

కవులు

రచనలు,జీవిత చరిత్ర

మహాకవి డైరీలు





సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020010006065

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

మహాకవి డైరీలు

(ఆంగ్లమునకు తెలుగు)

రచన:

గురజాడ అప్పారావు

సంకలితము:

అవసరాల సూర్యారావు

విశాలాంధ్ర ప్రచురణాలయం,
బకింగ్‌హామ్ పేట (పోస్టు) :: విజయవాడ-2

ముందుమాట

'డయారియం' అనే లాటిను శబ్దమునుండి పుట్టిన ఆంగ్లపదము 'డైరి'. దీనిని తెలుగున మనం ఆంగ్ల సమముగ వ్యవహరించుకుంటున్నాము. ఒక వ్యక్తి 'దినచర్యను' తెలిపేవి 'డైరీలు'. తొలుత యివి వాతావరణాది పరిస్థితులను తెలిపే భోగట్టాలుగా వుంటూ, రానురాను ప్రస్తుతార్థములో రూఢి అయినవి.

ప్రతిరోజూ తాముచూసే, వినే సంఘటనలను, లోనయే అనుభవాలను, మరుగున పడనీయక, లిఖితరూపమున కొందరు వ్యక్తులు వాటిని వెలయిస్తూవుంటారు. ఐతే వీటిని దిన దినమూ వ్రాసితీరాలనే నియమంమాత్రం లేదు. ఏమీ అంటే, ఎంతటి మహాపురుషుని జీవితంలోనైనా కొన్నిరోజులు, లేదా నెలలు పేర్కొన తగిన ఎట్టి సంఘటనలు సంభవించకపోవచ్చును. కాని ఏవేళ జరిగిన సంఘటనలను ఆ వేళే పేర్కొవడమనేది, డైరీల రచనకు ఒక సామాన్యసూత్రం.

లేఖన సాధనములు వచ్చిన తరవాత, ఏదో వొక రూపంలో, యివి వ్యవహారములో వెలసినవని చెప్పవచ్చును. పదిహేడవ శతాబ్దిలో యూరపులోనూ, ముఖ్యంగా యింగ్లండులోనూ యివి ప్రాచుర్యము వహించి, 'రినైజాన్సు' దినముల

అనంతరము, సాహిత్యములో ఒక విభాగముగా యివి ప్రాముఖ్యమునకు వచ్చినవి. విట్‌లాక్ (1605–75) రచించిన డైరీ, ఎంతో ప్రధానమైనదని ఆంగ్ల సాహిత్య విమర్శకులు పేర్కొంటున్నారు. షేక్స్పియరు సమకాలికుడైన జాన్ ఎవిలీన్ (1620–1703) డైరీ ఎప్పటికప్పుడు వ్రాసింది కాకపోయినప్పటికీ అందులో కొన్ని స్ఖాలిత్యములున్నా ఆంగ్ల సాహిత్య చరిత్రలో ప్రశస్తిని పొందింది. ఇది డబ్భై సంవత్సరాల ఆంగ్ల దేశ చరిత్రను తెలిపే డైరీ. యథార్థతకు, రచయిత వ్యక్తిత్వ నిరూపణకు ఉదాహరణగా శామ్యూల్ పెపీస్ (1633–1703) రచించిన డైరీని పేర్కొనదగునని ఆంగ్ల విమర్శకుల అభిప్రాయం. సుప్రసిద్ధకవి జాన్ బైరన్ (1692–1763) గుప్తపరచుకున్న డైరీ ఎన్నికైనది. ఇవన్నీ నాటి ఆంగ్ల దేశ సాంఘిక రాజకీయ స్వరూపమును ప్రతిబింబించే అద్దములవంటివి.

డైరీలు, నాటి దేశ పరిస్థితులను తెలుసుకోవడానికి మాత్రమేకాక, అవి రచించిన ఆ, యా వ్యక్తుల జీవిత వృత్తాంతాలను గ్రహించడానికి ఉపకరిస్తవి. వారి జీవిత చరిత్రలను లిఖించుటకు ఇతరులకివి తోడ్పడతాయి. లియోటాల్‌స్టాయ్ డైరీలను ఆధారంగా తీసుకుని, ఆయన మనమరాలు, తనతాత గారి జీవిత కథను రచించినది.

అయితే డైరీల ప్రాధాన్యము అవి రచించిన వ్యక్తుల ప్రాముఖ్యమును బట్టి నిర్ధారిత మవుతుంది. వ్యక్తుల ప్రాముఖ్యము పుట్టుకవల్ల వచ్చేదికాదు. సామాజిక సమస్యలపట్ల వారు అవలంబించిన వైఖరీ, దేశాభ్యున్నతికి, ప్రజాహితమునకు వారు చరిత్రలోనిర్వహించిన పాత్రా, జీవితముపట్ల వారు

వహించిన తాత్త్విక దృక్పథమూ, కావించిన ప్రజాసేవా, వీటిని బట్టి [illegible]ది కలుగుతూ వుంటుంది.

ఇటు సమాజంలోనూ, అటు సాహిత్యంలోనూ సదా పురోభివృద్ధినే కోరుతూ, దానికోసం ఎడతెరిపిలేని పోరాటాలను సాగించిన యుగపురుషుడు మహాకవి గురజాడ. కాలాన్ని వెనక్కి తిప్పే ప్రతి మూఢ సిద్ధాంతాన్నీ, అంధ విశ్వాసాన్నీ ప్రతిఘటించి, "నాది ప్రజల ఉద్యమము; దానిని యెవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను" నే మాగ్నా కార్టా ప్రకటనతో ప్రగతి శక్తులకూ, వొక కొత్త తరానికీ, యుగానికీ, గీతానికీ, సంగీతానికీ, సింహద్వారం తెరిచిన నిండు వ్యక్తి గురజాడ. అట్టి ఆంధ్ర జాతీయ మహాకవి డైరీలు యివి.

రచనలలో కవి, 'కవితామూర్తి'ని సందర్శించినంత ప్రస్ఫుటముగా, అతని వ్యక్తిజీవితాన్ని మనం వాటిలో దర్శించలేము. మహాకవుల, కృతి వొక గొప్ప భవంతిలో డ్రాయింగు రూమువంటిది. అందులో వంటిల్లు వంటివి డైరీ. డైరీలు సామాన్యమైన పాఠకునికి సైతం, మహాకవులతో ఎంతో చనువును కల్పిస్తవి. కనకనే డైరీలలో కవుల వ్యక్తిత్వము తేటగా కనబడినట్లు, వారి యితర రచనలలో గోచరించదు.

'కన్యాశుల్కము'లో 'ముత్యాలసరముల'లో 'ఆణిముత్యాల' కథలలో మహాకవి గురజాడతో మనకు ఏర్పడిన ఆత్మ బాంధవ్యమూ, చనువూ, 'మహాకవి డైరీలు' చదివిన వెంటనే వొకంతకు పదింతలవుతాయి.

అన్నిటా వారి దృష్టి మళ్ళినది. ఈరోజులలోనే ఆయన భాషా శాస్త్ర విషయములను, భాషల వింగడింపును సునిశితముగా పరిశీలించుతూ వచ్చినట్లు కనిపిస్తుంది. గ్రీకు రోమను సారస్వత విజృంభణమువల్ల యూరపులో స్వదేశీయ సాహిత్య విస్తరణము కలిగినట్లు, ఆంగ్లసాహిత్య ప్రభావమువల్ల భారతదేశంలో మన వాఙ్మయమేల వికసించకున్నదీ, తమిళ దేశములో త్యాగయ్య కృతులే ప్రచారములో వుండనేల, నాటకములను అభినయించు నటులు వచన రూపకముల స్మరంతికే పోరేమి; ఇవన్నీ ఆనాడు ఆయన తనను తాను వేసుకున్న ప్రశ్నలు. మహాకవి మాటలలోనే "పరస్పర వ్యత్యాసముగల, విభిన్న సంస్కృతులు రెండింటి మధ్య" ఆనాటిజనులు జీవించవలసి వచ్చినది. ఇవి ప్రాచ్యపాశ్చాత్య సంస్కృతులు: "ఇందులో వొక సంస్కృతి పూర్తిగా చివికి శల్యావశిష్టమైనది, తనకు గల సంకుచితత్వమేదాని దుర్బలత్వమునకు హేతువు. పాశ్చాత్య నాగరికత కొన్ని అంధవిశ్వాసాలను పోగొట్టుతున్న మాట యథార్థమే అయినప్పటికీ, అది ప్రబోధించే స్వాతంత్ర్యము సాంఘిక ప్రగతి శూన్యమైనది. ఇది అన్యులకు చోటివ్వదు. ఇది సంపూర్ణ స్వాతంత్ర్యము గాదు. నామ మాత్రమైనది".

కనుకనే 'చదల చీకటి కదల' బారగ 'తూర్పు బల బల తెల్లవారగ' స్వచ్ఛమూ నిసర్గసుందరమూ అయిన తీయ తీయని గొంతుతో "కొత్త పాతల మేలు కలయిక, క్రొమ్మెరుంగులు జిమ్మగా" 'యెక్కడనో వొక్క చెట్టుమాటున నొక్క కోకిల పలుకసాగి'నది. "పలుకులను విని దేశమందభిమానములు

మహాకవి డైరీలను వారి సంపుటిగా అచ్చొత్తించి ఆంధ్రప్రజలకు అందివ్వ గలుగుతున్నందుకు మేమెంతో ఆనందిస్తున్నాము.

ఇటు సంఘములోనూ, అటు సాహిత్యములోనూ మహాకవి ప్రారంభించిన విప్లవమునకు ఏయే హేతువులు ఆధారమైనవీ, గొప్ప సాహిత్యపురుషుడుగా ఆయన పరిణతి చెందడానికి యే పరిస్థితులు దోహదపడ్డవీ, నాటి సమకాలిక ఆంధ్రదేశ స్థితిగతులను, ఆనాటి ‘రినైజాన్సు’ దినములలో అంతర్గతముగ ప్రవహించే ధోరణులను, భావాలవెల్లువలను, దేశ సామాజిక జీవితమునూ ప్రతిబింబించే నిలువుటద్దము యీ సంపుటి.

అద్దమును ఒకసారి దర్శించడమే పాఠకుడి కిక తరవాయి !

——అవసరాల సూర్యారావు.

1889

16 ఆగస్టు :

మహారాజావారి ఆస్థానములో 'డిబేటింగుక్లబ్' ఏర్పడినది. ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోబడితిని.

6 సెప్టెంబరు :

సెలవు వొకనెల పొడిగించితిని.

16 సెప్టెంబరు :

శర్మగారివద్దవున్న నా ప్రాక్టీసాఫ్ ఎలక్యూషన్ (వక్తృత్వాభ్యాసము) అనే గ్రంథం తేవలెను. 'లివింగ్ ఆథర్స్' (సజీవకవులు), 'హింట్సు ఆన్ ఎలక్యూషన్' అనే పుస్తకములు ప్రిన్సిపాలుగారివద్ద వుండిపోయినవి. ఎ లుక్ రౌండ్ లిటరేచర్ (సాహిత్యసమీక్ష) ఎనాలిసిస్ ఆఫ్ యింగ్లీషు లాంగ్వేజి (ఆంగ్లభాషావిమర్శ) ప్లెజర్ ఆఫ్ డిసల్ట్యూటరీ రీడింగ్ (ఇచ్ఛానుసారపఠనమందలి ఆనందము) గ్రంథములను చదివితిని.

4 అక్టోబరు, శుక్రవారం :

విజయదశమి పండుగ. రెండుసంవత్సరముల క్రిందట ఈరోజున నాకీప్రస్తుత ఉద్యోగము లభించినది. అందువల్ల నాకెట్టి మనశ్శాంతికలిగినదో మహారాజావారికి తెలిసివుండదు. మహారాజావారిని పరమేశ్వరు డనుగ్రహించుగాక *సి. సి. గారి కొరకు నా ప్రార్థనలు.

---

*శ్రీ సి. చంద్రశేఖరశాస్త్రిగారు.

6 అక్టోబరు, ఆదివారం :

మహారాజావారు ♦ జె. యస్. గో, 'ప్రతివారమూ హార్పులో కవిత్వము వ్రాయరాదా?' అనిరి. మానవులలోగల పశుప్రవృత్తిని గురించి చర్చజరిగినది.

7 అక్టోబరు, సోమవారం :

గత నెల మొదటి తేదీ నుంచి నాకు జీతంలో అయిదు రూపాయిల యింక్రిమెంటు వచ్చింది. ఆర్డరు నెంబరు 118. కళాశాలలో చరిత్ర పాఠములను బోధిస్తూ వున్నంతకాలమూ యిది అమలులో వుంటుంది.

8 అక్టోబరు, మంగళవారం :

నా కింతకంటె హెచ్చు యింక్రిమెంటు యీయలేక పోయినందుకు ప్రిన్సిపాలుగారు తమ విచారమును వెలిబుచ్చిరి.

కోటలో యివాళ "జ్ఞానప్రదమైన సాహిత్యము, శక్తివంతమైన సాహిత్యము" అనే సంప్రదాయ సిద్ధమైన సారస్వత విభాగమును గురించి చర్చ జరిగినది.

27 అక్టోబరు, ఆదివారం :

కాంగ్రెసు మీటింగు. బ్యాంకు ఏజంటు మాక్డనలుగారికి నా ఉపన్యాసము పంపవలెను. మాధవరావుగారికి 'హార్పు'లో ప్రచురించడానికి ఉపన్యాసపు కాపీ కావలెనట.

♦ శ్రీ జిడ్డు సుందరరావు పంతులుగారు.

8 నవంబరు :

మహారాజావారి నాటక సమాజమువారు 'శకుంతల' ప్రదర్శించిరి. మహారాజావారు ప్రదర్శనమునకు విచ్చేసిరి.

10 నవంబరు :

మహారాజావారు విజయనగరంనుంచి బయలుదేరారు.

1891

30 జూన్ :

దేవరపల్లిలో రాజమ్మ వివాహమహోత్సవం.

1892

17 అక్టోబరు :

మహారాజావారివద్ద రెండువేల రూపాయిలు బదులు పుచ్చుకున్నాను.

1893

10 డిసెంబరు, ఆదివారం :

ఉదయము 5 గంటలుకు ఆడుతూ పాడుతూ భోజనం చేసి 7 గంటలుకు విజయనగరంలో రెయిలు యెక్కడమైనది. రెయిలు పడేవరకు యెప్పుడు పడునని ఆసక్తితో యెదురు చూచుచుంటిమి; గాని రెయిలు పడ్డతర్వాతకూడ గొణగడముకు కావలసినన్ని అవకాశములు రెయిల్వేవారు కల్పించినారు. ఊళ్ళదగ్గిర స్టేషనులు వుంటే ఉపద్రవము వస్తుందని

కాబోలు; యోచించి కాళ్ళకు కసరత్తు కలిగి పురజనులు దృఢముగా వుండగలుగుటకు ఊళ్ళకు కడుదూరముగా స్టేషనులు వుంచినారు. కొన్నిచోట్ల తునితగువులుకూడ చేయుచు వచ్చిరి. అలమండ స్టేషను వూరికి రమారమి రెండుమైళ్ళ దూరము; సింహాచల స్టేషను వూరికి మూడు మైళ్ళు. వాల్తేరు స్టేషను త్రిశంకుస్వర్గమువలె వాల్తేరుకు విశాఖపట్నముకు అంటివుండక రెంటికీ యెడముగా వున్నది. విజయనగరంనుంచి అనకాపల్లి వెళ్ళగోరువారు అసావాదిత్యోబ్రహ్మ అని అనకాపల్లి త్రోవవదిలి వాల్తేరు స్టేషనుయాత్రచేసి వొక గంట ఆ స్థలమును సేవించి, తిరిగి వదలిపెట్టి అనకాపల్లి, త్రోవవరకు వెనుకకు త్రొక్కి అక్కడనుండి అనకాపల్లి వెళ్ళేసరికి మధ్యాహ్నము కాగా, ఆ యెండలో వూరికి అద్దెబళ్ళకుగాను బండి వారలతో అద్దెనుగురించి పోరాడి, వూరుచేరి మూడుగ్రాసముల లోగా యిన్ని మెతుకులు కడుపులో వేసుకొన్నయడల కృతార్థులని యోచించ తగును.

1895

౩ జనవరి, లక్ష్మివారం :

జనవరి నెలకు నాకు రావలసిన అలవెన్సు యిదివరకే షరీఫువద్ద పుచ్చుకున్నాను. సోమరాజు బావ నాకు యివ్వవలసిన సొమ్ము పంపించమని ఉత్తరం రాశాను. 10 రూ॥ లు నగదు, స్టాంపుకోసం పుచ్చుకున్నది 10 రూ॥లు, రిజస్ట్రీషను

రుసుం, 10, మందులకు 150, ఆక్స్‌ఫర్డు పుస్తకాలకు 8 రూ॥లు, పెళ్లికి సామానులు కొనేందుకు 23, మొత్తం 211 రూ॥ లు.

ఇవాళ కోటలో ఫేన్సీడ్రస్ వినోదములు, విందు.

5 జనవరి, శనివారం :

కృష్ణాజిల్లాలోని వీరవల్లి స్టేషనుసమీపాన వాక కొలను కలదు. గట్టుచుట్టూ తుమ్మచెట్లు, యీతచెట్లు. చాలా చెరువులు అలాగునే వున్నవి. రాజమండ్రివద్ద గోదావరి అవతల ఒడ్డున రోడ్డుకిరువంకలా తుమ్మచెట్లకింద "పచ్చికమాసికలు" కనిపించినవి. బెజవాడ సమీపంలో ఎన్నో తుమ్మచెట్లు, పచ్చిక బయలు. ఎంతో ఏపుగా పెరుగుతున్న ఆగడ్డి ఏమిటిచెప్మా! బెజవాడవద్ద సీమచింత మొక్కలవరసలను చూశాను.

9 జనవరి, బుధవారం :

విజయనగరంనుంచి సాయంత్రం ఆరుగంటలకు బయలుదేరాను.

10 జనవరి, లక్ష్మివారం :

ఉదయం ఆరుగంటలకు రాజమండ్రీ వచ్చాను.

11 జనవరి, శుక్రవారం :

ఉదయం ఏడు గంటలకు బెజవాడ బయలుదేరాను. విజయనగరం మహారాజావారి ట్రెయినులో ఎక్కాను.

శ్రీ మోహనురావు చాలా మంచి వ్యక్తి. తన కొడుకును ఎంతో ఆప్యాయంగా ముద్దుముద్దుగా పెంచుతున్నాడు.

12 జనవరి, శనివారం:

ఇంకా మార్గమధ్యంలోనే వున్నాము. నంద్యాల దాటింది రైలు. నంద్యాల ప్రాంతం సొగసుగావుంది. కొత్తగా బాగుచేసి దున్నిన అడవిప్రదేశం చాలాకనబడుతూ వుంది. ఆముదప్పైరు; కంది వ్యవసాయం కనబడదు. ఈ జాతి ఆముదపు మొక్కలే యీ భూమిలో ఎక్కువగా పెరుగునుకాబోలు! కంకరభూమి. ఎక్కడ చూసినా ఆముదాలపైరే!

13 జనవరి, ఆదివారం:

ఉదయం మద్రాసు చేరుకున్నాము. అడ్మిరాల్టీహౌసు. అందమైన భవనం. మహారాజావారు, బిల్డింగంతా మాకు చూపించారు. తమ ఉద్దేశాలను, ఊహాలను, ఆశయాలను, విధానాలను కొంతవరకు మాకు వివరించారు. భూములమీద, భవనాలమీద డబ్బు పెట్టుబడిపెట్టడం, దానికిగల ప్రాధాన్యత. మెట్రొపాలిస్‌లో మొట్టమొదటసారిగా భవనంకొన్న మహారాజా యీయనే. మిగిలిన రాజులుకూడా యీయన్ని అనుసరిస్తారనుకుంటాను. అయితే 'సిటీ' అభివృద్ధి అవుతుంది. మహారాజావారి భవనం, మద్రాసులోకల్లా దివ్యమైనదని అంతా పరిగణిస్తున్నారు. ఇందుకు శ్రీ బాలయ్యానాయుడిగారిని అభినందించక తప్పదు. మహారాజాకు తగినభవంతి.

14 జనవరి, సోమవారం:

అడ్మిరాల్టీహౌస్‌వలె *ఫూల్‌బాగ్‌ను ఎందుకు అభివృద్ధిపరచకూడదు? భవనంమాటకాదు; తోట సంగతి.

---

* విజయనగరంలో వున్న పెద్ద పూలతోట. చూ. అప్పారావుగారి 'మీ పేరేమిటి' అన్న కథ.

16 జనవరి, బుధవారం :

కేశవపల్లి నరసింగరావు పంతులు ఇవాళ సాయంత్రం రమ్మనమని నాకు కబురంపారు. ఈనెల 17, 18, 19 వ తేదీల బేటా, ఆ(రూపాయిలు) శ్రీ బాలయ్యనాయుడుగారు యిచ్చారు; ఇమ్మనమని నే నడగలేదు.

18 జనవరి, శుక్రవారం :

శ్రీ మాధవరావుగారిని చూస్తున్నకొద్దీ ఆయనమీద నాకు గౌరవం హెచ్చుతూవుంది.

నంబరు 32, తంబుచెట్టివీధినుంచి శ్రీ జి. నారాయణ మూర్తిగారిలేఖ.

19 జనవరి, శనివారం :

జె.యం. గ్లీసన్ ఎస్క్వైర్, సూపరెండెంటు, సెయింటు జార్జి కెథడ్రెల్ రోడ్డు, తేనాంపేట.

శ్రీ మాధవరావుగారివద్ద 27 రూపాయలు చేబదులు పుచ్చుకున్నాను.

21 జనవరి, సోమవారం :

ఇవాళ బి. ఏ లను గురించీ, ఎలక్షన్లగురించీ తమ అభిప్రాయాలను మహారాజావారు మా యెదుట వ్యక్తపరచారు.

ఉదయపూర్ దివాన్ పన్నాలాల్జీకి స్వాగతమిచ్చాను. దివానుగారు వృద్ధులు. కాని మంచి ఆరోగ్యవంతులు. నవ్వుతూ కనిపించారు. ఆయన తాతగారే శాబోసు, మహారాజావారికి

లోగడ ఉదయపూర్ నుంచి ఉత్తరం వ్రాస్త. మహారాజావారు తాము కూచున్న కుర్చీలోంచి కొంచెం లేచి ఆయనకు నమస్కరించారు. కుర్చీ చూపించి కూచోమని గౌరవించారు. దివాను గారు రాజా వారియెడల ఎంతో గౌరవం కనబరిచారు.

31 జనవరి, లక్ష్మీవారం :

మహారాజావారు విజయనగరం బయలుదేరారు.

7 ఫిబ్రవరి, లక్ష్మీవారం :

టిఫిన్ ఏడణాలు.

లిటరరీ సొసైటీ నుంచి శ్రీ సూర్యనారాయణ పంతులు తెచ్చిన పుస్తకాలను వొక వాల్యూంతప్ప, మిగిలినవన్నీ వాపసు చేశాను. మహారాజావారి వద్ద లేనివి మూడు గ్రంథాలు యిక్కడ వున్నాయి.

8 ఫిబ్రవరి, శుక్రవారం :

పొద్దున్నే వొక మోతాదుమందు.

కోచ్ వాసికి అణాముక్కాణీ యిచ్చాను. పోస్టేజి నాలు గణాలు. లిటరరీసొసైటీ లైబ్రరీనుంచి ఇండియన్ ఆంటిక్వరీ వాల్యూములు పట్టుకొచ్చాను. కంపోజిటరుకు ఒక రూపాయి యీనాం యిచ్చాను. పనిచూస్తే చాలావుంది. చేతినిండాపనే. అయితే వున్నది మాత్రం ఒక్కడు. మిగిలినవాళ్ళంతా ఎవళ్ళ పనుల్లో వాళ్ళు మునిగివున్నారు.

టిఫిన్ నాలుగణాలు.

9 ఫిబ్రవరి, శనివారం :

టిఫినుకు ఏడణాలు. రాత్రి, మాత్ర వేసుకున్నాను.

10 ఫిబ్రవరి, ఆదివారం :

విజయనగరం వెళ్ళేగాం. రెండు మోతాదుల కాడ్ లివరాయిలు. ఒక్కొక్క మోతాదు చెమ్చాడేసి. మోతాదుతోపాటు రాత్రి మాత్ర.

12 ఫిబ్రవరి, మంగళవారం :

వంటలక్కకు అయిదు రూపాయిలు. రూపాయీం రెండణాలు పెట్టి అరరీము కాగితం కొన్నాను. టిఫిను నాలగణాలు. రెండణాలకు రెండు కొవ్వొత్తులు.

13 ఫిబ్రవరి, బుధవారం :

క థ లు.

దూడ, గడ్డి, పూరి తినుట
పరమానందయ్యగారి శిష్యులు
ఏనుగు, కాకి, రెండుపావురములు
తోప
వంటపాత్ర
చీమా నెమలి నేస్తం
రాజూ, అడవిమనిషి
తనభార్యను ఢోసినరాజు :

17 ఫిబ్రవరి, ఆదివారం :

ఓరియంటల్ లైబ్రరీ కేటలాగుకోసం శ్రీ శేషగిరి శాస్త్రియర్ యింటికి వెళ్ళాను. అక్కడ మైసూరు శేషన్న వీణ, జలతరంగిణి. వాయిద్యం ఎంతో బాగున్నది.

18 ఫిబ్రవరి, సోమవారం :

ట్రీటీ త్వరగా రాధాబాబు సాహేబ్‌కు పంపించమని కలకత్తానుంచి టెలిగ్రాం.

శ్రీ బాలయ్యనాయుడుగారు కబురు తోలేశారు. వంట లక్కకు అయిదు రూపాయిా లిచ్చాను.

19 ఫిబ్రవరి, మంగళవారం :

టిఫినూ, బిస్కట్లు రూపాయిబేడా. బి. యస్. గారికి టెలిగ్రాం. రాత్రి అడ్మిరాల్టీకి తిరిగివచ్చాక టెలిగ్రాం చూశాను. ఎనిమిదణాల పోస్టేజి.

20 ఫిబ్రవరి, బుధవారం :

మహారాజావారి కిచ్చిన టెలిగ్రాంకు మూడు రూపాయిలు. పుస్తకాలు కొన్నాను. గ్రామరు; వాగ్వ్యాఖ్యాయిని; కథాసప్తతి. డిక్షనరీ పది రూపాయిలు. మొత్తం పధ్నాలుగు రూపాయిలు. సుల్తాన్ హాలువద్ద వేలంపాటలో కొన్న వస్తువులకు రెండు రూపాయిల పదిహేనణాల పరకా. ఒక ఫిల్టరూ, నాలుగు స్పూనులూ, టీసెట్టూ, పిల్లలకు రెండు ఆటబొమ్మలూ.

అడ్మిరాల్టీకి వచ్చేసరికి నా కోసం నిరీక్షిస్తూ కూచున్న శ్రీ సుందర్రావు కనిపించాడు. తన స్నేహితులు ఖాంబాటాజీ,

అయ్యంగార్లను కలుసుకోమని చెప్పాడు. వివేకానందుని శిష్యులలో వీరిద్దరూ ప్రప్రథములు. మీటింగులు, వక్తృత్వము, లిటరరీ సొసైటీలను గురించి మేమిద్దరం చాలసేపు ప్రసంగించుకున్నాము.

21 ఫిబ్రవరి, లక్ష్మివారం :

ఫైనల్ ప్రూఫ్‌లను పోస్టుచేశాను. రూపాయి పన్నెండణాలు యిచ్చి వొక జోళ్ళజత కొనుక్కున్నాను.

22 ఫిబ్రవరి, శుక్రవారం :

పి. సీతారామరాజువద్ద నాలుగు రూపాయలడిగి తీసుకున్నాను. టిఫిను ఎనిమిదణాలు. పుస్తకాలకు రెండ్రూపాయిల పదమూడణాలు. కోచ్ వానికి బేడ.

23 ఫిబ్రవరి, శనివారం :

పుష్పప్రదర్శనం. గొట్టుముక్కల వెంకటరామరాజువద్ద పదిరూపాయిలు చేబదులు.

టెలిగ్రాం, పిల్లలకు బొమ్మలు.

24 ఫిబ్రవరి, ఆదివారం :

ట్రిప్లికేనులో బోటుఫెస్టివల్. పదణాలు బట్లకుకీ, వెంకటనాథానికి రెండ్రూపాయిలు, కొవ్వొత్తులు రెండణాలు. అయిదు రూపాయిలు వంటమనిషికి. రెండ్రూపాయిలు పుస్తకాలకు.

26 ఫిబ్రవరి, మంగళవారం :

చాకలాడికి తొమ్మిదణాలపరక. ఇరవై రెండుబట్టలు వేశాను.

27 ఫిబ్రవరి, బుధవారం.

మిస్టర్ అండర్‌వుడ్‌కు కథలు; వైద్యుడు గుర్రం; వైద్యుడు కరక్కాయ; రాజు మంగలిని మంత్రిని చేయుట; మిడుతంభట్లు; సవాల్; ముందూ వెనకా; జ్యోతిష్కుడు; మంచిగంధపుచెట్లు అమ్మడం; ససేమిరా; ఏకః పంథానుకర్తవ్యం; రాజుభార్య రాజును చంపుట: మంత్రి భార్యా బతికించుట; పక్షులు మాట్లాడుకోవడం; రాచకన్యల తాలూకు బట్టల నిమిత్తం కుమారుడు.

2 మార్చి, శనివారం:

శ్రీ కళ్యాణ రామయ్యరు మాకు టిక్కెట్లు యిచ్చారు. స్త్రీలు చక్కగా అభినయించారు.

3 మార్చి, ఆదివారం:

రాజగోపాలాచారిని చూశాను. కాలేజీలో మీటింగుకు వెళ్ళాను. శశిపాదబెనర్జీ కాన్ఫరెన్సుకు బయలుదేరాం.

9 మార్చి, శనివారం:

బంతి, బాడిద, మందార, పూతపూసిన మామిడి.

పరమేశ్వరన్‌పిళ్ళెగారిని ఓరియంటల్ లైబ్రరీలో కలుసుకున్నాను. ఆయనతో నాకు పరిచయమయింది.

10 మార్చి, ఆదివారం:

కథలు, గారడీవిద్య, విక్రమార్కుడు దొంగతనం, అతను సాని యింటికి వెళ్లుట; రాజు దొంగతనం నేర్చుట; నక్కలు,

రాజు; రాజు కొమారుడు వుండు యిల్లు; పురోహితుడి కుమార్తె; బాచిగాడు నెల్లూరి ప్రయాణం; మంత్రి బంగారం గిన్నె యెత్తుకుపోవుట; గొడ్డు గోతబడ్డది.

11 మార్చి, సోమవారం :

లోకల్ న్యూస్‌లో అతిముఖ్యమైన సమాచారం కన బడ్డది : ఆపరేషన్.

13 మార్చి, బుధవారం :

క్రిష్ణంరాజుగారితో రిజస్ట్రేషనాఫీసుకు వెళ్ళాను.

సెనేటుహాలులో సుందర్రావు పంతులుగారిని చూశాను. అక్కడనుంచి బీచికి వెళ్ళాం. సాయంకాలం. సంజ చీకటి. చల్లనిగాలి. గాలిచల్లదనాన్నీ, సంజచీకటినీచూసి ఆనం దించాం. అనేక విషయాలపైకి మా ప్రసంగం మళ్ళింది. అత్యంత మధురమైన వేళ.

గంటకుపైగా అక్కడనే వుండి గాలీ, చీకటీ అనుభవించి సుందర్రావుపంతులు యింటికి వెళ్ళాం.

14 మార్చి, లక్ష్మివారం :

డబ్ల్యు. కెన్. ఎమ్. ఏ. యమ్. ఆర్. ఏసీ, ఎగ్రికల్చరల్ కాలేజి ప్రిన్సిపాల్.

మెమోరియల్ మీటింగుకు వెళ్లాను. ఉపన్యాసములు చాలామటుకు పాడుగానే వున్నవి. శ్రీ పరమేశ్వరన్ పిళ్ళై ఉపన్యాసం చాలా ఉత్తేజకరంగా వున్నది, కాని ఉపన్యాసం చెబుతూ మాటిమాటికి ఉద్రేకపడ్డారు. మనిషిలో అలసట కని

పించింది. కొందరి ఉపన్యాసములలో హుందాతనమూ, ఔచిత్యమూ లోపించినవి.

తరవాత యింటికి బయలుదేరాను. వెంకటపతిరాజు గారి వద్ద పదిరూపాయిలు చేబదులు. ట్రీటీబుక్కుకు నాలుగు రీముల కాగితం.

15 మార్చి, శుక్రవారం :

అడ్మిరాల్టీలో బాలస్వామినాయుడుగారిని కలుసుకున్నాను. ఆయన నన్నెంతో ఆదరించారు. నూతనభవనం సరికొత్త డిజైన్లతో బాగుంది. ఎదుట తోట మరీ బాగుంది.

నాలుగువందల రూపాయలు డ్రా చేశాను.

19 మార్చి, మంగళవారం :

ఉదయం తొమ్మిదీ పదిగంటలమధ్య బసనుంచి బయలుదేరి క్రిస్టియను కాలేజీకి వెళ్ళితిని. దిగువ గదులలో పిల్లలు రణగొణ ధ్వని. పెంకు తెగిరిపోయేటట్టు వీళ్ళింత గోలగోల చేస్తూవుంటే వింటూ ఊరుకున్నారు. విద్యార్థులు పెంకె ఘటాలే, స్కూలు గోడలనిండా పెన్సిళ్ళతో ఏవేవో రాసి నానా ఖంగాళీ చేశారు. డాక్టరు మిల్లరు పిల్లల్ని కట్టు ఖాయిదాల్లో వుంచుతాడనే వింటినే !

క్లాసు రూములు చిన్నవి. ఎత్తు తక్కువ. పిల్లలతో క్రిక్కిరిసి వున్నాయి. సొగసైన బెంచీలు. కొందరికి బెంచీలతో పాటు డస్కులుకూడా వున్నాయి. ఇనప కమ్ములతో డస్కుల తీరు బాగున్నవి.

డాక్టరు మిల్లరు ద్వార ప్రయివేటు స్కూలు చాలా చిన్నది. ప్రొఫెసర్లు పాఠాలు చెబుతూవుంటే నూతిలోనుంచి మాట్లాడుతున్నట్టే వుంది. తాము చెప్పేదంతా పిల్లలకు వినబడునో లేదో అని నా సందేహం.

రిఫరెన్సు లైబ్రరీ, పుస్తకాలతో నిండుగావుంది. గది కవతల గోడ కెదురుగా పుస్తకాల జాబితా; చక్కటి షెల్ఫులలో పుస్తకాల పేర్లు; అక్కడనే ఒక బంట్రోతు నించుని వున్నాడు. ఇతనికి కొంచెం యింగిలీషు వచ్చునుకాబోసు. పిల్లలకి కావలసిన పుస్తకాలు ఇతనే యిస్తూవుంటాడు. తమకు ఏయే పుస్తకాలు ఎప్పటిలోగా కావలెనో విద్యార్థులు చిన్న కాయితం ముక్కమీద రాసి వుంచుతారు.

విద్యార్థులు పుస్తకాలను చక్కగా పఠిస్తున్నట్టే కనబడుతున్నది. లయిబ్రరీలోవున్న గ్రంథాలను బాగానే వినియోగించుకుంటున్నారు. జనరలులయిబ్రరీలో చెప్పుకోతగ్గ విశేషమేమీ నాకు కనుపించలేదు. అలమారాలు బహు అందంగా వున్నాయి. చెక్కడపుపని బాగున్నది.

20 మార్చి, బుధవారం :

మిస్టరు కూపర్ఓక్లీని చూస్తిని. మంచి గట్టివాడు. దాపరికంలేకుండా యిష్టాపత్తుగా మాట్లాడినాడు. పచ్చయ్యప్పకాలేజీకంటె ప్రెసిడెన్సీ, క్రిస్టియను కాలేజీలే నయమట! తన విద్యార్థులు పేదతనంవలన క్లాసు పుస్తకాలు కొనుక్కోజాలకున్నారట. మా కాలేజీ అంటే ఆయనకు చాలా గౌరవభావమున్నది. నన్ను పాఠములు విననివ్వవలసినదని కోరితిని. అందుకు తమ తాబేదారులు యిష్టపడరేమో అన్నారు.

21 మార్చి, లక్ష్మివారం :

ఉదయం తొమ్మిది గంటలకు డాక్టరు మిల్లరును చూడ వెళ్ళితిని. నేను వెళ్ళీ వెళ్ళగానే నన్ను చేతులతో ఆప్యాయంగా పట్టుకున్నాడు. వీపు తట్టాడు. ఎంతో మర్యాదతో మన్నన చేస్తూ పలకరించాడు. కుశలమడిగాడు. విజయనగరంలోవున్న తన పాతవిద్యార్థుల యోగక్షేమాలను భోగట్టాచేసి తెలుసుకున్నాడు.

కాలేజీలో క్లాస్సేవుండి, తిన్నగా అక్కడనుంచి రామస్వామిచెట్టి అచ్చాఫీసుకు వెళ్ళాను. అతని తమ్ముడు ఆఫీసులో కూచునివున్నాడు. ఇద్దరం అవీ యివీ ముచ్చటించుకుంటూ కొంతసేపు కాలక్షేపం చేశాము.

నాలుగోఫారం మళ్ళీ అచ్చువెయ్యమని చెప్పాను.

కాన్వొకేషనుకు హాజరవుతున్నానని తెలియచేస్తూ సెనేటు కొక దరఖాస్తు పంపించాను. శ్రీ శ్రీనివాసశాస్త్రి గారికి లేఖ రాశాను.

23 మార్చి, శనివారం :

'చంగాంగడి' వద్దవున్న థియేటరులో బాలామణి జట్టు నాటకప్రదర్శనం. రమ్మనమని శ్రీ బాలస్వామి నాయుడుగారు నన్నూ, శ్రీనివాసాచారిగారినీ ఆహ్వానించారు. ఇక వెంకట్రావు పంతులుగారు సరేసరి! రానంటోన్నా బలవంతంమీద కిందటి శనివారం రోజున నన్నక్కడికి లాక్కుపోయారు. జింకుషీట్లతో కట్టిన హాలు. మధ్యమధ్యన యినపవాసాలు. కాని థియేటరున్న సందు మురికివాసనతో అడుగుపెట్టడానికే రోతగా ఉండెను.

పోయిన శనివారం ప్రదర్శనానికి బోలెడంతమంది జనం వచ్చారు. హాలు క్రిక్కిరిసిపోయింది. హాలు వెలుపల తోడ దొక్కిడి లావుగావుండెను. లోపల కూచుందుకు జాగావే దొరికిందికాదు.

'మాస్కాను'తోటలో బాలామణి ప్రదర్శించిన శకుంతల నాటకం కూడా చూస్తిమి. మేం వెళ్ళేసరికి తృతీయాంకం ప్రదర్శింపబడుతున్నది. శకుంతలను విడిచి దుష్యంతుడు తన నగరుకు వెడలిపోతున్న దృశ్యం అభినయిస్తున్నారు. బాలామణి చెల్లెలు దుష్యంతుడి పాత్ర ధరించింది. ఆమెరూపం వికారంగా వుంది. నడకలో రంగేలా. కంఠం విప్పితే ఆడదని యిట్టే తెలిసి పోతుంది. బాలామణి తప్ప ఆ జట్టులో చెప్పుకోతగ్గ మరివక మనిషి కనబడదు. మిగిలినవాళ్ళంతా ఎందుకూ పనికిరారనే చెప్పవచ్చును.

బాలామణి రూపం ఠీవిగావుంది. మనిషి నాజూకుగా దర్శనీయంగావుంది. ముఖంలో కొంత యౌవనలోపం కనబడు తున్నా లావణ్యం కలదు. వాచికం మధురంగానేవుండును కాని, కొంతయాస లేకపోలేదు. కంఠం మార్చగలశక్తి వున్నట్టు నాకు తోచదు. శాంతము, ఓరిమికల విషాదభూమికలను నేర్పుగా అభినయించగలదు. కరుణరసం వొప్పించడం అంత సహజంగా వుందనజాలను; కొంత "అతి" వున్నది. అభినయించేటపుడు అనవసరంగా చీటికీ మాటికీ దుఃఖిస్తూవుంటుంది. శకుంతల ఇలాగున తరుచు దుఃఖిస్తూవుండాలని మూర్ఖతతో నాటకపుజట్టు నాయకుడు శాసించేడో, ఏమోమరి! మొత్తంమీద బాలా మణినిచక్కని'విషాదనటి'అని చెప్పలేను. విషాదనాయిక పాత్రను

రమ్యంగా నటించగలదో లేదో నాకు సందేహమే. కాని మనిషి బాగున్నది. వేషము ధరించడంలో మంచి అభిరుచి వున్నట్టు తోచింది. అలంకరణ బాగసుగా కనిపించింది. సాత్రోచితమైన ఆహార్యము.

మద్రాసులోవున్న మోటు మనుష్యులను మెప్పించడం కోసమే కాబోలును, యీ జట్టులు ఆడే నాటకాలలో బండ హాస్యమూ, మోటు శృంగారమూ వుత్పన్నము లవుతూ వుంటవి. మంచి రసవత్తరమైన ఘట్టములలో కొసకు విషాద సన్నివేశాలలో సైతం విదూషకుడు, సహజంగా నడచిపోతున్న కథకు అడ్డు తగిలి అసంబద్ధ ప్రలాపాలతో రసాభాస చేస్తాడు.

బాలామణిజట్టులో మిగిలినవాళ్ళ వేషధారణ చాలా హీనంగా వున్నది. పాపం, మదరాసీలలో తక్కువ కులస్థులని చెప్పబడేవాళ్ళు అంత అందంగా వుండరు. అందుచేత నాటక రంగంమీద కాస్త కంటికింపుగా కనిపించేందుకు ఆర్భాటమైన అలంకరణ వీళ్ళకు అవసరం కాబోలు !

నాటక ప్రదర్శనలో సంగీత వాయిద్యాలు లెక్కకు మించినవి. సంగీతం అంతా వొట్టి అల్లరి. గడబిడగా తేలింది. ప్రహ్లాదనాటకలక్షణం బాలామణిజట్టు యిక్కడకూడా పోనిచ్చుకో లేదులావుంది.

పంచమాంకంలో దుష్యంతుడి దర్బారుదృశ్యం వొకంతకి తెమిలిందికాదు. శకుంతలా దుష్యంతుల సమావేశం గంటల తరబడి నడిచింది. ప్రశ్న మీద ప్రశ్న. ప్రశ్నలవర్షం ! సమాధాన పరంపర ! ఈ పంచమాంకాన్ని కాళిదాసు యెంతో నేర్పుతో

నిర్వహించాడుకదా! అంత రసవత్తరఘట్టాన్ని అవలీలగా పాడు పాడు చేసి విడిచిపెట్టారు.

అన్నట్టు యింతసేపూ యీ విషయమే మరిచాను. భరతుడు వేషం వేసిన గుంటడు కొండముచ్చులా వున్నాడు!

పోయిన శనివారం బాలామణిజట్టు ప్రదర్శించిన నాటకం కొంతసేపు చూశాక కళ్యాణరామయ్యగారి నాటకానికి వెళ్ళాం. అతని జట్టు ఆడుతున్న ద్రౌపదీవస్త్రాపహరణంలో చీరవొలుపు సీను చూద్దామని కుతూహలం. బాల్కనీకి అవతలప్రక్క దూరాన ఆఖరు క్లాసులో కొన్ని నిముషాల పాటు నిలబడితిమి. ఈ నాటకపు జట్టుకు విలువైన దుస్తులే వున్నవి. కాని వేష రచన అసంబద్ధముగానూ, వికారముగానూ కనిపించింది. తలవెంట్రుకలు ముడిచి పెద్దకొప్పుగా చుట్టుకుని, నెత్తిని టోపీ పెట్టుకుంటే రాచకళవి కనబడదు. రాజవేషము వలె బొత్తిగా వుండదు. ఇక దుశ్శాసనవేషము! పెద్ద మీసాలు, గడ్డము, వింత తలపాగా, ఇత్తడి బెల్టులు; మా ప్రాంతపు పాములవాడి వేషమును తలదన్నుతున్నది. దీనికి తోడు మరాటీ కంపెనీలలోని రాక్షసవేషములవలె, దుర్యోధనుడూ, దుశ్శాసనుడూ పీంట్రించుకొని గావుకేకలు పెట్టారు. బాలామణి తప్ప యీ మదరాసు నాటకకంపెనీలలో సహజంగా వచనం చెప్పగల నటిగాని, నటుడుగాని వొక్కడూ కనబడలేదు. వచనం సరసంగా, సహజంగా, పాత్రోచితంగా యాసలేకుండా చెప్పడము వీళ్లెవళ్ళకీ తెలియదు. స్కూలు పిల్లలు పరీక్షాధికారి యెదట యేకరువుపెట్టినట్టు అనవలసిన ఆ నాలుగుమాటల్నీ గబగబ తరుముకుపోతారు. ఉచ్చారణలో

నిలుపులు సక్రమంగా వుండవు. ఎవరి కేదితో స్తే అది; ఎంత తో స్తే అంత. మాట యాస. ఇదివరకు కల్యాణరామయ్యరు జట్టు నాటక ప్రదర్శనాన్ని యింత పరిశీలనగా చూడలేదు. గత శనివారం కొద్దిసేపే వుండి యింటికి వెళ్లిపోయినాను. ఆవేళా యింతే! దుశ్శాసన పాత్రధారి గుక్క తిప్పుకోకుండా సీండ్రించుకుని గగ్గోలుపెడుతూ నానా రభసా చేశాడు. ద్రౌపదిముందు కుప్పిగంతులు వేస్తూ భయంకరంగా పులి గాండ్రుపెట్టినట్టు ఊరికే అరుపులు!

ఈమదరాసీలకు దీర్ఘోపన్యాసములు, వందలకొద్దీపాటలూ హోరెత్తించే సంగీతమూతప్ప మరేవీ రుచించవనుకుంటాను. కేవలం వచన నాటకమంటే వీరా స్మరంతికే పోరేమో!

ఈవేళ తన చాకచక్యమంతా చూపి కల్యాణరామయ్యరు అభినయిస్తున్నాడు. మనిషి వొడ్డూ పొడుగూ బాగానే వున్నాడు. ముచ్చట గొలుపుతున్నాడంటే పొరపాటుకాదు. వేషధారణ ఆకర్షణీయంగా వుంది. వేసుకున్న తెల్లని సిల్కు దుస్తులు, సన్నని జరీ నాకు నచ్చినవి. బట్టరంగు, కంటికి యింపు గొల్పుతున్నది. కాని వచ్చిన చిక్కల్లా అతని కళ్ళతోనే; కళ్ళూ ముక్కూ తీరుగా లేకుండుటచేత వేషానికి లోపం కలుగుతున్నది. కళ్ళు బండిచక్రాల్లా గుండ్రన. ముక్కు చప్పిడి. దూరంనుంచి చూస్తే విగ్రహం కంటికి కాస్త నదరుగానే కనిపిస్తుంది. అయ్యరుకంఠంలో మృదుత్వంలేదు. పాట సున్నితమూ కాదు; రెండుకురెండే!

బాలామణి 'డంబాచారి విలాస' ప్రదర్శనానికి చాలా ప్రసిద్ధి కలదు. నాయిక పాత్రధారిణి హోస్టుగ్గావుంది. గొబ్బి ఆట బాలామణి ఎంతో నేర్పుతో సున్నితంగా ప్రదర్శించింది. ఇందులో ఒకదృశ్యంలో ఆమె యించుమించు దిగంబరిగా వచ్చి డంబాచారికి అభ్యంగనం చేయిస్తుంది. ఇది చూడడానికి చాలా మంది వస్తారు. ఇంగ్లీషు బ్యాలటువనితవలె బనియనులు వేసు కొని రంగంమీదకు దూసుకొనివస్తుంది.

ఆమె ముఖవర్చస్సు బాగున్నది. తల నున్నగా నాజూ కుగా దువ్వుకొని సింగారించుకుంది. తలమీద సూర్యచంద్రుల ఆభరణాలు. ఇవి లేకుంటే యింతకంటే నయమనిపించును. నగ్నంగా యింగ్లీషుబ్యాలటువనితవలె బనియనులు ధరించి యీామె రంగంమీదకు రావడం నాకు నచ్చలేదు. వేష ధారణ సహజంగా లేదు. పాత్రోచిత వేషధారణ అనజాలను. శృంగారవిలాసవిజృంభణ మృగ్యం. చలాకీతనం కనపడదు. మదనసుందరిగా అంతకంటే స్ఫురించదు. అభినయంలోను నడకలోను ప్రశాంతత ధీమా, సొగసూ వున్నవి. చిత్ర మేమంటే యే మదరాసీ బంగారు పిచికనో యే చెట్టియారునో సర్వనాశనం చేసిన యీ భోగం పడుచు యీ 'డంబాచారి' నాటకంలో అట్టి సర్వనాశనము చేసే పడుపుకత్తెవేషం అభి నయించి తన జీవితమునే గర్హింపజేసే నీతిని బోధించుట !

అయితేనేమి ఈమె పేర్గొనతగిన స్త్రీలలో వొకతె!

ఈ వేళ పొద్దున్న వొక కుఱ్ఱాడు యిక్కడకు వచ్చి బాగుచేస్తాననే నెపంతో టెలిఫోను "జింక్సు"ను అటూ ఇటూ తుడిచేడు. బాగుచేయడంమాట దేవుడికెరుకగాని, తీరా వాడూ వెళ్లాక టెలిఫోను చెడిఊరుకుంది !

♦ ♦ ♦

తెలుగు మాట్లాడుతున్నపుడు తమిళుల ఉచ్చారణ: పదాలలో కలిగే మార్పు

వుండాది. వూడున్నాడు. బెసిఅయింది. వెధవకొడుకు. తీస్తిని(Bought) అద(అదిగా) యక్కడనో (కో)సామి (అయ్యా)

ఉచ్చరించేటపుడు పదములోని మొదటి అక్షరంమీద ఊనిక హెచ్చు:

రెండుమనిషి; బిల్లుయిత్తు; చేస్తిని; వెసుకుంటమూ; యేమిదండుగ; కత్తిదారపోసినాడు (Lost, mislaid) నెను మాచివాడు; లక్షణంగా.

మార్చి 24, తేదీ ఆదివారం :

శ్రీ బాలయ్యనాయుడుగారు కొంతమంది స్నేహితులను వెంటబెట్టుకొని యిక్కడకు వచ్చారు. నాకు వీరందరితోనూ పరిచయంకద్దు. సుబ్బారావుగారు జావళీలు చక్కగా పాడతారని ప్రసిద్ధి. కామస్వామినాయుడు, షణ్ముగం చెట్టియార్లు ఎంప్రెస్ ఆఫ్ యిండియా ప్రెస్సుకు చెందినవారు. శ్రీనివాసాచారిగారు కొంతకాలం నాతోనే వుండిరి. మేమిద్దరం హాయిగా కొన్నాళ్ళు గడిపాం. సుబ్బరాయనుగారు మాతోపాటే.

రోజూ రెండుమూడు బిలియర్డ్సు గేములు ఆడుకునేవాళ్ళం. ఇక టెన్నిసు ఆటకు మితమేలేదు. బాలయ్యానాయుడుగారు బంతిని బహు తమాషాగా కొడతారు. బహు నాజూకయిన స్ట్రోక్సు. కాని ప్రాక్టీసు చాలదు. కామస్వామినాయుడుగారి ఆట ఫరవాలేదనిపిస్తుంది. సుబ్బారావుగారిది ప్రశాంతమైన వ్యక్తిత్వం. నిశ్చలమైన స్వభావం; ఆయన మాకు * మొజార్టు వంటివారు.

మణ్ణుగంగారిని చూడగానే చటుక్కున నాకు వెంకటాద్రి నాయుడుగారు జ్ఞాపకానికి వస్తారు. ఇద్దరి ముఖ లక్షణాలూ వొకేతీరున వుంటవి. దేనినీ లెక్కచేయనన్నట్టు ముఖంలో వొక ధీమా గోచరిస్తుంది. పిడుగు మీదపడ్డా చలించని ధీమా తొణకిసలాడుతూ వుంటుంది. నాయుడుగారు కలుపుగోరు మనిషి. అందరితోనూ కలివిడిగా వుంటారు.

తమిళదేశం, సంగీతంలో తెలుగుదేశంకంటె మిన్నకదా, అయినప్పటికీ తమిళులు పాడే పాటలన్నీ తెలుగుకృతులే అయి వుండనేల? దీనికి కారణమేమిటయి వుండునో అని యిక్కడి మిత్రులను చాలామందిని అడిగాను. తమిళముకంటె తెలుగు భాష యెక్కువ సంగీతమయంగానూ, మధురముగానూ వుండ

---

* గొప్ప వాగ్గేయకారుడు. సాల్జుబర్గులో జననం : 1756; పుట్టుకచేత జర్మను - ఆస్ట్రియను జాతీయుడు. బాల్యంలోనే సంగీతజ్ఞుడుగా ప్రసిద్ధిబడసిన వ్యక్తి; 600 సంగీతకృతులకు కర్త. వీటిలో మూడు సంగీత రూపకాలు కూడా కలవు. అవి : దిమారేజి ఆఫ్ ఫిగారో, డాన్ గియోవన్నీ, ది మాజిక్ ఫ్లూటు అనే పేరు గలవి. రిక్వియం మాస్ అనేది అతని ఆఖరి కృతి. దీనిని రిహార్సలు చేస్తున్న సాయంకాలం ప్రేగ్‌లో ఈయన మరణించాడు. సంవత్సరం: 1791.

డమే దీనికి హేతువని మిత్రులు చెప్పుకొంటున్నారు. ఏమైనప్పటికీ యిది పూర్తి నిజమనజాలను. తమిళభాష యేవిధంగానూ సంగీతమయం కాకపోదు. తెలుగు కృతులను తమిళులు పాడడానికి హేతువు 'యిదే'నని సమాధానం చెప్పుకోజాలను. దీనికి యింతకంటె బలవత్తరమైన కారణాలేవో వుండి తీరాలి. వొక దేశం తన రహదారిని వొదిలి మాతృభాషను త్యజించి అన్యభాషను యెందుకు స్వీకరిస్తుందో సరియైన సమాధానం గ్రహించవద్దామరి!

ముసల్మానులు, యూరోపియనులు దక్షిణదేశంలో సామ్రాజ్యాలను స్థాపించుకోకపూర్వం అక్కడి పరిస్థితులు ఏలాగున వుండేవో గమనించినట్లయితే, యీ ప్రశ్నకు ప్రత్యుత్తరము లభించగలదని నా ఊహ. ఆనాటి దక్షిణదేశ స్థితిగతులే యిందుకు ప్రబలకారణమై వుండునని నాకు తోస్తున్నది. అప్పుడు దక్షిణదేశాన్ని పరిపాలించిన యేలికలు తెలుగువారు. అనగా మధురనాయకరాజులు, కంచిని ప్రధాన నగరంగా చేసుకొన్న చోళచాళుక్యులు; విజయనగర రాజులు.

తెలుగుభాషకు కొన్ని అవకాశాలు కలమాట నిజమే; సందేహంలేదు. ఎట్టి పరిమితులు లేకుండా తెలుగు, సంస్కృత భాషాపదములను స్వీకరిస్తుంది. తెలుగు అజంతభాష. అచ్చుల ఉచ్చారణము హెచ్చు. తమిళభాషలో కంఠ్యములు మిక్కుటము. 'ర' తరుచు వినిపిస్తూవుంటుంది. 'ర, ళ, డ'లకు ప్రాచుర్యము అధికము. సంయుక్తాక్షరములుకూడా తరుచు వినిపిస్తూనే వుంటవి. చాలాశబ్దములు హలంతములు.

* * *

టెలిఫోను సరిగ్గా పనిచేయడం లేదు. మహారాజావారు కలకత్తానుంచి బయలుదేరారట. సగం సగం మాటలలోనే, మాట పూర్తిగా చెప్పకుండానే అకస్మాత్తుగా టెలిఫోను మూతి బిడాయించుకు కూర్చున్నదే!

మార్చి,25 తేదీ సోమవారం :

ఇవేళ యింటినుంచి యెక్కడికీ కదల్లేదు.

పాత్రలు :

ఏకాంగి : ఈయనొక యోగిపుంగవుడు. స్ఫోటకపు మచ్చల ముఖము. కొంచెము పొడుగైన నల్లని తలగుడ్డ; చక్కరంగు జరీ. మేలురకము కాషాయపు అంగీ ధరించి మహాజ్ఞానివలె నటిస్తూ వుంటాడు. అబ్బో! మనిషికి కొన్ని యింగ్లీషు ఫేసనులుగూడా పట్టుబడ్డవి. మాటలధోరణి సాగుతూ వుంటే చీటికీ మాటికీ చేతిరుమాలు తీసి వాడుతూ వుంటాడు. యెవరైనా ప్రశ్నిస్తే మహాపండితునివలె తల పంకిస్తాడు. పాపం; ముసలి కృష్ణంరాజుగారి కీతనివల్ల చాలా డబ్బు దండుగవుతూ వున్నది. ఏకాంగిస్వామివారికి, దయపుట్టి యిటు వచ్చినప్పుడల్లా రెండురూపాయలన్నర బండీ అద్దెకే ముడుపు చెల్లించుకుంటున్నారు. స్వాములవారు తెలివితేటలు గలవాడే. తెలివితేటలు వున్నవికాని, వక్తకాదు. మాటల ధోరణి తెచ్చిపెట్టుకున్నదికాని సహజమైనదికాదు. పామరజనాన్ని బాగా ఆకర్షించగలడు. మావద్దకు వచ్చే బ్రాహ్మణులకు, వైష్ణవులకు యితనంటే రోత. ఇతనంత సుళువుగా కొట్టి పారవేయవలసిన

మనిషి కాడని చెప్పేందుకు యిదే దాఖలా. శూద్రులు లీతని పాదాలకు మ్రొక్కుతారు.

కృష్ణంరాజుగారి వెంట వొక వైష్ణవ భిక్షువుకూడా తిరుగుతున్నాడు. వాడు పచ్చి దొంగ. శుద్ధస్కౌండ్రల్ !

మార్చి, 26 తేదీ మంగళవారం :

వినోలియా సబ్బొకటి కొనుక్కుంటిని. బులుసు సూర్యనారాయణపంతులుగారికోసం మూడు రూపాయల పదణాలు పెట్టి వొక గడియారం కొన్నాను. రామస్వామిచెట్టి షాపులో ఎనిమిది పాతవస్తువులకు ఎనిమిది రూపాయలు చెల్లిస్తిని. 'వెస్టు' ఫోరుమెనుకు రెండున్నర మీటుల పేపరుకోసం రెండున్నరరూపాయలు యిచ్చాను. 'ట్రీటీ' నాలుగున్నర ఫారములు.

♦ ♦ ♦

ఏకాంగి పునర్దర్శనం !

♦ ♦ ♦

* శలవు (expenditure) అన్నీ తడిసిపోయింది;

విచారించుట (enquire) తీస్తిని (bought)

నువపిండుకో (chewing betel leaves)

రైల్వేస్టేషనుకు వెళ్ళాను. ఎంతబరువున్నానో తూచుకున్నాను. ఎనభై ఎనిమిది పౌనులు. ఏడు పౌనులు పెరుగుదల.

మార్చి, 27 తేదీ బుధవారం :

కృష్ణంరాజుగారి వెంట తిరిగే వైష్ణవభిక్షువు చేతిలో యేదో జ్యోతి పెట్టుకుని తక్కుతూ తారుతూ నా గదిలోకి

* తమిళులు మాటలాడే కొన్ని తెలుగు పదములు : వింత అర్థములు.

వచ్చాడు. దేవుడికేదో చేస్తాడట; అందు కతనికి యెంతో కొంత నా మనసుకు నచ్చినంత యివ్వవలెనని సూచించినాడు. అలాగునా అని అతనికి కొంతతత్త్వబోధ చేశాను. మారుమాటాడక సైష్ణవభిక్షువు మెల్ల మెల్లగా జారుకున్నాడు.

వెంకటనారాయణరాజుగారీవేళ నాకో ముచ్చట చెప్పారు. కథ వినడానికి కుతూహలంగా వుంది. అది, వెనక తమ బంధువులకూ, వారి విరోధులకూ జరిగిన యుద్ధ కథ. వెంకటనారాయణరాజుగారొక పాత్ర. మంచి నవ్వుతాలమనిషి. ఎప్పుడూ కులాసాగా వుంటారు. ఏదన్నా హాస్యంగానే తీసుకుంటారు. కాని తాను గౌరవిస్తున్న వ్యక్తి ఎవరైనా ఆయనతో పరుషంగా మాట్లాడితేమాత్రం విభ్రాంతులౌతారు; మొహం వెలవెల బోతుంది. రాజుగారి సంభాషణలో మాండలికపదాలు హెచ్చు. పలుకులో యాస; సెసెచి; సాం; యెటి; యిత్యాదులు.

ఆయన చెప్పిన సోల్జర్ల ముచ్చట బాగానేవుంది!

♦ ♦ ♦

మాడుగులలోవయు, పార్కులో జరిగిన అగ్నిప్రమాదము నుము యేదైనా వొక నవలలో చిత్రించతగ్గవి.

* * *

ఇవాళెందుకో మనసు బాగుండలేదు. విచారం ముంచుకొస్తున్నది. మనసు పరిపరివిధాల పోతున్నది. మామావగారి కుటుంబం! ఎంతమంది పోయారు! వాళ్ళందరూ తలపుకు వస్తున్నారేమో మరి! అందులోనూ చిన్నపిల్లడు చిట్టిబాబు! పాపం!

మర్చిపోకుండా ఇవాళ గిడుగు రామమూర్తిగారికి ఉత్తరం రాయాలి. ఆయన్ని తలచుకుంటే నా కెంతో విచారంగా వుంది. ఈ దేశంలో గౌరవంగా బతికిన కుటుంబాల పరిస్థితులన్నీ యింతే! కుటుంబయజమాని, ఆ వున్న కాస్త పెద్దదిక్కూ మరణించేసరికి, కుటుంబమంతా అవస్థలపాలు కావల్సిందే! ఈ దేశపు పోకడే అంత!

మార్చి 28 తేదీ లక్ష్మీవారం :

రామస్వామిచెట్టిగారి యింట ఆనందాచారిగారి కుమారుడు శ్రీనివాసాచారి కనుపించినాడు. మంచి యువకుడు; ఉత్సాహి. తన పత్రికానిర్వాహణపద్ధతులు, కవితకు ముఖ్యంగా ఆధునిక కవితా వికాసానికి చక్కగా ఉపకరించడం లేదని అతనూ అంగీకరించాడు. ఇదే పద్ధతిలో కొనసాగించినట్లయితే ప్రజల దృష్టిని యెంతమాత్రమూ ఆకర్షించలేమని అన్నాడు. ఆంగ్ల సాహిత్య గ్రంథాలను, కావ్యాలను సమర్థతతో అనువదించగలవారు ఆట్టేమంది లేరని చెప్పాడు. కావ్యాలను సాధారణంగా మాతృకలతో సరితూగేటట్టు తర్జుమా చేయడం దుర్లభమని, అనువాదాలు జయప్రదం కావడం అరుదని అన్నాను. ఆమాటా నిజమేనని అంగీకరించాడు. దేశంలో స్వతంత్రరచనాశక్తి క్రమ క్రమంగా మృగ్యమౌతున్నదని విచారం వెలిబుచ్చినాడు.

* * *

ఇవాళ తెలుగుసంవత్సరాది. మహారాజావారిని దేవుడు అనుగ్రహించుగాక! లోకంలో పరిపూర్ణానందం వెల్లివిరియుగాక!

మార్చి 29 తేదీ శుక్రవారం:

కాన్వొకేషనుకు హాజరయితిని. ఏర్పాటులేమీ సంతృప్తికరంగా లేవు.

మార్చి, 30 తేదీ శనివారం:

డాక్టరు బ్రౌనింగు వచ్చాడు.

నాయుడుగారివద్దనుంచి సైసుల ప్రయాణపుఖర్చులకుగాను ఏభయీ, మార్చినెల జీతాలనూ 'డ్రా' చేస్తిని.

ఈవేళ సాయంకాలం స్కూలుపిల్లల సమావేశానికి వెళ్ళాను. స్వామినాయరుగారి స్మారకసభను విద్యార్థులు, టవును హాలులో యేర్పాటుచేశారు. సభకు మిస్టర్ నార్టను అధ్యక్షత వహించవలసియుండెను; కాని ఆయన సభకు రాలేదు. శ్రీ పరమేశ్వరపిళ్లేగారు అధ్యక్షతవహించిరి.

♦ ♦ ♦

* ది పిక్ పాకెట్.

రాత్రి థియేటరుకు వెళ్ళాను. జేబుదొంగ నాటక ప్రదర్శనం. పాత్రధాయులు చాలా నెమ్మదిగా మాటలాడిరి. సంఘటనకు తగినవిధంగా పాత్రధారులు నటించ లేకపోయారు. కథ ఏమంత ఆసక్తి కలిగించలేదు.

---

* ఇది మూడు అంకాల మోదాంత నాటకం. రచయిత: జి. పి. హావర్తే. ప్రదర్శనాకాలం మూడుగంటలు. కేవలం యాదృచ్ఛిక సంఘటనలపై ఆధారపడిన కథ.

31 మార్చి, ఆదివారం :

అడ్మిరాల్టీ హౌసులో విందు జరిగింది. విందు యేర్పాటు చేసినవారిలో శ్రీపరమేశ్వరనుపిళ్ళైగారొకరు. భోజనం బహు రుచిగావుంది. వడ్డించిన పదార్థాలన్నీ చవులూరిస్తున్నవి. ముందు బ్రాహ్మణులకు వడ్డన. భోజనం చేసిన తరువాత మిగిలినవారు విందారగిస్తూవుంటే వారి ప్రక్కన కూర్చొని కులాసాగా కబుర్లు చెప్పేందుకు మేమంతా వెళ్ళాం. విందు ముగిసేవేళ యింతమందిని ఆహ్వానించి చక్కని ఆతిథ్యమిచ్చిన శ్రీ పరమేశ్వరన్ ప్రభృతుల ఆయురారోగ్యాభివృద్ధిని కోరుతూ క్లుప్తంగా ఉపన్యసించాను. తరువాత అందరమూ సోడాలను తాగేం.

శ్రీనివాసాచారిగారూ, సుబ్బారావుగారూ కొంతసేపు కృతులను గానం చేశారు. నాయుడుగారికి మహారాజామీద గౌరవం హెచ్చు. ఆయన గొప్పతనాన్ని శ్లాఘిస్తూ కొన్ని పాటలు పాడవలసినదిగా నాయుడుగారు, శ్రీనివాసాచారి, సుబ్బారావుగారలను కోరారు. మహారాజావారినితప్ప మరెవ్వరినైనా వారెంత గొప్పవారైనా కీర్తించడం తనకు అభిమతం కాదనీ, యింతటి గౌరవం చూపదగిన వ్యక్తి మహారాజావారేననీ నాయుడుగారన్నారు.

నాయుడుగారికి తాము ఆనందంగా వుండడ మెలాగో తెలుసును. ఇతరుల ఆనందాన్నే తమ ఆనందంగా భావించుకునేగుణం ఆయనకు కలదు.

గిండీలోని డాక్టరు బ్రౌనింగు బంగళా. డాక్టరు యింటి వద్ద లేడు. బంగాళాకు తూర్పుదిక్కు కభిముఖాన ఆఫీసురూము వున్నది. గది ఎంతో చల్లగా వుంది.

గిండీపార్కు కంటికి యింపుగా లేదు. నేలమీద పచ్చిక యెండిపోయింది. చెట్లు వొకదాని కింకొకటి యెడం యెడంగా వున్నవి. దూరదూరంగా వుండడానికి తోడు, వికృతమైన పెరుగుదల. చాలా అందవికారంగా కనిపిస్తున్నవి.

బ్రౌనింగు గదిలోవున్న అలమారానిండా పుస్తకాలు; చాలావరకు మెడికల్ గ్రంథాలే. షేక్స్పియరు నాటకాలు కూడా కలవు. గదిచెంత బట్లరు నించుని వున్నాడు. అతనితో కొంతసేపు మాటలాడితిని. బట్లరుకు దొరమీద ప్రేమ మిక్కుటముగా వున్నట్టు కనిపిస్తున్నది.

కేసులను పరీక్షించడంలో డాక్టరు బ్రౌనింగుకు మంచి ప్రసిద్ధికలదు. రోజులతరబడి వొక్కొక్కప్పుడు కేసులను నిదానంగా పరీక్షిస్తాడు. ఆలోచించి జాగ్రత్తగా పరిశీలించినమీదట కాని యే నిర్ణయానికీరాడు. వచ్చిన నిర్ణయాని కిక తిరుగు వుండదు. వైద్య వృత్తిలో ఘటికుడనే ప్రతీతి. తాను యేమి అనుకుంటున్నదీ మహారాజావారితో ముక్కుకు సూటిగా మాట్లాడగల నిర్మొహమాటి. ఈ నేర్పు కొద్దిమందికే వున్నది. మహారాజావారు లేనప్పుడుకూడా, మామూలు ఫీజుకంటే హెచ్చుగానే వసూలుచేశాడని బాలయ్యనాయుడుగారు నాతో చెప్పారు. బ్రేన్‌ఫోర్డు దొరకు రోజులు కలసిరాక, పేరు మరుగున పడిపోయిన తరువాత, వైద్యవృత్తిలో డాక్టరు బ్రౌనింగు బాగా పేరులోకి వచ్చి రాణిస్తున్నాడని, మదరాసులోవున్న

మనవాళ్ళ అభిప్రాయం. ఈయన మెడికలు జర్నలులో వ్యాసాలు వ్రాసి ప్రచురిస్తున్నాడు. ఘోషా ఆస్పత్రి యితని అజమాయిషీక్రింద బాగుపడింది. వాళ్ళు మంచి పనిచేసే స్వభావం. ఇతని వోర్మిని ఆసక్తిని చూసి గవర్నమెంటుకూడా మెచ్చుకున్నారు.

*　　　*　　　*

ఇవ్వాళ నారాయణమూర్తిగారిని పరమేశ్వరను పిళ్లేకి పరిచయం చేశాను.

*　　　*　　　*

*"మీ అవయవాలకు వచ్చిన ప్రమాద మేమీ లేదు. అవి బాగానే వున్నాయి. కాని మీ నరాలుమాత్రం ఎక్కడి వక్కడ విడిపోయినట్టు ధ్వంసమయాయి. సాధ్యమైనంతవరకూ లైగింకసంబంధం పెట్టుకోవద్దు. ఇప్పుడు మీరు పెప్సిను పొడరు పుచ్చుకుంటున్నారుకదా; అమందే యింకా కొంత కాలం వాడితే యిక ఆ మందు అవసరమే వుండదు, అవునండీ; మీరు బాగా పళ్ళరసం తీసుకోవాలి. సోడాకూడా మంచిది. మీరు కాలేజీనుంచి విరమించాలని నా అభిప్రాయం. ఎంత మాత్రం మీరిక కాలేజీలో పనిచేయకూడదని, వెంటనే విరమించాలని నా సలహా. నే నీమాట అన్నట్టు మహారాజా వారితో స్పష్టంగా చెప్పండి. శరీరానికి యెండతగలడం మంచిది కాదు. ఎండపొడ మీ శరీరానికి పడదు. అంతగా ప్రయాణం చేయవలసి వస్తే చేయండి కాని, వొంటికి ఎండా రొజ్జగాలీ తగలనీయవద్దు. శరీర దారుఢ్యానికి కాడ్‌లివరాయిలు సేవిం

* డాక్టరు బ్రౌనింగు పేరుపడ్డ సర్జను. ప్రభుత్వోద్యోగి. అప్పారావుగారి ఆరోగ్యస్థితిని పరీక్షించి ఆయన యిచ్చిన సలహాలు.

చండి. కొన్నాళ్ళు పుచ్చుకుంటే మీ ఆరోగ్యం చక్కబడుతుంది. సత్ప్రవ కలుగుతుంది. పేటెంటు మందులని ఊరికే చెబుతూ వుంటారే, వాటిజోలికి పోవద్దు. అవన్నీ వట్టిమోసం, దగా, హంబగ్! వేసవికాలంలో చన్నీళ్ళస్నానం చేయవచ్చును. సైకిలు తొక్కితే గుండెకు ప్రమాదం వాటిల్లుతుంది. మీ మూత్రంలో జబ్బువున్నదో లేదో భోగట్టా మీకు తెలుసు కున్నందువల్ల ప్రయోజన మేమీ లేదు. అది యేమిటో తెలుసు కుందామనే శారీరకశాస్త్ర ఆసక్తితో అడుగుతున్నారు తప్ప, అది యెంతమాత్రమూ మీ ఔషధసేవకు యెట్టిభంగమూ కలుగజేయదు. అది తెలుసుకోకపోయినంతమాత్రాన మీజబ్బు నిర్మూలించకపోదు."

3 ఏప్రిల్, బుధవారం:

ఇవాళ మదరాసునుంచి బెంగుళూరుకు ప్రయాణమయ్యాను. రామస్వామిమొదలి సత్రవులో భోజనం దొరికిందికాదు. బెంగుళూరుకు సరాసరి పోయే రైళ్ళలో సెకండుక్లాసు కంపార్టు మెంటులు లేవు. కనక మెట్టుపాళియం రైలును ఎక్కాను. కంపార్టుమెంటులో మంచి యూరోపియనుస్నేహితుడే దొరి కాడు; పేరు సి. హెన్రీ.

ఆర్కోణంలో వొక సంఘటన జరిగింది. జాలార్ పేటలో బండి మారాను.

4 ఏప్రిల్, లక్ష్మీవారం:

బెంగుళూరు చేరుకున్నాను. బాలయ్యనాయుడిగారి కక్కడ వొక మంచి యిల్లువుంది. అందమైనదే. ఆయన

యేజంటు వెంకోబరావుజీ దేశముఖ్ నేనంటే శ్రద్ధాసక్తులు కనపరిచాడు. ఎంతో మర్యాద చేశాడు.

సత్రవునానుకుని వొక వస్త్రషాపు కలదు. మదరాసులో కంటే యిక్కడి పాటకజనం మంచి బట్టలనే ధరిస్తారు. రంగు రంగుల రకరకాల చీరెలను ఆడవాళ్ళు కట్టుకుంటారు.

ఇక్కడున్న నూతులు పాతాళంలో వున్నట్టు చాలా లోతు. ఒకదానితో యింకొకటి జతపరిచి నాలుగు పెద్ద పలక రాళ్ళతో చుట్టూ నూతిగోడలు కట్టారు. నూతి వొరలు రాతితోనే నిర్మించుకున్నారు.

వీధిబడులలో పిల్లలకు తెలుగుకూడా బోధిస్తున్నారు.

సముద్ర తీరంలోనైతం ఉష్ణోగ్రత తొంభై డిగ్రీలదాకా పెరిగిపోతున్నదని వెంకోబరావు ఫిర్యాదు!

ఇక్కడ థియేటర్లు, నేటిపుస్తకాలు, స్వభాషా పత్రికలు వున్నవో లేవో దర్యాప్తు చేయాలి.

బసకు వెళ్ళగానే ముందు మొహం కడుక్కుందామని వెంకోబరావుగారిని పందుంపుల్ల అడిగాను. నల్లటి టూతు పౌడరు యింత పట్టుకువచ్చి ఆయన, నా చేతిలో పోశాడు. పందుంపుల్ల నా కెంత అనివార్యమో ఆయనకు బోధపడింది కాదు.

సరేనని వెంకోబరావుగారు నౌకరును పిలిచి వేపపుల్ల విరుచుకురమ్మన్నాడు. ఇంటి ఆవరణలోవున్న అంత చెట్టూ యెక్కి నౌకరు, అంగుళం వలం పందుంపుల్ల విరుచుకువచ్చాడు!

* * *

5 ఏప్రియల్, శుక్రవారం :

కాఫీ తాగినతరువాత బండీయెక్కి సెంట్రలు కాలేజీకి వెళ్ళితిని. భవనం అందంగావుంది. చుట్టూ పెద్ద జాగా; విశాలమైన ఆవరణ. ఆడుతున్న బంతి అవతలకు పోకుండా అడ్డుటకు టెన్నిస్‌కోర్టు కీరువైపులా యెనిమిదఘుగుల యెత్తున రెండు యినపకొవ్వాల వలలు కట్టివున్నవి. కాలేజీ, హైస్కూలు డిపార్టుమెంటులు రెండూ వొక్కచోటనే ఏర్పాటు చేసుకున్నారు. నాలుగువేల రూపాయలు ఖర్చుపెట్టి వొక ఫలహారశాలను నిర్మించారు. అస్తబలు, మరుగుదొడ్లు కలవు.

టీచర్ల వెయిటింగు రూములో మాథమిటిక్సు లెక్చరరు శ్రీ వెంకటస్వామినాయుడుగారిని కలుసుకున్నాను. శ్రీ మోహనరావు, విజయరాఘవాచారీ, రామానుజాచార్యులుగార్లను ఆయన ఎరుగుదురట! నాయుడిగారి జీతం మూడు వందలు.

బెంచీలు, కుర్చీలు అంత బాగాలేవు. వాటిని జాగ్రత్తగా ఉపయోగించుకున్నట్టు కనబడదు. విజయనగరంలో కంటే యిక్కడి బెంచీలు మరీ పాడుగావున్నవి. టీచర్ల వెయిటింగు రూములోవున్న సరంజామా మరీ అవుకు. రీడింగు రూములోవున్న బెంచీలను వొకచోట జతపరచి వాటినే వ్రాత బల్లలుగా వాడుకుంటున్నారు.

ఇవి పరిశుభ్రంగానే కనబడుతున్నవి. లైబ్రేరియను జీతం నెలకు పాతిక. లైబ్రరీలో మూడువేల పుస్తకాల ప్రత్యేక ప్రతులు వున్నాయి. ఒక అలమరానిండా బైండుచేసిన పత్రికా

సంపుటాలు. ఇంతకుమించి లైబ్రరీలో గమనించతగ్గ విశేషా లేమీలేవు.

మాథమిటిక్సు సెక్షనులో మొత్తం యెనమండుగురు, ఫిజిక్సు సెక్షనులో పాతికమంది విద్యార్థులు వున్నారు.

ఇంగ్లీషు ప్రొఫెసరు బెయిటుగారితో వొక గంటసేపు సంప్రదించితిని. ఈ ప్రాంతపు విద్యార్థులకు ఆత్మాభిమానం మృగ్యమని ఆయన అన్నారు. స్వదేశస్థులైన మన విద్యార్థులకు తమ వ్యక్తిత్వంపై తమకే గౌరవభావం లేదని, ఆయన యెంతో బాధపడుతూ నాతో చెప్పుకొచ్చారు: "వొకళ్ళతో వొకళ్ళు కలసిమెలసి తిరగరు. ఎవరిదారి వారిదే. కలిసికట్టుగా వుండక పోతేమానె! పోనీ తమ ప్రొఫెసర్ల చెంతకన్నా వస్తూ పోతూ సందేహాలు తీర్చుకుంటారా అంటే అదీ కనబడదు. చదువు కునే రోజుల్లో యిలాగున మేమెప్పుడూ ప్రవర్తించి యెరుగం. అందరం కలసిమెలసి మసిలేవాళ్ళం; ఆడుకునేవాళ్ళం. ఎవరితో నైనా జట్టీ వచ్చిందా అంతా కాకికట్టు."

"ఉన్నతమైన వ్యక్తిత్వం, గుణసంపద, లోకజ్ఞానం, పాండిత్యంగలవ్యక్తులతో విద్యార్థులకు పరిచయం వుండా లంటాను. అట్టి సహవాసం వారినెంతో ముందుకు తెస్తుందని నా అభిప్రాయం."

"అవును; మీరుచెప్పింది నిజమే"నన్నాడు దొర.

'విద్యార్థులు, ఇతరుల అభిప్రాయాలు తమకు భిన్నంగా ఉన్నవన్నంతమాత్రాన వాటిని ఎంతమాత్రం సహించలేనంతటి తీవ్రస్వభావులుకారు. తార్కికదృష్టి తీవ్రదృక్పథం వారి కలవడు

తున్నది. అయితే తమ మతచరిత్రకుగల కొన్ని సత్సంప్రదాయాలను వారు ఉపయుక్తం చేసుకోవడంలేదు. తమజాతిలో ఉద్భవించిన మహాపురుషుల గుణగణాలను సంప్రదాయాలను వారు అలవర్చుకోవడంలేదు. ఇందువలన విద్యార్థులలో గౌరవ భావం, ఆత్మాభిమానం క్రమక్రమంగా సన్నగిలిపోతున్నదని' చెబుతూ, నేను ప్రసంగవశాత్తూ నార్టనుదొర అజమాయిషీలో వున్న విద్యార్థులను గురించి ముచ్చటించాను. 'అవును; ఇది ఎంతో విచారకరమైన విషయము' టెయిటుదొర అన్నాడు.

ఇదివరకోసారి నాతో మాట్లాడుతూ డాక్టరు మిల్లరు 'విద్యాధికులైన హిందువులలో నైతికశక్తి, కార్యదీక్షా, పట్టుదల కొరవడినవని' అన్నాడు.

"చిన్నతనంలోనే వివాహంకావడంవల్ల భారతీయ విద్యార్థుల జీవితాలు దుఃఖభాజన మవుతున్నాయి. దీనికితోడు దారిద్ర్యబాధ వారిని మరీ కృంగదీస్తున్నది. అందువల్ల మా భారతీయ విద్యార్థులు హాయిగా కులాసాగా ఆనందంగా కనిపించరు. జీవితంలో యెదురౌతున్న కష్టాలను అధిగమించలేకపోతున్నారు. కష్టాలను తేలికగా తీసుకుని, నవ్వుతూ వాటిని దాటలేకపోతున్నారు. మీ ఇంగ్లీషు యువకులకీ చతురత స్వాభావసిద్ధమైన లక్షణం. ఈ గుణం మా విద్యార్థులలో ఎలాగ కనిపిస్తుంది మరి ?"

నేను చెప్పినదంతా నిజమేనని టెయిటుదొర సమాధానమిచ్చాడు.

వొకసారి ఆయన్ని వొక విద్యార్థి తనను పైక్లాసులోనికి ప్రమోటు చేయవలసిందిగా ప్రార్థించాడట. తనకు పరీక్షలవు

I asked him how he accounted for the lack of any extraordinary productiveness in the Vernacular literatures under the influence of English Education. I told him that if Latin and Greek could produce an outburst of literary activity in the European countries at the time of the Renaissance, was it not remarkable that the influence of such a great literature like that of the English people should have produced no appreciable influence on the Vernaculars? He could not see his way to any answer

తున్న సమయంలో తన బిడ్డ చనిపోయిందని, తన కా పసిపాప మరణం యెంతో 'దుఃఖం కలిగించిందనీ, అందువల్ల తాను పరీక్షపేపర్లు బాగా వ్రాయలేకపోయా'నని ఆ విద్యార్థి సెయిటుతో మొరపెట్టుకున్నాడట !

ఈ విషయం సెయింటు యెంతో విస్మయంతో నాకు చెప్పినమీదట నేను మా ప్రిన్సిపాలుగారి సంగతి ముచ్చటించాను. విద్యాభ్యాసం చేస్తుండగా విద్యార్థులు వివాహం చేసుకుంటే వారి కిచ్చిన స్కాలరుషిప్పులను రద్దుచేయడం ఆయన పద్ధతి. వివాహితులైన విద్యార్థులకు సర్వసాధారణంగా చను వివ్వడం అరుదు.

గ్రీకు రోమను గ్రంథపఠనమువల్ల రినేజాన్సుదినములలో యూరపులోని అన్ని దేశాలలోనూ స్వదేశీయ సారస్వత విజృంభణము వొక్కమారు ప్రతిభావంతమైనదిగదా, అట్లే ఆంగ్లుల ప్రసిద్ధ సారస్వత ప్రచారంవలన, విద్యాప్రభావం వలన, అట్టి విజృంభణము, మన దేశభాషలలో చెప్పుకోతగ్గ ఫలిత మేమీ కానరాకపోవడం వింతగా తోచడంలేదా ? ఇందుకు కారణం మీరేమని ఊహిస్తున్నారని ప్రశ్నించాను.

ఈ దృష్ట్యా ఆయన ఆలోచించి దీనికి సమాధానమీయకుండెను : "మళయాళీ భాషలో చెప్పుకోతగ్గ నవలే వెలువడిందికదా, మరి."

"దీని నంతవిశేషంగా చెప్పుకుందుకు కారణం మరేమీ లేదు; వొక యూరోపియను ఆ నవలను అనువదించడమే ! మదరాసులోవున్న మళయాళీ మిత్రులతో యీ నవలను

గురించి చర్చించాను. వారి దృష్టిలో యీ నవలేమీ గొప్పది కాదు!"

"ఆ నవలలో మంచి హాస్య సంభాషణ లున్నాయ్! వొక విద్యావిహీనునికీ, విద్యావంతునికీ మధ్యజరిగిన సంభాషణ హాస్యంగా లేదూ?"

"కొందరు యూరోపియనుల కీ నవల యెందుకు నచ్చుతుందో నాకర్థమయింది. వాళ్ళకి హాస్యమంటే అభిరుచి హెచ్చు. కాని నవలా శైలిలోనూ, వస్తు నిర్వహణలోనూ యేమైనా సొగసు వున్నదా? కళా చాతుర్యము వుట్టిపడు తున్నదా?"

"నా కాసంగతి తెలియదు; బహుశా వుండకపోవచ్చును."

"వొకవేళ యీ నవల బాగున్నదనుకున్నా భాషా వికాసానికీవొక్క నవలా సరిపోదు. స్వదేశీయ సారస్వత విలుప్తతకు కారణం వొకటై వుంటుందనుకుంటాను. సాహిత్య పాఠములలో విద్యార్థులకు శైలిలోను, వస్తువిన్యాసములోను యిదిమంచీ, యిది చెడ్డ అని విడదీసి వాటి బాగోగులను బోధింపకుండుట, విమర్శగా చదువుట నేర్పకుండుట, స్వతంత్ర యోచనా శక్తిని పురికొల్పేదిగా బోధనాక్రమ ముండకపోవుట, రసానుభవమూ, వివేచనా లేకుండుట కారణమని నా ఊహ. కాలేజీ విద్యార్థులకు చెప్పే పాఠాల తీరూ, బోధనా పద్ధతులూ చాలా దుష్టంగా వుంటున్నవి."

మీరు చెప్పినదంతా నిజమేనంటూ మిస్టర్ టెయిటు తనకు సాహిత్యపాఠాలను చెప్పడం రుచించడం లేదన్నాడు. గ్రంథాల పేర్లూ, కవులకాలాలనుగురించీ తప్ప మరి దేనినీ

బోధించడంలేదనీ, యిది చాలా విచారించతగ్గ విషయమనీ అంటూ మిస్టరు టెయిటు "క్లాసులో విద్యార్థుల కేమీ బోధ పడకపోయిందా, వెంటనే నిలబడి చెప్పేపాఠాలకు అడ్డు వస్తారు."

'మనం గొప్ప గొప్ప కావ్యాలను విద్యార్థులచేత చదివించడం మంచిది. ఏదో వొక యుగపు వాఙ్మయ చరిత్రను పాఠ్యభాగంగా వేస్తే చాలునని' నే నన్నాను.

టెయిటు దొర యీ విషయం వొకప్పుడు డాక్టరు మిల్లరుకు సూచించగా ఆయన "ఇప్పటికే విద్యార్థులు చదవ వలసిన పుస్తకాలు తడిసిమోపెడుండగా మరి నాలుగు పుస్తకాలు చదవమని వాళ్ళని బాధించలేం" అన్నారట! "పిల్లలు చాలా పుస్తకాలు చదవవలసివుండినమాట నిజమే! కాని మీ సూచనలను ఆమోదించినట్లయితే, యీ పుస్తకాల సంఖ్యా తగ్గివుండేది; మంచి గ్రంథాలను పిల్లలు చదవనూ చదివేవారు."

"అవునవును; మీరన్నది వాస్తవమే మరి! మీరు ఏ యే పుస్తకాల్ని బోధిస్తున్నారు?" మిస్టరు టెయిటు తన టేబిలుమీదవున్న గ్రంథాన్నొకదాన్ని చేతపుచ్చుకుని నన్ను ప్రశ్నించాడు. ఆయన చేతనున్న పుస్తకపు ఆకారాన్నిబట్టే అది లాంగ్మెన్సు బుక్కు అయివుంటుందని పోల్చుకోవచ్చును.) "అది లాంగ్మెన్సు బుక్కే కదూ?"

"సరే; మీకు తెలుసునన్నమాటే! ఇందులో కంఠస్థం చేయతగ్గ మంచి విషయాలు చాలావున్నాయి. అవీ యీ పుస్తకంలోవున్న సొగసు!"

"మా విద్యార్థులచేత, బడిలేని టైములో జనరలు పుస్తకాలను చదివిస్తాం. కాలేజీ లెక్చర్లలో ఒకాయన యీ పుస్తకాలను ఎలాగున పఠించవలెనో బోధపరుస్తావుంటారు."

"ఇది మహామంచి పద్ధతి."

క్లాసులను నిర్వహించడం బహుకష్టమైపోతున్నదనీ, విద్యార్థులు వ్రాసే కాంపోజిషనులోని ప్రతిదోషాన్ని దిద్దడం మసాధ్యమవుతున్నదనీ, మిస్టరు వెయిటు నాతో అన్నారు. "విద్యార్థుల కాంపొజిషనులో ఏ, యే తప్పులు ఉన్నాయో చూపించినంతమాత్రంవల్ల లాభం శూన్యం. తను చేసిన పొరపాటేదో విద్యార్థికి తెలియకుండా పోతున్నది. పోనీ ప్రతి తప్పూ దిద్దుతూ కూచుందామూ అంటే అదీ సాగడం లేదు. ఇక యూనివర్సిటీ సరేసరి! జనరలు యింగ్లీషు పేపరు వ్రాసే అది ఎత్తడంలేదు. జనరలుయింగ్లీషు పేపరు వొక అవకతవకగా తయారయింది. ప్రశ్నా పత్రాలలో ఏది అడగాలో, ఏది అడగకూడదో ఎవరికీ బోధపడదు; అంతా అయోమయం. ఎగ్జామినర్ల యిష్టాయిష్టాలపై యివి ఆధారపడుతున్నాయి."

'మదరాసు కాలేజీలలో వున్న ప్రొఫెసర్లు తమ విద్యార్థులకు బోధించే పాఠాలకంటె హెచ్చు విషయాలను మేము మా విద్యార్థులకు బోధిస్తున్నామని' నే నన్నాను: "మదరాసు ప్రొఫెసర్లు ఎగ్జామినర్లుగా వుండడంవల్ల మాకు వుండే శ్రమ దమాదులు వారికుండవు. స్కీట్సు శబ్దశాస్త్రమూ, కెల్లెన్సు వాక్యరచనాపద్ధతీ మదరాసు ప్రొఫెసర్లు యింకా తమ విద్యార్థులకు చెప్పనేలేదట! నాలుగయిదేళ్ళ క్రిందటే ఆ గ్రంథాలను

మాకు విద్యార్థులకు పాఠం చెప్పి, వాటిపై నోట్సు తయారుచేసి యిచ్చాను. వింత యేమంటే, నికుషూ, యీ యేడూ స్కీట్సు మీద విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. కెల్లెను గ్రంథంపై ఒక్క ప్రశ్న కూడా యింతవరకూ రాలేదు."

కొంతసేపు ప్రసంగించిన తదుపరి, తాము పాఠములు చెబుతుండగా వినవలెనని వున్నదని మిస్టరు టెయిటును సూచన ప్రాయంగా కోరితిని. నా కోరికను మన్నించినఎడల నేనెంతో కృతజ్ఞుడనని చెప్పితిని. తనకు థర్డుఅవరు యింగ్లీషు క్లాసు వున్నదని చెబుతూ, టెయిటుదొర నా సూచనకంత అభిముఖుడను కానని సూచించాడు. మరి నేనా విషయం ప్రస్తావించక అంతటితో నా కుతూహలాన్ని వొదులుకున్నాను. కాని లీనాక్సు దొర పాఠములను బోధిస్తుండగా వింటిని. ఆయన చాలా అసమర్థుడు. పాఠాలను బొత్తిగా చెప్పలేడు. మిస్టరు టెయిటునుగూర్చి గొప్పగా వింటిని. కొంచెం మోటుమనిషనీ, కోపిష్టి అనీ పిల్లలు అంటారుగాని చాలా మర్యాదస్థుడుగా కనపడ్డాడు. నాతో అదేపనిగా మాట్లాడినాడు. అయితే అది వాచాలత కాదు. నేనే చాలావరకూ అనేక విషయాలను ప్రస్తావించి ఆయనను సంభాషణలోనికి దించితిని. ఆంగ్ల, ఆంధ్ర భాషా విషయాలు వచనభేదాలను గురించి ఆయనకు తెలియ చేశాను. కాలేజీలోవున్న కన్నడభాషాపండితునితోగూడా కొంతసేపు ప్రసంగించితిని.

మా సమావేశానంతరం, యిక సెలవు పుచ్చుకుంటానని నేనే మొదట కుర్చీలోంచి లేచాను. టెయిటు దొర చాలా ఆప్యాయతతో కరస్పర్శ కావించాడు. ఇంతసేపూ

ఏవేవో విషయాలను ముచ్చటించి ఆయన పనికి ఆటంకం కలిగించినందుకు మన్నించవలసినదిగా కోరాను. "కాదు కాదు; మీతో సంభాషించడంవల్ల నా కెంతో ఆనందంగా వుంది. మీ పరిచయం కలిగినందుకు నాకెంతో సంతోషం."

6 ఏప్రియల్, శనివారం :

ఈవేళ ఉదయం ప్యాలసును చూస్తిని. భవనం చాలా అందంగావుంది. కాని లోపల వస్తు సామాగ్రి విజయనగరం లోని మోతీమహాలుకు తీసికట్టే. మహలు కొన్నిచోట్ల హుందాగా కనిపిస్తూ ప్రశాంతతతో తులదూగుతున్నది. మేడ మెట్లలో కొన్ని ఔకుగానూ అందవిహీనంగానూ వున్నవి. బల్లలతో కట్టిన వరండా. అదీ బాగు లేదు. మహలులో చెప్పుకోతగినన్ని వర్ణచిత్రాలు లేవు. మహారాజావారి లైబ్రరీలో ఆట్టే పుస్తకాలు లేవు. వున్న ఆ కొన్ని పుస్తకాలయినా కులాసాకి చదువుకునే నవలలు. పేలసు వాక తమిళపిళ్ళె అజమాయిషీకింద వుంది. అతను ధరించిన బట్టలు దరిద్రంవోడుతూ వున్నవి. పేలసు గేటులను మూసివుంచమనీ, ఎవరినీ లోనికి రానీయవద్దనీ మహారాణి హుకూం జారీ చేసిందట! ముందే నాకీ సంగతి తెలిసివుంటే, నే నింతదూరం వచ్చేవాడినీకాను; లోనికి వెళ్ళేవాడినీ కాను.

పిళ్ళె అంటే అందరికి ఎంతో ప్రేమ; గౌరవం. మహారాణికి ఇంగ్లీషు, కన్నడం, తెలుగు చక్కగా వచ్చును. ఈ మూడు భాషలలోనూ ధారాళంగా మాట్లాడగలదు; వ్రాయగలదు. ఆవిడ భాషాసంపన్నతకు మనదేశం గర్వించ

వచ్చును. ఆమెకు అయిదుగురు పిల్లలు. వీరి కుటుంబం వర్ధిల్లాలనీ, తమ తల్లిదండ్రులవలె, పిల్లలు కీర్తిప్రతిష్టలు ఆర్జించుకోవాలని నా కోరిక.

ఈ మహారాజు చాలాకాలం క్రితం కలకత్తాలో మరణించాడు. మా మహారాజావారి భవనంలో అతిథిగావుంటూ మందు పుచ్చుకునేవాడు. జబ్బు నిమ్మళించలేదు. ఆయన మరణించాడని ఒకనాడు మా మహారాజావారికి టెలిగ్రాంవచ్చింది. తన మిత్రుని మరణవార్తవిని మహారాజావారు యెంతో విచారించారు. ఆయనంటే యీాయనకెంతో గౌరవం.

తనభర్త మరణానంతరం, మహారాణి, కలకత్తానుంచి వెళ్ళిపోవస్తూ తన కృతజ్ఞతను మా మహారాజావారికి తెలియచేయవలసినదిగా బాబూసాహేబును కోరింది; ఆయన ఆవిధంగానే తెలియచేశారు. "కలకత్తానుంచి తమ స్వస్థలానికి బయలుదేరుతూ మీాకు తమ కృతజ్ఞతను తెలియచేయవలసినదిగా మహారాణి అభ్యర్థించింది. తమభర్త తన అవసానదశలో మీా బసలోనే వున్నందుకు, మహారాణికి కొంత ఊరటకలిగింది. ఇదివరకటివలెనే, ఇప్పుడూ ఎప్పుడూ మన రెండు కుటుంబాలకూగల స్నేహం వర్థిల్లగలదని ఆమె ఆశిస్తున్నది."

మహారాణి వాక్యాలలోగల సౌహార్దమునకు మా మహారాజావారు మిగుల ఆనందించారు.

కీ. శే. మహారాజు ఏమంత చెప్పుకోతగ్గ ధీశాలీ, పండితుడూ కాడు.

♦ ♦ ♦

మ్యూజియమును చూడ వెళ్ళితిని. అక్కడవున్న ఆఫీసరు చాలా మర్యాదస్థుడు. మ్యూజియములోని దంతపుపని మిగుల బాగున్నది. విజయనగరం మహలులో ఉన్న వాటికంటె యిక్కడివే సొగసుగా కనబడుతున్నవి.

♦ ♦ ♦

బ్రష్‌తో రాతిపలకను చక్కగా తుడిచి నీళ్లతో కడగవలెను. కాగితమును నీటిలో ముంచి, పైకితీసి, శాసనపు పలక మీద జాగ్రత్తగా నిండుగాపరిచి, బ్రష్‌తో వొత్తవలెను. శాసనములోని అక్షరములు కాయితంమీద పడేవరకు బ్రష్‌తో అదమవలెను. నీళ్లలో కాగితాన్ని ముంచేటప్పుడు దానిని టబ్బులో బాగుగా వుంచాలి.

నౌకరు మొదట నాసిక్ పేపరును వుంచాడు. దానిపై ప్రింటింగు పేపరును పరిచాడు. రాయి మోటుగా వుండి అక్షరములు స్ఫుటముగా పడనప్పుడు, వొక సీసాలో దీపపుమసీ, యింకుపౌడరూ వేసి సిరావలె తయారయేట్టు నీళ్ళుపోయాలి. పేడ్‌పై కొద్దికొద్దిగా యీ సిరాను చిమ్ముతూ మెల్లగా వొత్తవలెను. అక్షరములు స్పష్టపడేవరకూ అలాగున యింకును పోస్తూనే వుండవలెను.

... ...

ఈ వేళ సాయంకాలం రైలులో వొక పటాలం వెళ్ళిపోతుండగా చూశాను. సిపాయిలను సాగనంపుటకు వారి బంధువులు వచ్చారు. బంధువులు, కుటుంబస్థులు మిగుల దుఃఖిస్తూ వుండిరి. చాలా హృదయ విదారకమైన దృశ్యం.

సిపాయీలను యెక్కించుకొని రైలు బయలుదేరింది. ఇవతల నిలబడివున్న తమ ఆప్తులను, బంధువులను రైలు పెట్టెలలో నుండి తొంగి తొంగి చూస్తూ సిపాయీలు జేబు రుమాళ్ళను ఊపుతూ వుండిరి !

*   *   *

శ్రీ కృష్ణశాస్త్రిగారు చాలా మంచిమనిషి; ఒకరికి తనకు తెలిసిన విషయాలను చెప్పేందుకు, ఇతరులవలన మరి కొన్ని విషయాలను తెలుసుకునేందుకు సదాసంసిద్ధులు. మని షిలో లేనిపోని నటన, భేషజమూ లేవు.

కాని ఆయన యివాళ వస్తానని చెప్పి యింకారాలేదు. ఇక నాకు మిగిలినదల్లా వెంకయ్యగారి సాన్నిధ్యమే. ఈయ నకు నాపనిమీద శ్రద్ధలేదు; సానుభూతీలేదు. ఎప్పుడో యేదో పురావస్తు తత్వశాస్త్ర విషయాలలో మునిగి తేలిపోతున్నట్టూ, తనకేమీ తీరికలేనట్టూ ప్రవర్తిస్తాడు. తన శక్తి సామర్థ్యాలను గురించి తానే కొంచెం గొప్పగా పొగుడుకుంటూ, కాస్త యీర్ష్య ప్రదర్శిస్తూవుంటాడు. మనిషికి యీసు లావు. రికార్డులు చూస్తానయ్యా బ్రహ్మదేవుడా అంటే, అవి చూడ్డానికే ఆయన నాకవకాశమీయలేదు.

ఇలియటుదొరగారి తెలుగుశాసనసంపుటి కావాలని అడిగితిని. హుల్ట్జు దొరగారు వాటిని తీసుకువెళ్ళి వుంటారని ఆయన సమాధానం. "బెజవాడ, నాదెండ్ల శాసనాల నొకసారి తిలకించమని" వెంకయ్యగారన్నారు. వాటిల్లో నాకు కావలసిన ప్రధాన విషయాలేవీలేవు. సింగవంశపు శాసనాలను కావాలని

అడిగాను. "అవీ లేవు; వాటికేదో వుంటే, అది ఎడిటుచేయడానికని కీల్హారనుగారికు పంపించాము." ఈ రెండు శాసనాలు సూయిలులో కలవని నేనన్నాను. "అబ్బే! అది పొరపాటై వుంటుంది!"

మొదటి పదిరోజులు వెంకయ్యగారు, డాక్టరు హుల్ష్ దొరను పొగడడం తప్పితే, మారుమాటేమీ పలకలేదు. ఆ పది రోజులూ పొగడ్తలతోనే ఊసుపోయింది. "ఆయన గొప్ప సంస్కృత పండితుడు. రాజేంద్రచోళమిత్రుడు గొప్ప సంస్కృత భాషా పాండిత్యం కలవాడు కాదని హుల్ష్‌దొర చెప్పినారు; సంస్కృత వ్రాతప్రతులను గురించి భండార్కరు వ్రాసిన నోట్సు' లలో కొన్ని దోషములున్నట్లు నేను కనిపెట్టాను. అయితే నేనింకా నా సంస్కృతభాషా పరిజ్ఞానాన్ని వృద్ధిచేసుకోవాలను కుంటున్నాను. చోళరాజరాజుకూ, ఆయన అక్క కుందన దేవికీ మధ్య కొంత సంభాషణను ఊహించి వ్రాయాలని నా అభిలాష. రాజరాజు శక్తిసామర్థ్యాలను, ప్రతిభను ఉగ్గడిస్తూ కొన్ని వ్యాసాలను వరుసగా ప్రచురిద్దామని తలపోస్తున్నాను." ఇలాగ ఎంతోసేపు వెంకయ్యగారు ప్రసంగిస్తూ కాలం వెళ్ళబుచ్చారు.

"తెలుగులో కొన్ని చారిత్రకనాటకాలను నవలలను వ్రాయ తలపెట్టాను. అందుకోసం ఎట్టి విప్రతిపత్తిలేని దక్షిణ భారతదేశ చరిత్ర నాకు అవసరం; సరియైన చారిత్రకయితి వృత్తం, పథకం నా నాటకాలలో నవలలలో స్వీకరించాలని నా తలంపు" అన్నాను. తనకూ యిట్టి ఊహకలదని వెంకయ్యగారు చెప్పారు.

I said I wanted to have a correct sketch of the history of Southern India so that I might ~~[illegible]~~ give a historical framework of some plays and novels I intended to write in Telugu

కృష్ణా, గోదావరి జిల్లాలకు సంబంధించిన శాసనాలను రికార్డులను యీయవలసినదిగా వెంకయ్యగారిని నేను వచ్చిన రోజునే అడిగాను. కాని ఆయన నాకా సదుపాయం కలుగ జేయలేదు. నాకు వున్న వ్యవధి చాలా తక్కువ. ఆ కాస్త టైమునీ ఏదో వొక సంభాషణలోనికి నన్ను దించుతూ ఆయన హరించివేశాడు. కాలయాపన చేద్దామనే కాని నేనడిగిన దేమిటో పరిశీలించి యిద్దామనే తలంపు వెంకయ్యగారికే కోశానా లేకపోయెను!

ఒక శాసనంలోని తెలుగులిపిని పరిశీలిస్తూ కొన్ని మాటలకు అర్థం చెప్పవలసినదిగా ఆయన నన్ను కోరాడు. శాసనపు లిపిని పోల్చుకోవడంలో ఆయనకు నాకు చేతనైనంత సహాయం చేశాను.

* కరికాలచోళుడు అనేది వొక బిరుదునామమనీ, దానిని అనేకులు ధరించారనీ శ్రీ వెంకయ్యగారి ఊహ. కావేరి నదిపై ఆనకట్ట, లేక వంతెన కట్టినది ఎవరో ఆయనకు తెలియదు. కరికాళచోళుడు బహుశా యీ నదిపై కట్టలు

* క్రీస్తుశకము 450 ప్రాంతంలో కావేరీనదీ ప్రాంతాన్ని పరిపాలించిన చోళరాజు. చోళులు తమిళదేశాన్ని యేలిన రాజులలో అత్యంత ప్రాచీనులు. ప్రజలలోంచి ఉద్భవించి ప్రజల యోగక్షేమానికై పాటుపడిన పరిపాలకులు. శైవమతస్థులు. వీరికిని, పల్లవ సామ్రాజ్య స్థాపకులకును అనేక యుద్ధములు జరిగినవి. ఉత్తరదేశసంస్కృతిని, సంస్కృతభాషను దక్షిణదేశంలో నెలకొల్ప ప్రయత్నించిన పల్లవరాజులలో త్రిలోచన పల్లవుడు అగ్రగణ్యుడు. ఈ త్రిలోచన పల్లవుని, కరికాలచోళుడు ఓడించి కావేరీనది ఆనకట్ట నిర్మాణ సందర్భంలో యితని చేత మట్టితట్టలు మోయించాడని వొక ప్రతీతి కలదు. కావేరీ ముఖద్వారమునగల 'కావేరీ పూంపట్టణం' కరికాలచోళుని రాజధాని,

పోయించిఫ్రంటారని ఆయన అభిప్రాయం. కరికాళచోళుని గురించి ఆయన కేమీ తెలియదు. స్థానిక శాసనాలు, దాఖలాలు అంటే ఆయనకు విలువ లేదు.

ఇకియడు తెలుగు శాసనముల సంపుటి, యిలియటు వారగారు ఆఫీసుకు పంపించివేశారు. ఈ శాసనసంపుటిని యెవరూ పరిశీలించినట్టు తోచదు. ఇందులో కొన్ని శాసనములలో దానముల ప్రసక్తి వున్నది. కాని, వాటి మూల ప్రతులు పోయినవి. రెండు వందల సంవత్సరాలకు పూర్వము చేసిన వొక దానమునుగురించిన భోగట్టా యిందు కలదు. బహుశా యిది ప్రక్షిప్తమయి వుంటుంది.

నాకు కొన్ని పేజ్స్, బ్రష్‌లూ కావలసివుంది. ఆయన వీటిని ఆర్డరిచ్చి తెప్పించి నా కీయగలడు గాని, అలా చేయలేదు. డాక్టర్ హుల్ష్సు దొరకు వ్రాసి తెప్పించుకోవలసిందిగా చెప్పాడు. అక్కడి ఆఫీసులో కూచుని నేను సేకరించిన భోగట్టాను యెంతమాత్రమూ ప్రచురించవద్దని వెంకయ్యగారు నన్ను కోరారు. కారణం హుల్ష్సు దొరగారి అనుమతి లేనిదే నకళ్లూ అవీ ఆయన నా కిచ్చారట. డాక్టరుగారు ప్రివిలేజిలీవుమీద బెంగుళూరులో వున్నారాయె! కొన్ని శాసనపు నమూనాలకు, ఫోటోగ్రాఫులు యెత్తవలెనని నేను అనుకున్నాను. దానికికూడా

ఆ నగర ప్రాచీన శిథిలాలు నేటికీ నిలచివున్నాయి. తెలుగుదేశంలో వివిధ ప్రాంతాలలోవున్న రేనాటి చోళులు, వెలనాటి చోడులు తదితరులందరు కరికాలచోళుని తమ వంశకర్తగా కీర్తించారు. పాల్కురికి సోమనాథుడు, తన నవనాథచరిత్రలోను, తిక్కన తన 'నిర్వచనోత్తర రామాయణము'లోనూ ఇతనిని గురించి ప్రస్తావించారు.

హుల్ట్జుదొర అంగీకారం అవసరమట ! రాసిన ఉత్తరాలకు సమాధానమిచ్చే అలవాటు హుల్ట్జుదొరకు సర్వసాధారణంగా లేదు. "ఇదేమిటండీ వెంకయ్యగారూ" ఆయన "దొరకు పరాకు లావండీ ! గడియకోలాగ వుంటాడు. నేనేం చేయను?". అని సమాధానం. డాక్టరు హుల్ట్జు స్వభావ మేమిటో ఈయనకీ తెలియదు. దొరకు దూరప్రయాణాలంటే యిష్టంలేదు. కమానువెళ్ళడమంటే యజ్ఞం చేసినట్టే.

"పోనీ సూయిలుదొర సంపుటాలు వొకసారి చూడ నివ్వండి" అని అడిగాను. అవి యేమిటో ఆయనకు తెలియదు!

"సరే, గవర్నమెంటు యీ మధ్యనే సేకరించిన శాసనాలూ దానిమీద, వ్రాసిన నోట్సూ, వుంటే యివ్వండి"

ఇదీ ఆయనకు తెలియదు. "బహుశా 'రావు' గారు పట్టుకుపోయి వుంటారేమోనండీ" అని సమాధానం.

"కనుక్కోలేక పోయారా మరి ?"

"కనుక్కున్నానండీ. రావుగారి అసిస్టెంటు నడిగితే అవి తన ఆఫీసులో లేవన్నాడూ ! "

రావుగారు పండితుడు కాడనీ, ఆయనచేసే పనల్లా భవనం జాగ్రత్తగా వుంచడమనీ, శాసనాలను చెడిపోకుండా కాపాడడమనీ మిస్టరు టెయిటుగారు యిదివర కొకసారి నాతో చెప్పారు.

నటేశానికి శాస్త్రీయపద్ధతుల ప్రకారం కార్యభారాన్ని నిర్వహించడం చాతకాదట. మనిషికి శాస్త్రీయపద్ధతుల ఆలోచనల కంటె ఊహాగానం విపరీతమట. ఆయన "జానపద చరిత్ర" కేవలం ఊహాగానం. ఇలాటి కేవల ఊహాల్పై రచించిన

గ్రంథంవల్ల యెట్టి ప్రయోజనమూ లేదు. శాస్త్రీయపద్ధతులు పరిశిష్ట ఊహాలతో పరిశోధనలను సాగించడంవల్ల లాభం కనిపించదు.

ఆఫీసులో భోగట్టా సంపాదించడం బ్రహ్మాండం. ఆ మాటా యీమాటా చెప్పి, కేవలం యుక్తిగానూ, పదేపదే నొక్కి నొక్కి ప్రశ్నిస్తూ వొత్తిడిచేయడంవల్లనూ ఎలాగైతేనేం, కొంత సమాచారం సంపాదించగలిగాను.

* కోట రాజులనుగురించి వెంకయ్యగారి కేమీ తెలియదు. ♦ రాజమహేంద్రవరపు రెడ్డిరాజులు వియ్యంవల్లకాక కేవలం కొండవీటి రెడ్డిరాజులను జయించి రాజ్యాన్ని స్థాపించారని ఆయన ఊహ. ఈ విషయంలో (శ్రీ) వీరేశలింగం పంతులుగారి అభిప్రాయమే నిజమైనదని ఆయన భావం. రాజమహేంద్రవరపు రెడ్డిరాజులు కోమటి వేమారెడ్డితో యుద్ధంసలిపినమాట నిజమే;

---

* చాళుక్యరాజ్య పతనానంతరం గుంటూరుజిల్లా ధరణికోట ప్రాంతాన్ని పరిపాలించిన మాండలికప్రభువులు. తరువాత కొంతకాలానకు వీరు కాకతీయ సామ్రాజ్యానికి సామంతరాజులుగా మారిపోయినారు.

♦ కొండవీటి రెడ్డిరాజుల్లో అత్యంత విలాసపురుషుడైన కుమారగిరి రెడ్డి తన బావమరది కాటయ వేమారెడ్డికి రాజమహేంద్రవర రాజ్యాన్ని బహూకరించాడు. కుమారగిరిరెడ్డి అనంతరం కొండవీటిరాజ్యాన్ని పరిపాలించిన కోమటి వేమారెడ్డికి, రాజమహేంద్రవరాన్ని పాలించిన కాటయ వేమారెడ్డికి అనేక యుద్ధాలు జరిగాయి.

Social service. ~~[illegible]~~ To do literary work is my aim - But - I should prefer to work independently.

* గణపతి, "మహామండలేశ్వర" అనే బిరుదు వహించుటకు కారణమేమి? చోళులు అనంతరం, కాకతీయులు పరాక్రమవంతులయిరని, ప్రసిద్ధికెక్కిరని వెంకయ్యగారికి తెలియదు. "ఇటీవలనే ఇండియను ఆంటిక్వేరీ" వాల్యూములో తూర్పు చాళుక్యలపై ఫ్లీటుదొర వ్యాసం వ్రాసిరిగదా? సాగి వంశస్థులనుగురించి మీకేమైనా భోగట్టా తెలుసునా?"

"ఊహుఁ!"

విజయనగర పరిపాలకులలో ఆఖరివాడు శ్రీకృష్ణదేవరాయలు. ఆయన తరువాత వచ్చిన రాజులు కొన్ని గ్రామాలను మాత్రమే యేలినప్పటికీ తాము మహాచక్రవర్తులమని ప్రకటించుకొన్నారు.

పరిశోధనకు తెలుగు అసిస్టెంటు నొకరిని నియామకం చేయవలెనని ఇందుకు శ్రీ గిడుగు రామమూర్తి పంతులును నియమించవలెనని హుల్ట్జుదొర మొదట అభిప్రాయపడ్డాడు. కాని ఆంధ్రదేశంలో పరిశోధించవలసిన శాసనాలు మిక్కుటముగా లేవని భావించి శ్రీకృష్ణశాస్త్రిగారిని తరువాత నియమించాడు.

నాకే ఆశలూ లేవు; నాకు విశ్రాంతి కావాలి. సాహిత్య కృషిని, కొనసాగించడమొకటే నా ఆశయం. అయితే

* కాకతీయ గణపతిదేవుడు. ఇతడు కాకతీయ రాజ్యాన్ని విస్తరింపచేసి సమగ్రాంధ్రదేశాన్ని పరిపాలించాడు. అనేకమంది మండలేశ్వరులు యితనికి సామంతులు. వివిధ మండలేశ్వరులపై చక్రవర్తిత్వమును వహించి అందుకు చిహ్నముగా కాకతీయ గణపతిదేవుడు 'మహామండలేశ్వర' బిరుదమును వహించాడు.

సాహిత్య రచనను నేను సర్వస్వతంత్రుడుగా వుంటూ సాగించవలెనని నా అభిమతం.

సర్క్యులరు రిపోర్టులనుగురించి మ్యూజియములో విచారణ చేశాను. ఎపిగ్రాఫియా ఇండికాలో ప్రచురింపబడేవాటికి పేజీకి అయిదు రూపాయల చొప్పున యిస్తారట. ఆయన శాసన పరిశోధక డిపార్టుమెంటులో ఉద్యోగానికి దరఖాస్తుపెట్టాడట. "నా దరఖాస్తుమీద ఏమి రిమార్కులు రాశాడో హుల్ట్జ్ దొర! గవర్నమెంటు నా జీతం హెచ్చించింది. ఇప్పుడు రెండు వందలిస్తున్నారు. ముందుముందు రెండువందల యాభైదాకా పెరుగుతుంది."

ఈ హుల్ట్జ్‌దొర పెద్ద పండితుడేమీ కాడని శ్రీనివాసయ్యంగారు చెప్పారు. ఈ పదవిని పెర్మనెంటుచేయవలసిందిగా ఆయన దరఖాస్తు పెట్టాడట. లేకపోతే పెన్షనైనా యివ్వాండన్నాడట. ఇంతవరకూ ప్రభుత్వం యిందుకు సమాధానం చెప్పలేదు. అతనీ పదవిలో వుండేదీ లేనిదీ అతనుచేసే పనిని బట్టి వుంటుందని ప్రభుత్వం ఆయనకు సూచిస్తున్నట్లుంది. అందుకే దొర పిటిషనుమీద యేమీ మాట్లాడలేదు.

పినవీరన్న, అప్పన్న మంత్రులనుగురించి కొంత భోగట్టా చెప్పవల్సిందిగా నన్ను ఆయనకోరాడు. సరేననిఅంతాచెప్పాను.

7 ఏప్రియల్, ఆదివారం:

రైలు బెంగుళూరునుంచి మద్రాసు వచ్చేసరికి యింకా భళ్ళున తెల్లవారలేదు. సెంట్రలు స్టేషనులో కాఫీతాగాను. స్పెన్సరు హోటలునుంచి టెలిఫోనుచేస్తిని. కాని సెంట్రలాఫీసు

నుండి ఏమీ ప్రత్యుత్తరం రాలేదు. ఇంకా బాగా తెల్లవారక పోవడంవలన ఆఫీసుకు ఎవరూ రాలేదనుకుంటాను. ఇంతవేసరం బసనుంచి స్టేషనుకు బండీవచ్చే సాధనమేమీలేదు. త్వరగా యింటికిపోవడం మంచిదని, వొక గుర్రపుబండీని కుదుర్చుకున్నాను. తీరా గుర్రపుబండీ యెక్కేసరికి, గేటు అవతలవున్న సార్జెంటు వొకడు, బండీని అడ్డివేశాడు. 'ఎందుకాపావంటే' 'ప్యాసు చూపించ'మన్నాడు.

"లగేజీని ప్లాటుఫారం అవతలకు వాళ్ళు పోనిచ్చారుకదా, మధ్యన నీ అభ్యంతరమేమిటి?" అని ప్రశ్నించాను.

"వాళ్ళు పోనిచ్చారు కనకనే, మిమ్మల్ని నేను పట్టుకున్నాను!"

"నువ్వు పట్టుకుందుకు నేనేం నేరం చేయలేదే?"

"నేరస్థులు తాము నేరంచేసినట్టు ఎక్కడైనా వొప్పుకుంటారా సార్?"

ఈ గలాభా అంతా చూసి బండీవాడు "బేడకాసొకటి వాడిమొహాన పారేయండి! నోరు కట్టుకుంటుంద"ని గోసాయి చిట్కా ఉపదేశించాడు.

"బేడకాదు; వాడికొక్క తోలీకూడా యివ్వను; ఈ శషభిషలు నాదగ్గర పనికిరావు. పద, వెనక్కి! బండీ తిప్పు" అన్నాను. తన మంత్రం పారేటట్టులేదని గ్రహించాడు కాబోలును సార్జెంటు, మరి మాటుమాటాడకుండా మా బండీని ముందుకు పోనిచ్చాడు!

* * *

బెంగుళూరులో నాయుడుగారి బంధువులు నన్నెంతో ఆదరించి గౌరవమర్యాదలను కనపరచినారు. బెంగుళూరు మనుష్యులు చాలా నాగరికులు; మర్యాదస్థులు; అందరూ నన్ను ఎంతో మన్నన చేశారు.

◆ ◆ ◆

శ్రీ శ్రీనివాసాచారిగారు మాకొక ముచ్చటను చెప్పారు. కామాక్షి గ్రామంలో ఆయన ప్రవర్తించిన విధం, ఆయన వ్యక్తిగౌరవానికి తగినట్టు లేదని నా అభిప్రాయం.

◆ ◆ ◆

లా కాలేజీ విద్యార్థులు యేర్పరస్తున్న సమావేశానికి రావలసినదని శ్రీనివాసాచారిగారికి, మిత్రుడు సుందరరావు పంతులు వొక ఆహ్వానాన్ని పంపించాడు. బి. యల్. డిగ్రీ పరీక్షలో ఎన్నికైన మార్కులతో ఉత్తీర్ణులైన * శ్రీ వేపా రామేశపంతులును అభినందిస్తూ వొక వెండికప్పును బహూకరించవలెనని లా కాలేజీ విద్యార్థులు యీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నేను బెంగుళూరునుంచి తిరిగి వచ్చినట్లయితే, నన్నుకూడా వెంట తీసుకురావలసినదని మరీమరీ నాతో చెప్పవలసినదని సుందరరావుగారు, శ్రీనివాసాచారిగారికి చీటీ పంపినాడు. నాకు సభకు వెళ్ళడానికి బడలికగా వున్నమాట నిజమే కాని, వెళ్ళకపోతే నాకు వారిపై సానుభూతిలేదని దురభిప్రాయపడతారని నేనూ

---

* ప్రసిద్ధ న్యాయవాది. విశాఖపట్టణంలో 1898 లో ప్రాక్టీసు. తదనంతరం మద్రాసు. 1920–35 హైకోర్టు జడ్జి పదవి.

హాజరైతిని. మిత్రుడుసుందరరావుకు నాలెక్చరు చదివి వినిపించాను. ఆయన సమావేశపు ఉద్దేశాన్ని నాకు తెలియ చేయగా నేను చెప్పాను; "దీనిని పెద్ద ఆర్భాటంగానూ, గోరంతలు కొండంతలుగానూ ప్రదర్శించినట్టయితే తెలుగు వాళ్ళు చాలా వెనకబడి వుండడంవల్ల యీ విజయాన్నింత ఘనంగా చెప్పుకుంటున్నారని యిక్కడివాళ్ళు అనుకుంటారు. పరీక్షలో చక్కగా ప్యాసయిన అభ్యర్థిని అన్నివిధాలా ప్రోత్స హించవలసిందే; కాని ఆ అభ్యర్థికి సహజంగా మనోదౌర్బల్యం వుండివున్నట్లయితే, మిత్రుల లేనిపోని పొగడ్తలవల్ల అతనికి అనవసర భేషజం కొత్తగా వస్తుంది. అతని జీవితం ముందు విఫలమవుతుంది. ఇందుకు మిత్రులు అనుసరించిన మార్గాలే కారణం కావచ్చును. విద్యావంతులమని చెప్పుకునే మన స్వదేశీయులకు లేనిపోని అతిశయం, నటన, భేషజం పరిపాటి అయిపోతున్నవి. ఇవి, వారికి మానసికమైన ఏోక అత్యవసర గుణాలుగా కనిపిస్తున్నాయి. ఈ దుర్గుణాలను యెంత వేగిరంగా మొగ్గలో తుంచితే అంత మంచిది. దక్షిణ దేశంలో పాండిత్య మనేది ఉపకారానికి బదులు, అపకారం చేస్తోంది. ఇది ఎంతో హానికరంగా పరిణమిస్తోంది. శాస్త్రో కూస్త్రో పాండిత్యముంటే చాలును; లేదా అతను తగుమాత్రపు ఘనతను సాధిస్తేచాలు, ఇక మనవాళ్ళు అదేపనిగ అతన్నికీర్తించడానికి యెగపడతారు. అతన్నొక "ఆదర్శపురుషునిగా" శ్లాఘిస్తూ అతని అభి మానులు వింజామరలు వీస్తూ పొద్దుపుచ్చుతారు. అంతటితో ఆయన తనను తాను అభివృద్ధి చేసుకుందుకు యేమాత్రమూ ప్రయత్నించడు. ఆయన అభిమానులు ఆయనలో. వుండే

సుగుణాలను కాక దుర్గుణాలను అనుకరిస్తారు. ఈ సందర్భంలో శ్రీ వీరేశలింగంగారి అనుచరులను ఒక ఉదాహరణగా పేర్కొన వచ్చును.

అయితే శ్రీ వేపా రామేశంపంతులు భేషజపరుడుకాడు. అందుకు నాకెంతో ఆనందంగావుంది. ఆయన నిర్మొహమాటి. నిష్కర్షగా, సాదాగా మాట్లాడతాడు. మనిషిలో దాపరికం ఏమీలేదు. ఈ సుగుణం సాధారణంగా మనలో చాలామందికి మృగ్యం. వినయసంపన్నుడు. ఆయన తన విద్యార్థి జీవిత ఆదర్శాలను, తన ఉపజ్ఞను, శక్తిసామర్థ్యాల లోటుపాటులను సరిగ్గా అంచనావేసుకుని నడుచుకున్నట్లయితే, యెంతో మేలు సిద్ధిస్తుంది. ఆయన భవిష్యత్తులో చక్కగా రాణించగలడనే నా నమ్మకం. అయితే యీ రాణింపు ప్రస్తుతం మన మద రాసు కేసరులని చెప్పబడేవారి 'ఘనత'ను పోలివుండదనే ఆశి స్తున్నాను.

ఈ అభినందన సభకు అధ్యక్షత వహించవలసినదిగా మొదటనన్ను కోరవలెనని అనుకున్నారట. కాని నేను బెంగుళూరులో వున్నట్టు తెలిసినమీదట, శ్రీ శ్రీరాములుగారిని అధ్య క్షులుగా వుండవలసినదని అభ్యర్థించారు. శ్రీరాములుగారు బి.ఏ., బి. యల్., హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నారు. మచిలీ పట్టంజిల్లా నివాసి.

మీటింగునాడు నేను వేసుకున్న దుస్తులు చాలా అంద వికారంగా వుండెను; మీటింగుకు వెళ్ళి కుర్చీలో కూచునీ కూర్చోనగానే, అధ్యక్షులు నా దగ్గరకువచ్చి "ఈ సమావేశా

నికి అధ్యక్షత వహించే అర్హులు ఎవరైనా వున్నారా అంటే వారు తమరే!" అన్నారు.

అధ్యక్షత వహించడమనే చికాకు కలిగించే బాధ్యత తప్పిపోయినందుకు భగవంతుణ్ణి అభినందించాను. సుందర్రావు పంతులు ఉపన్యాసధోరణి యేమీ బాగులేదు. మాటలతీరు, నిలుపులు సుదీర్ఘం. పొగడ్తలు లావు. ఈ పొగడ్తలు వింటే మహర్షికి సైతం తలతిరిగిపోతుంది! ఇక సుబ్రహ్మణ్యంగారు, సుందర్రావుపంతులుకన్న యేడాకులు యెక్కువే చదివాడు. ఉపన్యాసధోరణి బాగున్నదికాని విషయం పాడుగా వుంది. ఉపన్యాసాలను కావించడమనేది ఆధునికనాగరికత తెచ్చిపెట్టిన దోషాలలో ఒకటివలె కనిపిస్తున్నది. మంచి ఉపన్యాసమంత చక్కనిదీ లేదు; చెడ్డ ఉపన్యాసమంత దుర్భరమైనదీ లేదు. కాని చాలా ఉపన్యాసాలు విసుగెత్తించేవిగానే వుంటున్నాయి. ఈ పొగడ్తల వలన రామేశంపంతులు భేషజాన్నలవరుచుకుంటే, అలాగ అలవర్చుకోడనే భావిస్తాను, దానికి మన మిత్రులే కారణం. నేనీసంగతి సుందర్రావుపంతులుకు తెలియచెప్పాను. ఈ సమావేశానికి నేనే అధ్యక్షతవహించి వున్నట్లయితే, అసలు విషయాలను పక్కదారులకు పోనిచ్చేవాడినికాను. సరియైన మార్గమేదో వివరించి చూపించి వుండేవాణ్ణి.

నేను, ఇంటికి వెళ్ళేముందు రామేశంపంతులును కలుసుకుని అతని లోటుపాటులను గ్రహించాలి.

నేనాయన్ని ఒకరోజున విందుకురమ్మని ఆహ్వానించాను. కాని ఆయన యెందువల్లనో రాలేదు. సుందర్రావుపంతులూ,

కవిమిత్రుడూ వచ్చారు. కవిగారు తన నవల అరవై పేజీలు చదివి వినిపించారు.

సమావేశం నాడు, శ్రీనివాసాచారిగారు సభలో గానం చేశారు. సమావేశానంతరం, మేడమీద వెన్నెట్లో మరికొంత సేపు కొన్ని కృతులను పాడారు. క్షత్రియుల విద్యాసమస్యను గురించి వెంకటపతిరాజుగారితో కొంతసేపు సంప్రదించితిని.

♦ ♦ ♦

మదరాసులో పకోడీలు బహురుచిగా వుంటాయి.

అన్నట్టు యింతసేపూ యీ విషయమే మరిచాను. ఈవేళ ట్రిప్లికేను వెళ్ళడమే ఎంతో కష్టమైపోయింది. జనసమూహంతో దారి అంతా క్రిక్కిరిసిపోయింది. ఇసకవేస్తే రాలని ప్రజ. అరువత్తిమూరు ఉత్సవం జరుగుతూవుండెను. వచ్చిన జనంలో చూడదగిన చక్కని మొహం వొకటీ కనబడ లేదు. స్త్రీలుకూడా అందంగా కనిపించలేదు.

10 ఏప్రియలు, బుధవారం:

స్మూలాఫ్ ఆఫ్సుకు వెళ్లితిని. పచ్చయ్యప్ప కాలేజీకి అక్కడనుంచి బ్యాంకుకు పోతిని. బాలస్వామినాయుడుగారి వద్ద నుంచి తీసుకున్న చెక్కు మార్చుకుని నూట ఎనభై రూపాయలు తీసుకుంటిని. అటుపిమ్మట మళ్లీ కాలేజీకి, కాలేజీనుంచి ఓరియంటలు లైబ్రరీకి వెళ్ళాను. అక్కడ నాపెన్సిల్ పోయింది. చెప్పిన ప్రకారం ఆ విద్యార్థి అక్కడకు వచ్చాడు. నా సలహాను తప్పక పాటిస్తానని వాగ్దానం చేశాడు.

11 ఏప్రియల్, లక్ష్మివారం :

దళసరైన ఎరుపు మొరాకో లెదరు బైండు కాపీలు పన్నెండు కావాలని శ్రీసూర్యనారాయణగారు చెప్పగా విన్నాను. మిగిలినవి వివిధరంగులవి. నలుపు, ఆకాశపురంగు, ఆకు పచ్చ, ఊదా, "త్వరగా వాటిని పంపించేటట్టు చూడండి. వీలును వస్త్రమునుంచి ఫొటోగ్రాఫ్సులు తీసుకోండి. యింకా సొమ్ము కావా లంటే ఆర్డరివ్వండి. జాగ్రత్తగా పుస్తకాలకు పంపమని వీలను అండ్ కో., కు తెలపండి. పదిలంగా పేక్ చేసి, సీల్సు వేసి సంత కాలుచేసి కట్టుదిట్టంగా పంపించేటట్టు యేర్పాటు చేయమనండి."

12 ఏప్రియల్, శుక్రవారం :

అక్మిరాలిటీ హాలులో ఇవాళ గానసభ. త్యాగయ్య గారి శిష్యుడు, శతవృద్ధు రమ్యంగా కొన్ని కృతులను పాడాడు. మనిషి వృద్ధులే అయినా చాలా ఆనందంగానూ, కులాసాగానూ వున్నారు. మిగుల ఉత్సాహి. ఉల్లాసంగా నాజూకుగా కనిపించారు. శ్రీనివాసాచారిగారు తమతో నగరాజారావు, రామచంద్రం, సాహెబు మరికొందరను గానసభకు తీసుకు వచ్చారు.

13 ఏప్రియల్, శనివారం :

ఒకరోజున శ్రీనివాసాచారిగారిని వారిబసలో కల్యాణ రామయ్యారు కలుసుకుని నాటక ప్రదర్శనాలను గురించీ, రంగ భూమిని గురించీ కొంచెంసేపు ముచ్చటించినాడట ! ఆనాడు తాము ప్రదర్శిస్తున్న నాటకాన్ని చూడరమ్మని ఆహ్వానించగా శ్రీనివాసాచారిగారు నేను వూళ్ళో లేకపోవడంవల్లనూ,

ఆయనకు తదితరపనులు వుండడంవల్లనూ నాటకానకు వెళ్ళలేక పోయినారట. ఈవేళ వస్తామని కల్యాణరామయ్యరుకు వాగ్దానం చేశాను. వాగ్దానం చెల్లించుకుందుకు మేం ప్రదర్శనానికి చూడ వెళ్ళాము. దారిలో (శ్రీ) సూర్యనారాయణ పంతులునూ, మాకవిమిత్రుణ్ణీ కలుసుకుని వారినికూడా వెంటతీసుకువెళ్ళాం; ప్రదర్శనం యేమీ బాగుండలేదు. హాలు నిండలేదు. నాటక ప్రదర్శనం జరుగుతున్న స్థలం శానుహాలు; హాలులో చాలా కుర్చీలు ఖాళీగానే పడివున్నవి. టిక్కెట్ల రేట్లు రెండు; రూపా యిన్నర, రూపాయి; రేట్లు తక్కువగా లేకపోవడంవల్ల ప్రేక్ష కులు పల్చబడివుంటారు.

హాలులో చూడదగిన ఆసక్తి కలిగించే దృశ్యం *ఆనరబుల్ శంకరనాయరుగారి కుటుంబం. మొదటివరసలో ఒక పెద్ద బెంచీమీద ఆయన కుటుంబీకులు ఠీవిణీవేసుకు కూర్చు న్నారు. నలుగుకు కూచోదగిన బెంచీ; కూచున్న స్త్రీలలో ఒకావిడ అందరికంటె వయసులో పెద్ద. స్థూలకాయం. మనిషి నాజూకుగానే వుంది. వొళ్ళో బిడ్డణ్ణి పండుకోబెట్టుకుని హాయిగా కూర్చున్నది. ఆవిడ ప్రక్కనే యింకోకామె, వయస్సులో కొంచెం చిన్నదే, చతికిలబడింది. తరువాత కూర్చున్నామె

* 1897 లో అమరావతి కాంగ్రెసున కధ్యక్షత వహించిన ప్రసిద్ధుడు. కొంతకాలము మద్రాసు హైకోర్టు జడ్జీ పదవిని అలంకరించినవాడు. 1915 లో భారత ప్రభుత్వ కార్యనిర్వాహకసభ్యుడు. 1919 లో పంజాబ్‌లో సైనిక ప్రభుత్వమును ప్రతిఘటిస్తూ తన ఉన్నతోద్యోగానికి రాజీనామా యిచ్చాడు. "గాంధీజీ - అరాచకము" అనే గ్రంథ రచయిత. పంజాబ్ లెఫ్టినెంటు గవ ర్నరు సర్, మైకేలు ఒడయరు ఈయనపై మానసష్టపు దావా తేగా శంకరన్ నాయర్ మూడులక్షల రూపాయలను చెల్లించవలసి వచ్చింది.

అందరికంటె చిన్నపిల్ల. మళయాళీ పద్ధతిలో చక్కని చీరెలు ధరించారు. వస్త్రలు చాలా ఖరీదైనవే. ధరించిన నగలుసైతం ఎంతో విలువైనవి; అలంకరణ ఎబ్బెట్టుగా లేదు. మధ్యన కూర్చున్న ఆవిడచెవులకు కుట్టు పోగులు లేవు. కాని మిగిలిన యిద్దరి చెవులకూ ఎన్నో పోగులు. చూడడానికంత నాజూకుగా లేవు. చెవులకున్న పోగులు చాలా వలయంగావున్నవి. స్త్రీలను, వారి ఆచార పద్ధతులనుంచి మళ్ళించడం కష్టమేకాని, చెవులకు అన్నేసి కుట్టుపోగులు, ఆభరణాలు పెట్టుకోవడమనే అలవాటును మాన్పించవలసివుంది. ఈ కాలంలోకూడా యీ అలవాటేమిటో! ఈ పద్ధతులను త్యజించవలసినదిగా గట్టి కృషి చేయాలి. వారిలో అందరికంటే చిన్నపిల్ల చాలా బక్కపల్చగా వున్నది. కళ్ళు చేపకన్నులను పోలివున్నవి.

నాటకప్రదర్శనం పాడుగావుంది. దీనిని యీ మహిళలు ఏవిధంగా అనుభవిస్తూ ఆనందిస్తున్నారో గమనిద్దామని నాకు కుతూహలం కలిగింది. చిన్నపిల్ల అమాయిక. ఎంతో వినయ విధేయతలుగలపిల్లవలె పొడకట్టింది. రంగభూమిమీద వొక అసంబద్ధ సన్నివేశం తరువాత యింకొకటి అలాగున ప్రదర్శింపబడుతూనేవున్నది. ఈ అసంబద్ధసన్నివేశాలను, దృశ్యాలను, నటననుచూసి యీ చిన్నపిల్ల ఏవిధంగా భావిస్తున్నదీ, ప్రతిచలిస్తున్నదీ గమనించవలెనని ప్రయత్నించాను.

సీనులు పాడుగావున్నాయి. తెరగుడ్డలు మరీఅసహ్యం. అభినయం! దానిని యేమనాలో నాకే బోధపడడంలేదు.

ఈ మత్సర పరిస్థితిని వర్ణించడానికి తగిన విశేషణం భాషలో అగోచరం.

మొట్టమొదట అనసూయా, ప్రియంవదల సంగతి. తాటకిలాంటి శరీరాలు; చెప్పలేనంత మోటుతనం. అనాగరకత హెచ్చు. సొగసైన లాలిత్యంగల శకుంతల చెలికత్తెలుగా వీరు తయారయినారు. సుస్నిగ్ధమైన హృదయభావాలనూ, మార్దవమైన అభిప్రాయాలనూ కవినీ హుందాతనాన్ని కలిగివున్న చెలికత్తెల వేషాలు యీ 'కోమలాంగులు' వేస్తే నాటకం ఎలాగున వుండవలెనో ఆలాగునే వున్నది !

శకుంతల పాత్ర ధరించిన కల్యాణ రామయ్యను కన్య వలె కనిపించకపోతేమానె ! మంచి నడివయస్సులోవున్న స్త్రీవలె చూపకులకు దిగ్భ్రాంతి కలిగించాడు. అతని ముఖలక్షణాలు అతనికే లొంగకుండెను. గుండ్రని కన్నులు. మొహానకు అతికించినట్లు పెద్దగుడ్లు; ఆటబొమ్మల కున్నట్లు మీదకు పొక్కొచ్చినట్లు వున్నవి. కోపమూ, చికాకూ, రుసరుసలు బహుశా ఏదో అవ్యక్తమయిన అనుకంపమూ తప్పితే అతని నేత్రాలు మరొకభావాన్ని అభివ్యక్తీకరింపజాలవు. మర్యాద, లజ్జ, ప్రేమ, గౌరవము, వినయశీలత, విచారము, విషాదము మొదలైన ఉదాత్తభావాలను వ్యక్తీకరించుటకు అతని కన్నుల తీరు సరిపడదు. ఈ గుణములేవీ అతని నేత్రాలలో మచ్చుకైనా కానరావు. భావప్రకటనకుగల యోజన అతని కనులకు మృగ్యం; నుదురు కిందకు అణిగి పోయివుంది; చిన్నది; లోత్త. చివరిభాగాలు మరీ చిన్నవి. కనుబొమలు వొకతీరున లేవు. పెదిమలు సన్ననివీ కావు. పోనీ కుదురుగ వున్నట్టూ కనిపించవు.

మీఁది పెదవి గుండ్రడన. పెదాలూ నోరూ ముందుకు పందెం వేసుకున్నట్టు తోసుకువచ్చాయి. స్తనములు చాలాపెద్దవి. పాపం అతను వాటిని సరిగ్గా అమర్చుకోలేదు. అయ్యారు ఆకారానికి సంబంధించినంతవరకూ యివీ విశేషాలు; ఇక అతని వాచికం సంగతి. నోరు తెరచి అతను మాట్లాడబోయేసరికి థియేటరు విడిచి వెళ్ళిపోదామన్నంత దుర్భరమనిపించింది. గొంతుకవింటే కప్పలు బెకబెకలాడినట్లు; ఎంత పెళుసు! మగవారికంతమని యిట్టే తెలిసిపోతున్నది. సంగీతవాయిద్యాలు మహా భయంకరం; మార్దవం పిసరంతలేదు. కర్ణకఠోరమైన సంగీతం! ఈ దుస్సహమైన దిక్కుమాలిన సంగీతాన్ని అతను యెందుకు మానుకోడు? ఉహుఁ! అలాగ వినిపించి ప్రేక్షకులను రంజింపచేయాలనే అతని అభిమతం !

ఈ మదరాసీలు కల్యాణరామయ్యరు పేరుచెబితే పొంగి పోతారు; ఉబ్బితబ్బిబ్బవుతారు. బాగులేదన్నవాళ్ళకు బహిష్కారమే. ఇతడు మంచి వ్యాపారస్థుడు. ముందుగా తాను వెళ్ళే స్థలములలో తగు మనుష్యులను కలుసుకుని వారిని ఆశ్రయించి ఆదరణ సంపాదించుతాడు. చెన్నపట్టం విడిచి దక్షిణానికిపోతూవుంటే యితని ప్రసిద్ధి మరీ ఎక్కువగాకనిపిస్తుంది. దీనినిబట్టి మదరాసీలకు 'విచక్షణ', సరియైన విలువలను పోల్చుకునే దృష్టి లేదని తేలుతున్నది. విజయనగరంజట్టు నాటకములలో అభినయం యింతకంటె బాగావున్నది. ♦ బుచ్చిశాస్త్రి

♦ ఆనందగజపతి ఆధ్వర్యాన నెలకొల్పబడిన 'నాటకసమాజము: ఈ సమాజములో బుచ్చిశాస్త్రి, చొప్పల్లి నరసింహం, కర్రా పాపయ్యశాస్త్రి, పప్పు అప్పయ్యశాస్త్రి, పప్పు వెంకటశాస్త్రి, ఆదిభట్ల జగ్గావధానులు

కంపెనీవారు కల్యాణరామయ్యరు జుట్టుకంటె అన్నివిధాలా ఎన్నోరెట్లు మెరుగు. అయితే వారికి శ్రీనివాసాచారి తరిబీదు వుందని చెప్పకతప్పదు. కల్యాణరామయ్యరువలె రంగభూమి మీద వెంకయ్యగారు అవకతవకగా ఎన్నటికీ అభినయించడు. అయ్యరుచేసిన మోటుపనులు కొండయ్య చేస్తాడంటే కలలో కూడా నమ్మజాలను. అసలు యితని నాటకపు నోటీసులే అవకతవకగా వున్నవి. ఈతని ప్రకటనలకొక అర్థంపర్థం లేదు. తానొక అసాధారణ ప్రజ్ఞావంతుడనని ప్రకటించుకుంటాడు. ఈ నోటీసులను అచ్చముగా అలాగే "పంచ్" పేపరులో అచ్చొత్తిస్తే హాస్యపు ప్రకటనలుగా చలామణీ అవుతవి. "నమ్రత" అంటే అయ్యరు ప్రకటనలలోనే కలదుగదా మరి! ఈ నాటకపు వాళ్ళకు ఆత్మశ్లాఘన అలవాటు అయినది.

ఇది యీనాడు వారికొక ఫేషను. తమిళుల పద్ధతులు బహుతమాషాఅయినవి. అవకాశము కలిగినచోటల్లా తమ

ప్రభృతులు సభ్యులు. ఈ సమాజమునకు నాయకుడు బుచ్చిశాస్త్రిగారు. ఈయన నాటకములలో నాయక పాత్రధారి. శ్రీ చొప్పల్లి నరసింహంగారు శ్రీ చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్ గారి జనకులు. వీరు సంస్కృత నాటకములలో నాయికిపాత్రధారి. హరికథా పితామహులు శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారి సోదరులు శ్రీ ఆదిభట్ల జగ్గావధానులుగారు. వీరు రాక్షసవేషములను ధరించెడివారు. శ్రీ కర్రా పాపయ్యశాస్త్రిగారు విదూషక పాత్రధారి. నాటకాలలో మిగిలిన భూమికలను శ్రీ అప్పయ్యశాస్త్రి, వెంకటశాస్త్రిగారలు నటించెడివారు. వీరిద్దరిదీ మధురమైన గాత్రం.

బుచ్చిశాస్త్రి నాటకసమాజంవారు ప్రదర్శించే సంస్కృతనాటకములు: అభిజ్ఞానశాకుంతలము, విక్రమోర్వశీయము, వేణీసంహారము, ఉత్తర రామ చరితము ఇత్యాదులు.

వాళ్ళను తామే పొగుడుకుంటూ ఆకాశానికెత్తుతూంటారు. కల్యాణ రామయ్యరుకు ప్రసిద్ధి యిలాగే కలిసివుంటుంది. అతని రూపు, సందేహంలేదు, చలాకీఅయిన డాన్సింగు గరల్‌వలె వుంది. ఇంతకంటే తక్కువవయసులో చిన్నతనంలో అయ్యరు కంఠమూ, రూపూ కాస్త బాగావుండేవేమో! యిప్పటికికూడా తాను తగుదునని ఆడవేషాలు ధరించడం ఎంత మూర్ఖత! అతని వక్రబుద్ధిని యేమనగలం!

దుష్యంతుడు వేషం కట్టిన బుద్ధిమంతుడు బహుశా యీ ట్రూపుకు నాయకుడుకాబోలును. ఈవేషమునకు ఇతనిని యెంచుకోవడంలో కల్యాణరామయ్యరు ప్రాజ్ఞతను యేమని పొగడగలను! పాడుమోహం; మట్టిబుర్ర. డోకువస్తూ రాక్షసుడిలా దూసుకువచ్చాడు. దయ్యంలాంటి మనిషి. నల్లగా లేడు కాని, వేషధారణ రోతకలిగిస్తున్నది. వేషంమీద రూపం అందంగాకనపడేటట్టు చేసుకోవడంకూడా యెరిగినట్టు తోచదు. సాక్సు, నల్ల ట్రౌజరు, కోటూ వేసుకుని మిలిటరీ ఆఫీసరులాగ దిగబడ్డాడు. దీనికితోడు తలమీద టోపీకూడాను! మీసాలు పల్చగా సన్నగా వున్నాయి. వేషానికి తగిన మీసకట్టుకాదు. నుదుట తిరుచూర్ణము; మొత్తంమీద మనిషిని చూసీ చూడగానే, మావేపు సాతానిభిక్షువు జ్ఞాపకంవచ్చాడు. మూతి కొంచెం ముందుకుంటుంది. మీది పెదవి గుండ్రము; పెదవులలో యిమడని పొడుగుపళ్ళు. ఇట్టి ముఖములో లావణ్యముగాని, చురుకుతనముగాని యేలాగు కనబడగలవు?

పాపం, అందు కతనేమి చేయగలడు! ధీమాగాని, చలాకీతనంగాని, రాజపౌరుషంకాని జోడుకంచుకాగడాలు

పట్టుకుని వెతికినా అత్తవిముఖంలో కానరావు. వేషము సరే సరి! అంతా మోటుతనమే; యుక్తత అన్నదిప్రాజ్యం. వెంట్రుకలు కొప్పుగా ముడుచుకుని దానిమీద కిరీటమొకటి పెట్టుకున్నాడు. తలవెనుక ముడి! ఆహా! వీళ్లెంత మోటుమనుషులు! కించిత్తు దర్జాకూడా లేదు; వానీ ఔచిత్యం అంతకంటే కనిపించదు! దుష్యంత మహారాజువారు లేచి నిలుచుంటే తల ముడి ముందుకు పడుతూవుంటుంది. బొర వెనక్కి వెడుతూ వుంటుంది! ఆరి పిడి సిగతరగా! ఏమి వేషం! ఏమిలోకం! దుష్యంతుడు ఎంత మూర్ఖుడు! ఎంత జడ్డి పీనుగ!

మిగిలిన పాత్రధారుల వేషధారణ యేమీ చెప్పుకో నక్కరలేదు. ఇంచుమించు వారికి మంచి దుస్తులు లేనట్టే; ఏ పనులయితే చేయకూడదో, ఏ మాటలను పలకకూడదో అవన్నీ చక్కగా చేసి, పలికి, రంగభూమి అంతా కంగాళీచేసి విడిచి పెట్టారు. ఇదివరకొకసారి నేను చెప్పినట్టుగానే, రంగభూమిమీద కనిపించిన ప్రతి నటుడూ ఏదో సణుగుడు ప్రారంభించారు. మంత్రాలు, జపాలు, పాటలు; సంభాషణమ్మాటకు లేదు. నోరు విప్పి మాట్లాడ్డం తప్ప మిగిలిన హంగామా కావలసినంత.

రంగభూమిమీద ఒకనటుడు విశాఖపట్నం చేంతాడంత స్వగతం చెప్పుకుపోతున్నాడు. పక్కనున్న మిత్రుణ్ణి "ఏమిటి నేస్తం యీ తరగనిదుంప! ఎప్పుడైనా హనుమంతుడి తోక చూశావా? అన్నట్టు ఇందులో నీకేమైనా బోధపడ్డదీ?" అని అడిగాను. ఎవరయితే అనర్గళంగా ఉపన్యాసధోరణిలో మాట్లాడుతారో వారు గొప్ప తెలివైనవాళ్ళని, గొప్ప నటులని

మనవాళ్ళ అభిప్రాయం. ఇది మరాటీ కంపెనీల బాణీ; దీని నొక సూత్రంగా యీ కంపెనీలు పరిగణిస్తున్నాయి. నటులు పలికే మాటలు కేవలం పాఠం వప్పగించినట్లే విసుగుకలిగిస్తూ కృతక మనిపిస్తున్నవి. ఎంతో కష్టంమీద వొక్కొక్క మాటనే అంటు న్నారు. ఈపాటి మహాభాగ్యానికి, కల్యాణరామయ్యరు చంగా బజారుసందుగొందుల్లో ప్రదర్శనాలీయక, ఎందుకీ టౌనుహాలులో నాటకాలు వేయాలని సహజంగా ఎవరైనా ప్రశ్నించవచ్చును; దీనికి నేనేం సమాధానమీయగలను? పాపం, అయ్యరు వొట్టి వెర్రికుట్టె! తాను శకుంతల భూమికను అత్యద్భుతంగా నిర్వహించగలనని భావిస్తున్నారు. నటులకు వేషం చక్కగా కుదిరేట్టు చేశానని, కాళిదాసు శ్లోకాలు అమోఘంగా భట్టీ వేయించానుకదా అని అతనిధీమా. వీటికే అతను హెచ్చు ప్రాధాన్యత యిస్తున్నాడు. శ్లోకములన్నీ ఆభాసుపాలు చేసినాడు. శ్లోకం తరవాత శ్లోకం. ఎక్కడా ఎడతెరిపిలేదు; నించున్న పాటున మనిషిని గొంతుక నులిపి హత్యచేసినట్టు శ్లోకాలను ధ్వంసంచేసి విడిచిపెట్టాడు. దారుణమైన హత్య! ఇక నా ఓర్మి సన్నగిల్లింది.

*"కిం శీతలైః క్లమ వినోదిభిః" అనే శ్లోకం దుష్యంతుడు నాటకరంగంమీద యీడుస్తూ చదువుతూవుంటే యిక భరించలేకపోయాను. నా తీవ్రఅసమ్మతిని తెలియచేసేటందుకో

*"కిం శీతలైః క్లమవినోదిభిరార్ద్రవాతాం
త్సంచారయామి నళినీదళ తాళవృన్తైః
అంకే నిధాయ కరభోరు యథాసుఖం తే
సంవాహయామి చరణావుత పద్మతామ్రౌ".

అప్పట్లో కాళిదాసుతో వొక్కసారి నేలనుకొట్టి "దురన్యాయం దురన్యాయం" అనుకున్నాను. నేను చేసిన యీ అసమ్మతి సూచక ధిక్కారం హాలంతా ప్రతిధ్వనిస్తున్నదా అనిపించింది. హఠాత్తుగా శకుంతల దుష్యంతుడి చెంత చేసితూ గునుస్తూ సానిపిల్లలాగా టక్కరితనంతో వగలు కురిపిస్తూ తెలుగులో "ననుగూడరా నాథా" అని జావళీ అందుకుంది! ప్రాణం విసిగెత్తిపోయి పాపం, శ్రీనివాసాచారిగారు దిగ్గున లేచిపోయారు. యిదేమిటీ దిక్కుమాలిన శకుంతల !

ఇదివరకు వొకసారి కల్యాణరామయ్యరు ప్రదర్శనం మీద నేను తీవ్రంగా జడ్జిమెంటు చెప్పానని శ్రీనివాసాచారి గారికి బాధనిపించింది. ఆనాడు ఆయన కల్యాణ రామయ్యరు నాటక ప్రదర్శనాలను సమర్థిస్తూ వాదించారు.

నా చెంతనే కూచున్న మిత్రుడు వెనక్కితిరిగి "ఇప్పుడీనాటకప్రదర్శనానికి కాళిదాసువచ్చివుంటే ఏమనుకునేవాడో!" అన్నాడు.

అర్థము : "చల్లనికై శ్రమం బడఁ పఁజాలిన తామరపాకు వీవనల్
మెల్లనఁ గొంచు వీచుదునొ మిక్కిలి శీతలమైన వాయువున్?
సల్లలితారుణాబ్జసదృశంబగు నీ చరణద్వయంబు నో
పల్లవపాణి! నా తొడలపై నిడి హాయిగఁ బట్టువాఁడనో ?
(వీరేశలింగంగారి అనువాదం)

తృతీయాంకం : శకుంతలా దుష్యంతులను అనసూయాప్రియంవదలు వొదిలి పెట్టి వెళ్లిపోతారు. అప్పుడు శకుంతల తా నొంటరిగా వున్నానని సఖులెలాగ వెడలిపోయారో! అని వెతచెందుతుంది. అప్పుడు దుష్యంతుడు "నీ కీ సంభ్రమ మెందుకు ? నీ సేవకుడనైన నేను నీ చెంతనే వున్నాను కదా" అంటాడు. ఆ సందర్భంలోనిది యీ శ్లోకం.

“మానుమాటాడక యీపాటికి ఏ నుయ్యో, గొయ్యో చూసుకునివుండును !”

ఒక్కచోటమాత్రం అయ్యరు అభినయం బాగున్నది. దుష్యంతుడితో తన చెలికత్తెలు ప్రసంగిస్తున్నపుడు శకుంతల మౌనంగా నిలబడివుంటుంది. ఇలా తానేమీ మాట్లాడకుండా నించున్నపుడే అయ్యరు నటన ఫరవా లేదనిపించింది.

శకుంతల, దుష్యంతుడితో * “ఇక్కడేమిటి అల్లరి చేస్తావు. అంతా చూస్తారు. బహిరంగం” అంటున్నది. సైడు కర్టెను పక్కకు తప్పుకొని, కాస్సేపు అచట నక్కి, మళ్ళీ యింకొక సైడుకర్టెనులోంచి తలపైకెత్తి తొంగితొంగి ముందుకు చూస్తూ మునికన్య శకుంతల “అక్కడకు మళ్ళీ నేనెటుల పోగల దానను ? నా పూలదండ పోయినదికదా !” అని వాపోతున్నది. వెదుక్కుంటూ యింకొకతె రంగంమీదకు ప్రవేశించింది. దుష్యంతుడు శకుంతలను “నీకేమి కావలె ?” అని ముచ్చటగా అడిగాడు.

“అయ్యో! నా పూలచెండును పోగొట్టుకొంటినే!”

“ఊరడిల్లు మూరడిల్లుము. అద్దానిని నేను నీ కొసంగెదను. కాని నీవు నాకొక వాగ్దానమీయవలెను!”

“ఇచ్చెదను!”

“ముందు మాటయియ్యి”

“యిచ్చితిని!”

“అటులైన యిటువచ్చి కూర్చో. పూలచెండును నీ జటయం దలంకరించెద!”

---

* ఈ వాక్యాలు డైరీలనుండి యథాతథంగా ఉదాహృతములు.

దుష్యంతుడు, శకుంతలకు పూలదండను యిచ్చి ఆమె చేతిని పట్టుకున్నాడు. పట్టుకుని లాగుతూ "నీకరమెంత మెత్తగా నున్నదో!" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు! శకుంతలాదుష్యంతుల ప్రేమాభినయమును చూసి హాలులోకూర్చున్న స్త్రీలు ఫక్కున నవ్వడమారంభించారు.

ఇప్పుడు యింక దుష్యంతుడు రంగభూమిమీద శకుంతల చెంత అభినయిస్తున్నాడు. వివాహితస్త్రీని మానభంగంచేసే టంత దూకుడుగా శకుంతలతో పెనుగులాడుతున్నాడు!

14 ఏప్రియలు, ఆదివారం :

1. తెనాలి రామకృష్ణ.
2. హిందువులు అనుసరిస్తున్న ప్రస్తుత వైవాహిక పద్ధతి సంతృప్తికరముగా వున్నదా.
3. మద్రాసులో విద్యార్థి జీవితం సుఖప్రదంగా వున్నదందుమా.
4. జీవితధ్యేయములు.
5. కేవలము వొకవ్యక్తి గొప్పస్థితిలోవున్నంతమాత్రాన, ఆతనియెడల గౌరవభావము చూపవలెనా.
6. ప్రజల ఐక్యతకు వర్ణవ్యవస్థ అనేది గొప్ప ఆటంకము గానూ, అడ్డుగోడవలెనూ లేదా.
7. మతసమ్మకమనేది ప్రస్తుతము, భారతదేశములో అభివృద్ధి అవుతున్నదా, లేక నశించుతున్నదా.
8. బహిరంగశత్రువు, కపటస్నేహితుడు, వీరిలో ఎవరు ఎక్కువ ప్రమాదకారులు.

9. ఆత్మహత్య చేసుకోవడమనేది మనిషి ధైర్యమునకు హేతువా లేక పిరికితనానికా
10. ఉపజ్ఞాపూర్వకమైన విద్యను గరపడంవలన, దేశంలో నేరముల సంఖ్య తగ్గునా?
11. జీవితపవిత్రత
12. చాంధసత్వమనేది సమాజమునకు హెచ్చు ఉపద్రవము తెచ్చిపెట్టునా

15 ఏప్రియల్, సోమవారం :

పచ్చయప్ప కాలేజీకి వెళ్ళితిని. సభకువచ్చిన జనం యెక్కువగా లేరు. చాలా బెంచీలు ఖాళీగానే వున్నవి. ఏర్పాట్లు బాగులేవు. వేదికమీద కొంతమంది మనవాళ్ళూ, ఆరుగురు యూరోపియనులూ ఆసీనులయిరి. వేదికచుట్టూ చాలామంది తగు మనుష్యులు గుమిగూడిరి. వారి గడబిడ, గాభరా హెచ్చుగానే వుంది.

బిషప్పుగారి ఉపన్యాసము యెంతో చక్కగా వుంది. ధోరణి ఎన్నతగింది. మధురమైన కంఠము. తెలుగుభాష సొగసును మెచ్చుకుంటూ కొంతసేపు ప్రసంగించాడు. మనిషిలో హాస్య, చమత్కారములు కలవు.

ఉపన్యాసమును ముగించాడు. మిగిలినవారి ప్రసంగములు పాడుగానే వున్నవి. మిస్టరు కూపరు ఓక్లీ ముక్కుకు సూటిగా ఉపన్యసించాడు. ఉపన్యాసములో తనకు సంబంధించిన భోగట్టా జాస్తి. ధోరణి బాగులేదు. ఎవరో కృష్ణమాచారి గారట, నానా చెత్తా మాట్లాడినాడు. విద్యాభివృద్ధిని

'హోస్టెలు'ను ప్రపోజుచేసే బాధ్యత ఆయనమీాద పడింది. విద్యా విధానం లోపభూయిష్టముగా వున్నదనీ, దానిని చక్కపరచ వలెననీ ప్రతీఘానంతరంగా నిర్వహించవలెననీ, ఆయన ప్రసంగించినారు.

మిస్టరు బ్లోనుగారు మాట్లాడుతూ విద్యావిధానము స్వయంపోషకముగా నిర్వహింపబడేట్లు చూడవలెననీ, విద్యార్థులు తమనుతాము పోషించుకునేశక్తి గలిగివుండాలనీ, ప్రభుత్వం యీ విషయాన్ని తృణీకారభావంతో చూస్తున్నదనీ అన్నాడు.

* * *

సావర్నుగారను సాగనంపుటకు వెళ్ళి అక్కడనుంచి 'చీపాకు'కు బయలుదేరాను. గవర్నరుగారు 'స్టూడెంట్సు హాస్టలు'కు శంకుస్థాపనచేసినసభకు చాలామంది విచ్చేశారు. మిస్టర్ బ్లిస్‌దొర మొదట మాట్లాడిరి. వైఖరి అంతబాగా లేదు. ప్రతీ వాక్యాంతమందున్నూ ఏకవిధమైన నిలుపులతో ధోరణి చికాకు కలిగిస్తూ వుండెను. మహారాజావారిని పొగడుతూ ప్రసంగించినాడు. కాని ఆయన పొగడ్తలు మహారాజావారి కేమీా రుచించినట్లు కనిపించలేదు. బ్లిస్‌దొర ఉపన్యాసం సుదీర్ఘం.

తరువాత శంకుస్థాపన మహోత్సవం. మిస్టర్ డంకన్ గవర్నరుచేతికి కలశమందించాడు. ఒక ప్లేటుతో ప్లాస్టరును ఒక అందమైన కూజాతో నీళ్ళను తెచ్చి బాలయ్యనాయుడుగారు గవర్నరు కందించారు. కమిటీతరఫున రాజావారు శంకువును బహూకరించారు. గవర్నరు ప్లాస్టరును అలది శంకుస్థాపన జరిగి

నట్లు ప్రకటించారు. శంకుస్థాపనానంతరం వేదికవద్దకు వెళ్ళి గవర్నరు ఉపన్యసించారు. ప్రిన్సిపాల ప్రసంగముకంటే గవర్నరు ఉపన్యాసము బాగున్నది. కాని బంకుతూ క్రమ్ముకొట్టి మాట్లాడాడు. శరీరం ముచ్చెమటలుపోసి-ది. సభవారితరఫున జస్టిస్ సుబ్రహ్మణ్యఅయ్యరుగారు వందనములు సమర్పించారు. ఉపన్యాస ధోరణి బాగులేదు. చెప్పినసంగతులు బాగులేవు. అతిపొగడిక. అయినా నాగరికముగాను, యుక్తముగాను చెప్పవచ్చునా; అది మదరాసీలలో మృగ్యము.

♦ ♦ ♦

కోటకువెళ్ళితిని. విజయనగరవంశచరిత్రకు సంబంధించిన ముఖ్యమైన భోగట్టాలు దొరికినవి.

♦ ♦ ♦

(శ్రీ) శ్రీనివాసాచారిగారి మేనకోడలు గర్భాధాన మహోత్సవమునకు వెళ్ళితిని. దారిలో కపాలేశ్వరుని ఉత్సవము చూసితిని.

డాక్టరు హల్ట్జుదొరను అడగవలసిన విషయములు :

కోట యేలికలను గురించి మీకేమైనా తెలియునా ?

వీరు జైనరాజులని కృష్ణాజిల్లా మాన్యువలులో చెప్పాన బడినది. అన్నట్లు మొదటి చాళుక్యులు జైనమతస్థులేనా ? జైన దేవాలయములో వొక చోళరాజు యేదో నిర్మించినట్లు దాఖలావుంది కదూ ?

పూసపాటి మాధవవర్మనుగురించి మీకేమైనా తెలుసునా ?

కాకతి గణపతి "మహా మండలేశ్వర" బిరుదును వహించాడు.

నెల్లూరు రాజునకును మరెవ్వరికి జరిగింది ఆ యుద్ధం? నోటుబుక్కు చూడండి.

తరువాత కంచిని రాజధానిగా పరిపాలించిన పల్లవులు నెల్లూరులో ఏమైనా శాసనము లున్నవేమో చూడండి.

ఇండియను ఏంటిక్వేరీ వాల్యూము 6; పేజీలు 226 జమ్మలమడుగు చెంతవున్న గరిశలూరు; వెంపల్లె (అనుమల సమీపు)

కావేరిబ్రిడ్జి

తిరువాంకూరు రాజులది యేరాజవంశం. గోత్రములు. పాండ్య.

చోళులవంశమూలచరిత్ర ఎక్కడనుంచి మీకు తెలుసును.

శంభురాజు తెలుగువాడు.

రాజరాజు, రాజరాజగంగయే కారాదా? రెండు తరగతుల క్షత్రియులు.

సూరాయిలు దొర పత్రములు.

ఇలియటుదొర.

ఎపిగ్రికా ఇండికాలో పేర్కొన్న మాధవవర్మ శైల, లేదా, శిలావంశస్థుడు.

బుద్ధవర్మ, చిక్కభీమ, మైలపభీమ, అన్నపదేవ, వీర బసవరాజు.

16 ఏప్రియలు, మంగళవారం :

శ్రీనివాసాచారిగారితో కలిసి 'అభిజ్ఞాన శాకుంతలము' చదవడాని కుపక్రమించితిని. నాటకారంభమున తపస్వికన్యల సంభాషణము అత్యంతరకరము కాదా ? కాళిదాసునకు అనాఘ్రాత పుష్పములవంటి కన్యల సౌందర్యముచు వర్ణించుట ప్రీతి. *వల్కలములను ధరించిన శకుంతల, పుష్పాలంకృత పార్వతి వర్ణనములు.

♦ వనజ్యోత్స్న; నవమాలిక ! ఈ రంగము మహా సౌందర్యమైన కవితా రూపకల్పనతో అలరారుతున్నది ! కథా

---

*బిగిగావున్న శకుంతల స్తనవల్కలములను అనసూయ వొసిలిస్తున్న ఘట్టము: దుష్యంతుడు వల్కలధారిణి అగు శకుంతలను చూసి :

"సరసిజమనువిద్ధం శైవలేనాపి రమ్యం
మలినమపి హిమాంశోర్లక్ష్మ లక్ష్మీంతనోతి,
ఇయమధికమనోజ్ఞా వల్కలేనాపి తన్వీ
కిమవ హి మధురాణాం మండనం నాకృతీనామ్." మొదలైనశ్లోకములు.

"నలినము శైవలంబునఁ బెనంగొని యుండియు రమ్యమే యగున్;
మలినకళంకముం గలిగి మంజుల తన్వహియించుఁ జంద్రుఁడున్;
చెలువున మించె నీజలజనేత్రయు వల్కలధారణంబునన్;
లలఁపఁగ సుందరాంగులకుఁ దాను విభూషణ మేదిగా దిలన్?"

(వీరేశలింగంగారి అనువాదం)

♦ శకుంతల ఆశ్రమములోనున్న వొకసొగసైనమాధవీలతకు 'వనజ్యోత్స్న' అని పేరు పెట్టుకొని తన తోబుట్టువువలె దానిని పెంచుతున్నది. ఇది నాటకమున రమణీయమగుకల్పన. గున్నమామిడి చెట్టునకు అల్లుకున్న వనజ్యోత్స్నవలె, శకుంతల తగిన వరుని పొందునని ధ్వని.

నాయకుడు మాటునదాగి ఇతరుల మాటలను వినడమనేది నాటకాలలో తరుచు కనిపిస్తూవుంటుంది. ఇది సాధారణమైన కల్పనే.

* "ఉపభోగక్షమ" అనే ప్రయోగము అర్థవంతమైనది. సాభిప్రాయము. ♦ క్షత్రపరిగ్రహక్షమా; యదార్యమస్యామభిలాషి మే మనః

---

* 'భోగార్హమైన' అని అర్థము. 'వనజ్యోత్స్న' అని నువ్వు పేరు పెట్టుకుని పిలుచుకుంటున్న ఈ వనమాలిక యిప్పుడు గున్నమామిడి చెట్టుకు స్వయంవర వధువుఅయింది, శకుంతలా! దీన్ని చూశావా మరి' అని అనసూయ పిలిచిచెప్పగా శకుంతల లతదగ్గరకు వెళ్ళి చూస్తూ అంటున్న మాటలు: "సఖి రమణీయే కాలే ఏతస్య లతాపాదపమిథునస్య వ్యతికరః సంవృత్తః యన్నవకుసుమయౌవనా వనజ్యోత్స్నా. బద్ధపల్లవతయోపభోగక్షమ ఏష బాల సహకారః". "చెలియా! ఆహా! ఈ రమణీయకాలంలో, ఈ లతాపాదప మిథునమునకు ఒకరినొకరు కలియడం తటస్థించింది! నవయౌవన ఈ వన జ్యోత్స్న. పల్లవరాగంతో అలరారుతూ భోగార్హమైనది ఈ క్రొమ్మావిగున్న."

♦ శకుంతల సౌందర్యాన్ని చూసి ముగ్ధుడై దుష్యంతుడు "నా కోరిక దుర్లభమేమో! ఈమె కులపతికణ్వునకు స్వజాతిదైనభార్యయందు పుట్టినది కాకపోవచ్చునా? పుట్టివుండకపోవచ్చును. సందేహించనక్కరలేదు.

'అసంశయం క్షత్త్రపరిగ్రహక్షమా యదార్యమస్యామభిలాషి మే మనః
సతాం హి సన్దేహపదేషు వస్తుషు ప్రమాణమన్తఃకరణప్రవృత్తయః'

అర్థం: నృపపరిగ్రహయోగ్య యీనెలత నిజము;
కాక, నామది నిర్దోషమీపై నెట్లు
దవులు? సందేహవస్తువులయందు
నాత్మగతులె ప్రమాణంబు బాధ్యులకును.

✻"తుమ్మెద నిన్ను బాధిస్తూవుంటే మేమేం చేయగలం? నిన్ను రక్షించడానికి మేమెవరమి? ఈ తపోవనాలు రాజుచేత సంరక్షింపబడుతున్నాయి. నిన్నురక్షించడానికి దుష్యంతుణ్ణి పిలు."

ఎంత చక్కగా వుంది!

♦రాజు అడిగిన ప్రశ్నకు శకుంతల ప్రత్యుత్తరమీయక పోవడం ఎంతో స్వాభావికముగానూ, సహజముగానూ వుంది.

ఈ కథలోని సంఘటనలు జరుగుతుండగా విశ్వామిత్రుడు యేమిచేస్తున్నట్టు? ‡"పురాకిల" అంటే యెన్ని సంవత్స

✻ నవమాలికా కుసుమముమీద వ్రాలిన తుమ్మెద, నీళ్ళుపోస్తున్న శకుంతల మోముమీద పడుతుంది. మొహంమీద వాలుతూ, చికాకుగలిగిస్తున్న భ్రమరపీడనుంచి తనను కాపాడవలసినదిగా శకుంతల తన చెలులను కోరుతుంది. అప్పుడు అనసూయాప్రియంవదలిద్దరూ "కే ఆవాం పరిత్రాతుమ్? దుష్యన్త మాక్రన్ద. రాజరక్షితాని తపోవనాని నామ" అని బదులు చెప్తారు.

♦ తుమ్మెదను తరిమివేసే నెపంతో దుష్యంతుడు, చెట్లచాటునుంచి వారిమధ్యకు వస్తాడు. శకుంతలను ప్రశ్నిస్తాడు: "చక్కగా తపస్సు సాగుతున్నదికదా?" రాజు ప్రశ్నకు మౌనయై శకుంతల సిగ్గుచేత తలవంచుకుంటుంది.

‡ శకుంతలావృత్తాంతమును తెలియగోరి దుష్యంతుడు అనసూయాప్రియంవదలను ప్రశ్నించగా వారు, శకుంతల జననవృత్తాంతమును తెలియచేశారు. విశ్వామిత్రుని తపోభంగము, మేనకావిశ్వామిత్రులకు శకుంతల జన్మించుట, కణ్వుడు శకుంతలను పెంచిపెద్దచేయుట, యిత్యాదులు. శకుంతలావృత్తాంతమును దుష్యంతునకు అనసూయ "శృణోత్వార్యః పురా కిల తస్య రాజర్షేరుగ్రే తపసి వర్తమానస్యకిమపిజాతశంకైర్దేవైర్మేనకా నామాప్సరా నియమవిఘ్నకారిణీ ప్రేరితా" అని చెప్పినది. అర్థము: "ఆర్యులు వినవలెను, పూర్వము కౌశికుడనే రాజర్షి ఉగ్రతపస్సు చేస్తున్నపుడు, దేవతలు భయపడి ఆ నియమమును విఘ్నంచేయాలని మేనక అనే అప్సరసను పంపారు."

రాలు? "దేవతలకీ పరతపోభయకీలత యెప్పుడూ వున్నదే" అనే రాజు మాటలు అసవసరం. ఇలా అనడంవలన ఆ పిల్లలకు తనమీద సమ్యక విశ్వాసం యేర్పడుతుందని దుష్యంతుడి ఉద్దేశం.

'వైఖానసం' దీనికి వివిధ విధములగు అర్థములు, అన్వయములు కలవు.

శకుంతల: ♦"అసంబద్ధప్రలాపినీ..." ఎంతసొగసుగా వున్నది! వృక్షములకు కలశములతో నీరు పోయుటవలన శకుంతల అలసిపోయింది. §అలసిన శకుంతలావర్ణనం మనోహరం.

అనసూయా ప్రియంవదలకు చదువువచ్చును, ప్రియంవద తెలివైన పిల్ల.

అబ్బో! "మేము మేము" అని ఏమి రాచఠీవి!

♦ ప్రియంవదపై కొంచెం కినుకవహించి శకుంతల రోషంతో "అనసూయా! నేను వెళ్ళిపోతాను" అన్నది. అనసూయ, "ఎందువలన" అని ప్రశ్నించింది. అప్పుడు శకుంతల:"ఇమామసంబద్ధ ప్రలాపినీమార్యాయై గౌతమ్యై నివేదయితుమ్". అర్థం: "ఈ అసంబద్ధప్రలాపాలను ప్రేలుతున్న ప్రియంవద కథ పూజ్యురాలయిన గౌతమితో చెప్పడానికి."

§ "కుండనుబూన మూఁపు లవి క్రుంగెను, హస్తతలంబు లెఱ్ఱనై
యుండె, వడంకఁజొచ్చెఁగుచయుగ్మము, మిక్కిలియయ్యెశ్వాసముల్,
నిండెనుమోమునందుఁ జెవినిడ్డ శిరీషమువాడఁజెమ్మటల్,
వెండ్రుకలుంగలంగె ముడివీడఁగఁ దా నొకచేతఁ జెర్యుటన్."

17 ఏప్రియల్, బుధవారం

రాజుగారు విజయనగరం బయలుదేరారు.

♦"అన్ డాస్" రచించిన "ఫ్రెసీవ్స్" అనే నవలను నేనూ శ్రీనివాసాచారిగారూ చదువుకున్నాం. ఇది ఒక రివరెండుకు సంబంధించిన క్షణికోద్రేకపూరితమైన కథ. ఇటాలియను కొండజాతిపిల్లను యితను పెంచుతాడు. ఒకఇంగ్లీషు వనిత నృత్యమందిరాన్ని చిత్రించడానికై మతాచారి ఆహ్వానింపబడతాడు. తను చిత్తరువును వ్రాస్తుండగా ఆ ఇంగ్లీషు వనితను ప్రేమించడ మారంభిస్తాడు. ప్రేమ వ్యవహారం మెల్లగా మందకొడిగా సాగుతుంది. మొదట ఆమెను అతను అంతగా మెచ్చుకోడు; ఆమె ఎంతో అందకత్తె. కథలో చెప్పిందే చెప్పడం, "టు బీ ఆర్ నాటు బీ" పద్ధతి రచనాశైలీ విపరీతం. "ప్రేమించనా, మాననా?" అనే వితర్కం విసుగు పుట్టించేటట్టు సాగింది. పాత్రల మానసిక అవస్థలను చిత్రించేటపుడు రచయిత్రి తికమకలు పడింది. మానసిక తత్త్వనిరూపణ, విశ్లేషణ యేమీ సహజంగా లేదు; సంభవ మనిపించలేదు. పాత్రల మానసికతత్త్వం యిలాగున వుండడం అసంభవం. ఆమె మంచి ఆస్తిపరురాలు. ఇద్దరి ప్రేమకథా యిలాగున వుండగా చిట్టచివరకు యీ ప్రేమి

♦ ఈమె సుప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత్రి. అసలుపేరు మేరీలూయిస్ డీలారమే. ఎడ్మండ్స్‌లో 1839 సంగంలో జననం; మరణం : 1908. ఈమె తొలినవల "హెల్డుయిన్ బాండేజి"; ఇది 1863 లో ప్రచురింపబడింది. సైనిక జీవితము, సామాజిక జీవితములలోని శృంగార యితివృత్తములను పరిగ్రహించి అనేక నవలలను రచించినది. ఈమె నవలల పేర్కొన దగినవి : "అండర్ టు ఫ్లేగ్స్;" "మాత్స్".

కుడు తన పెత్తండ్రి కుమారుడని ఆమెకు తెలియవస్తుంది. అతనే తన ఆస్తికి నిజమైన హక్కుదారుడని విదితమవుతుంది. ఈ కథ వొక కల్లబొల్లి అనుకులబ్బొంత. ఈవిషయం తెలియక మునుపు, ఆమె తనను వివాహం చేసుకోవలసినదిగా, యేలుకో వలసినదిగా అతన్ని కోరుతుంది. ఈ విషయం తెలిశాక నేలపాలై పడి మూర్ఛబోతుంది.

18 ప్రియులు, లక్ష్మీవారం:

బట్లరుకు ఏభై రూపాయలనోటూ, వొక పదిరూపాయల నోటూ దాచయిస్తిని.

♦ ♦ ♦

ఇవాళ యెందుచేతనోకాని, నామనస్సు *దేవరపల్లి వైపునకు పరిపరివిధాల పోతున్నది. మా మామగారూ, చిన్న బావమరదీ, వాళ్ళూ - అన్నట్టు అతనూ, ఆ బ్రాహ్మణకుర్ర వాడు, శాస్త్రిలు తెలిసీ తెలియని జ్ఞానం, మూర్ఖత! ఆగమ్మ కాకి! అతనూ జ్ఞాపకానికొస్తున్నాడు. ఆహా! ఆరోజులు, మళ్ళీవస్తే ఎంతబాగుండునోకదా! ఇంతకాలమైపోయినతరు వాత వాటిని తలుచుకుంటే ఎంత మనోహరంగా వున్నవి! కాని ఆ గతించిన రోజులు కష్టాలతో నాకెంతో వ్యధను కలి గించాయి. హృదయానికి మోయలేనిభారమనిపించాయి. నిజంగా

* విశాఖజిల్లా శృంగవరపుకోట తాలూకాలోని ఒక గ్రామం. ఇది అప్పారావుగారి మామగారి ఊరు. మామగారిపేరు యల్లాప్రగడ సన్యాసి రాజుగారు. ఇక్కడనే అప్పారావుగారికి వివాహమయింది.

అవి ఎంతో భారం! చెప్పలేనంత భారం! అంతో యింతో సంపన్నవంతుడనయేవరకూ నాకష్టాలు గట్టెక్కాయికావు.

నా చిన్ననాటిరోజులు తిరిగి రావలెననే కోరిక యిక నాకు లేదు. ఎప్పుడూ ఏదో వొక దిగులు; డబ్బులేకపోవడం వల్ల ఎన్నెన్ని చిక్కులు. ఆ దుర్దినాలు వెళ్ళిపోయాయి; వెళ్ళి పోయాయి! పూర్తిగా మటుమాయమై పోయాయి! అమ్మయ్య! ఎట్టి విపత్తు!

అయితే నేమి, ఆరోజులలో నాకానందం లేకపోలేదు. రోజులు మంచి ఉత్సాహంతో గడిపాను. తెల్లవారితే దినం యెలాగ గడుస్తుందనే చీకూ చింతా లేనప్పుడే మనిషికి ప్రశాంతి; సుఖమూను! వొకరిసంపాదనమీద ఆధారపడ్డ మనిషికి యే అనుభవమూ వుండదు!

♦ ♦ ♦ ♦

పాపం, నారాయణమూర్తి వంటి అంత తెలివైన వ్యక్తికి ఆరోగ్యం తిన్నగా లేకపోవడం యెంత విచారకరం!

* చిరంజీవి వెళ్ళిపోయినాడు. ఎంత ముచ్చటైన కుర్ర పిల్లవాడు! అతనికి స్కాలరుషిప్పు యిప్పించగలననే అనుకుం టాను. అతనికి మా ♦అమ్మాయినిచ్చి వివాహం చేసివుందును కాని ‖ మాపెత్తండ్రికొడుకుకు, అతనికి తన కూతుర్నియ్యాలని వుంది. ఇదే సబబు.

♦ ♦ ♦

* కావూరి చిరంజీవిగారు.

♦ లక్ష్మీనరసమ్మగారు, ‖ గురజాడ పేర్రాజుగారు.

పదిహేనో తేదీని వొక వింత జరిగింది. తలుచుకుంటే యిప్పటికీ నవ్వు వస్తూన్నది. పచ్చయప్పకాలేజీలో మీటింగుకు వెళ్ళి, యింకా చాలా వ్యవధి వున్నదికదా అని 'యీవినింగు బజారు'లో తచ్చాడుతూవుంటిని. ఒక పుస్తకాలస్టాలువద్ద ఆగి పుస్తకాలను కొనుక్కొంటూవుండగా అక్కడకొక బికారి వంటివాడు వచ్చి ఆ అంగడి వానికొక కళ్ళజోడు అమ్మజూపి నాడు. దానిని షాపువాడు రూపాయిన్నరకు అడగగా, వాడు మూడురూపాయలకిస్తానన్నాడు. నేను రూపాయిన్నర యిస్తా నంటిని; వాడు కొంచెము గొణుగుకొని యిచ్చివేసినాడు. అది వెంటనే కళ్ళకుపెట్టుకొని చూస్తిని. సరిపడలేదు. ఎట్లు సరి పడును! నాకప్పటికి చత్వారమూలేదు; హ్రస్వ దృష్టీలేదు. బూట్సూ, స్పెక్టికల్సుతో యేదో లేనిఘనత వొకటి కొత్తగా వచ్చిపడ్డట్టు, మహోదర్జాగా అవి కళ్ళకు అలంకారంగా వుంచు కొని, కాలేజీలోకి వెళ్ళబోయినాను. కాని ఆకళ్ళజోడులో దూరపుచూపునకొకముక్కా, చదవడమునకొకముక్కా అతికి వుండడముచేత, దృష్టిచెదరి మెట్లమీదనే, ద్వారములోనే జారి చాలా హాస్యాస్పదముగా చతికిలబడిపోయినాను!

♦ ♦ ♦

రవివర్మ చిత్రించిన 'రాధ' బొమ్మను చూస్తిని. మొద్దు మనిషివలె కనబడింది. ముఖములో కొంత అవాస్తవికత; స్త్రీ మోము ఆలాగున వుండునా అనిపించుతుంది. కళ్ళు అంత పెద్దవిగావుండడం బాగులేదు. ఎడమ కనుబొమ చాలా పొట్టి. కన్నులు చారెడేసి. మీదిపెదవికొన కొంచెము అణగారిన ట్లున్నది. కొంచెమేమి, కాస్త హెచ్చుగానే వంగిపోయివుంది!


నోటితీరు నాకేమీ నచ్చలేదు. ఆకారము చూడగానే, మొత్తెపుపైని చాలా సాధువుగానూ, అమాయికంగానూ కని పిస్తుంది. మరి, రాధ యిట్టిదా ? ఆమెలో భోగలాలసత్వమూ, చలాకీతనమూ చూసీచూడడంలోనే స్ఫురించవద్దా ?

19 ఏప్రిల్, శుక్రవారం :

ఏభై రోజులకు బేటా నూరురూపాయిలు, టిక్కెట్లు ఇరవై రూపాయిలు, ఇరవైనాలుగు రూపాయలకు కొన్ని నాటకాలను కొంటిని. బ్రౌనుగ్రామకు ఒకరూపాయి, మహారాజావారి ఖర్చులు నూరు.

♦ ♦ ♦ ♦

క్రిస్టియను కాలేజీ తెలుగుసొసైటీ ఏర్పాటుచేస్తున్న సభ, సాయంకాలం 4-45 ని॥లకు; సభకు అధ్యక్షతవహించ వలసినదిగా నన్ను కోరినారు. విషయం: " వార్తాపత్రికల ప్రభావము."



శాకుంతల నాటకపఠనము తిరిగి సాగించితిని.

విదూషకుడు తక్కువ జాతిబ్రాహ్మణుడనుట స్పష్టం. మాటాడే భాషప్రాకృతము. మాంసం భుజిస్తాడు.

§‘కిం మోదకఖాదనే’? విదూషకుడికి కది హాస్యమూ తే. హాస్యమేమంత గొప్పగా చెప్పకో తోచింది కాదు.

♦ శరీర వ్యాయామమును కాళిదాసు కీర్తిస్తాడు. వేట దోషమే అయినా అది శరీరానికొక వ్యాయామం, కనుక దానిని సమర్థిస్తాడు.

తపోవనాన్ని విడిచి తిరస్కరిణీకలను దూరముగా వుండేటట్లు కట్టుదిట్టం చేయుమని దుష్యంతుడు, సేనాపతికి ఆజ్ఞ యివ్వడం; †ఇది తపోజనులపై రాజునకుగల గౌరవం తెలుపుతుంది.

---

§ ద్వితీయాంకము : దుష్యంతుడికి వేటఅంటే విముఖత కలిగింది. శకుంతల మీదనే అతనికి మనసు. “విదూషకునితో నాకింకా నీతో మాట్లాడవలసినపని వుంది. ఒక అనాయాసకార్యంలో నీతోడ్పాటు అవసరమ”ని దుష్యంతుడు అనగా, విదూషకుడు “కిం మోదకఖాదనే? కుడుములు తినుటయందా?”అని ప్రశ్నిస్తాడు.

♦ “శాంతిపరులౌ తపోధనసంద్రములందు,
దహనశీలమౌ తేజంబు దాఁగియుండు;
తాఁకఁ దగియుండు సూర్యకాంతంబులట్లు,
వెలికిఁ జిమ్మును పరతేజ మడరబూని.

† వేటను వర్ణించుచు దుష్యంతునితో, సేనాపతి :

“పోరిపోరి మాటికి లాగుటను బూర్వశరీరము గట్టివాఱి, భా
స్కరకిరణాళికెంతయును సైఁచుచుఁ జెమ్మట లేశమైననుం
బోరయక, చిక్కియున్ ధృఢతఁ బొంపుటఁ బల్చనిమేన, విక్రమ
స్థిరుఁడయి యొప్పఁ జొప్పడును జెల్వుగ శైలచరద్విపంబనన్”
“కడుపులోఁ గ్రొవ్వెల్ల గఱఁగి యత్యంతంబు
నుదరంబు పలుచనై యొప్పెసంగు” మొదలైనవి.

ద్వితీయాంక ప్రారంభంవలన, శకుంతలయెడల రాజునకు కలిగిన ప్రేమాతిశయంవల్ల అతనికి వేటయందు విముఖత కలిగిందని చెప్పడంతప్ప మరొక ప్రయోజనం కనిపించదు.

♦ "సఖే, న పరిహార్యే వస్తుని పౌరవాణాం
మనః ప్రవర్తతే; "

ఈ మనోభావము వాస్తవిక విషయాలను నిజంగా తెలుపుతున్నదా? అలాగున తెలపకపోయినప్పటికీ, కాళిదాసు తనకాలంలోవున్న రాజులకీఆదర్శం వుండవలెనని అభిలషిస్తున్నాడా? అతనలాగున అభిలషించడం అర్థ్వామే. గత కాలపు రాజుల ఆదర్శాన్ని తనకాలపు రాజులకు కాళిదాసు ఆపాదిస్తున్నాడు కాబోలును!

† "వశినాం హి పరపరిగ్రహాసంశ్లేషపరాఙ్ముఖీవృత్తిః."

♦ దుష్యంతుణ్ణి, విదూషకుడు 'మిత్రుడా! ఇప్పుడు తాపసకన్యను సైతం కామిస్తున్నట్టు కనబడుతున్నావే?' అని ప్రశ్నించగా దుష్యంతుని సమాధానం: "సఖా! పరిహార్యవస్తువుమీదికి పౌరవులమనస్సుపోదు"

† పంచమాంకమున శకుంతలను దుష్యంతుడు తిరస్కరిస్తాడు. తిరస్కృత శకుంతలను దుష్యంతుని చెంతవదలి గౌతమీ శార్ఙ్గరవుడు వెళ్ళిపోతున్నపుడు శకుంతల వారివెంట బయలుదేరుతుంది. తమతో వస్తున్న శకుంతలను శార్ఙ్గరవుడు "కులముచెడిన నీవు కణ్వునిచెంతకు రావలదు; పతియింట దాస్యమే నీకు మంచిద" ని పరుషంగా మాట్లాడగా దుష్యంతుడు, శకుంతలను దూషించవద్దని చెబుతూ,

"కుముదాన్యేవ శశాఙ్కః సవితా బోధయతి పఙ్కజాన్యేవ,
వశినాం హి పరపరిగ్రహ సంశ్లేష పరాఙ్ముఖీ వృత్తిః"

§ యదార్య మస్యా మభిలాషి మే మనః
† ఇంగుదీ తైల చిక్కణ శీర్ష స్య

తెలుగున 'చిక్క' అనే శబ్దము, "చిక్కణ" అనే సంస్కృత శబ్దమునుండి పుట్టినదా? "చిక్క" సంస్కృతభవమా? గురువులను కాశ్యపులు ఆశ్రమంలో లేరుకనుకనే బహుశా దుష్యంతుడు తనను వివాహం చేసుకోవలసినదిగా శకుంతలను అడిగివుంటాడు.

♦ రాజు, నీవారధాన్యములలో ఆరవవంతు భాగము యిమ్మని వారిడిగి తేవచ్చును. రాజుకు పుష్కలంగా ధనం

అర్థము : "కుముదంబులకే శశియును
కమలంబులకే రవియు వికాస మొసంగున్;
స్వమన మటు జితేంద్రియులకు
విముఖంబగుఁ బరవధువుల కెగిరించికిన్."

§ ఇది ప్రథమాంకములోనిది; 16 వ తేదీ డైరీలో యిది ఉదహరింపబడినది.

† శకుంతలను ఎవరు పరిణయమాడి అనుభవించగలరో కదా అని దుష్యంతుడు విదూషకునిచెంత వాపోవుచున్నపుడు విదూషకుడు "యింగుదీ తైలంతో చిక్కనైన అరణ్యవాసి చేతిలో శకుంతల పడకమునుపే, నువ్వా మెను చేతికి చిక్కించుకో" మని సలహాయిచ్చాడు. చిక్కణ అనగా చిక్కనైన అని అర్థము.

♦ ఆశ్రమంలోని కొందరు తపసులు తనను గుర్తుపట్టారని, శకుంతలను చూడ్డానికి యేమిషమీద వెడితే బాగుండునని దుష్యంతుడు, విదూషకుణ్ణి ఆలోచన అడగగా, "నీవారధాన్యములలో ఆరవభాగం రాజువు కనక నీకు రావలసివుందికదా, ఆ మిషమీద వెళదాం" అని విదూషకుడు రాజుకు సలహాచెప్పాడు. ఇది విని దుష్యంతుడు "తాపసేంద్రులిచ్చు తపముల యాఱవ భాగ మక్షయముగఁ బరఁగు మాకు" అని చమత్కరించాడు.

వస్తోంది. కోశాగారం నిండుగానే వుంది. దుష్యంతునిలో కొంత హాస్యచమత్కారము లున్నవి. "తపసులో ఆరవవంతు."

* అహోప్రసన్న మహో౽పి విశ్వసనీయతా వపుషః! అథవా ఉపన్న మేతదృషిభ్యో నాతి భిన్నే రాజని.

ఇటువంటి గుణములుకల రాజులను కాళిదాసు శ్లాఘిస్తాడు. తనకు ఆశ్రయమిచ్చిన కవిపోషకుడైన యేలిక నుద్దేశించి కాళిదాసు యీ పొగడ్తలను బహుశా చేసి వుంటాడు.

♦ "కతిపయరాత్రం సారథి ద్వితీయో నాయుధ సధ్రీచా భవతాసనాథీ క్రియతా మాశ్రమ ఇతి".

సరే; అందుకని, రాజు ఆశ్రమంలో కొన్ని రోజులు వున్నాడు.

† "మొదలైతే కుతూహలం పైకుబికినమాట నిజమేకాని,

---

* ఆశ్రమారణ్యంలోవున్న దుష్యంతుణ్ణి ఆశ్రమాన్ని రక్షించడానికై కొన్నిరోజులపాటు వుండవలసినదిగా ఋషికుమారులు కోరతారు. అప్పుడు వొక ఋషికుమారుడు దుష్యంతుణ్ణి చూసి ఆశ్చర్యంతో "అహా! ఈయన మూర్తి తేజోవంతమయినా విశ్వసనీయంగా వుంది. ఋషులకునూ యితనికినీ అట్టే భేదంలేదు. కనుక యిలాగ రాజనందనుడు వుండడమనేది యుక్తంగానే వుంది" అంటాడు.

♦ పూజ్యులైన కణ్వమహర్షి దగ్గరలేరుకనుక రాక్షసులు యజ్ఞాన్ని విఘ్నంచేస్తారు. "అందువల్ల కొన్నిరాత్రుళ్లు మీరు సారథి ద్వితీయులరై ఆయుధాలు చేతపూని, యీ ఆశ్రమాన్నిరక్షించ" వలసినదిగా ఆశ్రమవాసుల కోరికను రాజునకు ఋషికుమారులు తెలియచేస్తారు.

† ఋషికుమారుల కబురువిని రాజు ఆశ్రమంవైపు వెడుతూ, విదూషకుణ్ణి "శకుంతల్ని చూడాలని కుతూహలపడుతున్నావా?" అని ప్రశ్నించాడు. అప్పుడు విదూషకుడు చమత్కారంగా అన్నమాటలివి.

ఇప్పుడీ రాక్షసుల కథ వినగానే ఒక్కసారంత మిగల్లేదు.”

హాస్య సంభాషణము !

• రాజధానినుండి కరభకుడు రాణి ఆజ్ఞను దుష్యంతునికి తెలిపాడు “ఆగామిని చతుర్థే దివసే నిర్వృత్తపారణ ఉపవాసో మమ భవిష్యతి. తస్మిన్ దివసే దీర్ఘాయుషా౽వశ్యం సన్నిహితేన భవితవ్యమితి”.

§ “త్రిశంకురివాంతరాళే తిష్ఠ;” త్రిశంకుని కథ యెప్పుడు జరిగింది? శకుంతలా వృత్తాంతానికి పూర్వమా కాక తరువాతనా? ఇది ఎనక్రానిజమ్ కాదా?

ముందుకాలంలో ఎప్పుడో జరిగిన త్రిశంకు వృత్తాంతాన్ని, శకుంతలా వృత్తాంతానికి పూర్వమే జరిగినట్లు ఇక్కడ కవి చెబుతున్నాడేమో?

† “మా ఖలు మాం రక్షోభీరుకం గణయసి?”
“మహాబ్రాహ్మణ కథమేతద్భవతి సంభావ్యతే?”

•ఇవ్వాళటికి నాలగవదినంనాడు పారణమానివేసి ఉపవాసం వుండబో తున్నాను కనుక దీర్ఘాయుష్మంతుడవగు నువ్వు దగ్గర వుండవలెను.

§ తన తల్లి పిలుపు నందుకున్న తరువాత, రాజధానికి వెళ్ళవలెనా, లేక ఆశ్రమంలో యజ్ఞాన్ని రక్షించేందుకు వుండిపోవలెనా అనే మీమాంస దుష్యంతుణ్ణి ఎదురొక్కంది. “రెండూ దాటకూడని ఆజ్ఞలే. యేమిటి చేయడ మంటే” విదూషకుడు అన్నమాటలివి : “త్రిశంకుళ్ళాగ అంతరాళంలో నిల్చిపో.”

† రాణి కబురు విని దుష్యంతుడు విదూషకుణ్ణి పుత్రకృత్యాన్ని నిర్వహించేటందుకు రాజధానికి వెళ్ళమని చెప్పాడు. నే నలాగే వెడతాను కాని “రాక్షసులకు భయపడిపోయి వెళ్ళిపోతున్నా ననుకుంటావు సుమీ!” అని

హాస్యసంభాషణము !

◆ రెండో అంకంలో చివరిశ్లోకంవలన దుష్యంతుడు భయంతోనూ, గౌరవంతోనూ శకుంతలను చేపడుతున్నట్లు తెలుస్తున్నది.

20 ఏప్రియల్, శనివారం :

మొన్ననీమధ్య, షణ్ముగంచెట్టియారుతో రాకెట్టు కోర్టులో కూర్చున్నాను. మాతోపాటు కృష్ణయ్యగారుకూడా వున్నారు. ఆయన చాలా ముసలివాడు; కళ్ళు ప్రకాశవంత

విదూషకుడు అంటాడు. అప్పుడు "ఆబ్బో! నువ్వు మహా బ్రాహ్మణుడివి. నీకు భయమనేది వుందని నేనెలా అనుకోగలను?" అని దుష్యంతుడు వేళాకోళం చేస్తాడు.

◆ "క్వ వయం క్వ పరోక్ష మన్మథో
మృగశాబైస్సమ మేధితో జనః,
పరిహాసవిజల్పితం సఖే
పరమార్థేన న గృహ్యతాం వచః"

అర్థము : "కనఁగ మనమేడ ! యజ్ఞాతకామ యగుచు
సరిగ మృగశాబకములతోడఁ బెరిఁగినట్టి
ముగుద యిదియేడ ? పరిహాసమునకు నేను
బలుకుమాటలు నిజమని తలఁపవలదు."

తాను శకుంతలానురక్తుడనైతినని విదూషకుడు అంతఃపురంలో ఒక వేళ చెబుతాడేమో అనే శంకతో దుష్యంతుడు విదూషకునితో పలికిన పలుకులు: "ఋషులమీద నాకున్న గౌరవంవల్ల ఆశ్రమానికి వెడుతున్నాను. కాని, తాపసకన్య శకుంతలమీద నాకేమీ మనసులేదుసుమీ" అంటూ దుష్యంతుడు విదూషకునకు నైపథ్యంగా తెలియచేశాడు.

ములు. ఉత్సాహం అధికం. తనకు అరవైఏనిమిదేళ్ళ వయస్సని చెప్పారు. త్యాగయ్యగారు నలభై ఆరు సంవత్సరాలక్రితం పరమపదించారు. ఆయన గురువు రామబ్రహ్మం. "ఆనంద సాగరమె" అనే కృతికి అర్థమేమిటని కృష్ణయ్యగారిని అడిగాను. ఈ కృతిని "ఆనందసాగర మీదని దేహము భూభారము, రామ బ్రహ్మానందసాగరము" అని చదువవలెను.

భాగవతం దేశంలో నశించిపోతున్నదని ఆయన అన్నారు. తమ చిన్నతనంలో ఎన్నో మంచి భాగవతపుజట్లు ఉండేవట! హరికథ దాసులను ఆయనా షణ్ముగంచెట్టియార్ గారూ ప్రశంసిస్తూ కొంతసేపు ప్రసంగించారు.

త్యాగయ్యగారు "శ్యామసుందరాంగ" అనే కీర్తనను గానంచేస్తూ చనిపోయినారని (శ్రీ) కృష్ణయ్యగారు చెప్పినారు. ఆయన ముఖికి నాటి బ్రాహ్మణుడు. నారాయణ అనేది శివ పరం.

♦ ♦ ♦ ♦

కృష్ణమరాజుగారు విచిత్రంగా సంభాషిస్తారు. "యివి అన్ని మాయాపురాణాలు. మనుష్యుల్ని నరకానికి తోసివెయ్య డానికి వచ్చినాయి. అవి వినకూడదు. పురాణాలు అన్ని ఐక్య కంఠ్యం చెయ్యవలె. విష్ణుపురాణములు సాత్వికములు. బ్రహ్మవి రాజసములు. శివుడివి తామసములు. అంతర్ముఖులు శివుణ్ణిగాని అన్యదైవములనుగాని పూజించరు." మాట్లాడుతు న్నప్పుడు రాజుగారికళ్ళలో మందహాసముతోలగి క్రోధభావము కనబడుతూవుండెను. మనిషికి చిరుకోపం ; ఇష్టే నియమాల

మీాద విరుచుకు పడతారు. సంభాషణలో ప్రశాంతత లేదు. మాటలను యీడుస్తూ పలుకుతారు. పలికిన మాటనే పలుకుతూ చెప్పిన వాక్యమునే చెబుతూవుంటారు. మామూలుధోరణిలోనూ కోపంవచ్చినప్పుడూ ఇదేతీరు. భూమి వణకిపోతుందేమోనన్నంతజాగ్రత్తగా ఒక్కొక్క అడుగే ఎత్తిఎత్తివేస్తూ నడుస్తూవుంటారు. ఖర్చులో యేమాత్రం వెనకడుగు వేసేదిలేదు. చేతిలో ఎంతుంటే అంతా అవలీలగా ఖర్చుపెట్టేస్తారు. దూబరా లావు. స్వభావం మంచిది. కొన్నికొన్ని సందర్భాలలో సానుభూతిని చూపెస్తారు. మనిషి శుభ్రంగా వుంటారు. చిన్న వేశ్యాలంపటం వొకటి. డాక్టరు దగ్గరకు వెళ్ళాలన్నారు.

◆ ◆ ◆

ఈవేళ తెలుగుహోర్పు రెండు సంచికలు నాకువచ్చినవి. పోనీ, అప్పుడప్పుడైనా దాని సంగీతధ్వని వినవస్తూవుండడం సంతోషదాయకం. ఇదివరకటివలెనే నామిత్రులు ఉల్లాసముగానూ, ఉత్సాహముగానూ దీనిని నిర్వహిస్తున్నందుకు ఆనందమవుతున్నది. 'నాయకు' రాకవలన విజయనగరంలో కొంత అలికిడిగా వున్నట్లుంది. నాయకుని దుయ్యబడుతూ మిత్రుడు వెంకయ్య చాలా ఘాటుగానే పత్రికలో లేఖ వ్రాశాడు. యువకులకుగల ఉత్సాహం, దురుసుతనం తప్పిస్తే లేఖ చక్కగానేవుంది. అతని మొదటివ్యాసం కంటె యిందులో కృత్రిమత్వం తక్కువే. తిట్టడపు దూకుడు చాలా తీవ్రంగానూ, యెంతమాత్రం తగనిదిగానూ, అయుక్తంగానూ వుంది.

నాయకు చాలా చిన్నవాడు. మహారాజావారి దృష్టిలో పడినప్పట్నుంచీ తననుతాను అభివృద్ధిచేసుకోవాలని ప్రయత్ని

స్తున్నాడు. ఇక్కడ ప్రస్నప్పుడు కొన్ని పుస్తకాలను చదవ డానకు ఆరంభించాడు. వెనుకంజ వేయకుండా కృషి చేసి నట్లయితే యువకులలో మంచి వక్తగా రాణించగలడు.

ఈసంవత్సరం కాలేజీఫొటోలో నేను లేకుండానే సాగి పోయినది. బహుశా యిది మంచిదే. జబ్బుమనిషికి గ్రూపు ఫొటోలో స్థానం లేదు. కురూపికి ఫొటో తీయడమనే శ్రమ కూడా యేల!

♦ ♦ ♦

నా ఉత్తరాలకు జవాబు రాసేపాటి దయ మేనేజర్లకు లేకపోయింది. బహుశా నాకు తెలియచేయడానికి సంతోష కరమైనవార్త యేదీ లేదులావుంది. వారిపరిస్థితి అంత అను కూలముగా లేదేమో!

♦ ♦ ♦

వెంకయ్యగారే కాక మిగిలిన విజయనగరవాసులు శ్రీ నాయరును అభినందించవలసివుంది. విజయనగర వింతలు చాలా ఆసక్తిగానూ, ఆహ్లాదకరంగానూ వుండవచ్చును. విజయ నగరంలో యిక ఊసుపోతుంది. నాయరు రాకవలన కలిగిన ప్రభావంయిది. ఆశ్చర్యమేమి! పిల్లలు నాయరంటే యిష్ట పడి తీరుతారు. చక్కగా వ్రాయగలశక్తీ, మాట్లాడగల నేర్పూ వున్నపుడు పిల్లలను ఆకర్షించవచ్చును. మిస్టరు నార్టన్ అంటే విద్యార్థుల కెంత యిష్టమో చూడండి! ఆయనచుట్టూ ఎప్పుడూ పిల్లలే!

పాపం, రామమూర్తి పంతులు! ఆయన కుమారుని మురుగులు, చోరీపోయినవట; తెలుగు హార్పుకొరక 'న్యూసు'

దొరికింది. నా అనారోగ్య విషయముకూడా పత్రికకు వార్త అయినది. కొత్త ఏరువలె తెలుగు హొస్పు మంచి పూటీమీద వున్నది. ఎక్కడచూసినా దొంగతనాలూ, అగ్నిప్రమాదాలూ, ఉపన్యాసపు వెల్లువలు !

మా బావమరదికి నామీద కోపంవచ్చింది. ఇక్కడకు వచ్చినప్పట్నుంచీ అతన్దగ్గర్నుంచి నాకొక వుత్తరమైనా రాలేదు. అతని ప్రయత్నాలకు నేనభ్యంతరం కలిగించాననీ, మహారాజా వారు తనకు సొమ్ము బదులు యివ్వకుండా ఆటంక పరిచాననీ నామీద అతనికి కోపం. ఇందువలన కలిగిన ఫలితమల్లా మా యిద్దరికీ భేదాభిప్రాయాలు కలగడమే;

నా భార్యా, పిల్లలూ మాడుగులలో వున్నారు. వాళ్ళ యోగక్షేమాలుసైతం నాకు తెలపడానకు మా బావమరదికి మనస్కరించింది కాదు. పోనీ, వచ్చిన యిబ్బందేమీలేదు; అప్పువ్యవహారంలో కలగచేసుకుని నావిధిని నేను నిర్వర్తించాను. అందుకు నాకేమీ విచారం లేదు.

ఒకనాడు, మహారాజావారు అనుకూలమైన షరతుల మీద కొంతడబ్బు అప్పిస్తామంటిరి. ఆయన అనుగ్రహానికి నేను తగను. చాలా సంవత్సరాలయింది, ఆయనవద్ద రెండువేల రూపాయలు నగదు అప్పు పుచ్చుకుని ! అప్పుడు మాస్థితి గతులు యేమీ బాగులేవు. తీసుకున్న అప్పులో యింతవరకూ వొక్కరూపాయి చెల్లుపెట్టలేకపోతిని ; పుచ్చుకున్న సొమ్ము తిరిగి నేను యివ్వలేకపోతానని మహారాజావారికి తాము మాట ఇచ్చినప్పుడు తెలియలేకపోయెను ; ఈఅవకాశాన్ని యెంత మాత్రం వినియోగించుకోకూడదని నేనూ అనుకున్నాను ;

నేనటువంటిమనిషినికానని నా స్నేహితులకూ తెలుసును. కాని చేసిన ఋణంతీర్చలేక పోతిని !

మా బావమరిది అప్పులవిషయంలో ఖరాఖండిగా ప్రవర్తించడని తెలిశాక, నా మనసుకు మరీ బాధకలిగింది. అందువల్ల నేను జోక్యం కలగజేసుకుని మహారాజావారికి నా అభ్యంతరం తెలియచేశాను. తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లించకపోతే మనసుకు శాంతివుండదు. అటువంటి చిక్కులేవీ రాకుండా, ముందే మహారాజావారు నాకు మనశ్శాంతి కలిగించారు.

నేను యిక్కడకువచ్చి కొన్ని నెలలయింది. కాని ఇంతవరకూ నాఆరోగ్యంకొన్నబడలేదు. ఇంతకంటెకొన్నబడుతుందన్న ఆశనాకులేదు. ఈఅడ్మిరాల్టీ వసాసులోనే ఇదిబాగుపడనప్పుడు విజయనగరంలో అసలే లాభంలేదు. చుట్టుపక్కల వాతావరణం, యిన్ని మంచి సదుపాయాలు, గొప్ప ధనవంతులకూ, ఉన్నతోద్యోగులకూతప్పించి,అన్యులకు అందుబాటులోవుండవు.

నిజమే; నాకు ఆలోచనలు లావు; మనసు ప్రశాంతంగా వుండక అనేక విషయాలమీదకు దృష్టి పోతుంది. పురావస్తు తత్వ పరిశోధనలను కావించాలనే పిచ్చి ప్రబలిపోతున్నది. విజయనగరం రాజకుటుంబీకులచరిత్ర రాయాలనే తలంపు ప్రత్యేకంగా నానాటికీ హెచ్చుతున్నది. ఇందునిమిత్తమే నేను బెంగుళూరు వెళ్ళాను. ఓరియంటలు లైబ్రరీలో గంటలతరబడి కూచ్చుని, భోగట్టా సేకరించాను. సందేహాస్పదమైన ఆరోగ్యం కలవ్యక్తి సాధ్యమైనంతత్వరలో తాను చేయగలపనిని యేదో వొకటి చేయడం మంచిది. విజయనగరకుటుంబ పూర్వీకుల

వంశచరిత్రను గురించి కొన్ని క్రొత్త విషయాలను చెప్పగలిగితి నేని, అది నాకెంత ముదావహము!

ప్రస్తుతము నా ఆలోచనలో వున్నవి, మూడు విష యాలు: మహారాజావారి వంశచరిత్ర; ఆంధ్ర నాటకరంగం; క్షత్రియుల విద్యా సమస్య. ఈ మూడింటిని గురించి యెంతో కొంత నేను కృషి చేయగలనుకదా!

♦ ♦ ♦

కొంతదూరము వచ్చినట్టేవచ్చిమాగుర్రం మరిముందుకు కదలడానకు వెనుకాడింది; సరే అని దానిని యింటికి పంపించి వేశాము. గయాసమాజ్‌లో జరుగుతున్న మీటింగుకు హాజ రయితిని. సంగీతముపై వొక సంస్కృత పండితుడు చక్కని వ్యాసమును తెలుగున వ్రాసి చదివినాడు. అయితే దానినెవరూ అర్థముచేసుకోకపోతేమానె, ఖాతరుకూడా చేయలేదు.

సమావేశమునకు అధ్యక్షత వహించినది మిష్టరు ఆడం; ఇద్దరు పిల్లవాళ్లు చూడడానికెంతో ముచ్చటగా వుండిరి. సభకు హాజరయినవారు అతితక్కువ.

సమావేశానంతరం రైల్వేస్టేషనుకు వెళ్లితిని. శ్రీ స్వామి నాథయ్యరు మొదటితరగతి కంపార్టుమెంటులో ప్రయాణము చేస్తూవుండెను. అతను కూర్చున్న కంపార్టుమెంటులోనికి ఇద్దరు యూరోపియనులు ప్రవేశించిరి. అయ్యరుగారు రిజర్వుడు కంపార్టుమెంటులోనికి వెళ్ళిపోవలసి వచ్చినది. రైలు కదల బోతూండగా సామాను మరొకపెట్టెలోనికి మార్చడం యెంతశ్రమ! ముందే వొకపెట్టె ఆయన రిజర్వు చేసుకో వలసింది!

21 ఏప్రియల్, ఆదివారం:

శాకుంతల నాటకం మళ్ళీ తెరిచాను.

"యజ్ఞకర్మ అయిపోయింది కనక సదస్యులు నాకు వీడ్కోలిచ్చారు. విరహంతో బాధపడుతున్న నేనింక యేమి చేయుదును?" అని దుష్యంతుడు † "శక్యమరవిన్దసురభిః కణవాహీ మాలినీ తరంగాణామ్ అఙ్గైరనఙ్గతప్తైరవిరళమాలిఙ్గితుం పవనః" భైరవి.

మేఘసందేశము, భవభూతి ఉత్తరరామచరితములతో సరిపోల్చి చూడవలెను.

§ 'వేతసమరిక్షిప్తేలతామణ్డపేసన్నిహితయా శకున్తలయా భవితవ్యమ్'. దుష్యంతుడు శకుంతల అడుగుజాడలనుపరిశీలించుట సొగసుగా వుంది!

---

† దుష్యంతుడు విరహవేదనను భరించలేక ఆశ్రమ ప్రాంతంలో సంచరిస్తూ అనుకుంటున్న మాటలు; అతని అవస్థను తెలిపే శ్లోకానికి అర్థం :

" తోయజాతసువాసనతోడఁ గూడి
మాలినీతరంగజలకణాళిఁ దాల్చి
యనిల మిచట గాఢాలింగనార్హమయ్యెఁ
గామతప్తమదీయాంగకముల కిపుడు."

§ 'ప్రబ్బచెట్లతో చుట్టబడివున్న యీ లతామండపమునందు శకుంతల సన్నిహితురాలయి వుంది.'

‡ "అభ్యున్నతా పురస్తాదవగాఢా జఘనగౌరవాత్పశ్చాత్
ద్వారేఽస్యపాండుసికతే పదపఙ్క్తిర్దృశ్యతేఽభినవా".

చెట్లచాటున పొంచుండి శకుంతలనుచూడడం, ఆపిల్లల మాటలు దొంగచాటుగా వినడం రాజునకుగౌరవప్రదమా? దుష్యంతుని ఉదాత్తతకు అర్హమైనదా?

• "ప్రథమదర్శనాదారభ్య పర్యుత్సుకాఆపన్నే వశకుంతలా."

శకుంతల దుష్యంతుణ్ణి వొక్కసారే చూసి వుంటుందా యేమిటి! 'పర్యుత్సుకా' ఎంత సొగసుగావుంది !

† 'పూర్వార్ధేన పుష్పశయనాదుత్థాయ' అహా! ఎంత సహజంగావుం దీ భంగిమ!

సరిగా దుష్యంతుడు లతామండపం చెంతకు వెళ్ళేసరికి అనసూయాప్రియంవదలు శకుంతలమదనబాధనుగురించియెందుకు ప్రసంగించాలో ? వారి సంభాషణ కొంత జరిగిన తరవాత

---

‡ "ఇవిగో ద్వారముకడఁ దెల్ల యిసుకలోన
జఘనభారంబునను వెన్కఁజాలలోఁతు
గాను ముందు ప్రక్కను నెత్తుగాను నున్న
క్రొత్తయడుగుజాడలు కనుంగొనఁగ నయ్యె."

• దుష్యంతుణ్ణి మొదటిసారి చూసినప్పట్నుంచీ శకుంతల గాఢానురాగంచేత బాధ పడుతోందని ప్రియంవద అనసూయకు తెలియచేస్తున్నది. 'రాజుకోసమే శకుంతలకి మనోవేదన కలుగుతున్నదాయేమిటీ చెప్మా?' అని ప్రియంవద ప్రశ్న.

† శకుంతలను అనసూయ "చెలియా! నిన్నొకటి అడగాలనుకుంటున్నాను. నీకు సంతోషం అధికంగావుందికదూ?" అని ప్రశ్నించింది. ఈ ప్రశ్న విని శకుంతల 'పూర్వార్ధేన పుష్పశయనాదుత్థాయ' పూలపాన్పునుండీ సగము లేచింది.

మధ్యలో రాజు లతామండపంచెంతకు వచ్చినట్టు చూపిస్తే బాగుండును!

♦ ♦ ♦

కనుబొమలు ముఖమునకు కొంత అందము కలిగిస్తూ కొన్ని లక్షణములకు దోహదముచేస్తవి. ముందుకు పొటకరించు కొని బొద్దుగావుండేవి సొగసుగా వుండవు. చర్మమునకు అంటు కొనిపోయినట్లుంటే, క్రూరత్వమును సూచిస్తవి. అతి సున్నిత ముగా పెన్సిలు గీతవలె వుంటే చులకనమనిషి అని సూచన. క్రమముగా విల్లువలె వంగి నొసోమోస్తరు దళసరితనముతో కండ్లకు అతిదూరముగాగాని, అతిదగ్గరగాగాని లేకుండా వుంటే, అవి ముఖమునకు శోభనిస్తవి. ఏకవరసగా లయినుగా కాకుండా యెగుడుదిగుడుగా సొగగావుంటే అవి తెలివితేటలకు సూచన. ఉదాహరణకు : అనంతాచారిగారి కుమారుడు.

♦ ♦ ♦

ఈరోజున "ధనం" పాటను వింటిని. ఏమంత రూపసి కాదు; కాని నిఘాగాచూస్తే ఆమె ముఖవర్చస్సులో ప్రజ్ఞగల ధీమా, చక్కని నమ్రత కలిసి గోచరిస్తవి; నాజూకుతో మిళిత మైన యీమెత్తు నిర్లక్ష్యభావం వైఖరిలో స్ఫురిస్తుంది. ఉదా త్తంలో పాడుతూవుంటే కనుబొమలు విడతవి. పాట చాలా హాయిగాను, మధురంగాను వున్నది. పెటుకుతనం యేమీలేదు, పాండిత్యకౌశలమునకు తోడునీడగా అభిరుచివుంది. అయినా మదరాసీ స్త్రీలలో కనబడే చొరవగాని, శ్రీనివాసాచారి పాటలో వుండే భావవిన్యాసముగాని యీమెలో కనబడలేదు. ఆచారి గారి పాటలో రకరకాల అనుభూతులు వున్నవి. కాని మధుర

మైన రసోత్కర్ష ఈమె గానములో గోచరించినట్లు ఆయన కంఠములోకూడా కానము. ఈమె అనుభూతికిగల ఉద్రిక్తతలను ఆచారిగారు అందుకోజాలరు. అట్టి ఉద్రిక్తానుభూతిని ఈమె యిట్టే అవలీలగా అందుకోగలదు. "ధనం" పాటనువినే అవకాశం యింతకుముందు నాకు లభించలేదు. ఇదే మొదటిసారి వినడం. నేను సాధారణముగా వినవలసివుంటూవుండిన గానములలో వలె యిందులో "గళసాధకపు వికారము" లేమీ లేవు. వాటిని ఆమె త్యజించినది; జయించినది. పాట సరళముగానూ, ఆహ్లాదకరముగానూ వున్నది. స్వరకల్పనలలో పాండిత్యమూ, చమత్కారమూ కలవుగాని తీపితనము అంతరించలేదు. గాత్రముతో పాటు నాజూకైన, మనోహరమైన వాయిద్యసమ్మేళనము. వీణారవమునకు సరితూగు గొంతుక. వీణావాయిద్యముకూడా మృదువుగా వున్నది. ఇంతకుముందు మైసూరు శేషన్నపాట వినడం తటస్థించింది. కాని ఈమె గాత్రం ఆయనగాత్రంకంటె మధురమైనది; ఇక మిగిలినవారి సంగీతము, ఈమెముందు దిగదుడుపు!

కాని ఈమెలో ఒక లోపమున్నట్లు నాకు తోచినది. వాయిద్యములో ధాటీ కనబడదు. ఆరితేరిన చేతిలోపడి దిక్కులను మార్మ్రోగించే వాయిద్యంకాదు.

దర్బార్, భైరవి, సావేరి, యదుకులకాంభోజి,పున్నాగవరాళి మొదలైన రాగములలో కొన్ని కృతులను బహు చక్కగా పాడింది.

ధనం పాటకచేరినుంచి యింటికివస్తూంటే, తోవలో మా కొక పెళ్ళి ఊరేగింపు తారసపడ్డది. ఊరేగింపు చాలా బాగున్నది. ముందు వొకబ్యాండు. దానివెనుక వందలకొద్దీ మగవాళ్ళు; రకరకాల విలువైన దుస్తులు ధరించుకుని కవిగానడిచి వెడుతున్నారు. ఒక గుర్రంపై వొకబాలుడూ, బాలికా కూచుని వున్నారు. గుర్రం వెనకాల జరీచీరెలు, వింత వింత పోడుల ఆభరణాలు జిగజిగ మెరుస్తూ వుంటే, స్త్రీలు కొందరు, వయ్యారంగా నడుస్తున్నారు. పెళ్ళి ఊరేగింపు, మొత్తంమీద చూడదగినదిగా కనిపించింది. స్త్రీలలో కొందరు సుందరులు.

గుర్రపు బండీ దిగి ఊరేగింపు తిలకిద్దామనుకుంటిని. ఏమి వింతలుకంటికి కనిపిస్తాయో, చెవులకు వినిపిస్తాయో మరి! అనుకుంటూ వుండగానే బండీవెళ్ళిపోయింది. నేనాపమనలేదు.

23 ఏప్రియలు, మంగళవారం:

క్రిస్టియనుకాలేజీలో రసెల్ గారు షేక్స్పియరు "కొరియొలేనసు" పాఠము చెప్పగా వింటిని. వక్త అనజాలను. ధోరణి అంతబాగాలేదు. 'స్కిన్నరు' కన్న దృఢతరమైన వాచికము కద్దు. ఈషత్తు కాయికాభినయం, ముఖవికాసములో మార్పులు. స్కిన్నరును చూస్తిని. విశాలమైన మొగుడునుదురు. వాచికము మంచి స్ఫుటముగావున్నది. "జేకను ఉపన్యాసములు"ను బోధించుచుండెను. పొడగరి, బక్కపల్చని మనిషి. సౌహార్ద్రదృష్టి కలదు. పిల్లలు చాలా మెల్లగా చదువుచుండిరి. నెమ్మదిగా మాట్లాడుచుండిరి.

రసెల్ క్లాసులోకి రాగానే పిల్లలకు పేపర్లను యిచ్చి వేసినాడు. "కొరియొలేనసు" నాటకము ప్రథమాంకము; తొమ్మిదవ రంగము. "ఇది నిజముగా చాలా కష్టమైనరంగము. వివిధపాఠాంతరములు. ఉన్న పాఠాంతరములు మిక్కుటము. వీటిని సమన్వయముచేయడమే దుస్సాధ్యము. క్లారడన్ ప్రెస్సు ఎడిషన్‌లో వాక్య విరామచిహ్నాలు ఎక్కువ" రసెల్ యిలా గున చెబుతూ చిరునవ్వునవ్వాడు. "ఇదిగో యిది గ్లోబ్ ఎడిషన్; ఇదీ క్లారన్ డన్ ప్రెస్సు సంపుటినే అనుసరించిందాయె! ఆరవ పంక్తిలో పాఠాంతరం. షేక్స్పియరీయనుపండితులు గ్లోబు ఎడిషనే'ఫాలో' అవుతూవుంటారు." పుస్తకాన్ని బల్లమీద పెట్టి కాస్సేపు రస్సెల్ మౌనంవహించాడు. పుస్తకాన్ని తీసి చేతులతో అటూ ఇటూ ఒకమారు తిప్పాడు. "ఇక్కడ డ్రగ్టన్ చెబుతున్నపదం 'ఏన్ ఓవర్ట్యూర్' అని;" నోట్సు తెరచి ప్రొఫెసరు బోధిస్తున్నాడు.

"ఆయన చెబుతున్నప్రకారం...ఆయన్ని మనమొక అథార్టీగా ఎంచుకోనక్కరలేదు. ఆయన యీపదం అయి వుంటుందని సూచిస్తున్నాడంతే; ఆయన సూచన మంచిదేమరి; కాని, షేక్స్పియరీ యను పండితులీ సూచనను ఆమోదిస్తారో లేదో నాకు తెలియదు. 'ఓవర్ట్యూరు' అనేపదం ముందు 'సి' అనే అక్షరం లోపించివుంటుంది." సుద్దముక్క చేతపుచ్చు కుని దాన్ని మెల్లగా ఎగరవేస్తూ కిందపడకుండా పట్టుకుంటూ రసెల్ తన ఉపన్యాసం కొనసాగించాడు;" పోనీ ఆయన చెబు తున్న ప్రకారం మనమాశబ్దాన్ని పరిగ్రహించినప్పటికీ,

'పేసేజి' అర్థంమటుకు మారదు. కనక దాన్ని మనం పరిగణించ నక్కర్లేదు,"

డ్రస్టన్ అర్థాన్ని సమర్థిస్తూ వొక విద్యార్థి ఏదో పుస్తకాన్ని పట్టుకువచ్చాడు:

"ఫాలియోసులోమాత్రం 'ఓవర్‌ట్యూర్' అనే పదమే కలదు. దానినే అక్కడ సమన్వయించుకుని అర్థం చెప్పుకుంటే 'పేసేజి' భావం పూర్తిగా మారిపోతుందండీ!"

ఓవర్‌ట్యూర్ అనగా ప్రెల్యూడ్ అని అర్థం.

రసెల్ తన నోట్సును తిరగవేస్తూ చెప్పుకువస్తున్నాడు.

"మంచిది. రైట్‌దొర చెబుతున్నప్రకారం ఈ పదాన్ని ఈ అర్థంలో షేక్స్పియరుకాని, లేదా ఆయన సమకాలిక రచయితలుకాని ప్రయోగించలేదు."

క్లారన్డన్‌నోట్సు రసెల్‌వొకసారి తిరగవేసి "రైటు ఈ పదాన్ని 'కవర్‌ట్యూర్' అని నిర్ధారించాడు. దీన్ని షేక్స్పియర్ 'కవర్' అనే అర్థంలోకాక 'ఎప్లేసాఫ్ కన్సీల్‌మెంటు' అనే అర్థంలో ప్రయోగించాడు. కాని కవర్ అంటేనే 'ఎప్లే సాఫ్ కన్సీల్‌మెంటు" విద్యార్థులు నవ్వుతున్నారు. "సరే; డ్రస్టన్ నోట్సులో మరేదోవుంది." నోట్సు తెరచి చూస్తున్నాడు. నుదుటిమీద వేళ్ళనుఆనించి కొట్టుకుంటూ ఆలోచించసాగాడు. మనం గ్లోబ్ క్లారన్‌డన్ ఎడిషన్లనే క్లాసికల్‌టెక్స్ట్సుగా తీసు కోవడం మంచిదనుకుంటాను" (విద్యార్థుల పేపర్లను ఇక్కడి ప్రొఫెసర్లు దిద్దుతున్నారో లేదో? సత్యనాథంగారిని కలుసు కుని యీ విషయం భోగట్టాచేసి చూతాం).

రసెల్ మాటిమాటికీ విద్యార్థులను ప్రశ్నలు వేస్తున్నాడు. వివరణలను అడుగుతున్నాడు. "డెబైల్ అనే పదం మనకిప్పుడు వాడుకలో లేదు. మనకు డెబిలిటీ అనే శబ్దంవుంది. క్రియాపదం డెబిలిటేట్;" రసెల్ పెదవులపై మందహాసం. మనిషి పొడగరి; కాని సన్నం. వదనంలో ప్రసన్నత.

"కొరియొలేనస్ అహంకారి. అతని వ్యక్తిత్వం రాను రాను ప్రస్ఫుటమౌతున్నది. గర్వం, క్రోధం హెచ్చు. అందువల్ల తన సహచరులకు దూరంగావుంటాడు. ఆరిస్టోక్రటిక్ తరగతికి చెందిన వ్యక్తులలో ఇతనిపాత్ర ద్విగుణీకృతమై రూపొందినది. తన అభిప్రాయాలను త్యజించి ఇతరుల అభిప్రాయాలకు చెవిఒగ్గే నమ్రత అతనికిలేదు. అహంకారం జాస్తీ. ప్రపంచమే అంత" అంటూ రసెలు చిరునవ్వు నవ్వాడు.

మిస్టర్ స్కిన్నర్

విద్యార్థులకు పేపర్లను యిచ్చివేశాడు. విశాలమైన నుదురు. 'బేకను ఉపన్యాసములను' పాఠం చెబుతున్నాడు. "జీవితంలో వివిధ అంతస్థులకు చెందిన మానవులమధ్య వివాహం.........మెల్ అనేది అంత అవసరంకాదు. 'మెల్' అంటే తప్పక జరగగలిగేదని అర్థం." స్కిన్నరు తన ఎడమ చేతిని మెడపై ఆనించుకున్నాడు......"మెనీక్రైమ్స్, ఆన్ మెనీ అకేషన్స్, యీ రెండింటిలో దేనికి ప్రాధాన్యతయిస్తే బాగుంటుందో నాకు తెలియదు......ఆంగ్లంలో ఎన్నో లాటిను భాషాపదాలు ప్రయుక్తమవుతూవుండేవి...లాటిను క్రియావిభక్తులను విడిచిపెట్టి, ఆ పదాలను ఆంగ్లంలో వాడుతూ

వుండడం సంప్రదాయం. అంత్యక్రియావిభక్తులు అవసరం కాదనుకుంటే వేవాహ.

జేకబ్ యీ వ్యాసాంతమందు వివాహాలను గురించి ఎన్నో అభిప్రాయాలను వెలిబుచ్చాడు. యులిసెస్‌ను గురించిన కథ."

యులిసెస్ పూర్వ వృత్తాంతాన్ని స్కిన్నరు విద్యార్థులకు చెప్పాడు.

"అయితే ఇక్కడి కథ యులిసెస్ గుణసంపత్తికి, ఔన్నత్యానికి ఉదాహరణగా పేర్కొనబడిందా?"

స్కిన్నరుది కొంచెం చప్పిడిముక్కు.

'క్వారల్' అనే పదం లాటిను అర్థంలో వాడబడింది... (క్లాసు రూములో కూచోవడంవల్ల నా తలప్రాణం తోకకు వస్తోంది. గదిలో ఎండ. కొంజాలు దిగువకు వున్నాయి.)

యంగ్మెన్సు హిందూ అసోసియేషనుకు వెళ్లితిని. టేబిలుచుట్టూ ఎన్నో పత్రికలు వున్నవి. టిట్‌బిట్సు, కాంటెంపరరీ ఫార్ట్‌నైట్లీ, ఇండియా ఎకాడమీ; పబ్లిక్ ఒపీనియన్, లండన్ టైమ్స్, వీక్లీ సోషల్ రిఫార్మర్ మొదలైన పత్రికలు. గుండ్రని బెంచీలు; తోట ఎంతో అందంగావుంది. ప్రతి ఆదివారమూ శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు ప్రొద్దున్న వేళల వేదాంత తత్త్వమును బోధిస్తూవుంటారు.

కాలేజీలో శ్రీ వేదం వెంకటరాయశాస్త్రిగారు కనిపించి నాతో ప్రసంగించారు. "ఆధునిక ఆంధ్రసాహిత్యం యేమైతేనేం; దాన్ని నేను పట్టించుకోను; నా కొచ్చిన ఆ శాస్త్ర తెలుగూ

దానివల్ల పాడైపోతుంది. సాత్త్విక స్వభావం అలవర్చుకున్న వారు ఎప్పుడూ నిజమే పలుకుతారు."

♦ ♦ ♦

"డిబేటింగ్ సొసైటీ"కి హాజరయితిని; చర్చనీయాంశము: "విద్యార్థులు : రాజకీయాలు." ఇద్దరు విద్యార్థులు ఫరవాలేదు, ఓ మాదిరిగా మాట్లాడారు. అధ్యక్షుడు, బొంబాయినుంచి వచ్చిన వొక ప్రొఫెసరు.

24 ఏప్రియలు, బుధవారం :

గుర్రం మరికదలనని పెంకితనం చేస్తున్నది. జమేదారు వద్దకు వెళ్ళాను. అతనీ ప్రాంతాలలో లేడు. దూరదేశమే పోయాడు. జట్కా చేసుకుని వెస్టు అండుకో కు వెళ్ళితిని. అక్కడనుంచి లిటరరీ సొసైటీకీ పయనం.

25 ఏప్రియలు, లక్ష్మివారం :

గుర్రపు బండీవానిని బలవంతాన్నే కుదుర్చుకున్నాము. శ్రీనివాసాచారిగారు, రామనాథయ్యరు ముఖమును పరిశీలనగా చూశారు. అతడు ఆయనకు సలాము చేశాడు.

26 ఏప్రియలు, శుక్రవారం :

గుర్రపుబగ్గీచెడిపోయింది; బగ్గీ తయారీ యింకా పూర్తి కాలేదు.

27 ఏప్రియలు, శనివారం :

ఈవేళ ఉదయమే నేను తోటలో పూవులను కోసుకుంటూవుండగా, యింజనీరింగు కాలేజీ విద్యార్థి వచ్చాడు;

వచ్చి తనవిషయమై శ్రీ సుందరరావుపంతులుగారితో చెప్ప మని కోరినాడు. అతనూ వెళ్ళగానే, పరమేశ్వరపిళ్ళేగారు వొక మిత్రుని వెంటబెట్టుకుని వచ్చారు. బిలియర్డ్సు గేము ఆడితిమి. తదుపరి మిత్రులకు ఎన్నో ఉత్తరాలను వ్రాస్తిని.

28 ఫిబ్రవరి, ఆదివారం:

ఈవేళ చాలా లేఖలు వ్రాశాను. నాయుడిగారి మిత్రుడు, దుబాసీ వచ్చాడు. బట్లరూ, అతనూ చాలాసేపు కాలక్షేపం చేశారు. నాకూ ఊసుపోయింది. బిలియర్డ్సు ఆడాం; నాలాగే అతనూ బాగానే ఆడతాడు.

♦ ♦ ♦

మా వంటలక్క చెప్పుకోతగ్గ మనిషే; శరీరం నలుపు. మొదటిలో ఆవిడ చాలా మంచిమనిషిఅనీ, శీలవంతురాలనీ, భక్తురాలనీ తోచినది. ఇట్టి శాంతతగలమనిషి చెన్నపురిలో యున్నేళ్లూ వంటలక్కగావుండి, పట్నవాసపుఛక్కీ యేమీ అలవరచుకోలేదే అనే వితర్కమూ సంతోషమూకూడా కలిగాయి; గాని యీ సదభిప్రాయ మెంతో కాలం నిలవలేదు.

కంఠం ఎంతో బాగుంటుంది. పాటలు చాలా మధు రముగా పాడుకుంటూ వుంటుంది. కేవలము భక్తిగీతములే కావు. అప్పుడప్పుడు అడపాతడపా కొన్ని ప్రేమగీతాలు కూడాను. కొంత వర్ణనాచాతుర్యము, కథనకౌశలమూ కలవు. తాను యెరిగిన భోగట్టాలు చిలవలూ పలవలూపెట్టి విన సొంపుగా చెబుతుంది. చాలా తమాషాఅయిన మనిషి. గుణం మంచిదోకాదో నాకు తెలియదు; మంచిదనే అనుకుందాము.

ఆమెకొక సోదరుడు వున్నాడు. కరణీకంకోసం కోర్టుల్లో లావాదేవీలు పడుతున్నాడు. (శ్రీ) బి. యస్. పంతులును కలుసుకొని ఆయనతో తన సోదరునిగోడవ చెప్పుకున్నదట! ఆ కరణీకప్రసారాటు తనసోదరునిపక్షమయ్యేట్టు చేస్తానని మా వంటలక్కకు ఆయన వాగ్దానమిచ్చాడట. ఆయన కిప్పుడు నెల్లూరుకు బదిలీఅయింది. మాటలుంటే మా వంటలక్క మనువు మరిచిపోతుంది. మాటలాడడమంటే చెవికోసుకుంటుంది. వి. యస్. ఆర్. కుటుంబాన్ని బాగాఎరుగును. వి. యస్. ఆర్. గారు ఒక మహ్మలమ్మాయిని పెళ్లిచేసుకున్నారు. ఆపిల్ల మిగుల అందకత్తె. యూరోపియనులలోగాని, స్వదేశీయులలోగాని అంతటి అందకత్తె లేదు. ఆమె 'శ్రీరం' జమీందారుని కుమార్తె. ఆమెకు పెద్దమనిషి అయిన పదహారోనాడు శోభనమయింది. ఆనాడే భర్త ఆమెను కాపరానకు యిక్కడకు తీసుకువచ్చేశాడు.

మా వంటలక్క యీ ముచ్చటలను చెబుతూండగా నేను "ఆమె యిప్పుడు వుందా?" అని ప్రశ్నించాను; "ఊహు! చనిపోయింది!"

ఒకసారి ఆమెను పెనిమిటి బొంబాయినగరము తీసుకువెళ్ళాడు. రోజుకు వందరూపాయల అద్దె యింటిలో కాపరమున్నాడు. ఒకనాడు ఆమె ఒక నిలువుటద్దములో ముఖము చూసుకుంటూఉండగా అందు ఒక * పెద్దపులిఆకృతి కనిపించి భయముగొలిపినది. అద్దములో కనిపించే ఆ పెద్దపులి

* చూ: 'ఆణిముత్యాలు' అనే అప్పారావుగారి కథానికాసంపుటిలో ముద్రితమైన 'మెట్డ్లా' అనేకథ.

మీాదకు దుముకుతూ మింగవస్తున్నట్లు అనిపించింది. తన మెడవరకూ భుజాలనుసైతమూ పెద్దపులి మింగివేసింది. వెంటనే తెలివితప్పిపోయి, పిల్ల కిందపడిపోయింది; ఎంతసేపటికీ స్మారకానకు రాకుండెను. భర్త భూతవైద్యము తెలిసిన వొక ముసల్మాను మంత్రగానిని రప్పించాడు. నూరుకడవల చల్లనినీరు ఆమెమీాద ధారాప్రవాహంగా గుమ్మరించమని భూతవైద్యుడు భర్తను ఆదేశించాడు. ఆ విధంగా స్నానంచేయించగా, కొంత సేపటికి ఆపిల్లకు స్పృహవచ్చింది. తదుపరి, బొంబాయి నుంచి దంపతులు యిక్కడకు వెళ్లిపోవచ్చారు. ఇప్పుడిక ఆమె 'ఆమె' కాదు. పూర్వపులావణ్యమూ, సొరూ, సౌందర్యమూ నశించి పోయినవి.

ఆమెను, 'శ్రీర' గ్రామమునకు వచ్చివుండమని కన్నవారు, చాలా పర్యాయములు కబురు పంపుతూ వచ్చిరిగాని, ఆ పిల్ల పుట్టింటికి వెళ్ళలేదు.

"దంపతులిద్దరూ ప్రేమతో అన్యోన్యంగా యిష్టాపత్తుగా వుండేవారా ?"

"ఊహు ! వుండేవారుకాదు; అహా ! వుండేవారు; అవునూ కాదూ అని చెప్పలేను."

అతని భుజములపై ఆమె ఎప్పుడూ పడుతూవుండేది. అతనొకనాడు కృష్ణాజిల్లాలో వున్న తన తోబుట్టువును చూడడానికి వెళ్ళాడు. ఇలావుండగా వొక రోజున, ఆమె వంట్లో యేమీా బాగుండకపోయెను. మనసుకు చికాకు హెచ్చసాగింది. ఇంత మజ్జిగా అన్నమూ పెట్టమని అయిదారుసార్లు అడిగింది. అలాగున రోజల్లా అడుగుతూనే వుంది. భర్త గ్రామాంతరము

నుండి తిరిగి వచ్చాక తనకు వంట్లో యేమీ బాగులేదనీ చికాకుగా వుందనీ చెప్పింది. తాను లోపలకు రాకూడదనీ, 'వెలపల' వుంటిననీ తెలియచేసింది.

తన వొంటిమీద వొక్కసారి చెయ్యివేసి చూడమని భర్తను అడిగింది. భర్త, భార్యను స్పృశించాడు. తన మెడను రెండు చేతులా దగ్గరకుతీసుకుని, తనను అక్కున జేర్చుకోవలసినదని వేడుకొంది. భర్త భుజములపై తనతలను వాల్చుకొని భార్య, యీ అప్పగింతమాటలను చెబుతూ మరణించినది: "యక్కడ శ్రీర. యక్కడ ఈవ్రాసు. నేను మీపిల్లను. మీతో సంబంధం రావడము, మీ తొడలపైని కాలము చేయడము..."

నాటినుండి ఆయనకు మనోధైర్యము సడలిపోయింది. పట్టుతప్పి మనసు చంచలం కాజొచ్చింది. ఎప్పుడు ఏది మాట్లాడినా ఆమెను గురించే; వొకేవిధమైన కలవరింత; వొకటే పలవరింత. ఆమె మూర్తి అతనిని వదలకుండెను. ఇది యించుమించు వొక ఉన్మాద అవస్థ. తన భార్యను గురించి కథారత్నాకరం అనే గ్రంథాన్ని మరి వొక నవలనూ రచించాడు. ఆయన యెప్పుడూ యేదో పుస్తకము పఠిస్తూనే వుంటాడు.

ఈ విషాధగాథను విన్నంతనే నా హృదయభారము మిక్కుటమయింది. మనసులో ఏవేవే ఆలోచనలు చెలరేగి గుండెలలో చేయిపెట్టి కలచినట్లయి, కొంతసేపు మౌనముగ ఆలాగునే నిలబడిపోయాను. భరించలేని విషాదానుభూతి కలిగింది. బహుశా యీ హృదయవిదారకదృశ్యమును మా వంటమనిషి తన కళ్ళారా చూసింది కాబోలును!

వి. యస్. ఆర్. మొదట ఉపాధ్యాయ వృత్తినిచేపట్టి తరువాత కొన్నాళ్ళకు ప్లీడరయినాడు. వకీలు వృత్తిలో చక్కగా రాణించి చాలా ధనం ఆర్జించాడు. మంచి వక్త. తెలివితేటలుగలవాడు. "పి. యచ్. యస్"ను ప్రారంభించాడు. కాని లాభించలేదు. తరువాత స్పెక్యులేషను ఆరంభించాడు.

పైన చెప్పిన విషాదగాథను మరికొందరు యింకొక విధంగా చెబుతారు. ఆ యువతి అనుమానింపబడి హత్య చెయ్యబడ్డదట! హరిహరీ! ఇదే యదార్థమైతే, కాదనే హృదయ పూర్వకంగా నమ్ముతున్నాను, అతనే యీ అకృత్యం కావించిన నరపిశాచి అయివుండాలి! ఎంత మూర్ఖాతిమూర్ఖుడు!

ఒక కుమారుడు, ఒక కుమార్తెగల వయసుమళ్ళిన వొక పురుషుడు తన శాఖకాని సుందరాంగి, నవజవ్వని యెడల వెర్రివ్యామోహములోపడిపోయి, ఎంతో శ్రమపడి పెండ్లాడి, మితిమీరిన వైభవంతో విరగబడుతూ త్యాగభోగరాయుడు లాగ వెలుగుతూవుంటే, అతనికి ఆమెనుగూర్చి యెన్నైనా అనుమానములు లోలోపల పీడిస్తూ వుంటవని యితరులకు తోచడములో యేమీ ఆశ్చర్యమూ లేదు; ఇది అసంభవమూ కాదు. నాలుగయిదు రోజులమధ్య తప్పక అతని నొకసారి నేను చూసితీరవలెను.

ఈ గాథను వి. యస్. ఆర్. యింకొక విధముగా చెప్పాడు. చాలా రొమాంటిక్ కథవలె వర్ణించాడు: స్పెక్యులేషనులో తన ధనమంతా పోయింది. ఇక బతుకుమీద ఆశ లేక తానూ తనభార్యా ఆత్మహత్య చేసుకుందామనుకున్నారట! తలుపులు బిడాయించుకొని రెండు విషపాత్రలను


మొదటపెట్టుకొని ఒక గదిలో కూచున్నారు; ముందు ఆమె, విషం తాగింది. కాని యితను తాగేలోపుననే దంపతుల ఆత్మహత్యా ప్రయత్నం నలుగురికీ వెల్లడి అయిపోయింది. అతని ఆత్మహత్యా ప్రయత్నం విఫలమయింది.

♦ ♦ ♦

జలంత్ర సూటుకు సంబంధించిన విషయాలను గురించి మాట్లాడేటందుకు రంగాచారియర్, వకీలువద్దకు వెళ్ళాను. అక్కడనుంచి మాధవనాయరుగారింటికి, తరువాత బీచి. ఇల్లు.

29 ఏప్రియలు, సోమవారం :

నాటకములలో నాయికలు తక్కువ. వసంతసేన భోగముపిల్ల. భూమిక ఆకర్షణీయము; కాళిదాసుని "నాయికలు" శృంగారమునకే ప్రసిద్ధి. నాటకములలో దాంపత్య శృంగారము. సంఘటనములు తక్కువ. నాయికలేకుండా నాటకము. గ్రీకు నాటకములలో గ్రీకుల సాంఘిక పరిస్థితులు, ఇంగ్లీషులో ఆంగ్లుల జీవితము, భారతీయ నాటకములలో హిందూదేశ పరిస్థితులు కనబడతవి.



లీలావతి, సులోచన లేదా టు సిస్టర్సు; పి. సాంబనాథన్ బి. ఏ. రచియించిన కొత్త నాటకం.

గివరెండు డి. అనంతన్ బి. ఏ. హెడ్‌మాస్టర్ సి. యమ్. యస్. హైస్కూలు.

* * * *

'అస్మి రాలిటి హౌసు' ఇపుడు ఉత్సాహంతో కనుల కైకరంవముచలెవుంది. ప్రాతఃకాలం యెంతో శోభాయమానంగా వుంటున్నది. ప్రతి ఉదయమూ ఆహ్లాదకరమే; కోకిలమ్మకు మా తోటలోనే కాపురం. మధురమైన కంఠమునెత్తి పగటి వేళల నిరంతరము దిక్కులు పిక్కటిల్లేటట్టు కుహూకుహూ మని తన కలకలస్వనముతో గానప్రవాహముతో మైమరపిస్తున్నది. తోటలో ఎన్నో లతలు ఎన్నెన్నో పూలగుత్తులు. విరగపూసిన మొక్కల సొగసు. లిల్లీసు, నందివర్ధనపూలు, ఫలసంపంగి, గంగ రావి, మందార!

అయాంబిక్ పెంటామీటరూ, లాటిను డ్రమెటిక్ మీటరూ వొకటేనా?

యూరిపిడస్‌ను తమిళభాషలోనికి అనువదించిన రచయిత యెవరో, దానినతను బ్లాంకు వెర్సునకెలాగున సరి పుచ్చెనో?

ప్రాచీన భారతదేశపు నాటకములు అచ్చొత్తింపబడ లేదు. అచ్చుయంత్రములుండీ, యెంత దౌర్భాగ్యము!

♦ ♦ ♦

* 'కారన్ హిల్' మ్యాగజీను సంపుటములను వరసగా చదువనారంభించితిని:

---

* చదివిన సంపుటములు మొత్తం: 34; ఇవి 1862 సంవత్సరంనుంచి 1882 వరకు గల సంపుటాలు; ఉదాహృతమైన వ్యాసములే కాక మరికొన్ని కలవు.

స్టేజ ఎడాప్టేషన్సు ఆఫ్ షేక్స్పియరు; ఫారిన్ యాక్టర్సు అండ్ ఇంగ్లీషు డ్రామా; ది మిజరీస్ ఆఫ్ డ్రమెటిక్ ఆథర్; ది యింగ్లీషు డ్రామా; ఎలిజబెత్ అండ్ జేమ్సు; షేక్స్పియరు యిన్ ఫ్రాన్స్; కాస్ట్యూమ్స్ అండ్ కారెక్టరు; క్లియోపాత్రా; ఎ పెర్షియన్ పేషన్ ప్లే; డ్రమెటిక్ సిట్యుయేషన్ అండ్ డ్రమెటిక్ కారెక్టరు; వై డిడ్ షేక్స్పియర్ రైట్ ట్రాజడీస్; ది కామెడీ ఆఫ్ ఫ్రాన్సు; షేక్స్పియర్ అండ్ వాల్టేర్; ఎ డ్రమెటిక్ టేల్; ఎ స్టడీ ఇన్ ఫ్రూల్ లిటరేచర్; ది థియేటర్ ఇన్ చైనా; ది ఫారిన్ థియేటర్ బిఫోర్ మోలీ; టు డ్రమెటిస్ట్సు ఆఫ్ ది లాస్ట్ సెంచరీ; బిహైన్డ్ ది కర్టెన్; ఆక్ట్వో; ది డేనిష్ నేషనల్ థియేటర్; ఎ ప్లెజెంట్ ప్లే; ది ఆర్ట్ క్రిటిసిజమ్; డాంటే; ఏన్షియన్ట్ హ్యూమరు; ఆర్ట్: రిలేషన్ టు మేన్; సూపర్ నాచురల్ ఇన్ ఆర్ట్; హ్యూమర్; అమెరికన్ హ్యూమర్; క్రిటిసిజమ్ ఆన్ వర్డ్స్‌వర్త్; జార్జి ఇలియట్; నవల్ ఎలిమెంటు యిన్ లిటరేచర్; సోషియల్ లైఫ్ యిన్ ఆర్ట్; ఆర్ట్ అండ్ మొరాలిటీ; ఇంగ్లీషు రూరల్ పొయిట్రీ; పెసిమిజం అండ్ పొయిట్రీ; ఎథిక్స్ అండ్ యీస్తటిక్స్ ఆఫ్ మోడరన్ పొయిట్రీ; ద్రవిడియన్ ఫోక్ సాంగ్స్; ది స్టడీ ఆఫ్ కెల్టిక్ లిటరేచర్.

ఇంగ్లీష్ లిరికల్ పొయిట్రీ; పొయిటిక్ ఇమేజ్ అండ్ ప్రిమిటివ్ కన్సెప్షన్; క్రిటిసిజం ఆన్ వర్డ్స్‌వర్తు; పొయిట్రీ ఆఫ్ ఇటాలియన్ డైలెక్ట్సు; బాలెడ్; ఛాసర్స్ లవ్ పొయిట్రీ; ఎర్లీ యియర్స్ ఆఫ్ షెల్లీ; ఎ ప్లీ ఫర్ ఎరోటిక్ ఫారమ్స్ ఆఫ్ వెర్స్,

ది మోడరన్ కల్చర్; బొహీమియన్స్ అండ్ బొహీమియనిజం; మైకస్ట్రిమన్; ఎనార్కీ అండ్ అథారిటీ; నేషనల్ కారెక్టరు; ది సోషల్ లైఫ్ ఎమాంగ్ గ్రీక్స్; ది బర్మీస్ హీరోయిన్స్; సెల్ఫ్ ఎస్టీమ్ అండ్ ఎస్టిమేషన్; థీవ్స్ అండ్ థీవింగ్; ది జయంట్ ప్లానెట్, ది జూపిటర్; ఎథిక్స్ ఆఫ్ ఫ్రెండ్షిప్; ది మోడరన్ ఐడియా ఆఫ్ కల్చర్;

ఫ్రెంచిప్రెస్స్; ది జర్నలిజం; ఎర్లీ న్యూస్‌పేపర్స్; న్యూస్‌పేపర్ ఇంటరెస్టు ఇన్ జర్మనీ.

◆ ◆ ◆ ◆

అప్పటికి సిస్టరిన్‌లా వయసు ఇరవైయేళ్ళు. ఆమె భర్త వొక సబు-మేజస్ట్రేటు. ఆమె గదిలో ఆమె పెట్టె బేడా తదితర సరంజామా అంతావుండేది. అతని సోదరునిభార్య, అక్క అతని యింటికివచ్చి అక్కడనే వుంటూవుండేవారు. వీరిద్దరికీ ఆమె అంటే తగని యీర్ష్యపట్టుకున్నది. ఆమెను విషంపెట్టి చంపివేశారు. ఎందుకు విషంపెట్టిచంపారు? కారణం తెలియదు. వాళ్ళకు ఆమె అంటే పడేదికాదు. ఏమో? చెప్పలేను. ఆమె, తానే విషం తాగి చనిపోయిందని కొందరంటారు.

ఒకనాటిరాత్రి గదిలోనుంచి వొక అరుపు వినవచ్చెను. ఆమె గొంతుకలో విషం బలవంతంగాపోసి కాళ్ళతో మెడను తొక్కిపెట్టారు. ఆమె కేకలు అతనికీ వినిపించాయి. ఆ రాత్రి యెలాగయితేనేమి, అతనికి నిద్రలేదు. ఆమె అరుపులు, మూలుగులు ఇంటినొకరుకూడా విన్నారు. పొద్దున్న ఆవిడ పడకగది తలుపులు యెంతకూ తెరవబడకుండెను. ఎంత పొద్దెక్కినప్పటికీ వేసినతలుపులు వేసినట్లే వున్నాయి. గది తలుపులు తెరిచి

యింటివాళ్ళు లోపలికి వెళ్ళి చూసేసరికి ఆమె చచ్చిపోయి పడివుంది. శవంచెంత వొక గ్లాసు కనిపించింది. పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు వచ్చారు; వెళ్ళారు. ఆమెభర్త ఎంతో డబ్బు విరజిమ్మవలసివచ్చింది.

ఇది జరిగి యిప్పటికి వొక సంవత్సరమయింది; అతని రెండో భార్య మూడేళ్ళ క్రితం చనిపోయింది.

వి. యస్. సంగతి సందర్భాలను మంచిచెడ్డలను ఉనికిని తెలుసుకుందామని ఆమెను అడగ్గా ఆవిడ అన్నీ చెప్పింది; చెప్పి "అతనికి మంచితనం వకటి, యేమున్నా వున్నది. పిల్లా లకి సంగీతం మప్పడమేమిటి, పై వాళ్ళయెదట పాడించడమేమిటి" అన్నది; ఆలాగున వి. యస్. చేసినాడా? అవును.

ఆఖరుకి అతనికి నేం క్షమాపణకూడా చెప్పకో వలసి వచ్చింది. ఎంత అన్యాయం! నాకీ ఉదంతం చెవిని పడినపుడు నా కెంతటి విచారం కలిగిందో చెప్పలేను. అవును మరి, తొడిమకున్న ముళ్ళతేమను పీల్చుకునేకదా గులాబీ మొగ్గలు వికసించేది!

30 ఏప్రియలు, మంగళవారం :

'వెస్టు అండుకో'కు వెళ్ళాను. మిస్టరు శామ్యూల్ వూళ్ళో లేడు. మిస్టరు బిషపు తాను మూడు రోజుల్లో బుక్కు లను సిద్ధంచేసి వుంచుతానని చెప్పాడు. కాని బైండరు యింకా వూరునుంచి రాలేదని, అందువల్ల బైండింగుకు కొంత వ్యవధి అవసరం పడుతుందని ఫోర్‌మన్ తెలియచేశాడు. బుక్కులు

తయారయిన తీరు బైండరుకు నచ్చలేదట; చక్కగా బైండు చేయాలని అతని ఉద్దేశం. అందుకు కొన్నాళ్ళాగమని గడువు యిప్పించమని ఘోరుమన్ నన్ను కోరాడు. 'సరే' అన్నాను. అక్కడనుంచి తిన్నగా మీటింగుకు బయలుదేరాను. పచ్చయ్యప్ప హాలులో సమావేశం. (శ్రీ) సత్యనాథం ఉపన్యాసమును సభలో చదువుతూ వుంటెను. విషయం: "హిందువులకు యూరోపియన్‌లకుగల సాంఘిక సహవాసము" ఈ ఉపన్యాసము శంకరనాయరుగారు కొత్తగా ఆరంభించిన మేగజినులో అచ్చుపడ్డది. సమావేశానికి మిస్టరు చెట్టనల్ అధ్యక్షత వహించాడు.

ఉపన్యాసం పెటుకుగా వుంది. ఇంగ్లీషు దోషభూయిష్టము. భాష మహాదురుసుగా సాగింది. తెచ్చిపెట్టుకొన్న హాస్యం; జుగుప్సాకరం; ప్రసంగమంతా పేలవంగానేవుంది. చెప్పిన విషయంలో 'పస' లేదు. మనకూ యూరోపియనులకూ మధ్య పొత్తు కలియకపోవుటకు కారణము "యూరోపియనులకు మనల గురించి యేమీ తెలియదు, అందువల్ల వారికి మనమీద సానుభూతి లేదు." ఇదీ ఆయన ఉద్దేశం; "వారు మనలను సానుభూతితో చూడరు కనక వారికి మనలగురించి యేమీ తెలియదు. స్త్రీలను మనం నలుగురియెదటకూ తీసుకురాము; వారికి సమాజంతో ప్రమేయంలేకుండాపోతున్నది. మనలో మనకు ఐకమత్యము లేదు. ఆంగ్లజాతికి తాము అధికులమనే వొక గర్వభావం కద్దు. భారతీయులు ఇంగ్లీషువాళ్ళను పగపట్టినట్టు చూస్తున్నారు; అందువలన వాళ్ళకు స్వదేశీయులమీద గౌరవము లేదు."

అయితే యిందుపై నా ఉద్దేశాలు యివి; స్వదేశీయులకు ఇంగ్లీషువాళ్ళకు మధ్య ఒక పెద్ద అఖాతమున్నదీ అంటే దానికి కారణాలు యివి :

1. సాంఘిక అవస్థలో మనకూ వాళ్ళకూ గల భేదం. మనం స్వతంత్రులముకాము; వొకరిపై ఆధారపడ్డవాళ్ళం.

2. మన ఆచారములు సంప్రదాయము వేరు;

3. ఇరుజాతులమధ్య వొకే పోలికగల అభిరుచులు, ఆసక్తి, పరస్పర సాహాయిక దృష్టి వుంటేనేతప్ప, యిరుజాతులకు చనువు యేర్పడదు.

4. విద్యావంతులైన స్వదేశీయులు ఒక వింతఅయిన మనుష్యులు. అటు ఆవుపెయ్యాకాదు; ఇటు గేదెపెయ్యాకాదు అనే సామెతవలె వుంది వీరి పద్ధతి. వీరికి వ్యక్తిత్వమూ, శీలమూ పూజ్యము. నిజమైన సంస్కృతిని, వ్యక్తిత్వమును సాధించిననాడు వీరికి సమాజములో గౌరవము కలుగుతుంది. సిరిసంపదలుకూడా మనిషికి గౌరవము తెస్తవి.

1 మే, బుధవారం :

పత్రికలు నిరంతరము నిర్వహించవలసిన పనులు.

1. బహుదుర్బలులు, నిరుపేదలు అవివాహితులుగా వుండుట.

2. పిల్లలను చక్కగా పెంచి విద్యాబుద్ధులు గరిపే విధానం.

3. దొంగమందులను కంపెనీలను వెలివేయుట, చెడ్డ అలవాట్లను నిరోధించుట.

4. క్షత్రియులు, శూద్రులు తమ ఆడపిల్లలకు యుక్త వయసువచ్చిన పిమ్మటనే పెళ్ళిచేసేటట్లు కృషి సల్పుట.

పత్రికారచనలో శైలివిషయమున తగు జాగ్రత్త వహించవలసిన అగత్యము వుందా? తప్పక వుంది. మన పత్రికారచయితలు యేపరిస్థితులలో వుంటూ తమ కృషిని సాగిస్తున్నారో, ఆ పరిస్థితులు దుస్సహమైనవి. అన్ని డిపార్టు మెంటులలోనూ చాలినంతమంది మనుషులు లేరు. వున్నవాళ్ళు బహుకొద్ది. మేనేజరూ, ఎడిటరూ ప్రొప్రయిటరూ అన్నీ వొకడే. వున్న వుద్యమాలకు సెక్రటరీ, ఉపన్యాసకుడూ వొకడే. స్కూలు మాస్టరూ, వకీలూ ఇతర ఉద్యోగ విధులు; దీనితో పుస్తక పఠనముకు పరిశీలనకు తీరిక చిక్కదు. కొంతకాలంవరకూ వారపత్రికలు హెచ్చుఉపయోగం. దేశములో ఐకమత్యము లేకపోవడం వొక ప్రధానలోపం.

సున్నితమైన హాస్యము. సరియైన పద్ధతులలో కల్పనా కథలు నవలలు. గుడ్డెద్దు చేలో పడ్డట్టు తర్జుమా చేయడం వల్ల లాభం శూన్యం. తెలుగుభాషలో పత్రికా ప్రచురణావశ్యకత ఎంతోవుంది. మాతృభాషలలో పత్రికలు, రాజకీయాలు, సాంఘికపరిస్థితులూ తెలిపేటిక మాన్యువలు వంటిది అవసరం. ఇట్టిది యింగ్లీషున లేదు.

2 మే, లక్ష్మివారం :

కాస్మపాలిటను క్లబ్బుకు వెళ్ళితిని. క్లబ్బులో మద్రాసు గ్రాడ్యుయేట్ల ఎసోసియేషనువారొక సమావేశము ఏర్పాటు చేశారు.

పాకామీద జట్లు జట్లుగా కూర్చి వారు కొంత సేపు అటూ ఇటూ పచారుచేస్తూ కాలము గడిపిరి. కాఫీ, నారింజ, ద్రాక్ష మొదలైన పానీయాలు, సోడాలు త్రాగిరి.

అనంతరం సభ – శ్రీ రంగాచారి తమ ఉపన్యాసమును చదివిరి. ధోరణి యేమీబాగులేదు. అవసరం వున్నా లేకున్నా ప్రతివాక్యమునూ నొక్కి-నొక్కి పలుకుతున్నారు. చెప్పిన అభిప్రాయములలో ప్రాముఖ్యత లేనేలేదు. ఆచరణయోగ్యతా లేదు! సభకు అధ్యక్షులు శ్రీ మణిఅయ్యరు. నాచెంత శ్రీ సుందరశాస్త్రిగారు కూర్చునివుండిరి. రంగాచారిగారు ఉపన్యసిస్తుండగా సందర్భానుసారముగా శాస్త్రిగారు విమర్శిస్తూ రిమార్కులు చేస్తూవుండిరి. ఆచారిగారు వెస్లక్ నూ ఆయన సతీమణినీ పొగడుతూ, ప్రసంగిస్తూవుండగా శాస్త్రిగారు నాతో మెల్లగా యిలా అన్నారు: “మనవాడు సబ్ జడ్జి కావాలని ప్రయత్నాలు చేస్తున్నాడు.”

ఉపన్యాసకుడు ఛాందసత్వాన్ని ఎడాపెడా విమర్శిస్తుంటే ఆయన మళ్ళీ యిలాగున వ్యాఖ్యానించారు: “అదంతా బాగానే వుంది. మరి దీనికి ప్రత్యామ్నాయంగా మన విద్యావంతులయిన యువకులు యేంచేసినట్టు! విద్య అనేది మన యువకులకు తగనిగర్వం, నిరంకుశత్వం తెచ్చిపెట్టడం లేదూ!”

ఆయనతరువాత శ్రీ బాలాజీరావుగారు ప్రసంగించారు. రావుగారి ఉపన్యాసములో సబబులకన్న నవ్వించడం హెచ్చు. సందర్భశుద్ధికంటే హాస్యం లావు. ఆ నవ్వుతాలమాటలైనా ఆయనవికావు. ఎరువు తెచ్చుకున్న మాటలు. ఏదో ఒక నెపంతో పట్టభద్రులను ఆయన దుమ్మెత్తిపోశాడు. పట్టభద్రులకు స్వయం

ప్రతిభ లేదట. విషయ సేకరణ, పఠనాసక్తి మృగ్యమట. చెన్నపురిలోవున్న పట్టభద్రులకంటె యితర పట్నాలలోవున్న పట్టభద్రులు మరీ సనసనలట! కాలేజీ చదువులు ముగిసినతరవాత యింక పుస్తకాలజోలికే పోరు; డిగ్రీ తీసుకున్నపిమ్మట చదువుకు స్వస్తి. అరవజను పుస్తకాలైనా చదవరట! సామాజిక సంస్కరణగురించి వక్త చాలాచాలా చెప్పినాడు.

ఈయన ప్రసంగానంతరం వొక డిస్ట్రిక్టు మునసబు లేచి నించున్నాడు. విదేశ భాషను అభ్యసించడం యెంత కష్టమో వివరించాడు. కాలేజీలలో పనికిరాని విషయాలనే హెచ్చుగా బోధిస్తారు. ఉదాహరణకు మాథమెటిక్సు వట్టి నిరుపయోగం. ఈయన ప్రసంగంలో సబబూ, సందర్భమూ వున్నాయికాని, ఒకంతకు తెమిలిందికాదు.

శ్రీ సుబ్రహ్మణ్యంగారు యిలాగ చెప్పారు: "స్త్రీ విద్య అంటే మీ రేమీ పట్టించుకోవడంలేదు. మనము మన కుమారుల చదువుకుమాత్రము బోలెడుడబ్బు వెచ్చిస్తున్నాము; కాని మన కుమార్తెల చదువు నిమిత్తం మనం ఖర్చుచేసేది యేమీ లేనేలేదు."

సుబ్రహ్మణ్యంగారి ప్రసంగమయినతరువాత మరి వొక ఉపన్యాసకుడు లేచాడు; పట్టభద్రులు చేసిన కృషి తనకు ఎంతో సంతృప్తికరంగా వున్నదని, ఆయన చెబుతూ "పట్ట భద్రుల కృషి ప్రశంసనీయంగా వుంది; ఇందుకు కీర్తిప్రతిష్ఠ లార్జిస్తున్న పరమేశ్వరపిళ్లై, కళ్యాణరామయ్యరు ప్రభృతులే వారి ప్రతిభయే ఉదాహరణ" అని పేర్కొన్నాడు.

అయితే ఈ సమావేశాని కొక నిర్దిష్టకార్యాచరణ కుపయుక్తమయే కార్యక్రమ మేమీ లేదు. పట్టభద్రులుకనుక వారి కొక కర్తవ్యం వుందికదా. విద్యావిషయిక సమస్యలను చర్చించడం పట్టభద్రుల ప్రప్రథమ కర్తవ్యం. నిజంగా ఆలోచిస్తే విద్యాసమస్యలపై యిప్పుడు మనకు ప్రతిభావంతమైన 'పబ్లిక్ ఒపీనియనే' లేదు. చరిత్రను యెలాగున బోధించాలి మొదలైన విషయాలపై ఎట్టి ఊహా కానరాదు. సాహిత్య కృషి సరేసరి. స్వతంత్రయోచన 'లేదు లేదు' అని చెప్పడమే కాని ఎందుకు లేదో ఎవరూ చెప్పరు.

మదరాసు నాటకరంగస్థితి సిగ్గుపడవలసిన పరిస్థితులలో వుంది.

ఇక పాఠశాలలో మాతృభాషలు అధ్వాన్నంగా వున్నవి. వస్తువిన్యాసంలోను, శైలిలోను శిల్పం అనేది హుళక్కి. ఒరిజినాల్టీ లేదు. దారిద్ర్యం. తక్కువస్థితి; ఉన్నతస్థితికి వచ్చుటకు ప్రయత్నములు అవసరం. గర్వపడుటకు కారణములే కనిపించవు. విద్యావిధానమే దుష్టము; లోపభూయిష్టము. అభిరుచి అన్నదే కలిగించడంలేదు. దీనికి నాయకత్వము వహించు వ్యక్తులు లేకపోవడం. దీనికితోడు ఇంగ్లీషుతో పోటీ.

మైక్రొస్కోపులో పొడగట్టుతున్న విప్లవం, దాని నైతిక స్వభావము.

పట్టభద్రులు సంస్థలను నెలకొల్పుకోవడంలేదు.

మహిళలకు ఇంగ్లీషువిద్యను బోధించడంలేదు.

మెట్రిక్యులేషనుకు పాఠ్యపుస్తకాలు; ఆంగ్లదేశచరిత్రను, భారతదేశ చరిత్రను బోధించడం.

మెట్రిక్యులేషను క్లాసు.

మోడరన్ ఇండియన్ హిస్టరీ.

యూరపు : ఇంగ్లీషు పీరియడు.

కళాశాలలో సాహిత్య పాఠాలను యింతకంటె మిన్నగా చక్కగా చెప్పవలెను. మాతృభాషలలో ప్రొఫెసరు షిప్పులు. మదరాసు తెలుగు.

ప్రాదేశిక విభేదాలు, వైమనస్యాలు. ఐకమత్యం అవసరం. జాతిభేదంఅనేదికూడదు. వీడు ఈజాతివాడు ఆ జాతిఅనే భావం కూడదనిది. విద్యారంగములో కృషిచేయుటకు, సేవ చేయుటకు కాంపిటీషను యేర్పరచి అర్హులకు స్థానమీయవలెను. ఇంతకంటె జీతం హెచ్చుచేయవలె. ప్రతిభావంతులను ఆహ్వానించుటకు విద్యాసంస్థలలో వారికి యింతకంటె హెచ్చుసదుపాయములు అవకాశములు కలుగచేయవలెను.

ప్రైవేటు మేనేజిమెంటుకు సంస్థలను అప్పగించడమనేది చేయరాని ఒక మహాదోషం; ఇంతకంటె హానికరమైన పని మరివొకటి లేదు. నగరాలలో వున్న పాఠశాలలు కళాశాలలు యెంత అవకతవకగా, బేసబబుగా నిర్వహింపబడుతున్నాయో వాటికి అజమాయిషీ వహించే కమిటీలు యెంత అరాచకంగా ప్రవర్తిస్తున్నాయో ఊహించలేం. కమిటీలకు వున్నదల్లా అహంకారం వొకటే. బాగుపడే విధాన మేదో వారింకా గ్రహించినట్టులేదు.

పచ్చయ్యప్ప కాలేజి ఎందు కంత వెలుగులోకి వస్తున్నదో అర్థంచేసుకోవడం సులభంకాదు.

ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులుగా వుండాలి. మహోన్నత శీలము, వ్యక్తిత్వము, గుణసంపద అవసరము. సాహిత్యాభినివేశము కలిగించాలి. ఇప్పుడు బి. ఏ., జనరలు యింగ్లీషు వట్టి అరాచకమయం.

మన విశ్వవిద్యాలయాల పరిస్థితి వేరు. ప్రాదేశిక ఇంగ్లీషు యూనివర్సిటీల తీరు వేరు. ప్రాదేశికవి ప్తీర్ణము. మెట్రోపాలిటను మనుషులే సెనేటు సభ్యులు. మిగిలినవారికి యేమీ లేదు. ఇతర నగరాలలోవున్న పరిస్థితులు సాధారణంగా యేమీ తెలియదాయెను.

యువకులు కొంతకాలం బ్రహ్మచారులుగా వుండడం అవసరం. ఉపాధ్యాయుల కళాశాలను యిప్పటికంటే మంచి పద్ధతులపై నిర్వహించాలి. ఇంగ్లీషులో పట్టభద్రుడైనంత మాత్రాన, అతను యేపనిబడితే ఆపని నెరవేర్చగలడా, ఏ విషయాన్నైనా బోధచేయగలడా, ఏపరీక్షకయినాసరే అతడు పరీక్షాధికారిగా వుండగలడా?

స్వదేశీయులకు ఒరిజినాలిటీ లేదని స్వతంత్ర యోచనాశక్తిని కనబరుచుట లేదని చాలామంది పదేపదే అంటున్నారు. అయితే నా దొక ప్రశ్న: ఈ దేశంలోవున్న ఈఉపాధ్యాయులు యేమి స్వతంత్ర యోచనాశక్తిని ప్రదర్శిస్తున్నారు? వీరికివున్న ఒరిజినాల్టీ యేమి? కేవలం టెక్స్టుబుక్కులను ఎడిటుచేసుకోవడం; మిస్టర్ థాంప్సన్ అండు కాంపొజిషను పేపర్లు తయారుచేసుకోవడం తప్పితే వీరు వెలగబెడుతున్న దేమిటో మరి!

భారతీయ విద్యార్థులకు వారు ఎడిట్ చేస్తున్న పాఠ్యపుస్తకాలపద్ధతి యేమిటో నాకేమీ బోధపడడం లేదు. అంతా

దురవగాహంగావుంది. వారు చేస్తోన్న పని యేమీలేదు. మాతృభాషలోనూ, నుడికారపు సొంపుతోను కాంపోజిషను పుస్తకాలు రచింపబడాలని మనం ఆశించడం సహజం. ఈ ఆశయం ప్రతివారికీ వుంటుంది. కాని వాటి ప్రసక్తి యిక్కడా అక్కడా ఎక్కడా కానరాదుకదా!

ఎఫ్. ఏ. క్లాసులో చెప్పే హిస్టరీసంగతి మరి చెప్ప నక్కరలేదు. భయంకరంగా కర్ణకఠోరంగా వినిపించే తప్పుల తడక యింగ్లీషుతో, అంతకంటే ఘోరమైన ఆ చెప్పేపద్ధతితో విసిగెత్తిపోయి కుర్రవాళ్ళు క్లాసులో కూచుందుకే హడలెత్తు తున్నారు.

కొందరికి తాము చెప్పే విషయమేమిటో బాగానే వచ్చును. విషయంతెలిస్తే లాభం యేముంది? దానిని చక్కగా బోధించవద్దూ? అదే వీరికి కొరత!

4 మే, శనివారం :

పాపం, ఆర్. వి. సుబ్బారావుగారి కుమారుడు ఆకస్మిక ముగా పోయినాడట! సాయంకాలం సరదాగా బీచికి వెళ్ళి యింటికి వచ్చాడు. రాత్రి అన్నం తిని పడుకున్నాడు. కాని పొద్దున్న చూసేసరికి మరి లేడు. పాపం, సుబ్బారావుగారు ఎంత దురదృష్టవంతులు!

* * *

క్లబ్బులో శ్రీ రామశాస్త్రిగారిని కలుసుకుని ఉత్తర సర్కారులలోని విద్యార్థుల ఎసోసియేషన్ గురించి మాట్లాడాను.

♦ ♦ ♦

క్లబ్బులో కూరెళ్ల సుబ్బారాయుడు కొడుకు వెంకట లింగం కనబడ్డాడు. ద్రవిడభాషాశబ్దశాస్త్రమును గురించి తను కాల్డ్వెలుగారిని అడిగితే ఆయన, నన్నుగురించి ప్రశంసా వాక్యములు చెబుతూ, నావద్దకు వెళ్లి తెలుసుకోమన్నారని చెప్పినాడు: 'అయ్యా! తమరు యిచటకు దయచేస్తే నేను రోజూ క్లబ్బుకు వస్తానని' అతనన్నాడు. ఈ చెన్నపట్ట ములోవాళ్ళు చాలా వింతమనుషులు!

[illegible]

బట్లరుదగ్గర అయిదు రూపాయలు పుచ్చుకున్నాను. యూరోపియనులనుగురించి నాటకము వ్రాసి, వారియెడల అను కంపము కలిగేటట్లు చేయవలెను. ఈ సంకరులను యింగిలీషులు పెట్టే క్షోభకు ఆ యింగిలీషులే తలవంచుకునేటట్లు నాటకము వ్రాయవలెను.

మిస్టరు జగన్నాథం, నరసింగరావు, సిద్ధాంతి, లింగన్న.

5 మే, ఆదివారం:

'నేటివ్ క్లబ్'కు వెడితిని. రాజామణిచెట్టియారుతో పాక గేమ్ ఆడాను. నెమ్మదిగా ఆడడం, పుష్, స్పిన్నూ ఇవీ అతని ఆటకు ప్రసిద్ధి తెచ్చిన రహస్యాలు. ఎదురుగుండా బంతి

వస్తున్నప్పుడు, దగ్గరపడినప్పుడు. నీ బేటు కొంచెం వెనక్కి తీసుకుని, మీదనుంచి అరబంతిని నెమ్మదిగా కొట్టాలి. వెనక్కి గిరుక్కున తిరగాలి.

* బంతి మిడిల్ పోకెట్‌కు వచ్చినప్పుడు స్పిన్ స్లో;

6 మే, సోమవారం:

నా రచన నా రూపురేఖలవలెనే వుంది.

రామమూర్తిగారివద్ద పదిరూపాయలు పుచ్చుకున్నాను. రంగాచారిగారిని కలుసుకున్నాను. ఆయన్ని హైకోర్టుకు తీసుకువెళ్ళాను. బగ్గీవాడికి పావలా యిచ్చి యింటికి పంపించివేశాను. పావలాపెట్టి పెప్సిన్ పౌడరు కొనుక్కున్నాను. జట్కావాలాకు రూపాయి యిస్తిని.

7 మే, మంగళవారం:

భాషలు యేవిధముగా మార్పుచెందుతున్నవి; దూర దూరముగావున్న ప్రదేశములలో భాషలు యేకకాలమున మారుటకున్నూ, కొన్ని కొన్ని ప్రాంతాలలో వొకేరీతిని మారుటకున్నూ, మరి కొన్నిచోట్ల యీ మారుదల వేరు వేరుగా వుండుటకున్నూ కారణ మేమయివుండును?

మాటవరసకు మూలద్రవిడభాష దక్షిణాన తమిళముగానూ, ఉత్తరాన తెలుగుగానూ ఏలాగున మారినది? తమిళభాష మూలద్రవిడభాషకు చాలా సన్నిహితముగా వున్నదనీ, అందు గొప్పసాహిత్యం కలదనీ అన్నవాడు బర్నలుదొరే అను

* బంతి ఆ విధంగా వచ్చినట్లు ఊహించుకుని కొన్ని కోణాలతో గీయబడిన వొక డయాగ్రము యిక్కడ కలదు.

కుంటాను. తమిళభాషలో గొప్ప సాహిత్యముకలదని చెప్పినంత మాత్రాన, అది అతిప్రాచీనభాష అని చెప్పడానికి వీలులేదు. అర్వాచీనసోదర సాహిత్యంకంటె ప్రాచీనసాహిత్యం పాత భాషా రూపములను, పదములను యెక్కువగా నిక్షేపించుకుంటుం దనడంలో సందేహమేమీలేదు, కాని తమిళసాహిత్యం తెలుగు సాహిత్యంకంటె అత్యంత ప్రాచీనమైనదని గట్టిగా చెప్పలేము.

భాషలు యేలాగున మారునను ప్రశ్నకు సమాధానము యీ విధంగా తేలుతోంది; కొన్ని కొన్ని ప్రదేశాలలోని ప్రజలు కొన్ని కొన్ని ధ్వనులను పలికేటపుడు వారి ఉచ్చారణాంగాలైన తాల్వాద్యవయవాలనుబట్టి భాషా పదములు మారుతూ వుంటాయి. ఇదేరీతిని ప్రజల అలవాట్లు, ఆచార వ్యవహారాలు, మతము, వారిపాటలు, సంగీతము, సాహిత్యము మొదలైనవి భాషలపై తమ ప్రభావాన్ని స్పష్టముగా నెరపుతున్నాయి. ఈ లాగునే ఇరుగుపొరుగు ప్రదేశాలలోవున్న భాషలు.

ఒక భాషాకుటుంబములో అనేకరూపాంతరిత పదములు. ఒకే జాతి భాషలో పలు రూపాంతరములు.

పచ్చయ్యప్ప కాలేజీలో అడుగుపెట్టేసరికి మాథ మెటిక్సు లెక్చరరు కనబడి "హాహాహా! ఎప్పుడు రావడం ఏమిటి కథ?" అంటూ పలకరించాడు. నిజానికి ఆయన యెవరో నాకు తెలియదు. ముక్కూ మొహమూ ఎరుగని వొక అపరిచయస్థుడు అంత కలుపుగోరుతనంగా పలకరించినపుడు మనం తికమకలలో పడతాం; ఇదొక తమాషాఅయినపరిస్థితి.

♦ ♦ ♦

మద్రాసు మ్యూజియం; ప్లేటు నవంబరు 13

సూయిలు దొరగారు తలచినట్లు రెండు దానాలుకావు; మూడు.

9 మే, లక్ష్మివారం :

రామస్వామిచెట్టి, కృష్ణస్వామిచెట్టిగార్లను 'రఫ్ పేపరు' వుంటే కావాలన్నాను.

10 మే, శుక్రవారం :

నాలుగణాలు నౌకరుకు. నాలుగణాలు బగ్గీవాడికి. అయిదురూపాయలు లిటరరీసొసైటీకి, రూపాయిన్నరబిలియర్డ్సు. ఒకరూపాయి జింజరు,సోడా. మిగిలినసొమ్ము శ్రీనివాసాచారివద్ద వుంది.

11 మే, శనివారం :

బట్లరుదగ్గర ఆరురూపాయలు తీసుకున్నాను. బ్యాంక్వెటింగుహాలుకు వెళ్లాను. టిక్కెట్లకు ఆరురూపాయ లిచ్చాను. ట్రిప్లికేను థియేటరులో నాటకప్రదర్శనం.

షేక్స్పియరు సీనులు. ప్రదర్శకులు మిస్టర్ అండ్ మిసెస్ బి. క్రాస్టన్, విల్మాక్. హాలు కిటకిటలాడుతూ వుంది. మన చెన్నపురి పెద్దలు, భారతీయులు, యువకులు, వకీళ్లు, పలువురు విద్యాధికులు ప్రదర్శనానికి హాజరయిరి.

ఫాల్‌స్టాఫ్ వేషం బాగులేదు. వుండవలసినంత పెద్దవాడుగాగాని, లావుగాగాని లేడు. వైఖరి యేదోవాకలాగవున్నది. వాచికము "వప్పగింత" వలె వున్నదితప్ప "అభినయముగా" తోచలేదు.

మర్చంటాఫ్ వెన్నిస్‌లో నటించిన సూాయిలుదొరకు పోర్షను నోటికిరాదు. టేబిల్‌మీద పుస్తకాన్ని చూసో, మరి పోర్షనుకాయితం చూసో చెప్పలేనుకాని, దానిని చదువుతూ అభినయించాడు. షైలాక్ వేషము 'ఫరవాలేదులే' అనిపించింది. కాని పోర్షియా పాత్రధారిణి విల్మాక్‌సతి 'వాహవా' అనిపించింది. అభినయం ప్రశంసనీయం, ఆమె అసలు చాలా సొగసైన మనిషి. వేషధారణము యుక్తము. అభినయం సహజముగానూ,, భాసమానముగానూ వుంది. వాచికం స్ఫుటముగానూ, గణనీయముగాను వున్నది.

ఒథెల్లో వేషం పరమదౌర్భాగ్య మనిపించింది. వికార మైన వేషధారణ. నటన పాడుపాడు! డెస్డెమోనా అంత బొత్తిగా బాగులేకపోలేదు!

మళ్లీ విల్మాక్‌సతి ఎమీలియా వేషంలో కనిపించింది. అత్యద్భుతమనిపించింది. ఎమీలియా ఆహార్యము ఎంత సొగసుగా వున్నదో వర్ణించిచెప్పడం కష్టం. దుస్తులు, అలంకరణ బాగుబాగు అనిపించినవి. విల్మాక్‌సతితప్ప యీజట్టులో చెప్పు

కొత్తగ వారెవరూ లేరు. ఆమె ఒకర్తెమాత్రమే చక్కగా నటించగలదు. మిగిలినవారి ప్రసక్తి అనవసరం.

ఇంటికి వెడుతూ వెడుతూ ఒకసారి ట్రిప్లికేను థియేటరుకుపోయి తొంగిచూశాము. హాలులోకి అడుగుపెట్టీపెట్టగనే, శ్రీ ని వా సా చా రి గా రి తో పరిచయస్థులొకరు, మమ్మల్ని మర్యాదగా పలకరించి, మొట్టమొదటి సోఫా చూపించి అక్కడ కూర్చోండని కోరినారు. శ్రీనివాసాచారి గారికి అన్ని నాటకపు జట్టులతోనూ మంచి పరిచయం కద్దు. నాటక కంపెనీలవారు యీయన పేరు చెబితేనే మన్నన చేస్తారు. మేము సొమ్మేమీ చెల్లించనక్కర్లేదని ఆ కంపెనీ మనిషి అన్నాడు. అతను కోరిన ప్రకారం ముందు వరసలో సోఫాలమీద కొంతసేపు కూచుని యింటికి వెళ్ళిపోయాము; వెళ్ళిపోతూ టికెట్టు సొమ్ము ఇచ్చివేశాం.

భవనము చాలా పాడుగా వుంది, తెరలు అంతకన్నా పాడు. వేషములూ అభినయమూ మరీ దరిద్రం. అందరి దుస్తులూ పాడుగానే వున్నవి. చెప్పుకుంటే సిగ్గు సిగ్గు! హిరణ్యాక్షుడి వేషం కన్న చెన్నపట్నంలో యే ముష్టివాడి వేషమేనా బాగుంటుంది. తెగిన తరిబీదు వుంటే ప్రహ్లాద వేషం నటించిన పిల్లవాడు పనికి రావచ్చును.

ఉత్తర దేశపు బాణీలో నటి వికారంగా పరమ రోతపుట్టేటట్టు పాడుతూ డ్యాన్సు చేసింది. ఉత్తర దేశపుపాటలకు నృత్యాలకు యిది వొక పేరడీవలె కనిపించింది. సూత్రధారుని విగ్రహం పుష్టిగావుంది. పాట కొంతవరకు నయం. గొంతుక ఫరవాలేదు. నటీ సూత్రధారుల సంభాషణ మొదట తెలుగు

పద్యాలలో కొనసాగింది. పద్యాలు భాగవతంలోనివి. పద్యాలు పాడినతరవాత వాటిఅర్థం తెలుగున వివరించి చెప్పారు. ఇంచుమించు ఇది కళ్యాణ రామయ్యరు తమిళ సంస్కృతముల కలగలుపువలె వుండెను.

ప్రస్తోద నాటక ప్రదర్శనంలోని నటుల అభినయమును ఏదైనా ఒక 'స్కెచ్'లో వర్ణించవలెను.

♦ ♦ ♦

రైల్వేస్టేషనునుంచి 'పేడ్స్' అందినవి.

♦ ♦ ♦

*ది యూరేషియను డ్రామా. ఒక గొప్ప 'సివిలియను' ఒక కొండజాతి స్త్రీని వుంచుకుంటాడు. అతనికి ఇద్దరు సంతానం. ఈ ఇద్దరూ ఇంగ్లండులో పెరిగారు. పరిస్థితుల ప్రభావంవలన తల్లీ, పిల్లలూ ఒకరికొకరు దూరమౌతారు. అతను ఆమెతో సంబంధాలను తెంచుకుంటాడు. అతను ఎక్కడవున్నాడో, అతని ఆనుపానులేమో ఆమెకు తెలియదు. ఒకముసల్మాను వర్తకుడు ఆమెకు ధనం యిస్తూవుంటాడు. ఇంటికి కావలసిన వస్తువులు తెచ్చి పడవేస్తూవుంటాడు. ఇతను మొదట బట్లరు. తర్వాత వర్తకుడైనాడు. కొంత కాలానికి ఆమె కొడుకూ కూతురూ తిరిగి వస్తారు. కొడుకుకు తన తల్లి కొండజాతిస్త్రీ అని మొదట తెలియదు. తన తండ్రి చనిపోయాడని అనుకుంటాడు. కాని అతను యిండియాకు రాగానే పరిస్థితులన్నీ అవగాహనవుతాయి. ఇంటికి వచ్చే సప్లయిలు కొన్నిరోజులనుంచి ఆగి

*"యూరేషియనులను గురించి నేనొక నాటకము వ్రాసి వారియెడల అనుకంపము కలిగేటట్లు చేయవలెను." చూ. 1895 మే నెల 4 వ తేదీ డైరీ.

పోతాయి. కూతురు పనిచేస్తూవుంటుంది. ఆమెకు చదువు వచ్చును. సప్లయిలు బంద్ అయినప్పుడు అట్టి సన్నివేశంలోనే పిల్లలిద్దరూ ఇండియా చేరినట్లు చిత్రించేదా?

ఆ యూరోపియను ఒక పిల్లను పెళ్ళాడతాడు. అతనికి పిల్లలు కలుగుతారు. దగుల్బాజీ. ఇంకొక పిల్లను ప్రేమిస్తాడు.

12 మే, ఆదివారం:

ఇండియను యాంటిక్వేరీ వాల్యూములను చాలావాటిని చదివితిని.

14 మే, మంగళవారం:

క్రిస్టియను కాలేజీలో హిస్టరీ ప్రొఫెసరు కెల్లెటుగారిని కలుసుకున్నాను. ఇద్దరం ఒక గంటకుపైగా ఎన్నోవిషయాలను ముచ్చటించుకున్నాం. కాలేజీలలో ఆంగ్లసాహిత్యాన్ని బోధించేటపుడు ఎన్ని అవకతవకలు జరుగుతున్నవో, బోధనా పద్ధతులు ఎంత లోపభూయిష్టముగావున్నవో వివరముగా చెప్పాను. విద్యాబోధన ఆలోచనలను పురిగొల్పేదిగా యెంతమాత్రం వుండడంలేదు. అభిరుచీ, విమర్శనా, అసలు లేనేలేదు.

మాతృభాషల సాహిత్యం గురించీ, దేశచరిత్ర రచనావశ్యకతను గురించీ ప్రసంగించాను. తెలుగు పాఠ్యగ్రంథాల నిర్ణయంలోనూ, పరీక్షాధికారుల నియామకంలోనూ జరుగుతున్న పాక్షికత్వమును గురించి నొక్కి వక్కాణించాను. విశ్వవిద్యాలయ బోధనా పద్ధతుల దోషాలు దేశమంతటా విస్తరిస్తున్నాయి. మదరాసు తెలుగు. రామానుజాచారి, మాధవరావు, వెంకటరాయశాస్త్రి, శ్రీరామశాస్త్రిగార్లను

గురించి కెల్లెటుతో ముచ్చటించాను. అప్పుడు కెల్లెటు యిలా అన్నాడు: "చాలా ఆలస్యమైపోయింది. ఈ ఏడు వ్యవధిలేదు. మీాదటికి ఏదైనా తప్పకుండా ఏర్పాటు చేస్తాను" ఇందుకు నేనిలా సమాధానమిచ్చాను. "నాకైతే అట్టి పదవి అక్కరలేదు. ఆలాగున నేను కాలము వ్యర్థము చేయజాలను. కాని మా ప్రాంతమువారిని కూడా, తగిన పండితులను, అట్టి పదవులకు నియమించవలెను. కారణమేమంటే యిప్పుడు పరీక్షా పత్రములనుబట్టి పాఠ్యక్రమము నిర్ధారిత మవుతున్నది కనుక."

చరిత్రను బోధించే పద్ధతులను గురించి సంభాషణ జరిగింది.

"పోలికలూ, భేదములూ నిరూపిస్తూ గ్రీసు రోము రాజ్యముల చరిత్ర మీారెందుకు వ్రాయరాద"ని కెల్లెటుగారు నన్ను ప్రశ్నించారు.

"అబ్బో! అది నా శక్తికిమించిన పని."

"కాదు కాదు, మీారే వ్రాయగలరు!"

He asked "Why should you not write a history of Rome & Greece, on the comparative method." I said that was beyond my powers. He said "Oh! you can". We talked a world of things.


మేమిద్దరమూ అనేక విషయాలను గురించి ప్రసంగించుకున్నాము. నా వంట్లో బాగుండలేదు. లేకపోతే ఆ సంభాషణ అంతా వ్రాసేవాడినే మరి!

14 మే మొదలు 24 వ తేదీ వరకు :

పది పదకొండు రోజులనుంచి వొంట్లో యేమీ బాగు లేదు. "బ్రోంకైటిస్" వ్యాధి పట్టుకుని పీడించసాగింది. బాధ లావు. రోగంతోటే సరిపోయింది. పనేమీ కొనసాగింది కాదు. చేసిన మంచి కార్యం వొకటే. మహారాజావారి పుస్తకాలు తయారుచేసి నెక్స్టు అంక్‌కో వారు పంపించివేశారు. (శ్రీ) వెంకన్నగారు నన్ను చూడ్డానికి వచ్చారు. అతనంటే నాకు చాలా అభిమానం. మంచి సాహిత్యాభిరుచి వున్న కొద్దిమంది యువకులలో ఇతను వొకడు; మన దేశంలో ఇలాంటి యువకులు అరుదు.

28 మే, మంగళవారం :

బెల్టు కొలతలు, బేబుతో 32 అంగుళముల కైవారం గల, అంతకు కొంచెం తక్కువగా వుంటే మరి వకటి గూడా తెస్తే బాగా వుంటుంది.



కంచు అమాం దస్తా. బి. సూర్యనారాయణరావు గారి కోసం సంస్కృత గ్రంథాలు, నోట్సు; శంకరనారాయణ డిక్షనరీ, లెదరు బెల్టు; ఒక జత ముత్తైపు గుండీలు. జాకెట్టు క్లాత్సు; ఫేన్సీ వస్తువులు; అలారం టైంపీసు.

3 జూన్, సోమవారం :

డాక్టరు కీల్హారనుగారికు ఉత్తరం వ్రాశాను. గరిసెలూరు శాసనం గురించి శ్రీ సుబ్రహ్మణ్యం, విజయరాఘవాచారి, సీతారామయ్య ప్రభృతులకు లేఖలు వ్రాశాను.

4 జూన్, మంగళవారం :

డాక్టరు భండార్కరుకూ, డాక్టరు ఫ్లీటుగారికూ కూడా ఉత్తరాలు రాశాను.

5 జూన్, బుధవారం :

రాచూరు.

'వెస్టు అండుకో' కు వెళ్ళాను. "రైప్పు విరగదీసి మీకెప్పుడుకావలెనో తెల్పితే అప్పుడు పంపించివేస్తాము. మా సామాను మేము వుంచుకుంటాము" అన్నాడు మిష్టరు బిషప్పు.

"కొంపదీసి విరగదీయడం మాత్రం వొద్దు. మొత్తం రైప్పంతటికీ సొమ్ము యిచ్చుకోమంటాను."

"క్షేమూ మిగతా సామాను మావేకదండీ ; అలాంటపుడు అంతా యెలా యిచ్చేస్తాం"

"పోనీ ఓపని చేయండి. క్షేమూ, మిగతా సామానూ, కంపెనీ రైప్పు అన్నీ మా రాజావారికి ఖరీదుకివ్వండి; అలాచేస్తే నాకెంతో సంతోషం."

"ఫస్టుపాస్టులోని రైప్పూ, మార్జినలు నోట్సులో వాడే రైప్పూ అన్నీ మావేకదండీ."

"అవసీంచి! అయితేనేం? మా కోరికను మీరు మన్నించవచ్చుకదా! ఆయనకి కావాలంటే కొత్త సరుకే కొనుక్కోవచ్చును."

"అవునవును. సరే; అయితే అంతటికీ మేం ధరకట్టాలే!"

"సరే; కడితేకట్టండి, పోనీ!"

"కానీ, ఫ్రేముల్లోవున్న యీటైప్సు మహారాజావారేం చేసుకుంటారు?"

"ఏమో; అవన్నీ నాకేం తెల్సు; బహుశా స్టెనోటైపింగుకు వీటిని వాడుకుంటారేమో! అలాఅయితే మాత్రం మీ ఆఫీసులోనే చేయిస్తాంలెండి"

"ఆయన తమపుస్తకాన్ని అక్కడే అచ్చొత్తించుకుంటారు కాబోలు!"

"బహుశా అందుక్కాదేమో లెండి; అక్కడ మంచి పనివాళ్ళు లేరు. బుక్కు చాలా విలువైనది. అందువల్ల యిక్కడ కంటె అక్కడే స్టెనోటైపు చేయించాలని అనుకుంటున్నారేమో మరి! ఇక్కడ కంటె అక్కడ సులువు హెచ్చు. యిక్కడే మిషను అమిరిస్తే జాగా అంతా ఆక్రమిస్తుంది."

"సరేలెండి. మరి ఎల్లోక్లాత్ కావాలంటిరే! దాన్సంగతేమిటి?"

"మీరు సప్లయిచేస్తే బహుసంతోషం!"

"అది యింకా ఎప్పటికొస్తుందో తెలియకుండావుంది. ఇప్పట్లో బహుశా రాదేమోనండీ!"

"అయితే నేటివ్ ఫర్మ్సులో అడిగి చూస్తాను"

"అబ్బే! వాళ్ళదగ్గిరుండను. అయితేనేం, అడిగిచూడండి. మేమెప్పుడూ వాకబు చేయలేదుమరి"

"ఆఁ అదే మరి! పసుపురంగు క్లాతుమీద నీలాక్షరాలు సొగసుగా వుంటాయి కదాని!"

♦ ♦ ♦

అబ్బయ్యశాస్త్రి వొంట్లో యెలావుందో డాక్టర్నడిగాను. చిరంజీవికీ, నరసింగరావు పంతులుగారికీ ఉత్తరాలు రాశాను.

వేదాంతసారం	...	...	2— 0—0
ది ఫోక్ సాంగ్స్	...	...	2— 0—0
ఒరిస్సా అండ్ టెంపుల్ ఆఫ్ జగన్నాధ			0—12—0
గ్రీక్ అండ్ గోథే	...	...	3— 0—0

♦ ♦ ♦

డాక్టరు హుల్ష్‌దొర వ్రాసిన ఉత్తరానికి నకలు :

ఉదకమండలం, 5, జూన్ 1895.

డియర్ మిస్టర్ అప్పారావు

ఈ నెల 3 వ తేదీన మీరు వ్రాసిన ఉత్తరం నిన్ననే నాకు అందింది. వచ్చేనెలలో మీరెక్కడ వుండేదీ, దయవుంచి మీ చిరునామా తెలపండి. బెంగుళూరుకు తిరిగి వచ్చాక, ఆ మూడుశాసనాలను చూసి (ఉదయగిరివి రెండూ, పాలకొల్లు శాసనము వొకటీ) ప్రచురణ నిమిత్తం మీకు వాటిని తప్పక పంపిస్తాను.

మీ లేఖలో పేర్కొన్న కృష్ణరాయ కాలపు రెండు శాసనములను ప్రచురించడానికి ప్రోత్సాహకు కీల్హారను తలపెడు

తున్నట్లు కనబడదు. ఈ శాసనాలలో ప్రస్తావింపబడిన విషయం గురించి మీ రొక మెమోరాండము పంపించినట్లయితే దానిని నేను సంతోషపూర్వకంగా డాక్టరు కీల్హారను ముందు పెడతాను. అప్పుడు ఆయన శాసనాలను ప్రచురించడానికై ఉద్దేశ పడవచ్చును; అలా కానిపక్షంలో మీరు వాటిని ఎడిట్ చేసి ప్రచురించడానికై వాటిని వెంటనే మీకు పంపించివేయగలను.

మీరన్నట్లు నాసిక్ పేపరు మేమే సప్లయి చేయాలంటే అది నాకెంతో శ్రమ. లోకలు ఏజంట్ల దగ్గర మీ కాపేపరు దొరకడం కష్టం కాదనుకుంటాను.

10 జూను, సోమవారం :

బజారులో కొనవల్సిన వస్తువులు: సగ్గుబియ్యం, పటిక-పంచదార, పాతబియ్యం, నెయ్యి, పేపబెత్తుపెట్టె, అగ్గిపెట్టెలు, స్టౌమీది సన్నపాటి గిన్నెలు రెండు, లాంతరు.

16 జూన్, ఆదివారం :

రామస్వామిచెట్టి	57—12—0
నా సాదకు	49—14—0
వెస్ట్సు అండ్ కో బైండరుకు	2—10—0
వంటలక్కకు	10— 0—0
పాలవాడికి	6— 0—0
పెరుగు	1— 0—0
నారాయణమూర్తి మందులబిల్లు	6— 0—0
డాక్టరు బిల్లు	90— 0—0
మందులు	40— 0—0
పుస్తకాలు	31— 0—0

కొనవల్సిన సామాను:

బొత్తాయిలు
నెక్ టై
పొత్తికడుపుపై కట్టుకునే బెల్టు

19 జూన్, బుధవారం

మబ్బుల వాతావరణం మనోహరంగావుంది. ఇంతకు ముందు చలిగాలి రివ్వున వేసుకొచ్చేది.

20 జూన్, గురువారం

ఈ రోజు ఉదయానే బెజవాడ చేరుకున్నాను. ఇక్కడ విజయనగరం రాజకుటుంబానికి చెందిన భోగట్టా కావలసినంత. "శ్రీకృష్ణవిజయం" రచించిన రాజకవి అత్యంత ఆత్మీయతతో వర్ణించిన యింద్రకీలాద్రి చేరువనవున్న బెజవాడ యెంత మనోహర నగరం! ఆ కొసనున్న కృష్ణాబ్రిడ్జినుంచి ఎర్రని కెరటాలతో ప్రవాహం; నగరంచుట్టూ వెనకభాగాన 'సెట్టింగ్' వేసినట్లు ఎత్తయిన కొండలు; లోయలో ప్రతిష్ఠింపబడిన కనకదుర్గగుడి, రైల్వేస్టేషను చెంతవున్న పర్వతంమీాద కట్టబడిన బంగాళాలు; చూడ్డానికి నగరశోభయెంత ఆహ్లాదంగావుంది! కనుల వేడుక!

¹ పాటిబండ వెంకట రమణయ్య పంతులుగారియింట నా బస. ఆయనకి నేను అతిథిని. కొండలకు దూరంగా గవర్నరుపేటలో వారియిల్లు; వాసయోగ్యంగానూ, హాయిగానూ, ఎంతో

¹ ప్రస్తుతం విజయవాడలో న్యాయవాదిగావున్న శ్రీ పాటిబండ అప్పారావుగారి తండ్రి.

సదుపాయంగానూ వుందీ యిల్లు. సంతులుగారు సంస్కృత పండితులు. తరువాత తరువాత యింగ్లీషు నేర్చుకున్నారు. ఇప్పుడీవూళ్ళో యీయన పెద్దింగు ప్లీడరు. ఇల్లు సొగసుగా యిమ్ముగా వుంది. గాలీ, వెలుతురూ పుష్కలం. గదులు చాలినన్ని. ఇన్ని గదులున్నా భవంతి అందమేమీ చెడగొట్ట లేదు. భవనం యెక్కచ్చిగా వుంది.

నే నున్న గది కిటికీ తెరచిచూస్తే యెదురుగా బందరు కాలువ, కాలువ వెనుక వరసలు వరసలుగా చెట్లూ కనిపిస్తవి. ఇటువంటి యిల్లు వొకటి కట్టుకొని అందులో కాపురముండాలని నా కోరిక. ఏడాదికీ కొన్ని నెలలైనా యిటువంటి యింటిలో విశ్రాంతి తీసుకోవాలని మనసు. తీరిక అనేది చిక్కే కాలం నా చెప్పుచేతల్లోవుంటే యిటువంటి యింట్లో 'రిటైరు' అవుతాను. రిటైరు కావడం! విశ్రాంతి! ఎంత వింతైనమాట! ఎన్నడూ విననిమాట! ఈమాట కేమన్నా అర్థంవున్నదా! శరీర దారుఢ్యం పూర్తిగా సడలిన నావంటివాడికి యిది ఎంత వింత మాట! ఆరోగ్యం బాగున్నా లేక పోయినా బలవంతుడైనా దుర్బలుడైనా మనిషి ఎలాగూ రిటైరుఅవుతాడు. అప్పుడు ప్రశాంతమైన ఒక యింట్లో గడిపే అవకాశం వుంది. కాని ఎప్పుడూ యేదోఆలోచిస్తూ యేదోరాస్తూవుండే నాకు 'విశ్రాంతి' అనేది కల్ల. నా మెదడు ఎప్పుడూ పనిచేస్తూనే వుంటుంది. ఈ కృషినుంచి నేను తప్పించుకుంటాననేది పొసగనిమాట. డాక్టర్లు ఎన్నిసలహాలిస్తేనేమి! వాటిదారి వాటిదీ; దీనిదారి దీనిదీ! శ్రమ అధికమై, ఇక నేనేపనీ చేయజాలని పరిస్థితే కలిగినప్పుడు,

నాకిక బతుకుమీద ఆశేలేదు. పనిచేయలేకపోవడమనేది ఒక విషమపరిస్థితి.

కాని నా కిప్పుడొక విషయం జ్ఞాపకానకు వస్తున్నది. ముసలికాలంలో దేవరాపల్లిలోనో, లేదా మరో గ్రామంలోనో, 'రిటైరు' కావాలని నా కొకప్పుడు వుండేది. ఏడాదికీ నాలుగయిదు నెలలో పోనీ ఏడాదల్లానో అక్కడే కాలం వెళ్ళబుచ్చాలని ఒకనాటి నా తలంపు.

♦ ♦ ♦

అన్నన్న ! భూపతిరాజు కత్తెర్లనీ దీపపుమసినీ నా పెట్టెలో పెట్టడం మర్చిపోయాడే ! శాసనప్రు పలకల్ని కాపీ చేసుకుందుకు అవసరమైన వస్తువుల్ని వేటినీ మరవకుండా అన్నీ 'నా పెట్టెలో పెట్టండి బాబూ' అని అందరికీ మరీ మరీ చెప్పానాయె ! అవీ యివీ అన్నీ కలిపి విజయనగరం 'పేక్' చేసి పంపించేశాడు !

రామస్వామిచెట్టి కంపెనీలో వున్న గణపతిచెట్టి నాకు స్నేహితుడు. దుకాణదారుడికీ, బేరగాడికీ వున్న పరిచయం వంటిదికాక మా యిద్దరికీ మంచి స్నేహమే వుంది. మద్రాసులో నే నున్నన్నాళ్ళూ నాతో యెంతో యిష్టాపత్తుగా వున్నాడు. ఏ వస్తువడిగినా సప్లయిచేసేవాడు. రైలుకొచ్చి దిగబెట్టేడు. సామానూ అవీ కట్టుదిట్టంగా పంపించాడు. అతనే స్టేషనుకు రాకపోతే, యిబ్బందికలిగేది. రైలు తప్పిపోను ! అతని ఫర్మ రాణింపులోకి రావాలని నా కోరిక. పట్టణంలో అందరి అభిమానాన్ని సంపాదించుకోవాలి. యూరోపియను ఫర్ముని దీనిముందు మందులోకి రాకుండాపోవాలి. ప్రింటింగులో

వాటిని యిప్పటికే వెనక్కి తోసేశాడు. పాయింటుపైపులో ఒక బుక్కు అచ్చువేయాలని గవర్నమెంటు సూపరెండెంటు ఊళ్లోని అన్ని ప్రెస్సులకూ వెళ్ళాడు. మద్రాసులో అన్ని అచ్చాఫీసులకు ఆబుక్కు పంపించిచూశాడు. స్పెసిమను కాపీలను అచ్చు ఆఫీసులన్నీ తయారుచేసి గవర్నమెంటుకు పంపించాయి. కాని అన్నింట్లోకీ ఇతని ప్రింటింగే కుదురుగా వున్నదని ఎంచుబడి చేశారు. అయితే, రామస్వామిచెట్టి షాపు చూసీచూడగానే కొట్టవచ్చినట్టు డాబుగా కనిపించదు.

చెట్టిది గౌరవమర్యాదలున్న కుటుంబం. పెద్దింటివాడు. తగు మనిషి. బాగా పైసా, పరకా వున్నవాళ్ళే. వాళ్ళ పిన తండ్రి మదరాసులో షాపు పెట్టాడు. ఇదే చెన్నపట్నానికి మొట్ట మొదటి "నేటివుషాపు".

గణపతిచెట్టికీ, నాకూ పరిచయం ఎలా కలిగిందో! ఆఁ! శ్రీనివాసాచారిగారు నాకాయన్ని ఎరుకపరిచారు.

* * *

బెజవాడ ఒకప్పుడు దేశానికి రాజధానిగా వుండేది. చెప్పుకోతగ్గ నగరంగానే వుండేదనుకోవచ్చును. సైనిక ప్రాధాన్యత దృష్ట్యా దీనికి ప్రాముఖ్యతవుంది. ఇక్కడ చాలా సైనిక బలము వుండేదని కృష్ణామాన్యయలులో పేర్కొనబడింది. కృష్ణరాయలు పూర్వ దిగ్విజయయాత్రకు విచ్చేస్తూ బెజవాడలో కొన్ని దినములు వున్నాడు. ఆముక్తమాల్యద: "విజయవాటిం" గొన్ని దినంబులుండి. "వాటి"ని మాధవవర్మ సంస్థాపించాడు. బెజవాడలో "పూసపాటివారికోట" అని

పిలువబడే వొక ప్రదేశమున్నది. ఇప్పు డీ జాగాలో యిళ్ళు కట్టబడ్డవి.

3 జూలై, ఆదివారం :

అమ్మయ్యో! ఎంతకాలానకు యిల్లు చేరుకున్నాను! లోకలురికార్డులను యెత్తివ్రాసుకున్న నా బుక్కు మా వాళ్ళ నిర్లక్ష్యంవల్ల పోయింది. నెలలతరబడి చేసిన యింత కృషీ, శ్రమా బూడిదలోపోసిన పన్నీరు. రాజమండ్రీలో వొకరోజు ఆగాను. వివిధ కాంపౌండులలోవున్న అనేక శాసనపుపలకలను పరిశీలించాను. శాసనపుపలకలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దిక్కూమొక్కూ లేక పడివున్నాయి. వీటినిచూసే నాథుడే లేడు.

I lost my manuscript book of inscriptions with the Local Records. So the labour of months is gone. I stopped for a day at Rajahmundry. Saw some inscribed slabs in various compounds. Proper care is not taken of them.

రాజమండ్రీ నుంచి పిఠాపురంవచ్చి అక్కడో రాత్రి వున్నాను. *మా మేనత్తగారి కుటుంబపరిస్థితులేమీ బాగు లేవు. ఆవిడ పెనిమిటి రోగిష్టి. ప్రథమకోపం; చీటికీమాటికీ రుసరుసలు.

* మేనత్తపేరు : తుమ్మలపల్లి లక్ష్మాయమ్మగారు; భర్త వెంకటరత్నంగారు. కొంతకాలం ఈయన పిఠాపురం ఎస్టేటు తాణేదారు.

మనిషికి ఎంతిస్తే అంత. శతమొండి. ఆవిడ పెద్దకొడుకు తెలివైనవాడే. ఇంటిగొడవలు ఘోరంగా వున్నాయి. సంసారంలో సుఖంలేదు. మా మావను నా వెంట తీసుకువెళ్ళిపోవచ్చాను. ఇరవై రూపాయలు చేతిలోపెట్టి యింటికి పంపించివేశాను. అతనికి భద్రాచలం వెళ్ళిపోయి మడిదున్నుకు బతకాలని వుంది.

*　　　*　　　*

నిన్నటి సాయంకాలం మహారాజావారు యితరుల మనస్సుకు నొప్పి కలిగించకుండా వుండడముగురించిన్నీ, ఆగ్రహమును అదుపులో పెట్టుకోవడము గురించిన్నీ మాతో ముచ్చటించిరి. దీనికి సందర్భము యిలాగున కలిగింది. మొన్నటిరోజున పిల్లవాళ్ళను మహారాజావారి యెదుట పరీక్షిస్తూ లక్ష్మాజీ పంతులుగారు "నో ఎసీ" అనే పదబంధం ప్రయోగించినారట. వెంటనే తన మామూలుధోరణిలో 'శర్మ' ఆయనమీద విరుచుకుపడి "అది ఆంగ్లములో దుష్ప్రయోగము"ని మందలించెనట. అదీ పిల్లవాళ్ళయెదట! నేను అప్పుడు లేనుగాని, తరవాత తెలిసింది. రామమూర్తి పంతులు, సుందరరావు పంతులూ శర్మగారితోపాటు నవ్వుతెత్తినారట. తాను యింటికి వచ్చేముందు, లక్ష్మాజీపంతులుకు క్షమార్పణ చెప్పుకొంటినని సుందరరావుపంతులు నాతో చెప్పిరి. కాగా నాటి ఉదంతమును గురించి రాజావారు యిలా అన్నారు: "నాతో వుండేవారంతా తమ ఆగ్రహమును అదుపులో వుంచుకోవలెనని నా కోరిక. మనిషి అనుకునేవాడల్లా యిది అభ్యసించతగ్గది. ఇతరుల మనసుకు నొప్పి కలిగించకుండా వుండేందుకు ప్రతిమనిషీ యెంత జాగ్రత్త వహించవలెనో అంత జాగ్రత్తనూ వహించి మసలు

కోవలెను. మనమనే ప్రతివారికీ యేదో వొక యిబ్బంది వుంటూనే వుండి; సంసార తాపత్రయాలో, లేక ఉద్యోగంలో కలుగుతున్న చికాకులో ఏవో అందర్నీ బాధిస్తూనే వున్నాయి. ఈ చికాకులకు తోడు మరికొన్ని లేని పోని బెడదలను కొని తెచ్చుకోవడమేల? ఉన్న చికాకులు మనిషికి యెలాగూ తప్పడంలేదు. అందులోనూ కుటుంబభార మంతా మీదపడ్డ వొక మనిషిని మరీ చికాకుపరచడం దేనికి? అసలే పుట్టెడు కష్టాలలో కుమిలిపోతున్న వొకరి హృదయాన్నీ, మనసునూ మనమేల గాయపరచవలెను? యెవరివల్లనైనా లోపమేవుంటే, కష్టంకలిగితే, తప్పువుంటే మనం వారిమొహాన యెదటనే పుల్ల విరిచి పొయ్యిలో పెట్టినట్లు మాటలనగూడదు. సమయాసమయములు, సవ్యాపసవ్యములూ వున్నవి. తప్పును మృదువుగానూ, మనస్సును నొప్పించకుండానూ చెప్పుటకు వీలున్నది.”

ఈ సందర్భమును పురస్కరించుకొని రాజావారొక ముచ్చట చెప్పారు. చాలా యేళ్ళక్రితం తాము విద్యా వ్యాసంగము చేస్తుండగా తమయెదట వారి నాయనగారు కూర్చొనిరట. నాయనగారియెదట అంతసేపు ఆలాగున కూర్చొనడంవల్ల శరీరము చెమటలుపోసి మనసుకు చికాకు వేసిందట; అప్పుడు మహారాజావారు లేటు సుందర్రావుపంతులు గారితో ‘నాన్నగారి యెదట కూచోడం కష్టంగా వుందని’ రట; ఈ మాటవిని సుందర్రావు పంతులుగారు మందహాసంచేస్తూ, “గొప్పతనముయెదట కూచోవడం సుఖంగావుండదు!” అన్నారట.

మహారాజావారు మరివొక ముచ్చటను ప్రస్తావించారు. ఒక యూరోపియను, ఆయనపేరు నేనూ మరిచాను, మహారాజావారి నాయనగారితో తానొకప్పుడు వొక నౌకరుమీద ఎంతో క్రోధము వహించితినని తెలియచేశాడట. ఆ నౌకరు ఎన్నిసార్లుచెప్పినా తన దుష్ప్రవర్తన మానకుండెననీ, అతని నడవడిని యిక సహించలేకపోతిననీ యూరపియను రాజావారికి చెప్పెను; నౌఖరును చంపుదామన్నంత కోపం యూరపియనుకు కలిగింది. చంపుదామనే అనుకున్నాడు. కాని, కొంచెం తమాయించుకొని అతన్ని చంపే ప్రయత్నం మానుకున్నాడు. కాని ఆ యూరోపియను, యింత పెద్దమనిషీ చరచరా తన పడక గదిలోనికి వెళ్ళి తాడుతో చితుకబాదెనట. తనకోపం చల్లారేవరకూ ఆలాగున ఛళ్ళుఛళ్ళున కొడుతూనే వుండెను. రాత్రి భోజనం వేళకు అతనికోపం చల్లారినది. ఇదివిని మిష్టర్ అండవ్‌వుడ్‌తో యిలాగున అనెను: "అంత కోపంగా పడక గదిలోనికిపోయి ఎందుకు ప్రవర్తించవలసి వచ్చింది? సత్ప్రవర్తనంటే ఏమిటో తెలియదు; కనుక మనుష్యులు దుష్ప్రవర్తన కలవాటు పడిపోతారు. దుష్ప్రవర్తనమేతప్ప వారికింకొకటి వున్నదనే విషయమే తెలియదు. ఇవన్నీ కేవలం అజ్ఞానంవలన పుడుతూవుంటవి." దీనికి దొర సమాధానం చెబుతూ "నిజమే; కోపగించుకోవడం, రోషంతో చిందులు తొక్కడం మంచిపనికాదని నాకూ తెలుసును. క్రోధ మనేది మనిషిని భూతంవలె వెంటాడుతూ, మనఃక్లేశాలను కలిగిస్తుంది. కాని యేమి చేయను? ఇట్టే చిర్రుబుర్రు లాడడం, కోపంతో రెచ్చిపోవడం నా స్వభావమాయె!" అన్నాడట.

౭ జూలై, శుక్రవారం :

రేపు శాకుంతలనాటక ప్రదర్శనానికి తప్పక వెళ్ళి కల్యాణ రామయ్యాసు, బాలామణి జట్టులకూ, రెండింటిగల తారతమ్యాములను తైవారువేసి పరిశీలనగా చూడాలి.

♦ ♦ ♦

గత కొన్ని దినములనుంచి రాజావారు అదే దీక్షగా లెక్కలేనన్ని వ్యాకరణములు తిరగవేసి "నో ఎనీ" అనే ప్రయోగం తప్పా, అయితే యెందువలన తప్పు అనే సంగతి పరిశీలిస్తున్నారు. మేముకూడా ప్రమాణగ్రంథములను తిరగ వేస్తున్నాము.

ఈరోజున రాజావారు అప్రయత్నంగా తోచినట్టు 'న్యూమన్' లో గాని, 'ఫ్రూడ్' లో గాని యిట్టి ప్రయోగం దొరకవచ్చునని అన్నారు. సూర్యనారాయణ పంతులు 'న్యూమన్ చరిత్రోపన్యాసములు' మొదటి వాల్యూము పదిపేజీలు అలా తిరగవేస్తూ వెళ్ళేసరికి, వింత! "హ్వెదర్ ఆర్ నోఎనీ" అనే ప్రయోగం కంటపడ్డది. అక్కడికి వివాదము ఫైసలయిపోయింది. దీనిమీదట మహా రాజావారు అన్నారుకదా: "ఇదివరకొకసారి కొన్నేళ్ళక్రితం యిలాగునే నాకొక సందేహము కలిగింది. అదిమా పూర్వీకులకు 'మహామండలేశ్వర' అనే బిరుదుకలదా, లేదా అని. పాపం, సంజీవరావుపంతులుగారు, అంత ముసలివారైనప్పటికీ కూడా బహుఓపికతో యీ విషయం పరిశీలించి సందేహ నివృత్తిచేశారు. మహామండలేశ్వర అనే బిరుదకల మా పూర్వీకులలో వొకరు జారీచేసిన ఫర్మానాలను వారు నాకు

చూపించారు. నేను కీసెర్చిసలిపి 'ట్రీట్రీక్' వ్రాసితిని. మనము మన తప్పులను సరిదిద్దుకోగలము. తప్పుల తడకలతో వున్న ప్రకటనలను సరిచేసుకోగలము.

మా నాయనగారొకసారి మా వంశీయులకు, కుటుంబీకులకు 'మహామండలేశ్వర; సుబదార్' అనే బిరుదులు కలవని క్లెయిము చేసిరి. మా నాయనగారి క్లెయిమునకు యెట్టి ఆధారము లేదని, యివి గాలి కబుర్లని నేను సంశయించాను. వివాదగ్రస్తమైన తన ప్రకటనలను చనిపోయిన ఒక మనిషి ధ్రువపరచుకోజాలడుకదా! ఈ విషయములో మా నాయనగారి మాట నిజము కావచ్చును; వారిమాట గౌరవించవలెను.

సంజీవరావుగారు దాఖలా చూపించిన పత్రం 'మహామండలేశ్వర' బిరుదును ధ్రువపరుస్తున్నది. కాని సుబదార్ అనే బిరుదుమాట; మొన్న మొన్న అప్పారావు పంతులు 'సుబదార్' బిరుదును ధృవపరచే ఒక గ్రంథమును తెచ్చి నాకు చూపించినారు.

ఇపుడు శ్రీ సూర్యనారాయణపంతులు, వారినాన్నగారికి తగిన కుమారులవలె, దీక్షతో వెదికి యీ 'నో ఎనీ' ప్రయోగాన్ని ప్రామాణికంగా చూపించారు. ఈ ప్రయోగంవల్ల అసలుప్రశ్న తేలిపోయింది. 'న్యూమన్' ప్రామాణికుడు కాడనలేము. ఆయన యెన్నికగన్న రచయిత. ఒకానొక ప్రయోగము సాధువా, అసాధువా అనే విషయంపై నాకున్నూ, రామానుజాచారిగారికిన్నీ వొకప్పుడు మతభేదం కలిగింది. ఈ ప్రయోగమునుగురించిన శంక అయిదుసంవత్సరాలవరకూ నా మనసులో వుంది. తుదకు సాధువా అసాధువా అని శంకి

స్తున్న యీ ప్రయోగం నాకు 'న్యూమన్' లో దొరికి నిర్ధారణ అయింది. మనం ఈవేళ 'నో ఎనీ' అనే ప్రయోగం కనుగొనుట యేదో మహాత్కార్యమనిగాని, ఈ చర్చకు అవ కాశ మిచ్చిన సంఘటననుబట్టి యుత్కర్ష పొందదగినదనిగాని నే ననుకోను. 'నో ఎనీ' ప్రయోగము సాధువుకాదని చెప్ప డానకు నా కేమీ అభ్యంతరంలేదు. తన కొక విషయము సరియైనదని స్పష్టంగా తెలిసి నిశ్చయజ్ఞానం కలిగినపుడు, యితరు లా విషయంలో పొరపడుతున్నారని దృఢముగా తెలసి నపుడు, అప్పుడే నిజంగా ఓరిమి వహించాలి. ఇతరులు పొరబడు తున్నారని మనకు తెలుస్తున్నకొద్దీ మనము శాంతము వహించ వలె. ప్రాజ్ఞుల మనసులకు నొప్పి కలిగించకూడదు. అందు లోనూ లక్ష్మీజీపంతులువంటి వయోవృద్ధులను 'పొరబడిరని' చటుక్కున బొత్తిగా ఆక్షేపించరాదు. మన మనసులోని మాటలను నాజూకుగా, మృదువుగా యేమీ కోపించకుండా నెమ్మదిగా చెప్పవచ్చును.

పాపం, లక్ష్మీజీపంతులు అష్టకష్టాలూ పడి, కాలము మళ్ళిన వృద్ధులు. అనుభవములో పండిపోయిన యోధులు. వాదించేటపుడు ఆయన కోపములోనే మాటాడివుండవచ్చును. వీరత్వముగానే పలికివుండవచ్చును. అయితేనేమి, వారికన్న చిన్నవారు ఆయనపట్ల గౌరవముతో మసలుకోవలెను. వారి పలుకులు సహించవలెను. వారి మనస్సు సంతోషపెట్టవలెను. లోపములు చూపుటకు చక్కని మార్గములున్నవి. సాధువుగా చెప్పుటకు వీలున్నది. నేను చెప్పినదే సబబని నిష్కర్షగా, విధి వాక్యముగా అననక్కరలేదు. శర్మవంటి ప్రజ్ఞావంతులకు తాము

యెంత పెద్దవారైతే అంతగాక, గురుసుగా యితరుల నేరసులను ఎంచవలసిన అవసరం కనబడదు."

ఈ సందర్భములో మహారాజానా రోక ఆర్చి బిషప్పు వృత్తాంతాన్ని వివరించారు. మతముమీద మిల్లుదొర వ్రాసిన మూడువ్యాసాలను రాజావారు చదువుకుంటూ వుండగా, కొన్ని ధర్మసందేహాలు కలిగాయట! కాళీబాబు తన శంకలను తీర్చ గలడేమో అని ఆయనను అడిగితే "యిలాంటి శంకలను నే నేమీ ఖాతరుచేయను; హాయిగా యింత తిని పడివుండక నా కెందు కీజెడద. రామరాజు పొద్దున్నే పాలూ, నెన్నా పట్టుకొస్తాడు. గుమ్మపాలు కులాసాగా తాగి, ఆనందగా తిరుగుతాను. ఇంత చదువూ చదివి రామరాజునీ, బట్లరుముండాకొడుకునీ అదమా యించుకోలేరు మీరు. చదువులూ, చట్టుబండలూను; ఎప్పుడూ ఏదో సందేహమే. ఏదో ధర్మశాస్త్ర చర్చే. నాకు మీ అంత చదువురాలేదని దిగులులేదు. రేపట్నుంచీ నా క్కావలసింది పొద్దుగులో పాలు; వేరే మరగబెట్టుకొని రామరాజూ, నేనూ పుచ్చుకుంటాం. బాగా అనుభవించడం యెలాగునో మాకు తెలుసును; మీరు మాత్రం యేదో శంకలు, ధర్మసందేహాలు వేసుకుని ప్రాణిని ఉసురుపెట్టుకుంటూంటారు. శంకలు లావవు తున్నకొద్దీ చికాకులు జాస్తీ."

ఇంతలోనే ఆర్చిబిషప్పు వచ్చి తమకోసం ఎదురు చూస్తున్నాడని కబురురాగా, తొందర తొందరగా దుస్తులు వేసుకుని రాజావారు వెళ్ళిపోయినారట. పుస్తకం చదువు తున్నప్పుడు తమకు కలిగిన సందేహాన్ని బిషప్పుకు, వివరించి

చెప్పగా ఆయన "బట్లరుగారు దీనిని ఫలానా పుస్తకంలో చర్చించి ఫలానా ఫలానాచోట వివరణ రాసివున్నట్టుంది "అన్నాడట !

" బాగానేవుంది కథ. అదేమిటో తెలియచెప్పక రాసినట్టుందంటాడేమిటి ? తను ఇంగ్లీషువాడై వుండికూడా, బట్లరు గురించి యితమిత్థమని తెలియదే !" అని రాజావారు తలపోసిరట. బిషప్పు వెళ్ళిపోగానే, బుక్సెల్లరువద్ద బట్లరు గ్రంథం కొని పరిశీలనగా చూసేరట. బిషప్పు చెప్పినచోట ఆ వివరణ విపులంగా వుందట. అప్పుడు రాజావారిలాగున అనుకున్నారట: "ఈ ఇంగ్లీషు విద్వాంసులకు యెంత నిశ్చయజ్ఞానముంది. దానిని చెప్పేటప్పుడు ఎంత నాగరికంగా నమ్రతగా చెప్తారు !".

ఈ విషయం ఉదహరించి మహారాజావారింకా యిలాగున చెప్పారు : "పిన్నలతో మనం ప్రసంగించేటప్పుడు యెంతో జాగ్రత్త వహించవలెను. చిన్నల దోషాలను సరిదిద్దేటప్పుడు పెద్దవారికంటె వీరికి హెచ్చు బాధనిపిస్తుంది. అది సహజం. ఇతరులు తమ లోపాలను యెత్తిచూపించకూడదని కుర్రవాళ్ళు తాపత్రయ పడుతూవుంటారు. 'నేను వేసుకున్న బట్టలను గురించి, నా రూపలావణ్యాం గురించి వాళ్ళూ వీళ్ళూ యేమనుకుంటున్నారు ? నా వేషభాషలు, తెలివి తేటలు, ఇతరుల మెప్పును, పొందుతున్నాయా? పదిమందీ నన్ను గొప్పవాడినని అనుకుంటున్నారా, లేదా ? అనే ఊహాలు యువకులను సదా వెంటాడుతూనే వుంటవి. చిన్నప్పుడు నా చుట్టూ ఎవరుండేవారో, వారెలాంటివారో అనే ప్రసక్తే నాకు వుండేదికాదు. వాళ్లెలాంటి వాళ్ళయితే నాకేమి? నన్ను గురించి చెడ్డగా భావించకుండావుంటే చాలును. నా గొడవేదో నాది; నా మీద నాకే శ్రద్ధ

హెచ్చుగా వుండేది. యెవరయినా నాగురించి యేమయినా అనుకున్నారా, లేదూ నాకు అపకారమేచేశారా, వాళ్ళపాపం వాళ్ళది. నే నేమీ లెక్క చేసేవాడిని కాను. దాన్ని యిట్టే మర్చిపోయేవాడిని. నా కపకారం చేసినవాళ్ళమీద నాకు కినుకా వుండేదికాదు. "పోనిస్తూ" అని క్షమించేవాణ్ణి.

ఒక పిల్లవాడిని మనం దుసుసుగా మందలించి, చీవాట్లు పెట్టి కారాలూ మిరియాలూ నూరి దుయ్యబట్టుకుంటే మన చెంత కిక రిమ్మన్నారాడు. మనచెంతకు వస్తేనేకాని వీల్లేని స్థితిలో వుండి ఆ పిల్లవాడు మనదగ్గరకు రాక తప్పదనుకుందాం. అపుడు మన సహవాసం సాంగత్యం అతనికి ఆనందమీయదు.

అయితే వయసువస్తున్న కొద్దీ అనుభవం హెచ్చుతున్న కొద్దీ, మనపట్ల యితరులు ఎట్టిదోష మాచరించినా పట్టించుకో కూడదు. మనోబలమున్న మనుష్యులు వీటికి చలించరు. పదిమందిమధ్యకీ వచ్చినతరువాత, సమాజములో పాల్గొం టున్నపుడు వొకరిని ఎంచుబడిచేయుటకు, తానట్టి యెంచుబడికి గురి అవుటకు వ్యక్తులు సిద్ధపడకతప్పదు. తమకు పరిచయ మవుతున్న మనుషుల చహరాలు, వ్యక్తులు పడికట్టవలెను. మానవజీవితమనే గ్రంథమును చక్కగా చదనవలెను. లేక పోతే ఆవ్యక్తి యెందుకూ మారనట్లు నలుగురూ జమకడతారు. ఇట్టి అభ్యాసమునకు నిదర్శనం యేమంటే ఓరిమీ, సహనమూ, ఇతరులను రంజింపజేసే వృద్దేశమూ, శక్తీ కలిగి ప్రవర్తించుట. ఇట్టి వ్యక్తులలో వొకరిని నొప్పించుట అనే గుణం వెదికినా కానరాదు."

ఈ విధంగా ఆయన చాలా చెప్తూకొచ్చారు. జరిగిన యీ సంభాషణ యథాతథంగా రాయగలిగానని నేను చెప్ప జాలను. కొన్నిచోట్ల పొరపాటు పడ్డానేమో !

అపకారంచేసిన వారిమీద కినుక వహించకపోవడమనేది, యితరుల దోషాలను మన్నించడమనేది రాజావారి వ్యక్తిత్వంలో కనపిస్తుందనీ, అవి పిన్నలకూ, పెద్దలకూ అరుదుగా వుంటవనీ ఆయనకే తెలియదు !

మహారాజావారు యింకా యేమేమో ప్రస్తావిస్తూండగా శలవు తీసుకుంటానని కాలేజీకి వెళ్ళిపోవలసివచ్చింది !

8 జూలై, సోమవారం :

కృష్ణంరాజుగారివంట్లో యెలా వుందో చూసివద్దామని పొద్దున్నే బయలుదేరాను. నిన్నటికంటె యివాళ నయం. రెండు విరేచనాలయ్యాయట. వమనం చేసుకున్నారట.

మద్రాసు ఎలక్ట్రిక్ ట్రాంవే కంపెనీకి ఏ మాత్రం పరపతి వుందని ఆవిడ నన్ను అడిగారు. కాస్త మంచికబురు ఆవిడ చెవిని వేతామనుకుంటే, యేమీ లేనేలేదు. తనకు తానే వితర్కించుకుని తమ సొమ్ముకేమీ మోసంరాదనుకుంటూ, కొద్దిపాటి లీగలుపరిజ్ఞానాన్ని ప్రదర్శించింది ఆవిడ. పెక్కాలి ప్రోనోటుమీద దావావేయమని మా నాన్నగారికి మేనేజర్లు దానిని, పంపించినట్టు ఆవిడ తెలియచేసింది. అది చెల్లుపెట్టవలసిన పూచీ తమకున్నట్టు ఆవిడ చెప్పలేదు; కాని నాలుగువేల రూపాయలు అడ్వాన్సుయిస్తే ఎలా వుంటుందని మా నాన్నగారిని ఆవిడ సలహా అడిగారట; అడ్వాన్సు ఈయమని ఆవిడకు

మా నాన్నగారు సలహా యిచ్చారట. జమీందారు మేనేజరు, ప్రోనోటు వ్రాశారు. ఇప్పుడు జమీందారు తనకూ, ప్రోనోటుకూ యేమీ సంబంధం లేదంటున్నాడు.

కృష్ణంరాజుగారి కుశలం తెలుసుకున్నాక, హెడ్ మేనేజరు చెంతకు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి జరుగుతున్న రివెన్యూ కేసుకు సంబంధించిన చరిత్రయావత్తూ ఆయన చెప్పుకువస్తున్నాడు. ఈ కేసులో రాజకీయంకూడా యిమిడివుంది. చెబుతున్నప్పుడు ముఖకవళికలు మామూలుగానే వున్నాయి. ఏమీ తొట్రుపాటు కనిపించలేదు. చెప్పే తీరు ధారాళంగావుంది.

ఇక్కడనుంచి తిన్నగా సుందర్రావు పంతులు యింటికి! నేను కనిపించేసరికి ఆయన తన హాబీనిగురించి ముచ్చటించారు. ఆయుర్వేదం, దాన్ని ప్రోత్సహించవలసిన ఆవశ్యకత, వైద్యవిధానం అన్నీ చెప్పుకొచ్చారు. ఇంటికివచ్చిన మీదట కోటకు వెళ్ళాను.

మేనేజరు సాహేబు కేసు ఎలా వివరిస్తున్నాడని మహారాజావారు నన్ను ప్రశ్నించారు. చక్కగా నివేదిస్తున్నాడనే కబురు విని నాకు తమ అభివందనలను తెలిపారు. అక్కడ లక్ష్మాజీ పంతులుగారుకూడా వున్నారు.

'చారు' మానేయడం మంచిదని రాజావారు సలహా యిచ్చారు. దేహానికంత మంచిదికాదని, కడుపులో గాలి యేర్పడుతుందని, అజీర్తికి హేతువుకాగలదనీ ఆయన అన్నారు. కోదండరావు పంతులుగారు వృద్ధులు; ఆయనకి నల్లమందు కడుపులో పడందే వొక్క గడియ గడవదు. పాలు తాగరు;

పెరుగు వేసుకోరు, గోధుమ ససేమిరా పనికిరావు. ద్రాక్షపళ్ళ రసం రోగిష్టికి ఎంతో మంచిదని రాజావారు చెప్పారు. ఇంత పంచదార కలిపి పుచ్చుకుంటే ఏరోగానికీ మంచిదట; ఈ మాట యెంతవరకూ నిజమోనని వైద్యగ్రంథాలు చూస్తిమి; రాజావారన్నమాట అక్షరాలా నిజం.

మహారాజావారిది వొక ప్రత్యేకమైన ప్రవృత్తి. గుణసంపద యెనలేనిది. ప్రత్యేకమైన వ్యక్తిత్వం. ఆయనకు ఆయనే సాటి. మన దేశంలో యింతటి గుణసంపన్నులు అరుదు. ఛలోక్తులూ, హాస్యమూ ఆయనలో మిన్నగా కనబడతాయి. జీవిత వేదాంతంనుంచి ఉద్భవించిన హాస్య చమత్కృతులు, షేక్స్పియరు కవికి గల చమత్కారం; తనకు తానే, తమ మరణం గురించి తామే నవ్వుతాలుగా మాట్లాడతారు.

పూర్వం వొకానొకప్పుడు వొక ముసల్మాను. మంచి నవ్వుతాల మనిషి వుండేవాడట. అందరినీ కడుపుబ్బా నవ్విస్తూ వుండేవాడు. తన అవసానకాలంలో కుమారుల్ని పిల్చి తను పడుకున్న మంచమును గోడచేరువకు లాగమని కోరాడట. చనిపోతున్నపుడు తనకాళ్లు రెండూ గోడమీద పారచాపి అదే స్థితిలో వుండిపోయాడు. కాళ్ళు రెండూ పారజాపివున్న మనిషి మృతకళేబరం! అతనిని కుమారులు సమాధిచేస్తున్నపుడు కాళ్లు యెంతకూ వొంగేయికావు. ఎలావున్న శవం అలానే వుంది. పట్టుకు దొరకదు. శరీరాన్ని లొంగదీసుకొని సమాధి చేద్దామని ప్రయత్నిస్తునకొద్దీ ఆ శవం వున్నట్టేవుండి ఠక్కున మళ్ళీ యథాస్థితికి వచ్చేది. ఏతాములాగ కిందకూ, మీదకూ ఊగులాడడమే కాని లొంగడమనేది లేకపోయింది. ఆ చనిపోయిన ముస

ల్మాను చుట్టాలు యిదిచూసి యిలా అన్నారు : "ఈ మనిషి నవ్వుతాలమనిషి. తాను బతికివున్నపుడూ మనలను నవ్వించాడు. చనిపోయిన తరవాతా నవ్విస్తున్నాడు."

మహారాజావారు యిలాటిదే మరొకకథ చెప్పారు. ఒకానొక ముసలాయన తన అవసానకాలంలో కొడుకుల్ని దగ్గరకు రమ్మని పిల్చి అన్నాడట: "మీరు కుర్రముండాకొడుకులుగా వున్నపుడు మిమ్మల్ని ఉయ్యాలలో పెట్టి ఊపాను. ఇప్పుడిక మీరు నన్ను ఊపండి!"

*　　　*　　　*

నిన్న రామమూర్తి పంతులుగారు వచ్చారు.

మహారాజావారు యెంతో కొంతసొమ్ము స్టీవెన్సుదొరకు ముట్టచెబుదామనుకున్నారు కాబోలును. జాయింటు మేనేజరుగారికి పిలిచి స్టీవెన్సుకు సూపరింటెండింగుపనో, లేదా తనిఖీపనో కొన్నాళ్ళు అప్పజెప్పమన్నారు. ఈపని ఎవరైనా చేసిపెట్టగలరు. దీనికి స్టీవెన్సే అక్కర్లేదు. కాని దొరకు ఎంతో కొంత సొమ్ము యిద్దామని కదూ, రాజావారి తలంపు.

మహారాజావారిపట్ల స్టీవెన్సు ప్రవర్తన ఉచితంగాలేదు; తెలివి తక్కువగా ప్రవర్తిస్తున్నాడు. మర్యాదా మప్పితం లేకుండా రాజా వారితో ప్రసంగిస్తూ వుంటాడు. ఇలాగున రాజావారితో స్వదేశీయులుగాని, యూరోపియనులుగాని సంభాషించివుండరు. ఈ పద్ధతీ నడవడీ అతనికి ఎంతమాత్రం తగదు. స్టీవెన్సుదొర యిక్కడ లేకపోతే పనులేం అడ్డిపోవు; ఇన్నాళ్లూ యితను లేకుండానే రాజావారు తమ వ్యవహారాలను

చూసుకున్నారు. ఇక ముందూ అంతే! మహారాజావారు తన నెంత 'యిది'గా చూస్తున్నారో దొర గమనించినట్లులేదు. మహారాజావారికున్న కీర్తిప్రతిష్ఠలు అతని కెరుకపడినట్లులేదు. స్ట్రీవెన్సు, పోనీ డెమోక్రటు అందామా అంటే అదీకాదు; వొట్టి కన్సర్వేటివు; దురభిమాని. కన్సర్వేటివు పక్షంమీద ప్రీతి లావు. అయితే, యిన్ని దురభిమానములు, లోటుపాట్లు వున్నా అతనికి కొన్ని సుగుణాలు లేకపోలేదు. మహారాజావారంటే దొరకు ప్రేమ. తనకు చేతనైన సహాయం ఎవరికైనా చేస్తాడు. కాదనడు. సర్వీసులోవున్న మిగిలిన యూరోపియనులు చేసేపని తక్కువ; తక్కువేమి? యేమీ లేనేలేదు. కాని వాళ్ళ క్లెయిమ్సూ, కుటుంబాల క్లెయిమ్సూ తలకుమించినన్ని. ఇది కావాలి, అదికావాలని అన్నీ కోరికలే!

మహారాజావారు 'సర్వీసు'లో మిష్టర్ డేనిస్‌ను వుంచి యెంత దయతో దొరను చూశారు! ఇతరత్రా డబ్బువచ్చే ఉపాధికూడా కల్పించారు. తనకు వివాహమయిందని తన భార్య తనను నమ్మి యింగ్లండునుంచి యింతదూరం వెళిపోవచ్చిందని దొర చెప్పుకున్నంతమాత్రాన మనసుకరిగి రాజావారు దొరకు సదుపాయాలు కలిగించారు. డేనిస్‌కు పెళ్ళి అయిందికనక యిక అతను తెచ్చే ఆదాయం సంసారానికి సరిపోదని మహారాజావారు అనుకున్నారు. అందుకని దొరకు యిన్నోటి సదుపాయాలు.

రాజావారు 'నో ఎనీ' అనే ప్రయోగం గురించి స్ట్రీవెన్సను అడగ్గా 'మీరన్నట్టు అది న్యాయమన్లో కాదేమన్లో వుందికదా! అదే యిక రుజువూ. దానికదే ఉదాహరణ!'

అన్నాడు. "అదికాదు; ఆ ప్రయోగం గురించి మీ ఉద్దేశ మేమిట"ని రాజావారు ప్రశ్నించారు. చర్చకు తావివ్వక తన ఉద్దేశమేమో చెప్పక దొరగారు "నే నింగ్లీషువాణ్ణి. మీ అందరి కంటె నా భాష నాకు బాగా తెల్సును. మిస్టర్ అండర్‌వుడ్ నే నన్నమాట రైటన్నాడు. ఇద్దరు ఇంగ్లీషువాళ్ళకి యేకాభి ప్రాయం కుదిరిందంటే యిక వివాదం ఫైసలయిపోయిం దన్నమాటే; మిష్టరు ఆడం, కూపరు ఓక్లీ యిద్దరూ మంచి గ్రంథకర్తలే. వాళ్ళ గ్రంథాలు చూడండి."

దొర ఎంతసేపూ యిలా చెప్పుకుపోతాడే తప్ప తన అభిప్రాయమేమో వివరించడు. వ్యాకరణ విషయాలనూ చర్చించడు.

* * *

ఈ వేళ సాయంకాలం శర్మవచ్చాడు. ఆడం గ్రంథం లోని వొక వాక్యసముచ్చయము గురించి తనకూ, లక్ష్మాజీ పంతులుగారికీ వివాద మేర్పడిందట. దానిమీదట రాజావారు గంటల తరబడి వ్యాకరణ విశేషాలను గురించి ప్రసంగించారు. మహారాజావారికి వ్యాకరణ శాస్త్ర పరిజ్ఞానం అపారం! ఎంత వింత!

11 జూలై లక్ష్మివారం:

జాయింటు మేనేజరు, శర్మ ప్రిన్సిపాలుగారలను తమ వెంట మహారాజావారు తీసుకువచ్చారు. శర్మ సోదరునికి సంస్థానపు దావాలలో వకాలత్ యివ్వడం గురించి చర్చ జరిగింది.

మహారాజావారు గొప్ప ఆశ్చర్యకరమైన రాజనీతిని ప్రదర్శించారు. పరిపాలనా దక్షత ఎంత గొప్పది! మేనేజిమెంటును గురించి తమకు తామై సూటిగా ప్రసంగించలేము. దాని కనేక కారణాలు ఆయనకు వుండివుండవచ్చును.

ఎస్టేటులను ఎందుకు జమీందారులు తమకు తామై మేనేజిచేయకూడదో నాకు కనిపించే కారణాలు అనేకం. జమీందారు అయినంతమాత్రాన అతనికి పరిపాలనా దక్షత వుంటుందనుకోనక్కర్లేదు. నిజానికి అతను జీవించే పద్ధతీ, పరిసరాల సరళీ వేరు; మామూలు పరిసరాలు వాతావరణం అతని అభివృద్ధికి ఆటంకమని అతనిభావన. పరిస్థితు లిలా వుంటున్నప్పుడు, అజమాయిషీచేసే జమీందారు ఒక న్యూసెన్సుగా తయారవుతారు. మంచి మేనేజరును ఎంచుబడి చేసుకోవడమే జమీందారు కర్తవ్యం. అంతటితో అదిసరి, ఇదీ నా అభిప్రాయం.

శర్మ చాలా నెమ్మదిగా తన అభిప్రాయాన్ని తాను చెప్పాడు. నాకే ఆశ్చర్యమనిపించింది. శ్రీ జగన్నాధరావు పంతులు అందరికంటె అద్భుతంగా చెప్పారు. ప్రసంగంలో మహారాజావారు ఎప్పుడూ ముందు వుండేవారు; ఆయనొక విషయాన్ని ప్రారంభించి విడిచిపుచ్చేవారు. మధ్య మధ్య సూచనలుగా రెండు మూడు మాటలు అంటూండేవారు. అంతేనేకాని, ఎన్నడూ ఆయన ఆదేశమిస్తున్నట్టు మాత్రం ప్రసంగించనూ లేదు. ఒకరుచెప్పింది కాదని త్రోసిపుచ్చనూ లేదు.

శర్మ సోదరునికంటె, జగన్నాథరావు పంతులుగారి కుమారుని క్లైయిమ్మును మహారాజావారు అంగీకరించడం న్యాయమే మరి.

మహారాజావారు మా నాన్నగారి కుశలమడిగి తెలుసుకున్నారు.

12 జూలై, శుక్రవారం :

మనదేశపు నౌకరులు యెంత తెలివితక్కువగా, యెంత మూర్ఖంగా, అపరిశుభ్రంగా వుంటారో యీవేళ మాటల సందర్భంలో రాజావారు చెప్పుకొచ్చారు: "యే వస్తువు యెక్కడుండాలో అక్కడది వుండదు. దేన్ని యెలా వుంచాలో అలా వుంచరు. మనకు కోపం లేకపోయినా, లేని కోపం తెచ్చిపెట్టుకొని నటిస్తేనేగాని వాళ్ళతో వ్యవహారం సజావుగా సాగదు. మెల్లిమెల్లిగా అప్పుడప్పుడు అదీ యిదీ బోధిస్తూ వాళ్ళకి జ్ఞానోదయం కలిగించాలి. మనల్ని మనమూ అభివృద్ధి చేసుకోవాలి. ఈ శిక్షణ మనకూ అవసరమే.

ప్రతీ వస్తువూ నేలమీదపెట్టి వుంచడమనేది నౌకరుల వాటు. బల్లలమీద యెందుకు వుంచకూడదు ? ప్రతీ యింటా బల్లలుండడం అవసరం. మన హిందూ స్త్రీలు వారెంత గొప్పవారైనాకానీయండి, కాకపోనీయండి. పగలల్లా స్నానాలతోనే కాలం గడుపుతారు. మడీ తడీ; వంటా వడ్డనా; యేదో నౌకచాకిరీ వుంటూనే వుంటుంది.

గిన్నెలూ, చెంబులూ కడుగుతారా, లోపల మకిలి వదలదు. అంతా పై పైనే; పాత్రలుమాత్రం ధగధగా మెరుస్తూ వుంటే చాలు."

'ఇ' దొరగారొకసారి రాజావారి స్టూడియోకి వెళ్ళేరు. అప్పుడు ఆయన తన స్టూడియోలోవున్న పాత్రలను కింద పెట్టి గుడ్డతో దుమ్మును దులుపుతున్నారట. దొరను చూసి "మంచి పనిలో వున్నాను. చేతినిండా పనే" అంటూ ఆయన చిరునవ్వు నవ్వారట.

♦ ♦ ♦

రాజావారిదెంత నిరాడంబర జీవితం. ఆయనా, ఆయన పరిచితులూ కూచునే కుర్చీలు, బెంచీలు పెద్ద విలువైనవి కావు. వేసుకునే దుస్తులు చాకింటి మడతలే కాని, అవీ ఆర్భాటంగా వుండవు. ఆయన నాయనగారు ధరించే లేసు తలపాగాలు, సాధారణంగా ధనికులు ధరించడానికి తాపత్రయపడే డాంబికమైన టోపీలు రాజావారికి కిట్టవు. ఆయన పెట్టుకునే తలపాగా సహజంగా వుంటుంది. దర్పం కనిపించదు. కాని అందంగా వుంటుంది. ఠీవి కనిపిస్తుంది. ఆయన ధరించే తలపాగాలనే ఇతర జమీందారులు, మొఖాసాదారులు అనుకరిస్తున్నారు.

29 జూలై, సోమవారం :

మళ్ళీ మామూలే. వంట్లో యేమీ బాగులేదు. మహారాజావారికి నామీద ప్రేమ.

శ్రీ వీరేశలింగంగారు.

కవులకాలము. మూలసూత్రమంతా యిక్కడేవుంది. కవుల జననం, తేదీలు, కాలమూ అన్నీ ఆయనకు ....

2 ఆగస్టు, శుక్రవారం:

మహారాజావారికి నే నంటే అభిమానం. అరటికాయ కూర 'డిసింట్రీకి' మంచిదని చెప్పి రోజూ పొద్దున్నే నాకు పంపించే యేర్పాటు చేస్తున్నారు.

నేను వ్రాతామని వేసుకున్న సాహిత్యప్రణాళిక:

ఒక వ్యాకరణము వ్రాయుట

భారతి దేశచరిత్ర, ఆంగ్ల దేశచరిత్ర

* ఇంగ్లండులో ప్రచురించుటకై ఆంగ్లములో కొన్ని కథలు. గ్రీసు రోము చరిత్రలను తారతమ్య పరిశీలనతో రచించుట.

♦ ఆధునిక జీవితమును అభివర్ణిస్తూ యింగ్లీషున నవలా రచన.

తెలుగు సారస్వతంపై వరసవరసగా కొన్ని ఉపన్యాసములు, ఈ సారి మద్రాసు వెళ్ళినప్పుడు వచ్చే శీతాకాలంలో అక్కడ యీ వుపన్యాసము లీయవలెను.

♦ ♦ ♦

సామంతపహాళి మణి	భైరవి
కువలదళ స్నిగ్ధరంగై	పున్నాగమరాళి
తవకుసుమశరత్వం	శహాన
కుమ్మీయది పొణ్ణకుమ్మిగియది పెణ్ణె	హుశేని

* 'Stooping to raise' అనే పేరుతో అప్పారావుగారు రచించిన ఆంగ్లకథ వొకటి లభించింది. అది 'సంస్కర్త హృదయమనే' పేరుతో వారి 'ఆణిముత్యాలు' అనే కథల సంపుటిలో తెలుగున ప్రచురితము.

♦ ఆంగ్లమున వారు వ్రాసిన యీ నవలాప్రణాళిక లభించినది.

కొంగ్రొ కులంగవకమిాయత్ర
సమ్మయిరశై కింసిత్యకళ్యాణశై
శ్యామసుందరాంగా ధన్యాశి
యెంతో ముద్దు యంతసొగసు బిందుమాలినీ
విదముశాయవే ఖరహరప్రియ
గూఢంనూపురశబ్ద హిందుస్తాని కాపీ

దృ శ్య ము లు :

కుమిలిఘాటు, గునుప్రాడి అడవి, నెల్లిమర్ల యేరు, రామతీర్థం, శృంగవరపుకోట కొండలు, మాడుగుల, సింహాచలం, కోనాడ.

వి ష యా లు :

దానిమ్మ; సారంగ.

♦ ♦ ♦

తానెవ్వరో తనా వారెవ్వరో

* * *

చిత్తా స్వాతి వాన జోడించి కురియగా
చిప్పలోను బడె చినుకొక్కటి
ఆ చుక్క ముత్యమయి మునిగిపోయె ముందు
చిప్పతో చెప్పింది మాటొక్కటి

* * *

శకుంతల
కామంప్రియా మోహన; బాగుంది !
భాగడ

యణ్ణై తెక్కురే న్వారాయ్ కణ్ణాళ్ళనే
ధర్మసంవర్థనీ మా యమ్మా నమ్మితి నిన్నా
దాసుడను నను బ్రోవవలె నమ్మా
బంగరుకోమ్మా
రీతి గౌళ
జననీ నీను వినా త్రైలోక్య - దిక్కెవరమ్మ జగమూ
లోనగాని
సరసిజమానసమ్మోహిని వినవే నా మనవినీ
విని నన్నాబ్రోవు
పూరికల్యాణి
నిను వినా మరి దిక్కెవ రున్నారు నిఖిలలోకజనని
నన్ను బ్రోచుటకు
పన్నగ భూషణుడో.........
హిందూస్తానీ కాఫీ
వా డెటూ బాల్కెనో దెల్పవే
పయ్యాదాపై నాదనామక్రియ
నామానానువంటిదె నీ మానసయి
తే, నా నోముఫలము తీరురా కళ్యాణి
... ...
యేమందునే కొమ్మా దీనివెద యట్లా తీరునమ్మ
కోమలి శ్రీరాజగోపాలు నెడబాసీ
రామరామ యన్నాళ్లో కామినీ తాళూను
... ...

పన్నీటతడసె పడకే పయ్యదకొంగు
కన్నీటతడిసెనుగా వన్నెమీరినట్టి
వనితా చక్కనిమోము చిన్నపోయెనుగా
మిన్నగమెరసె మెలత చక్కనిమేను
సన్నమై సోలేనుగా వెన్నెలనాడే వెలది
చందమామని కన్నెత్తి చూడాదుగా దిగులొందగ శహాన

... ...

ఏనోవారానమ్మా యింగి ఆందుపో
యి శైనెనేర మాచ్చమ్మా
మానె శ్రీనివాసున్ మది మరందా
నోయన్నై ఆనాలుం యిప్పడి ఆహు
మో అవనిక్కి

... ...

రాజువెడల జూతామురారే తోడి

... ...

యేమగువ బోధించెరా నీ కేమగువ
శ్యామరాజ భూపాలతనయ
సరస శ్రీకృష్ణరాజేంద్ర మారువ

... ...

రమ్మనిబిలిచితే రావే చెలియా కన్నడ

31 డిసెంబరు, మంగళవారం :

సరుకులమీద	కాసులు	100 రూ॥లు
	కంకణాలు	60
	హాళీ	200

వస్త్రాలు

వెంకటరత్నంగారి బాకీ	60
కొట్టాల నరసన్నగారికి	50
మొత్తం	470 రూ॥లు

నీళ్ళ బ్రాహ్మడికి

నాలుగు నెలల జీతం	12– 0–0
జగన్నాధం	28– 0–0
దేవాంగికి	20– 0–0
ఆముదం	7– 0–0
చిట్టి వెంకన్న	10– 0–0
నూనె	20– 0–0
పెరుగు, నెయ్యి	12– 0–0
నూకిజీతం	6– 0–0
చేబదులు	20– 0–0
పాలది	5– 0–0
చాకలి	3– 0–0
యింటిమీదమొత్తం	20– 0–0
సన్యాశి	4– 8–0
పండుగఖర్చు	25– 0–0
చిన్నయ్య	36–10–4
వెంకటాద్రి జీతం	14–12–0
అగురు దానికి	2– 0–0
మొత్తం	259–14–4

1896

1 జనవరి, బుధవారం :

విజయనగర రాజవంశీకుల వ్రాసిన చరిత్రను సంసిద్ధ పరచడం.

3 ఫిబ్రవరి, సోమవారం :

డైరెక్టరాఫ్ పబ్లిక్ ఇనస్ట్రక్షన్ వచ్చాడు. స్టేషనువద్ద ప్రిన్సిపాలుగారు ఆయన్ని కలుసుకొన్నారు. డాబాకోటలో జాయింటు మేనేజరుగారు కలుసుకుని తమతోపాటు ఆయన్ని తీసుకొని వచ్చారు.

4 ఫిబ్రవరి, మంగళవారం :

కాలేజీలో జరిగిన సమావేశంలో డైరక్టరుగా రిలాగున ఉపన్యసించిరి :

"తత్త్వశాస్త్రము యెందుకూ పనికిరాదని కొందరి అభిప్రాయము. కాని అది అభివృద్ధి చెందుతూ వున్నది... మహారాజావారి యెడల యెంతో గౌరవప్రపత్తులను కనబరుస్తూ మీరు ప్రసంగించడమనేది నా కాశ్చర్యమును కలిగించలేదు. ఆయనను యెరిగినవారెవరైనా, ఆయనను ప్రేమించకుండా వుండజాలరు. అయితే ఆయనకొక దోషముకలదు. ఎంతో మంచితనము, చెప్పలేనంత మంచితనము కలిగి వుండడమే ఆయన దోషం. ధార్మికదృష్టికూడా ఆయనకు లావు."

14 ఫిబ్రవరి, శుక్రవారం :

వెన్లక్ మెమోరియల్ గురించి జాయింటు మేనేజరు గారితో ప్రసంగించితిని. నాకు తోచిన వ్యక్తులలో తన పేరున ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడానికి అనుమతించారు.

28 ఫిబ్రవరి, శుక్రవారం :

బాలరామారావుకి రెండురూపాయలిచ్చి శ్రీకాకుళం పంపించాను.

29 ఫిబ్రవరి, శనివారం :

శ్రీ బలిజేపల్లి సూర్యనారాయణ పంతులుగారిని కలుసుకుని ఆయనతో ముచ్చటించితిని. విశాఖపట్టణములో జరగబోయే వెన్లక్ మీటింగుకు సహాయం చేస్తామని మాట యిచ్చిరి. ఇదేపనిమీద వెంకన్న పంతులుగారినికూడా కలిసితిని. సంతోషం. మాన్యుమెంటును గురించి శ్రీ రామానుజాచారి గారితో మాట్లాడినదానికంటె యింకా హెచ్చు భరవసాగా నాతో ప్రసంగించిరి. అధ్యక్షత వహించమని ఆయన్ని కోరాను. అందుకు తమకేమీ అభ్యంతరంలేదనీ, కాని మిస్టర్ ముల్లర్ అధ్యక్షత వహించేటట్లుగా ఆయన్ని వొప్పించడానికి ప్రయత్నించగలననీ అన్నారు.

2 మార్చి, సోమవారం :

శ్రీకాకుళంలో మెమోరియల్ మీటింగు విజయవంతముగా జరిగింది. సభ యిక ముగుస్తుందనగా కొంత చిక్కు ఏర్పడ్డది. లీడింగు లాయరు బాపిరాజు మొదట కొంత విముఖతతో వున్నారు. తీర్మానం ప్రతిపాదించవలసినదిగా ఆయన్ని

కోరాను. కొంతచర్చ జరిగినమీదట యిలాగైతేనేం, అయి నందుకు పొడబట్టారు. చాలాసేపు ప్రసంగిస్తూ తీర్మానం ప్రతి పాదించి ఉపన్యాసం అయిపోయాక నాదగ్గరకొచ్చి యిలా అన్నారు: " చిట్టచివరికి ఎలాగయితేనేమి, నన్ను మార్చి వేశావు. "

4 మార్చి, బుధవారం:

సోంపేట బయలుదేరాను.

5 మార్చి, లక్ష్మీవారం :

సోంపేటనుంచి, ఛత్రపురం బయలుదేరాను. అడవి ప్రదేశంలో రైల్వేస్టేషను. నాదగ్గర చదువుకున్న విద్యార్థి కనకరాజు కనిపించాడు. నాయెడల శ్రద్ధాభక్తులు కనబరిచాడు. స్టాండర్డు పత్రిక ఎక్కడపడితే అక్కడే వుంటోంది. మంచి ప్రచారంలోకే వచ్చింది. కనకరాజు చేతిలో స్టాండర్డు పత్రికను చూశాను.

6 మార్చి, శుక్రవారం :

సబ్-మేజస్ట్రేటును, తహశ్శీల్దారును కలుసుకున్నాను. ఎంతో గౌరవం చూపారు. ఈ విషయంలో తాము తప్పక సహాయంగా నిలబడతామన్నారు. జమాబందీ అడావుడిలో వున్నారు. తిరుగు ప్రయాణంలో ఒకసారి మనం కల్సుకుంటే మంచిదన్నారు.

21 మార్చి, శనివారం :

గం. 5-25 లకు యెలమంచిలి బయలుదేరాను.

గంగారాంకి విజయరామపంతులు 43,000 రూపాయలు యిస్తానన్నాడు. చలపతిరావుపంతులు, భూమి చూసుకున్న తరవాత 75,000 యిస్తానన్నాడు.

"బోసందు" అనే పదం యీ ప్రాంతాల్లో వాడుకలో వుంది. బోసందు అంటే భూసంధి కాబోలును.

23 మార్చి, సోమవారం :

వెంకటేశ్వర్లు 24,000 రూపాయలకు కాపగోద వలస కొన్నాడు. వెయ్యిరూపాయిల రాబడి వస్తుందని అంటున్నారు.

15 మే, శనివారం :

నిన్నరాత్రి విచిత్రమైన కలవచ్చింది. కలలో కన్నీరు కార్చాను. మహారాజావారికేదో విపత్తు వాటిల్లినట్లూ, నాకు దుఃఖం పొంగుకువచ్చినట్లూ కల! కలలో మహారాజావారు కనిపించారు. తెల్లవారిన తరువాతకూడా మనసు స్థిమితపడలేదు.

కాని ఎంత ఆశ్చర్యం! పొద్దున్న పదకొండు గంటల వేళకు రొప్పుకుంటూ రొప్పుకుంటూ సూరీడు పరుగెత్తుకొచ్చాడు. మనిషి నిలువునా వణికిపోతూ కంపిత స్వరంతో చెప్పలేక చెప్పలేక చెప్పాడు: "హెర్ హైనెస్ ఛోటా మహారాణివారు మరణించారు!"

దుఃఖకరమైన యీవార్తను మొదట నమ్మలేకపోయాను. ప్రతాప్‌సింగ్జీ భవంతిలో విషాదచ్ఛాయలు ఆవరించినవనీ, ఆపుకోలేని దుఃఖం అలముకొన్నదనీ వార్త. వార్త తెలిసి, సూరీడును వెంటబెట్టుకొని, ప్రతాప్‌సింగ్జీ భవంతికి వెళ్లాను. ఆయన్ని ఓదార్చాను. కష్టసమయాల్లో ఆత్మసంయమనం

అవసరం. ధైర్యం వహించండని చెప్పారు. సాయంత్రం మళ్ళీ వెళ్ళి పరామర్శించి వచ్చాను.

16 మే, ఆదివారం :

పొద్దున్న ప్రతాప్‌సింగ్జి కబురుపంపారు. మధ్యాహ్నం భోజనంచేశాక మళ్ళీ మనిషిని పంపారు. వెళుతూ వెళుతూ దారిలో ఆయనకి కొన్ని రిఫ్రెష్‌మెంట్లు కొని తీసుకువెళ్ళాను.

5 జూన్, శుక్రవారం :

సంస్థానం హుజూరు ఆఫీసులో పనిచేయ ప్రారంభించాను.

7 జూన్, ఆదివారం :

కోటపల్లి చలపతిరావుపంతులు దగ్గరవున్న క్యాషు బుక్కూ, స్టేటుమెంట్లను పరిశీలించాను. ఫారాలను పూర్తిగా మార్చివేస్తేనే కాని, లాభంలేదు. అప్పుడుకాని యెకౌంట్లను దేనికది విడమర్చి వేయడం సాధ్యంకాదు. ఇప్పుడున్న యీ ఫారాల్లోని ఎకౌంట్లను, స్టేటుమెంట్లనూ చెక్‌చేయడం కష్టం. కోర్టాఫ్‌వార్డ్సు హయాములోవున్న పిఠాపురం ఎస్టేటుఫారాలను పంపించమని రాశాను. ఈ ఫారాల్లో ఇన్ని హెడ్డింగులు ఎందుకో!

20 జూలై, సోమవారం :

ఏడుంబావుకి 'తిలారి'కి బయలుదేరాను. స్టేషనుకీ ఊరికీ దూరం నాలుగుమైళ్ళు.

సవారెనిచూస్తే పిల్లలకు సరదా. ఆశ్చర్యంతో ఏదో పెద్ద వింతలాగ పిల్లలు చూస్తూ నిలబడ్డారు!

21 జూలై, మంగళవారం:

జరజంగికి ఒంటిగంటా పదినిముషాలవేసరికి బయలు దేరాను.

22 జూలై, బుధవారం:

గంగరాం గ్రామము తాలూకు ధాన్యం అంబారం, చోళ్లు నూర్చేను - చోళ్లు వగయిరా తొలకరి.

నది యిక్కడుంటే ఎంతబాగుండును!

"జామచెసినదూ; అంతన్నాను."

మంచి ప్రయోగాలే!

23 జూలై, లక్ష్మివారం:

వనవిష్ణుపురం వెళ్ళాను. భూమి సారవంతమైనదే. విస్తీర్ణంకూడా హెచ్చు. చెరువుకింద భూములు. చెరువులో నీరు ఏడాదిపొడుగునా వుంటుంది.

ఇరవై వేలు; ఐదు వేలు.

1897

1 జనవరి, శుక్రవారం:

ఫేన్సీ డ్రస్ బాల్. మహారాజావారు ఉపన్యసించారు. ఉపన్యాసం బాగున్నది. కలెక్టరు మిస్టర్ హ్యూమ్ అభినందిస్తూ సమాధానం చెప్పారు.

2 జనవరి, శనివారం:

మహారాజావారు నన్ను బగ్గీమీద కూచోబెట్టుకుని కంటోన్మెంటు తీసుకువెళ్ళారు. అక్కడ కేంపులో నాటక

ప్రదర్శనం జరుగుతున్నది. రాజావారు కట్టించిన కొత్త కోటు తొడుక్కున్నాను. ప్రదర్శిస్తున్న నాటకంపేరు "కేట్." అభినయం మనోహరం. నాయిక తండ్రి మిస్టర్ రామ్సన్ నేర్పుగా నటించాడు. ఆ తాగుబోతు మాటలు, పోకిరితనం, కిల్లాడీతనం యుక్తంగా చూపించాడు. పోలి ఒక దేవతవలె తోచింది. దేవకన్య హృదయం స్పష్టపడేట్టు నాయికపాత్ర ధారిణి నటించింది.

3 జనవరి, ఆదివారం :

జిల్లామునసబు రిటైరు అవుతున్నందుకు హెడ్ మ్యానేజరుగారి యింట సంగీతకచేరి. జాయింటు మ్యానేజరుగారికి దివాన్ బహద్దరు బిరుదు వచ్చినందుకు♦ అభినందనము విందు. నా కన్యాశుల్కము ప్రతి నొకదానిని ఆయనకు కానుకగా సమర్పించి "ఇంత తక్కువ విలువగల కానుకను యిస్తున్నందుకు అన్యథా భావించకండ"న్నాను. "ఇది స్వల్పమేమీకాదు. అలా ఎన్నడూ అనుకోకండి. మీరు మీ హృదయాన్ని నాకు కానుకగా బహూకరిస్తున్నారు. ఆ సంగతి నాకు తెలుసును. ఇది ఎంతో గొప్ప కానుక!"

5 జనవరి, మంగళవారం :

విజయనగరంలో పావుశతాబ్దం. ఇరవైఐదు సంవత్సరాలు.

19 జనవరి, మంగళవారం :

ఇంటిని గురించి.

♦ హరికథా పితామహ శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారి ఆత్మకథలో యిది అభివర్ణితము.

22 జనవరి, శుక్రవారం :

బాపిరాజు పంతులుగారికి అక్కవలస కేసుకు సంబంధించిన రికార్డుల్ని యిచ్చాను.

మాక్సుముల్లర్ 'వాట్ ఇండియా టీచస్ అజ్.'

23 జనవరి, శనివారం :

దీనబంధు; మద్రాసు పేపరు

77 అన్నపిళ్లైవీధి;

27 జనవరి, బుధవారం :

రేపు ఉదయం రైల్లో రాజామణి చెట్టియార్, ద్రేట్ 'ఆక్' వస్తున్నారు.

మాధవరావు వ్యవహారం. కాలేజికి, హిందూస్కూలుకి నోటీసులు.

28 జనవరి, లక్ష్మివారం :

జాయింటు మ్యానేజరుగారితో బొబ్బిలి వ్యవహారం మాట్లాడాను.

29 జనవరి, శుక్రవారం :

మహారాజా హోల్కర్ టెలిగ్రాంయిచ్చారు. ఆయన్ని గురించి మ్యునిసిపల్ సెక్రటరీతో మాట్లాడాను.

30 జనవరి, శనివారం :

కన్యాశుల్కం ప్రతులు రివ్యూలకోసం మద్రాసు పత్రికలకు పంపించాను.

4 ఫిబ్రవరి, లక్ష్మివారం :

ప్రిన్సిపాలుగారికి క్లాసికల్ డిక్షనరీలు. మొకాలే వాల్యూం 7.

10 ఫిబ్రవరి, బుధవారం :

భీమిలిలో మీటింగు. మహారాజావారు ఉపన్యసించారు. మిస్టర్ టర్నర్ రాజావారి ప్రసంగం చాలా బాగుందని ప్రశంసించాడు.

11 ఫిబ్రవరి, లక్ష్మివారం :

"టర్నరంటే నాకెందుకు అభిమానమో మీకు తెలుసునా ?" అని మహారాజావారు ప్రశ్నించారు. దాని కాయనే సమాధాన మిచ్చారు :

" నేను రాడికల్‌ను కనక "

నేను టర్నరుతో అన్నాను: "ఆయన్ని మీరు మర్చిపోడానికికంటె, ఆయన, మిమ్మల్ని మర్చిపోడానికి అవకాశం హెచ్చుగావుందికనక !"

14 ఫిబ్రవరి, ఆదివారం :

కమాండర్ – ఇన్ – ఛీఫ్ యివాళ ఉదయం రైలులో వచ్చాడు. రైల్వేస్టేషనువద్ద పటాలం.

15 ఫిబ్రవరి, సోమవారం :

నిన్న ఆదివారం సెలవుకనక, యీవేళ కమాండర్ ఇన్ ఛీఫ్ గౌరవార్థం ఫిరంగులు పేల్చారు.

పదిగంటలకు మోతీమహాలులో విందు.

24 ఫిబ్రవరి, బుధవారం :

అక్కయ్యవలస కేసు యీరింగు.

10 మార్చి, బుధవారం :

పేకాట, కథల పుస్తకాలకు ఐదురూపాయలు ఖర్చు.

2 మే, ఆదివారం :

వెయ్యిరూపాయలు డ్రా చేశాను.

రెండు మెమోరాండములు.

దర్జావద్ద మూడువందల ఇరవై రూపాయల నోట్లు డ్రా చేశాను. అతనివద్దనే వుంచాను.

23 మే, ఆదివారం :

తెల్లవారుఝాము మూడు గంటలకు మహారాజావారు పరమపదించారు.

26 జూలై, సోమవారం :

రామయమ్మగారివద్ద కృష్ణమ్మ సరిగ్గా పనిచేయడంలేదని రెండణాల జుల్మానా.

27 జూలై, మంగళవారం :

మేనేజరుగారికి బ్యాంకువిషయమై మెమోరాండం.

3 ఆగస్టు, మంగళవారం :

రామయమ్మగారు నాఎదుట కరన్సీనోట్లను జమకట్టారు. మొత్తం వెయ్యి రూపాయలు.

8 ఆగస్టు, ఆదివారం :

సీతారామయ్య తాను పక్షిప్రాత్రికని రామాయమ్మగారిపడబ్బు అడిగినాడట. ఆయన కిమ్మనమని చెప్పి ఆవిడ నా చేతికి ముప్పై రూపాయలు యిచ్చారు.

18 ఆగస్టు, బుధవారం :

మోతీలాల్ వెళ్లిపోయినాడు.

22 ఆగస్టు, ఆదివారం :

ఒకలక్షా నలభైవేలు. నెలకు వడ్డీ ఏడువందలు. ఆరు నెలలకు రావలసినవడ్డీ నాలుగువేల రెండువందలు.

రెండవ అయిటము :

పదివేల రూపాయలు. ఏప్రియల్ 15 వ తేదీ.

135 రోజులకు; రోజుకూ రూపాయి పదణాల ఎనిమిది పైసలు.

మూడవ అయిటము :

ఏడువేలు; 147 రోజులకు రోజుకూ రూపాయి బేడా ఎనిమిది దమ్మిడీలు.

నాలుగువేల అయిదువందల పంథొమ్మిది రూపాయిల న్నర. ఈ అయిటములక్రింద రావలసినవడ్డీ.

అయిటము నాలుగు :

నాలుగు సంవత్సరాలనుంచీ
పదిహేడు వేలు.
అయిటము అయిదు :

టర్నర్ వెళ్ళిపోయినప్పుడు	పదివేలు
రెండవదఫా	ఏడువేలు
మూడవదఫా	రెండువేలు

మొత్తం పంధొమ్మిదివేలు.

అన్ని అయిటములు మొత్తం లక్షా తొంభై మూడు వేలు. వడ్డీతో కలిపి లక్షా తొంభై ఏడువేల అయిదువందల తొంభై ఆరున్నర.

మిస్టర్ టర్నరు బహుశా ఫిబ్రవరి పన్నెండవ తేదీన వెళ్ళిపోయి వుండాలన్నమాట. సెప్టెంబరు 18 వ తేదీకి రెండు వందల రోజులు. దీనికి వడ్డీ నాలుగువేల తొమ్మిదివందల ఇరవైతొమ్మిది రూపాయల పదమూడణాల నాలుగుపైసలు.

27 ఆగస్టు, శుక్రవారం:

ఇంగ్లీషు ఇలస్ట్రేటెడ్ మాగజైన్
గ్లిమ్సెస్ ఆఫ్ ది వరల్డు

11 సెప్టెంబరు, శనివారం:

మహారాణీవారు గవర్నరుకు తంతి యిచ్చారు. కాపీ ఒకటి బాలయ్యనాయుడుగారికి పంపించారు. మ్యానేజరుగారు దిద్దుబాటులు చేసిన ముసాయిదా కృష్ణమూర్తివద్ద వున్నది.

12 సెప్టెంబరు, ఆదివారం:

హిందూస్థానీ పనికత్తెకు నెలకు ఆరు రూపాయిల చొప్పున యివ్వవలసిన యెనిమిది నెలల జీతం మొత్తం నలభై ఎనిమిది రూపాయలు యివ్వవలసినదిగా ఆర్డరయిందని జగన్నాధరావు పంతులుగారు నాకు చెప్పారు.

27 సెప్టెంబరు, సోమవారం :

బాడీసు బాగా ఉతక్కుండా పాడుచేసినందుకు అర్ధ రూపాయి చాకలాడికి జరిమానా. రామయ్యమ్మగారిద్వారా నాకీ సంగతి తెలిపారు.

11 నవంబరు, లక్ష్మివారం :

మిస్టరు విల్లక్ యివాళ ఛార్జీ తీసుకొన్నారు.

20 నవంబరు, శనివారం :

ఇవాళ హెచ్. హెచ్., దివంగతులైన మహారాజా వారి క్వార్టర్సుకు వెళ్ళి ఒక సారి చూసివచ్చారు.

21 నవంబరు, ఆదివారం :

ఇవాళా అంతే.

26 నవంబరు, శుక్రవారం :

ఎ. డబ్ల్యు. అండ్ కోకు లెన్సు పంపమని టెలిగ్రాం యిచ్చాను. మేగ్నిఫయింగ్ గ్లాసెస్ కావాలని 'ఎ' సైజు ఒకటి, 'బి' సైజు ఒకటి. 13 వ తేదీకే రావలసివుంటె మరి!

9 డిసెంబరు, లక్ష్మివారం :

తాళపత్రగ్రంథం యిచ్చినందుకు భట్రాజుకు పన్నెండు రూపాయలు చెల్లిస్తిని.

11 డిసెంబరు, శనివారం :

పట్టుపంచెలు పసుపురంగువి.
బుఖ్ని ఎరుపు
సాటెన్

12 డిసెంబరు, ఆదివారం:

తెల్లచారలతో వున్న నీలిరకున్ని పాపురాను పంపించమని విశాఖపట్నం ఉత్తరం రాశాను.

14 డిసెంబరు, మంగళవారం:

తెలుపు, కుంకుమ రంగుల ఉన్ని రెండేసి పేకెట్లు పంపమని మా వకీలుకి ఉత్తరం.

15 డిసెంబరు, బుధవారం:

చిట్టిబాబుగారికి సాటిన్ కోటుకు, పాయిజామా కుట్టించమని పంతులుగారికి పురమాయించాను.

17 డిసెంబరు, శుక్రవారం:

మా వకీలుగారు తెలుపు, కుంకుమ రంగులవి నాలుగు ప్యాకెట్ల ఉన్ని పంపించారు.

18 డిసెంబరు, శనివారం:

* దత్తతస్వీకార మహోత్సవం ఇవాళ తొమ్మిదిగంటల నలభై అయిదు నిమిషాలకు జరిగింది. హిందూపత్రికలో రిపోర్టు.

22 డిసెంబరు, బుధవారం:

పంటల ఎస్టిమేటు గురించి జరూరుగా ఆర్డర్లు పంపించమని గంగారం అమీను పంపుకున్న పిటీషనుమీద హెడ్ మ్యానేజరుగారు యిలా ఎండార్సు చేశారు:

* శ్రీ ఆనందగజపతి మహారాజా విల్లు ప్రకారం శ్రీ విజయరామ గజపతి దత్తతస్వీకారం జరిగి ఆయనకు సంస్థానం దఖలుపడ్డది.

"నాకీ పిటీషనుగురించిగాని, అతని నియామకంగురించి గాని ఏమీ తెలియదు. బహుశా, శాసనపరిశోధకుడు (శ్రీ) అప్పారావుకు ఎస్టేటు గురించి అన్ని తబిశీళ్లూ తెలిసివుండ వచ్చును. — రిప్రజెంటు."

అందుమీదట మిస్టర్ విల్లక్ "యీ వ్యవహారంగురించి వెనువెంటనే వొక ఫుల్ నోట్ తయారుచేయవలసిందిగా" అప్పారావుకి ఎండార్సు చేశారు.

23 డిసెంబరు, లక్ష్మీవారం :

పిటిషను మీద రిపోర్టు వ్రాస్తూ మిస్టర్ విల్లక్‌కు ఇలా తెలియచేశాను : "రెండు మూడు రోజుల్లో పూర్ణ మెమోరాండం పంపిస్తాను. రికార్డులు లభించలేదు కనక యిప్పటికి అసమగ్రమైన రిపోర్టునే పంపవలసి వచ్చింది."

మిస్టర్ విల్లక్ ఎండార్సుమెంటు : "అలా అయితే సంస్థానం ఆఫీసుకువెళ్ళి రికార్డులుచూసి సమగ్రమైన మెమోరాండం తప్పకుండా పంపించండి".

25 డిసెంబరు, శనివారం :

దత్తత గురించి హిందూలో వ్యాసం.

26 డిసెంబరు, ఆదివారం :

"మిస్టర్ విల్లక్ మిమ్మల్ని రేపు ఉదయం కోటులో కలుసుకోవాలను కుంటున్నారండీ" అని మ్యానేజరుగారు చెప్పారు.

27 డిసెంబరు, సోమవారం :

మిస్టర్ విల్లక్ నా యెడల ఘాటుగా ప్రవర్తించాడు. "మెమోరాండం మీ రెందుకు తయారు చేయరు?"

"రికార్డులన్నీ ఆఫీసులో వున్నాయి కదండీ!"

"అయితే మీకు తెలుసున్నదే రాయండి. ఆఫీసులోకి వెళ్ళి పనికిరాని కవిలకట్టకోసం మానేజర్ని మీరూరికే ట్రబుల్ చేస్తున్నారే?"

"నే నెవర్నీ ట్రబుల్ చేయలేదే! సరే! నాకు తెలుసున్న దేదో రాయమని మీరన్నట్లయితే నే నేనాడో రాసి పంపించేవాడిని."

"పోనీ! వెంటనే యిప్పుడు రాసి యివ్వండి."

"మీకు అఫెండయినందుకు విచారం. మిమ్మల్ని అఫెండు చేద్దామనే ఊహ నాకు లేదు."

"సర్సరే! నోట్ తయారు చేయండి."

"మీకది రేపే పంపించేస్తాను. గుడ్ యీవినింగ్."

26 డిసెంబరు, బుధవారం :

ఉదయం అయిదు గంటలకు మిస్టర్ విల్లక్ కు రిపోర్టు పంపించాను.

31 డిసెంబరు, శుక్రవారం :

ఇది నాకు చాలా ప్రమాదకరమైన సంవత్సరంగా పరిణమించింది. శ్రీ విజయనగరం మహారాజావారు, నేను దారాపుత్రులకన్నా, తల్లిదండ్రులకన్నా అధికంగా ప్రేమించిన

వ్యక్తి, పరమపదించారు. ఆయన శీలమూ, వ్యక్తిత్వమూ పరిణతమనస్కుల హృదయాలను ఆకట్టుకొనేవి. నిష్కల్మష హృదయంతో, నిండు దయతో, నిరంతర సత్యాన్వేషణతో ఆయన కుశాగ్రబుద్ధిగల మేధావులను ఆకర్షించేవారు. ఆయన పట్ల అవ్యాజమైన భక్తిప్రేమలు కలగడానికి కారణం ఆయన సుగుణసంపత్తి. మా జీవితములు ఆయన జీవితముతో పెన వేసుకు పోయినవి. లోకమునుంచి ఒక జ్యోతి వెడలిపోయినది.

మహారాజకుమారికావారికి నేనంటే ఆదరణ ఇంతా అంతా కాదు. చెప్పలేనంతదయ.

1898

10 జనవరి, సోమవారం:

శ్రీ కె. సి. నరసింగరావుగారివద్ద గుర్రాన్ని కొన్నందుకుగాను ఖరీదు ముప్పై అయిదురూపాయిలు ఆయనకు చెల్లిస్తిని.

11 జనవరి, మంగళవారం:

విశాఖపట్టంజిల్లా మాన్యువలు కాపీ శ్రీ బి. సూర్యనారాయణపంతులుకు యిచ్చాను. విల్లకు దొరకు కావాలని అడిగి తీసుకువెళ్ళారు.

22 జనవరి. శనివారం:

సూర్యగ్రహణము, ఉదయమే అక్కాబత్తుళ్ళవిద్దరిని నియమించవలెను. గ్రహణ కాలములో బంగారము, వెండి,

రాగి కలిపిన మిశ్రమముతో ఎన్ని ఉంగరములు చేయగలరో అన్నింటినీ చేయించవలెను.

12 గంటల 20 నిముషముల 12 సెకండులకు దక్షిణ ముగా 64 డిగ్రీలు; పశ్చిమముగా 30.7 డిగ్రీలు. గ్రహణము ఆరంభము.

సూర్యగ్రహణము 15 గంటల 8 నిముషముల 54 సెకండ్లకు పట్టు విడుస్తుంది.

విడుపు ఉత్తరముగా 45 డిగ్రీలు, తూర్పుగా 40.7 డిగ్రీలు.

1 ఫిబ్రవరి మంగళవారం:

హిందూస్థానీ పనిమనిషికి ముప్పైఆరు రూపాయలు. ఆరునెలల జీతం.

17 ఫిబ్రవరి, లక్ష్మివారం:

విశాఖపట్నం నుంచి "అప్" ట్రయిన్సు:

రాక	పోక
1-42	2- 2
18	18-22
లోకల్	
9-47	10- 7

విజయనగరం నుంచి "డౌన్"

రాక	పోక
17-34	18- 1

23– 2	23–22
లోకల్	
13–30	13–50

18 ఫిబ్రవరి, శుక్రవారం :

హార్బరు కట్టడానికి వైజాగ్ అద్భుతమైన ప్రదేశం. రాత్రి ఏడుగంటల పదిహేను నిమిషాలకు గవర్నరు వచ్చాడు.

19 ఫిబ్రవరి, శనివారం :

డాక్టర్ బ్రౌనింగ్‌ను కలిశాను. గవర్నరు హార్బరుకు వెళ్ళాడు. నేనూ అక్కడకు వెళ్ళాను.

20 ఫిబ్రవరి, ఆదివారం :

ఫోటోగ్రాఫిక్ నెగెటివ్‌లు. భూమికి సంబంధించిన వ్యవహారము. విశాఖపట్టంనుంచి గవర్నరుగారు ట్రెయినులో విజయనగరం బయలుదేరారు. అదే ట్రెయినులో నేనూ బయలుదేరాను. స్టేషనునుంచి తిన్నగా గవర్నరుగారూ, డాక్టర్ బ్రౌనింగూ నేనూ కోటకు చేరుకున్నాము. తరవాత వారిని పెద్ద పూలతోటకు తీసుకు వెళ్ళాను.

21 ఫిబ్రవరి, సోమవారం :

పేలస్‌కు గవర్నరు సాయంకాలం మూడుగంటలకు వెళ్ళిపోయారు.

27 ఫిబ్రవరి, ఆదివారం :

తీగ

సున్న కడియం

కెంపులతో తాపిన పతకంగల మూడు పేటలపలకసర్లు.

పతకం లేకుండా మూడు పేటల పలకసర్లు.

ఆరువందల రూపాయిీలు.

అయిటము రెండు ;

కంటె	కంకణాల జత
వడ్డాణం	బాజుబందుల జత
తీగ	యేడువందల రూపాయిీలు
డిటో	
డిటో	

1 మార్చి, మంగళవారం :

యలమంచిలిది మంచి పుగాకు.

8 ఏప్రియలు, శుక్రవారం :

శ్రీ బాలయ్యగారిని సాగనంపితిని.

23 ఏప్రియలు, శనివారం :

పి. వి. ఆర్. నన్ను మ్యాజిక్ హార్మోనియం.

24 ఏప్రియలు ఆదివారం :

బిధుభూషన్ దాస్

అచ్చువేయడానకు పేపరు పదిరూపాయిీల ఆరణాలు.

శ్రీనివాసాచారి.

26 ఏప్రియల్, మంగళవారం :

సాయంకాలం ట్రెయిన్లో బరంపురం బయలుదేరాను.

రిఫ్రెష్మెంటు రూములో రెండురూపాయలు ఖర్చు.

కోచ్ వాడికి అర్ధరూపాయి.

27 ఏప్రియల్, బుధవారం :

బరంపురంలో కలక్టర్ను కలిస్తిని.

మిస్టరు టయిలరుగారు రేపు యిక్కడకు వస్తున్నారు.

రామయ్యకు రెండు రూపాయలిస్తిని.

28 ఏప్రియలు, లక్ష్మివారం :

ఉదయం మిస్టర్ వుల్ఫుమ్రేను కలుసుకొని ప్రసంగించితిని. గిల్ మన్ కు టెలిగ్రాం. ఖర్చు రూపాయిన్నర.

29 ఏప్రియలు, శుక్రవారం :

మిస్టరు టెయిలరు దొరతో సంభాషించితిని.

30 ఏప్రియలు, శనివారం :

మిస్టరు ఉల్ఫుమ్రే దొరను మళ్ళీ కలుసుకున్నాను.

రెండురూపాయీలు ఋణాం.

ఒక రూపాయి బండిఅద్దెకి.

1 మే, ఆదివారం :

క్యాంపు కంచిలి. సానాక్ గొచ్చా; గ్రాంథికం.

చెరువుకు దక్షిణంవైపు పచ్చని చింతలు, మొదళ్ళంత కొన్ని; వెదురు పొదలించుమించు నీటి ఉపరితలాన్ని తాకుతున్నవి.

2 మే, సోమవారం :

అమీను. పెద్ద జమీందారును కలిశాను.

సోంపేట.

3 మే, మంగళవారం :

క్యాంపు సోంపేట, జలంత్ర మేపు సంపాదించితిని. సోంపేటనుంచి విజయనగరం బయలు దేరాను. రెండున్నర రూపాయీలు రాముడికి. రంగస్వామినాయుడుకొక రూపాయి.

12 మే, లక్ష్మివారం :

చి॥ నాన్నమ్మ వివాహం.

చి॥ బాబు ఉపనయనం.

14 మే, శనివారం :

సదస్యం.

14 జూన్, శుక్రవారం :

తమన్నగర మహారాజావారి వజ్రాల బ్రోచ్ పుండి పోయినదని తెలియజేస్తూ శ్రీ గాలఖ్య్వానాయుడుగారు మహా రాణివారికి యిచ్చిన తంతి కాపీ నొకదాన్ని మిస్టర్ విల్లకు ద్వారకు అందజేస్తిని.

15 జూన్, బుధవారం :

రిఫ్రెష్ మెంటు రూమ్ బిల్లు.

24 జూన్, శుక్రవారం :

ఏదో భూముల తగువుల్లో యిరుక్కున్న రైతులువస్తే వాళ్ళని మ్యానేజరుగారి చెంతకు తీసుకు వెళ్ళండని రీవా మహా రాణీవారు నాతో చెప్పారు. సరేనని రైతులను వెంటబెట్టుకొని మ్యానేజరుగారి ఆఫీసుకు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి మ్యానే జరుగారు ఆపనీ ఈపనీ చూసుకుంటూ ఎన్నలాంఎంతో సేపు

కూచోబెట్టి, పిల్లక దొరగారి చూడ వెళ్ళారు. అక్కడనుంచి తిరిగివచ్చి "దొరగారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అని చెప్పారు.

తీరా నేను వెళ్ళేసరికి దొరగారు తన ధోరణిలో లేరు. చటుక్కున నాకేసి తిరిగిచూసి "మంచిది. ఏమిటీ వ్యవహారం?" అని ప్రశ్నించారు.

"ఈ వ్యవహారం గురించి నాకేమి తెలియదండి. రైతుల్ని మ్యానేజరు గారిదగ్గరకి తీసుకు వెళ్ళమంటేనూ..."

"అలా అయితే నన్ను కలుసుకోవాలని వాళ్ళెందుకను కున్నారు?"

"అనుకో లేదండీ."

"ఈ విషయంలో యాక్షను తీసుకునేది నేను. మేనేజరు కాదు. ఆయనదగ్గరకి మీరెందుకెళ్ళారు? ఇలాంటి వ్యవహారాలు నేను సాగనిచ్చేదిలేదు."

"అసలు వ్యవహారమేమిటో నాకు తెలియదు. ఇదేదో రైతుల వ్యవహారం. వీళ్ళని రీవామహారాణీవారు మ్యానేజరు గారిదగ్గరకి తీసుకు వెళ్ళమంటే సరేనన్నాను. ఇంతే నేను చేసింది."

"హుఁ! నాకు తెల్సును! ఈ వ్యవహారానికంతా మూలం మీరే. యు ఆర్ ఎట్ ది బాటమ్ ఆఫ్ దిస్...... యస్.... మీ ప్రవర్తన గురించి మీరు జాగ్రత్తపడాలి."

"నా ప్రవర్తన నాకు తెలుసును. కాని నేనేమీ 'బాటమ్'లో లేను. మీ కంత కోపం ముంచుకొస్తున్నందుకు నాకు మాత్రం విచారంగా వుంది."

"యస్. యస్; సరే, సరే; ఇక మీరు వెళ్ళండి!"

4 జూలై, సోమవారం:

ఫిబ్రవరి 1896 లో తాకట్టుపెట్టిన నగలు విడిపించాను.

15 జూలై, శనివారం:

మైనరుమహారాజావారికి కుట్టించిన ఆరు వస్త్రలను మైలరింగు డిపార్టుమెంటువారు వెంకటస్వామిద్వారా యివాళ పంపించారు.

16 జూలై, ఆదివారం:

కోట ఆవరణాంతా పరిశుభ్రం చేయించమని కబురురాగా సంజీవరావు పంతులుగారిని పాకీవాళ్ళని పిలిపించమని కోరాను.

మాలిని గురించి రిపోర్టు. గరిశధాన్యం.

20 జూలై, బుధవారం:

మూడు తులముల తొమ్మిది అణాల పరకకు ఒక గురివిందగింజ తక్కువ.

21 జూలై, బుధవారం:

ఇరవైరూపాయలు పుచ్చుకుని, అందులో పంధొమ్మిది రూపాయలు అమ్మకు పంపించాను. పోస్టుజవానుకు అయిదు రూపాయల అరణాలు. అముద్రిత గ్రంధ చింతామణి చందా.

31 జూలై, ఆదివారం:

గార్డియను మిస్టరు డబ్ల్యు. ఎ. విల్లకు, మహారాజ కుమారిక పేరున ఇరవై అయిదు వేలకు స్వయంగా తానే ప్రోనోటు వ్రాశాడు. సంవత్సరానికి నూటికి ఆరురూపాయల వడ్డీ చొప్పున ఈ సొమ్మును మహారాణీవారు యిచ్చారు.

3 ఆగస్టు, బుధవారం :

మహారాణీ సాహేబావారు చెప్పిన ప్రకారం వాచి పెంటలో వున్న సకినేని జగన్నాధరాజుకు కవరుపంపించాను.

20 ఆగస్టు, శనివారం :

బంగారు కంకణాల జతమీద అమ్మ వందరూపాయలు ఆమెకు యిచ్చింది. టంకప్పొడి, లక్క పట్టుతో కలిసి తూకం ఏడుతులాలు.

11 సెప్టెంబరు, ఆదివారం :

మిస్టర్ గిల్మన్ గారను కలుసుకొని, కె. వి. వ్యవహారాలను గురించి ముచ్చటించాను.

గిల్మన్ దొర హంపి, విజయనగర శిథిలాలను చక్కగా ఫొటోలు ఎత్తాడు. శిల్పాల ఫొటోలను చూశాను. ఫొటోగ్రాఫిక్ కెమెరా ఎరువు కావాలన్నాడు.

14 సెప్టెంబరు, బుధవారం :

మిస్టర్ గిల్మన్కు యిమ్మని ఉత్తరం పంపించాను.

15 అక్టోబరు, శనివారం :

పోలో టోర్నమెంటు.

24 అక్టోబరు, సోమవారం :

విజయదశమి. రాజావారికి ఉద్యోగులు అనేక ఫలాలను కానుకలుగా సమర్పించారు.

28 అక్టోబరు, శుక్రవారం :

డవేజరు మహారాణీవారిని (శ్రీ) రామానుజాచారిగారు కలుసుకున్నారు.

4 నవంబరు, శుక్రవారం :

దవేజరు మహారాణీవారి విల్లు.

5 నవంబరు, శనివారం :

ఉదయం తొమ్మిదీ యేభైఅయిదు నిముషాలకు బెనారస్ బయలుదేరాను.

6 నవంబరు, ఆదివారం :

గార్డులకు పారితోషిక రూపాయిలు.

7 నవంబరు, సోమవారం :

వాడీ చేరుకున్నాను. గవర్నమెంటుప్లీడరు కలుసుకున్నాడు.

8 నవంబరు, మంగళవారం :

ఎనిమిదిన్నరకు అహమ్మదునగరు.

పాలు మంచినీళ్లు తెచ్చాడు. తొమ్మిదిన్నర ఖర్చు.

9 నవంబరు, బుధవారం :

వాక చెక్కపెట్టె కొన్నాను.

13 నవంబరు, ఆదివారం :

కాశీలో బాబూ మోహన్‌దాస్ మిత్రాను మహారాజా వారు చూశారు.

17 నవంబరు, లక్ష్మివారం :

కుమారరాజా; స్వామి భాస్కరనందను మహారాజా వారు పిలిపించారు.

18 నవంబరు, శుక్రవారం :

హరివిద్యానాథశాస్త్రి

సీతారాం, అలహాబాద్.

30 నవంబరు, బుధవారం :

బెనారస్ రాజకుమారుడుకు కబురుపెట్టాను.

3 డిసెంబరు, శనివారం :

ఈ వారం అన్నీ విశేషాలే. మూర్ఖట్టు చూడతగ్గదిగా వుంది గవర్నమెంటు పేపరు గురించిన పని ముగిసింది.

4 డిసెంబరు, ఆదివారం :

శ్రీ 'హూ'గారిని చూడడానికి మూడు నాలుగుగంటల మధ్య వెళ్ళవలెను.

17 డిశంబరు, శనివారం :

పి 49/2 గవర్నమెంటు పేపరుసామ్ము ఖర్చయిపోయినది.

29 డిశంబరు, లక్ష్మీవారం :

టర్నరుగురించి బి. ఎస్. వ్రాసిన ఉత్తరం అందింది.

1900

17 మార్చి :

మదరాసులోవున్న మేనేజరాఫీసుకు యెవరో మరి, ఆకాశరామన్న వుత్తరమును వ్రాసిరి.

16 ఏప్రియల్ :

మద్రాసు ప్రభుత్వపు ప్రొసీడింగులు. ఉత్తరువు నెంబరు 357 ఆఫ్ మార్చి 9;1900.

"ఛీఫ్ సెక్రటేరియటు పుస్తకభాండాగారములో వున్న శ్రీ అప్పారావుగారు పేర్కొన్న రికార్డులను, అవి రహస్యముగా

వుంచవలసినవి కానందున, వాటిని పరిశీలించడానికి (శ్రీ) జి. వి. అప్పారావుగారికి అనుమతి ఒసంగడమైనది. ఇందువిషయమై జనరలు రికార్డు డిపార్టుమెంటు సూపరింటెండెంటుతో ఉత్తర ప్రత్యుత్తరాలను జరపవలసినదిగా శ్రీ అప్పారావుగారిని కోరడమైనది.”

29 నవంబరు, బుధవారం :

కలకత్తా చేరుకున్నాము. తెల్లవారిన దగ్గరనుంచీ మేము చూసినవన్నీ వరి పొలాలే. నగరసరిహద్దులు దగ్గర పడుతున్న కొద్దీ మిల్లులు మాకు ఎదురయ్యాయి. నిన్న సాయంకాలము బీహారు మీదుగా ప్రయాణము చేస్తిమి. ఎటుచూసినా సమతల ప్రదేశము. పంటలతో అలరారుతున్నది. జొన్నచేలు, శనగచేలు, చెరుకు, చింతతోటలు పుష్కలముగా కనిపించినవి.

సీల్డా ప్యాలసు అందమైన భవనమే; నివాసయోగ్యం గానూ, సముపాయముగానూ వున్నది. కానైతే పరిసరములు మాత్రం రోతగా వున్నవి. రైల్వేస్టేషనూ, ఫ్యాక్టరీల గడబిడ జాస్తీ. భవనమునకు చుట్టూ కాంపౌండూ, తోటా కలవు. కాంపౌండులో రెండు గృహములు వున్నవి. భవన నిర్మాణములో శిల్పచాతుర్య మేమంత చెప్పుకోతగ్గది కాదు. కాని గదులు వొకదాని కొకటి యెదురెదురుగానూ, విశాలము గానూ వున్నవి. కలకత్తాలో గృహ శిల్పం గొప్పదేమీ కాదు. మాయముండామాటలూ పీనూ, ఇటాలియను ఫెర్గ్యూసను చెప్పినంత సుందరవంతమైనదేమీ కాదు.

మునిసిపలు మార్కెట్టు చూడదగ్గ మనోహరమైన స్థలాల్లోకల్లా ముఖ్యమైనది.

30 నవంబరు, లక్ష్మివారము :

న్యూమన్స్ కేటలాగులో ప్రాచీన భారతదేశ భూగోళ చరిత్ర పుస్తకము వున్నది. ఒక నిఘంటువు. వీటిని కొనవలెను.

పుస్తకశాలవద్ద "ది ఫ్రెంచి యిన్ యిండియా" అనే గ్రంథమును జూస్తిని.

1 డిసెంబరు, శుక్రవారం :

షాపుకు వెళ్ళి గ్రంథాలను ఖరీదు చేస్తిని. హారిసను రోడ్డు విద్యుద్దీపములతో కలకలలాడుచుండెను. వొకదానిని తప్పించి యింకొక సైరుపోస్టునకు దీపపుగ్లోబులు అమర్చబడివున్నవి. వీధి వీధి అంతా ధగ ధగ మెరుస్తూ వేయి చంద్రబింబములు వుదయించినట్లుండెను. వెన్నెల దూరినట్లు వున్నవీధి.

3 డిసెంబరు, ఆదివారం :

మ్యూజియమును చూస్తిని. ప్రాచీన శిల్పఖండములను దర్శించితిని. బౌద్ధశిల్పములే హెచ్చుగా వున్నవి. దుస్తుల అలంకరణములోనూ, అవయవ నిర్మాణపు తీరులోనూ, శిరోజములను దిద్దుకొనుటలోనూ, గ్రీకుల శిల్ప ప్రభావము పొడగట్టుతున్నట్లు నాకు తోచినది. ముఖవిన్యాసములో సైతము గ్రీకుల ప్రభావము కద్దు.

ప్రాకారము అమరావతిలోవలె కాక డాబు దర్పములు లేకుండెను. అక్కడ మరికొన్ని స్థూపములు కలవు. అనేక శిరస్సులు బుద్ధునివీ, బోధిసత్త్వులవీ పదిల పరచి వుంచారు. వీటిలో కొన్ని మహాసౌందర్యముగ చెక్కినవి. శిల్పవిన్నాణము మెన లేనిది.

ఆస్పత్రిః ఇక్కడ ఒక దిక్కున శాసనప్రపలకవున్నది. దీనిని శ్రీ కొంపెల్లి వెంకటరామయ్యగారు బహూకరించారు.

ఇవేకాక, మరికొన్ని జైన విగ్రహములను మ్యూజియములో చూస్తిని. బుద్ధ, బోధిసత్త్వాల విగ్రహములను కడుజాగరూకతతో పరిశీలించినపుడు, నాకు కనిపించిన భేదమల్లా బోధిసత్త్వాల విగ్రహములకు ఆభరణము లున్నవి; బుద్ధ విగ్రహములకు లేవు.

కొన్ని జైన విగ్రహములు సింహమున్నట్లు చెక్కినారు.

కాశీలో ప్యాలసునకు సమీపముగ పార్శ్వనాథుని దేవాలయములు గలవు. రోడ్డునకు పక్కగా వున్న గుడి మొన్న మొన్నటిది. ఇక్కడనుంచి, ప్రాచీన దేవాలయమున కొక రోడ్డు కలదు. దేవాలయము లోపల, కిటకిటలాడుతూ భోపాలు నుంచి యాత్రికులు వచ్చి గుమిగూడివుంచిరి.

అచ్చట మూడు చిన్నచిన్న కోవెలలు గలవు. వీటిలో పీఠములూ, పీఠములలో తీర్థంకరుల విగ్రహములూ ప్రతిష్ఠించి వుంచిరి. ఈ విగ్రహములలో కొన్ని పాలరాతివి. మరికొన్ని నల్ల శానాపురాయివి.

ఒక చాన్దిని. దేవాలయపు స్తంభములు కొన్ని చతురస్రాకారముగానూ, మరికొన్ని యెనిమిది కోణములతోనూ వుండి, వాటిపై స్త్రీల ప్రతిమలు చెక్కబడినవి. (పురుషుల విగ్రహములుకూడ చెక్కి వున్నవి?) ఈ విగ్రహములు గానము చేస్తున్నట్లూ, నృత్యము చేస్తున్నట్లూ, వివిధ భంగిమములతో అలరారుతూ వున్నవి.

ప్రాచీన దేవళములకు ఒక 'శోభ' కలదు; అర్వాచీన దేవాలయములకు మాత్ర మది లేదు. ఇవి యిటీవల కట్టినవే. కాశీలోని హిందూ దేవాలయములను పోలివున్నది.

* * * *

నిన్న రాత్రి నేను సలు థియేటరుకు వెళ్ళితిని. థియేటరు జనంతో కిటకిటలాడుతూ వుంటెను. ఆరుగురు మనుష్యులు నిల బడడానికిమాత్రము జాగా వుంది.

నటుల వేషధారణ యెంతో వాస్తవికముగానూ, సహజముగానూ వుంది. దుస్తులలో ఆడంబరము లేదు. సంగీతము లేనే లేదు. రంగము ముగిసిన తరువాతమాత్రము సంగీతము వినిపిస్తూ వుంటెను. నటన అత్యద్భుతముగా, సొగసుగా వున్నది. బఫూనరీ తప్పించి మిగిలినదంతా సహజసిద్ధమైన పాత్రోచిత మైన అభినయము. విషాదాంత నాటకములలో మధ్యమధ్యన బండ హాస్యము చాలా అసంగతముగా వుంటుంది;

నిన్న ప్రదర్శించిన నాటకము విషాదాంతము.

బెంగాలీ థియేటరుకుకూడా నేను వెళ్ళిచూస్తిని. ఇది మిగుల చిన్నది. నేను వెళ్ళేసరికి వొక ప్రేమ ఘట్టము ప్రదర్శిత మౌతూవున్నది. వొక అమ్మాయికీ, మరివొక నిద్రభంగికీ జరుగు తున్న ప్రేమఘట్టం. యువకుడు చాలాదృఢ కాయుడు. పగడపు రంగుదుస్తులు ధరించి వున్నాడు. పిల్లయితే మధురముగా మాటలాడుతూ, చక్కగా నటిస్తున్నది. కాని, చూడడానికి నాజూకుగా కనిపించ లేదు.

మిగిలిన రంగములన్నీ బఫూనరీలే! ఒక బ్యాలటు మాత్రము బహుబాగున్నది. ట్యూనులు చక్కగా వినుల

వింపుగా వున్నవి. కాని వాయిద్యసమ్మేళనముమాత్రము ఘోరాతిఘోరం!

4 డిసెంబరు, సోమవారం :

హైకోర్టు భవనములను చూడడానకు పయనమైతిని. కోర్టుకవరణ చిన్నదే కాని, అయితే నేమి, మిగుల పరిశుభ్రముగా కడిగిన ముత్యమువలె వున్నది. పార్కు సొగసుగా మురిపెముగా వున్నది. మద్రాసు హైకోర్టునకు యీ అందములేదు. ఇక్కడ చక్కని గాలీ, వెలుతురూ వచ్చునట్లుగా కట్టిన దర్వాజాలు, కిటికీలు మసలడానకు చాలినంత విస్తీర్ణం.

5 డిసెంబరు, మంగళవారం :

ఉదయము, కలకత్తానుంచి బయలుదేరితిని. హుగ్లీ పరిసర వాతావరణం, దృశ్యములు కనులకు విందుగొల్పుతున్నవి. విశేషించి, సితాపూర్ తోటలెంత మనోహరముగా వున్నవని! స్టీమర్లు, పడవలు, మిల్లులు!

6 డిసెంబరు, బుధవారం :

విజయనగరము చేరుకొంటిని. ఉదయము దారిలో భువనేశ్వరాలయమును చూస్తిని. దట్టమైన అడవులమధ్య విశాలమైన మైదానములో దేవాలయపు గోపురములు కనబడినవి. నదీతీరాన, దారి అంతా మంచుతో కప్పి వున్నది.

7 డిసెంబరు, లక్ష్మివారం:

మదరాసు చేరుకుంటిని. ఎస్కార్టుగా ఎనిమిదిమంది. మా కోసము బగ్గీ సిద్ధముగా వున్నది. జయపూరు, తదితర జమీందారులూ వచ్చిరి.

10 డిసెంబరు, ఆదివారం :

రీవారాణి బగ్గీమీద వెళ్ళినది. 'గాబ్బిలి'ని చూసినది.

11 డిసెంబరు, సోమవారం :

సైగ్రాయి మదరాసు వచ్చాడు. రీవారాణి, సైగ్రాయికి వంటకములను పంపించినది. గిల్మన్ వచ్చినాడు.

12 డిసెంబరు, మంగళవారం :

ఆహ్వానసభకు మహారాజా లనేకమంది హాజరైరి.

రీవారాణి "విక్టోరియా ప్రశస్తి" కాపీలను సైగ్రాయికీ, ఆయన సతీమణికీ పంపించినది.

అడ్మిరాల్టీలో ఉదయం

పిట్టలు కిల కిలమని పాడుతున్నవి. ఒడ్డున విరుచుకుపడు తున్న తరంగాలతో, దూరంగా చూస్తున్న కొద్దీ పోనుపోను సముద్ర జలాలు ధగధగ ప్రకాశిస్తున్నాయి. తరంగములు ముందుకు విరుచుకుపడి, ఒడ్డునుంచి వెనుకకు తగ్గుతున్నపుడు నలుపు వర్ణము కనిపించుచుండెను. సముద్రం ఒడ్డున కొంచెము దూరముగా సాలోపులో పచ్చిక మొదిగివుంది. సముద్ర తీరము, దిగువగానూ నేలకు లెవిలుగానూ వుంది.

సముద్రతీరమున కివతలభాగాన కొన్ని తాటిచెట్లూ, చిన్నచిన్న ముళ్ళపొదలూ గాలికి కదలాడుతున్నవి. వాటికి దిగువస్థలాన మరికొంతదూరములో సరుగుడు, కొబ్బరితోటలు కనిపిస్తున్నాయి. సముద్రతీరాన్నుంచి ఒకరోడ్డుమీదుగా వెళితే అక్కడ శ్మశానము. అడ్మిరాల్టీనుంచి మరొక రోడ్డుమీదుగా పోతే బీచి తగులుతుంది. దారిలో సరుగుడుతోటలగానము విని

పిస్తుంది. పోర్టికోకు వెళ్ళేమార్గములో చక్కని పూలతోట, లతామంటపములతో పరిమళములను వెదజల్లుతున్నవి. తోట చుట్టూ వెదురుపొదల కట్టువు కలదు. తోటమధ్య సొగసైన ఫౌంటెనూ, దానిచుట్టూ పూలతివ్వెల పందిళ్ళూ శోభతో అలరారుతున్నవి. పోర్టికో, నాజూకైన గుండ్రని స్తంభములతో కట్టబడ్డది. స్తంభములు పెద్దవేకాక చాలా పొడుగు. స్తంభముల మొదళ్ళు చతురస్రాకారముగా వున్నాయి. స్తంభములమీద పచ్చనిరంగుతో లతలు, తెల్లగా మెరసేటట్లున్న పువ్వులు అంచులుగా చెక్కబడ్డవి.

డ్రాయింగు రూమునకు దిగువన పాలరాతి మేడమెట్లు కలవు. డ్రాయింగురూము లోపలభాగము ఆకుపచ్చనిరంగుతో అద్దకము వేసినట్లున్నది. గదిచెంత పూలలతలు. గది సీలింగు కూడా రంగువేసి వుంచారు. డ్రాయింగురూములోకి వెళ్ళే ద్వారమునకు లలితమైన తెరగుడ్డ అమర్చివుంది. తలుపులకు నలుపురంగు.

ఒక ద్వారముచెంత నిలబడితే యెదురుగ సముద్రం అవుపిస్తుంది. ఇంకొక ద్వారము తెరిచి చూస్తే చుట్టూ వున్న గోడ కనిపిస్తుంది. గదిగోడకు నిలువుటద్దములు, కింద బల్లమీద నల్లని సింహపు ప్రతిమా వున్నవి.

గదిముందు విల్లు ఆకారముతో మనోహరమైన ఒక పూల పందిరి కలదు. అందమైన టేకుబద్ద మీద నగిషీ చెక్కిన చందమున పూలతీగలు అల్లుకున్నవి.

ఆవరణచుట్టూ వున్నగోడకు గదికి యెదురుగ కర్రతో చేసిన గేటువుంది. గేటు చెక్కడపుపని మితముగా వుంది.

గిల్టుతో మలామాచేసిన గేటుమీద రెండు చిన్నసింహపు పిల్లల ప్రతిమలు నిల్చున్నవి. ద్వారపు గోడమీద చిన్ని చిన్ని సిరమిక్సు ఆకృతిని రెండు కొప్పులు.

మీది అంతస్థునకు వెళ్ళేందుకు గేటుచెంతనే మెట్లు వున్నవి. పడమటి దిక్కున కుడివైపు మళుపులు తిరగవలెను.

గదిలో టేబిలుమీద యించుమించు నగ్నముగా వున్న కంచువిగ్రహము యెడమచేత్తో డాలూ, కుడిచేత్తో ముందుకు విసురుతున్న బల్లెమూ పట్టుకుని భయంకరమైన భంగిమలో నిలబడి వున్నది.

15 డిసెంబరు, శుక్రవారం :

'మోడలు ఫారము'నకు పోతిని.

(1) అరటిమొక్క పెరుగుదలకు నిరోధము కలగకుండా వాటి పిలకలను యెప్పుడు తీసివేయవలె ?

అరటిమొక్కలకు యెరువులు. పెంట.

చెరుకు పంట పాడవకుండా, చెదపట్టకుండా కాపుదల చేయవలెను. పొలమునకు చక్కగా నీరుపట్టవలెను. మన్నులో సున్నము వెదజల్లి – యెకరమునకు ఒక అరటన్ను–ఫినాయిలు రెండు గేలనులు. చక్కని నీటిపారుదల.

(2) కాలువ గట్టుల ఏ పంటలు పండించవలెనో.

(3) కాలువలు మేట వేయకుండా అపుట యెట్లు ?

16 డిసెంబరు, శనివారం :

శ్రీ భాష్యంగారు కబురు పంపించారు.

17 డిసెంబరు, ఆదివారం :

మైనరు మహారాజావారిని వైస్రాయిగారు రమ్మనమని వర్తమానం పంపించినారు.

18 డిసెంబరు, సోమవారం :

ఉదయం.

నిన్నరాత్రి చిన్నచిన్న తుంపర్లతో పన్నీరు చల్లినట్లు వానచినుకులు పడినవి.

తూర్పుదిక్కున ఆకాశపు మూలల పొగలవంటి మబ్బులు కమ్ముకు వచ్చాయి. మబ్బులరంగు దట్టముగా లేదు. తూర్పు దిశనుండి మబ్బు లటుయిటూ కదలాడి మిగిలిన ఆకాశమును అక్కడక్కడ పలచని బట్టతో కప్పినట్లు తెరలు తెరలుగా కమ్మినవి.

చల్లని పిల్లవాయువులు వీస్తూ, నీలి ఆకాశము పూర్వ రంగముగా వున్న కొబ్బరితోటలను కదలిస్తూ, అప్పుడప్పుడు మర్మరధ్వని చేస్తూ వున్నవి. ఆకాశమూ, భూమీ కలుసుకున్న చోట, కొంచెము దూరమున ఎత్తుగా విదియనాటి చంద్రుడు. చంద్రునకు దిగువభాగాన, మూడు నాలుగు గజాలదూరంలో చిన్ని నక్షత్రము మిణుకు మిణుకుమని మెరయుచుండెను.

సముద్ర తీరమునకు కొంచెము దూరములో పాయలు పాయలుగా చీల్చుకొని వచ్చే తరంగాలమీద బెస్తవాళ్ళు వలలు వేసి చేపలను పట్టుకొంటూవుండిరి !

20 డిసెంబరు, బుధవారం :

సర్ ఆర్థర్ హేవ్‌లక్ వచ్చాడు. ఇంటర్వ్యూ ముప్పావు గంటసేపు. వెళ్ళిపోతూ ఆయనన్నమాట లివి: "మీదగ్గర *ఆమె వద్ద సెలవు తీసుకునేందుకు విచారముగా వున్నది."

చేయవలసిన పనులు

ఓక్సు వేలంవేసే సెకండు హాండు పుస్తకాలను ఖరీదు చేయడము. ♦ మా తమ్మునికి ఒక గడియారము, ఒక పెన్నూ, అమ్మకు చంద్రహారపు గొలుసు. చక్కసి వాకమప్పటి.

లిటరరీ సొసైటీ లయిబ్రరీనుంచి గ్రంథములను తెచ్చుకోవలెను. ఇండియను ఆంటిక్వరీ ది ఎపిగ్రాఫికా యిండికా. కృష్ణాజిల్లాలోని బౌద్ధశిల్పములను, శాసనములను తెలిపే భోగట్టా.

దృశ్యములు

26 డిసెంబరు, మంగళవారం :

రాత్రి, నీళ్ళల్లో దీపములు ప్రతిబింబించు చుండెను. అక్కడక్కడ వెలుగుతున్న దీపములకాంతి నదీ వక్షోజమున పడి తళతళ మెరుస్తున్నవి.

ఆగ్నేయ దిశను సమీగుము, కొబ్బరితోటలు కలవు. ఈ దృశ్యమును చూసేసరికి, యేదో తెలియని ఉల్లాసమూ, ఉత్సుకతా కలిగినవి.

---

* రీవారాణి

♦ కీ. శే. శ్యామలరావుగారు

మనం, సొగసును, లావణ్యాన్ని సౌందర్యాన్ని భావించుకుంటాము. మనుష్యులపట్లకూడా మనం యింతే. మనుష్యుల గురించి మనకు యెంత తక్కువగా తెలిస్తే అంత యెక్కువగా వారిని గురించి మన ఊహాపోహాలు పోతూవుంటవి. ఈ ఊహాలు యెంతో రమ్యంగా వుండడం కద్దు. ఊహాలు రమ్యంగా వుంటున్నకొద్దీ ఆ మనుష్యులను తెలుసుకోవాలనే ఆసక్తి అధికమవుతూ వుంటుంది.

రాత్రి ఆ నీళ్ళల్లో ప్రతిబింబించే దీపముల కాంతి యెక్కడనుంచి వచ్చి పడుతున్నది? ఆ దీపములు బెంగుళూరు కిరస్తానుల యింగ్లీషు కుటుంబము కాపురముంటున్న బంగళాలోనివి. భార్య కొత్తగా కిరస్తానీమతము స్వీకరించినది. ఇదివరకు ఆమె హిందూ స్త్రీ; నూతనముగా హిందూ స్త్రీని వివాహమాడిన యూరోపియన్ తనమనసులో తనభార్యను గురించి ఏమిఊహించుకొనునో! నిజముగా అతని భావములు గమనించదగ్గవి. ఆమె నడవడి, ఆమె పరిసరములు, ఆమె గత జీవితము, తొలినాటి ముచ్చట్లు చిన్ననాటి వేడుకలు యివన్నీ ఆసక్తిని కలిగించేవే! ఆమె పెనిమిటికి ఊహాలు మధురముగా వుండును కాబోలును!

31 డిసెంబరు, ఆదివారం:

ఈవేళ యేమి రాసేది నేను? ఇవాళేమీ ముఖ్యమైన సంఘటన జరగలేదు. కనక వొక విషయమును మాత్రము చెప్పుకుంటాను. పంధొమ్మిదవ మహాశతాబ్దము నేటితో గడిచిపోయినది.

1901

1 జనవరి, సోమవారం :

నూతన సంవత్సరము. 1901. నూతన శతాబ్దము. పాపం! ఈ శతాబ్దములో జీవించే అదృష్టము మహారాజా వారికి లేకపోయినది!

6 జనవరి, శనివారం .

రాత్రి పదకొండు గంటలకు మదరాసునుంచి బయలు దేరాను.

7 జనవరి, ఆదివారం :

మార్గమధ్యలో వున్నాను.

8 జనవరి, సోమవారం :

విజయనగరమునకు ఉదయమే చేరుకున్నాను.

9 జనవరి, మంగళవారం :

'నేంద్రకోజా' మలబారు అరటిమొక్కను తోటలో నాటితిని.

13 జనవరి, ఆదివారం :

చెరుకుపొలములో యేడుగోజులు గొర్రెలమందను కట్టించితిని. మధ్యభాగంలో నాలుగు రాత్రుళ్ళు.

నిన్న రాత్రి వొక దుక్కి వాన కురిసింది; ఉత్తరమున కట్టు బాగాతడిసింది. మీాదకు కొంచెందూరంగా కట్లు తడవలేదు. బహుశా యిక్కడ వానపడలేదు కాబోలును. చెరువుకు నీరు కట్టించితిని.

18 జనవరి, శుక్రవారం :

పదిహేనో తారీఖున వర్షం కురిసింది. ఇంతవరకూ ఆకాశం మబ్బులతోనే వుంది. వర్షం విపరీతంగా కురియడం వలన గట్టుమీద సర్వేరాళ్ళు కొట్టుకు పోయినవి. మన్ను మేట వేసింది.

అరటితోట వేయడమే మంచిది. మంచి లాభసాటిగా వుంటుంది.

19 జనవరి, శనివారం :

మాధవధారవద్ద పట్టుకొచ్చిన అనాస మొక్కలను నాటించితిని. వెయ్యి ఒక్కంటికి అయిదురూపాయల ఖరీదు. నాకు అవసరం పడ్డవి అయిదువందలు; గెడ్డకు అవతల భాగాన అరటి మొక్కలను పాతించితిని.

వాతావరణం మబ్బుగానే వున్నది. నల్లని మేఘాలు ఆకాశంమీద పరుగులుతీస్తున్నవి. కాని మూడురోజులనుంచి ఒక్క చినుకైనా పడిందికాదు.

మతాడుబొండలో నీరు నిల్వవుంది.

నక్కదోస గింజలు చెరువుగట్టున జల్లించవలెను. గెడ్డమీద కర్బూజాకూడా వేయించవలె.

20 జనవరి, ఆదివారం :

సర్వే, ఫిబ్రవరి 26 వ తేదీన హాజరుకమ్మని కోర్టుసమనులు వచ్చి పడ్డాయి.

14 జూన్ :

ఇవాళ విజయనగరముమీదుగా మిడుతలదండు వొకటి దాటిపోయినది.

29 జూలై :

జోధ్పూర్ మహారాజా అర్జునసింజీ యివాళ వచ్చారు.

31 జూలై :

ఆయనను నే నీనాడు కలుసుకున్నాను. ఆరువేల రూపాయలు నగదు, మరికొన్ని బహుమతులు ఆయనకు యిచ్చారు.

1 ఆగస్టు :

మహారాజా అర్జునసింజీ నేటి సాయంకాలం వెళ్ళిపోయారు.

9 ఆగస్టు :

నిన్నరాత్రి వెంకన్న పంతులుగారు చనిపోయినారు. పాశ్చాత్య నాగరికత తెచ్చిపెట్టిన మంచీ చెడూ ద్విగుణీకృతమై ఆయనలో మూర్తీభవించినవి. ఆయనకు పౌర కార్యకలాపాలపై ఆసక్తి మెండు. మనిషికి ధైర్యం వున్నది. స్వతంత్రుడు; కాని, మనిషి మనసుకు యేదితోస్తే అది, యెంత తోస్తే అంత. ఆలోచనలకు తూకము లేదు.

ఆయనంటే కిట్టనివాళ్ళు ఆయనకుగల చెడ్డగుణాలనే చెబుతారుకాని ఆయన మంచిని ఎన్నికచేయరు. ఆయన చెడ్డను గోరంతలు కొండంతలు చేస్తారు. కాని అటువంటి దుర్గుణాలు ప్రస్తుతం మన సమాజంలోవున్న మేధావివర్గమునకు తప్పని సరిగా వుండకమానవనే విషయాన్ని వీరెవరూ గుర్తించడంలేదు.

మన మతసమ్యకములు. సాంఘిక అభిప్రాయములు, ఆశయములు అంతో యింతో వ్యక్తిగత జీవితాలలో నైతిక ప్రమాణాలను కలుగజేస్తూనే. ఇంకొకవంక సామూహిక జీవితములో సద్భావమును, నీతినీ కల్పించలేకపోతున్నవి; విద్యాధికులైన భారతీయులపై ఇవి తమ ప్రభావమును నెరపలేకపోతున్నవి. పాశ్చాత్య విద్యావిధానము [illegible] గమన శక్తి లేని కేవలము కొన్ని అభిప్రాయములను, ఆశయములను మాత్రమే ప్రపదేశిస్తున్నది. సామూహిక, మేధోజీవిత పరిస్థితులను సమన్వయముచేసే శక్తి యీ పాశ్చాత్య విద్యకు మృగ్యము; పాశ్చాత్య విద్యాజనిత ఆశయముల కిట్టి శక్తి పూజ్యము.

తూర్పు యూరపు ప్రజలనుగురించి క్రీమన్ ఒకచోట పేర్కొన్నట్లుగా, నే నిక్కడ ఒకమాట చెప్పదలచాను. పరస్పర వ్యత్యాసములుగల, విభిన్న సంస్కృతులు రెండింటి మధ్య ప్రస్తుత తరపు జనులు జీవించవలసి వచ్చినది. ఇందులో ఒక నాగరికతకు సూత్రములు కొల్లలుగావున్నప్పటికీ అవి శిథిలమైనట్టివి. ఈ సంస్కృతి పూర్తిగా చివికి శల్యావశిష్టమైంది. దీనికి యితరులతో సమాధానపడు తత్వము లేకపోయినప్పటికీ యిది బహుదుర్బలమైనది. తనకు గల సంకుచితత్వమే దాని దుర్బలత్వమునకు హేతువు. కేవలము సంకుచితదృష్టివల్లనూ, యీ సంస్కృతికి ప్రాతినిధ్యము వహించువ్యక్తులు సాంఘికముగా తక్కువస్థితిలో వుండుటవల్లనూ, తద్వ్యతిరేకమైన పాశ్చాత్య నాగరికతా దోషములను, కెరటములవలె వచ్చి

పడుతున్న విజాతీయ విశ్వాసములను, పద్ధతులను వారు యెదిరించలేక పోతున్నారు.

ఇక రెండవవాని విషయము : ముందుకు నడుచుకు పోవుటలో యిది శక్తివంతమైనది. స్వేచ్ఛాయుతమైనది. ఇది హేతువాదమును ఆశ్రయించుచున్నది.

పాశ్చాత్య నాగరికత కొన్ని అంధవిశ్వాసాలను పోగొట్టుతున్న మాట యథార్థమే అయినప్పటికీ, అది ప్రబోధించే స్వాతంత్ర్యము సాంఘికప్రగతిశూన్యమైనది. ఇది సంపూర్ణస్వాతంత్ర్యము కాదు. నామమాత్రమైనది. ఇది అన్యులకు చోటివ్వదు. ఇటువంటి నాగరికత, మనుజులను అవలక్షణములకు, అస్థిరత్వమునకు, దోషములకు గురిచేసి అక్కడకు తీసుకుపోయి, దిగవిడువక తప్పదు. ఈ అవలక్షణములను, దోషములను, చెడుగులను, ధోరణిని దిగ్విజయముగ యెదిరించి పోరాడుట నేటి ప్రప్రథమ సమస్య.

విజాతీయ నాగరికతా గుణదోషములు రెండున్నా, రెట్టించిన పరిమాణములో శ్రీ వెంకన్నగారి వ్యక్తిత్వమున మూర్తీభవించినవి.

15 నవంబరు :

మొన్న శ్రీ శ్రీనివాస అయ్యంగారు యిక్కడకు వచ్చారు. ఆయనలో వొక వింతపరిణామము కలిగినది. మొదట ఆయన స్వతంత్రయోచనాపరుడైన సంశయవాదిగా వుంటూ, యిప్పుడు అసంబద్ధమైన ప్రతిదానినీ విశ్వసించే, మూఢ విశ్వాసాలను శాస్త్రీయదృష్ట్యా అసంగతంగా సమర్థింపజూసే, థియొసోఫిస్టుగా మారిపోయినాడు !

18 నవంబరు :

పెద్ద ముసురుపట్టినది. కుంభపోతగా వర్షము కురిసినది. ఆముదపు పైరు బాగుగానే పెరుగుతున్నది.

1902

4 మార్చి :

ఉదయము యేడు గంటలకు విజయనగరమునుంచి మద్రాసుకు బయలుదేరితిని. దవేజరు మహారాణీ, రీవా సర్కారు, మైనరు మహారాజా, చిట్టి మహారాణీ సాహెబు, బాబూసాహెబ్, ప్రతాప్‌జీ పెద్దకుమార్తె, ట్యూటరు డాక్టరు లేపింగూ బయలుదేరారు.

5 మార్చి :

ఉదయం యేడుగంటలకు మద్రాస్ చేరుకున్నాము. స్వామి పరమహంస బాలసుబ్రహ్మణ్యంకూడా హెర్ హైనెస్‌తో వచ్చారు. ఆయన ఆమెకు ఆనరబుల్ ప్రైవేటు సెక్రటరీ.

ఆయన శిష్యులు కొందరు ఆయనకోసం వొక బండీ తీసుకువచ్చారు. మరివొక బండీనిండా పూలమాలలు, చందనము. ఆయనకు శిష్యులు ఛత్రము పట్టినారు.

7 మార్చి :

ఈవేళ ఉదయం వొక మొదలియారు యువకుడు స్వామిజీని సందర్శించ వచ్చాడు. మొదలియారు యువకుడు పట్టభద్రుడు. తమిళమున "ఉత్కృష్ట మతము: హిందూవేదాం

తము” అనే గ్రంథము వ్రాసినాడట. విద్యాధికులైన హిందువులకు మరి వేదాంత విషయపరిజ్ఞానము శూన్యమని, యేమేమో గొప్పగా చెప్పుకొచ్చినాడు. అబ్బో! నా మొహాం యెదుటనే, నన్ను గురించి అతిగా ప్రశంసావాక్యములు పలుకుతూ పేర్కొన్నాడు: “మీది మహోన్నతమైన ఆత్మ!”

అతని రిమార్కును ఆ భగవంతుడే రక్షించుగాక !

9 మార్చి :

తన చిన్న కుమారుని వెంటబెట్టుకొని బొబ్బిలి మహారాజావారు యీదినం వచ్చినారు. జమీందారులకు ట్యూటరులుగా వుండేందుకు యింగ్లీషువాళ్ల కంటె ఆంగ్లో యిండియనులే తగునని అభిప్రాయపడుతున్నామని ఆయన చెప్పారు.

బొబ్బిలి చరిత్రమును తెలుగులో తాము ప్రచురించితిమని తెలియచేశారు. ఇందులో మొదటిభాగము స్వర్గీయ శ్రీ రామమూర్తిపంతులుగారు రచించిన వెలమ కులమును గురించిన భోగట్టాలోను, రెండవభాగమును తాము రచించిన బొబ్బిలి చరిత్రమును ముద్రించిరట.

10 మార్చి :

నిన్న సాయంకాలము మేము శ్రీ కృష్ణ భాగవతి హరికథా కాలక్షేపమునకు వెళ్లితిమి. శ్రీ కృష్ణ భాగవతారిది తంజావూరుజిల్లా. ఆయన గొప్ప గాయకుడే కాక, తెలివితేటలు గల వ్యక్తి. తమిళమున రుక్మిణీ కళ్యాణము కథను హృదయరంజకముగ చెప్పినాడు. కథ చెప్పుతీరు బాగున్నది. మిక్కిలి ఉత్సాహముతో శ్రద్ధతో విని జనులు సంతోషపడిరి. సంస్కృత

28

శ్లోకములు, తెలుగు పద్యములు, తమిళ, కన్నడ, మళయాళీ కీర్తనలు ఆయన పాడెను. తెలుగు పద్యములు, సంస్కృత శ్లోకములు భాగవతములోనివి.

కథా కథనమందు శ్రోతరయే ఆయన విజయమునకు కారణము.

1903

1 మార్చి :

అస్తబలు నా అజమాయిషీక్రిందకు వచ్చినది.

7 ఏప్రియలు :

విజయనగరంనుంచి మద్రాసుకు బయలుదేరితిని.

8 ఏప్రియలు :

మద్రాసు చేరితిని.

10 ఏప్రియలు :

సర్ భాష్యంగారు వచ్చిరి.

11 ఏప్రియలు :

కూనూరుకు ప్రయాణము.

14 ఏప్రియలు :

ఒకరోజు ఊటీలో.

18 ఏప్రియలు :

బాలయ్య నాయుడుగారు వచ్చిరి.

11 జూన్ :

ఊటీనుంచి బయలు దేరితిని.

14 జూన్ :

మద్రాసులో.

20 జూన్ :

విజయనగరమునకు బయలు దేరితిని.

13 జూలై :

శర్మగారు విశాఖపట్టంలో మరణించిరి. సమస్థానముపై దావా.

26 డిసెంబరు :

పిఠాపురం రాణులలో ఒకామె కోటకు వచ్చినారు.

1904

27 ఏప్రియలు :

విజయనగరమునుంచి ఊటీకి బయలు దేరితిమి. స్టేషను వద్ద తునిరాజుగారు తన మేనల్లుళ్లను వెంటబెట్టుకొని, మహా రాజాను చూడవచ్చిరి.

28 ఏప్రియలు :

మద్రాసు వచ్చితిని. మా అమ్మాయికి వొంట్లో బాగు లేదని టెలిగ్రాము వచ్చినది.

29 ఏప్రియలు :

నాన్నమ్మకు కులాసాగా వున్నదని మళ్లీ టెలిగ్రాం.

30 ఏప్రియలు :

శ్రీ రంగాచారిగారు వెళ్ళిపోయిరి.

31 ఏప్రియలు :

సర్ భాష్యంగారు వచ్చిరి. కూనూరుకు బయలు దేరితిని.

1 మే :

కూనూరు చేరితిని.

9 మే :

ఊటీకి వచ్చితిని.

11 మే :

మిస్టర్ గిల్మన్ వచ్చాడు.

16 మే :

మిస్టర్ లారోన్స్ వెళ్ళిపోయినాడు.

23 మే :

లేడీ ప్రిన్సు వచ్చినది.

30 మే :

ది ఆనరబుల్ మిస్టర్ స్టోక్స్ వచ్చినాడు. కాగితములపై దస్కత్తులయినవి.

2 జూలై :

ఊటీనుంచి బయలు దేరితిని.

3 జూలై :

మద్రాసు చేరితిని.

4 జూలై :

సర్ భాష్యంగారు వచ్చిరి.

6 జూలై :

మిస్టర్ డ్వేల్, ఆయన సతీమణి యింటికి వెళ్ళిరి.

1905

15 ఏప్రియల్ :

మద్రాసుకు చేరుకుంటిని.

24 ఏప్రియల్ :

మా నాయనగారు పరమపదించుటవల్ల నేను విజయ నగరమునకు బయలుదేరితిని.

7 మే :

ఊటీకి పోవుటకు విజయనగరమునుంచి బయలుదేరితిని.

8 మే :

మద్రాసులో.

10 మే :

మద్రాసునుంచి బయలుదేరితిని.

11 మే :

ఊటీకిచేరితిని. రైలులో మిస్టర్ లార్మర్ నాతోపాటు ప్రయాణము చేసినాడు. నేను ఊటీకి వెళ్ళునప్పటికి మిస్టర్ చూథాంప్సన్ నాకోసం యెదురుచూస్తున్నాడు. శుక్రవారము నాడు మిస్టర్ గిల్మన్ వచ్చాడు.

26 మే :

మిస్టర్ లార్మర్ వెళ్ళి పోయినాడు.

29 మే :

మహారాజావారు ప్రభుత్వ భవనములో గవర్నరును కలిసిరి.

5 జూన్.

గవర్నరు సతీమణి మహారాజునుచూడడానికి వచ్చినది.

1906

12 జనవరి, శుక్రవారము :

తాళపత్రగ్రంథములు సంపాదించితిని.

16 జనవరి, మంగళవారం :

శ్రీరామమూర్తి గ్రంథము రెండవభాగమును ఫైలు చేయవలెను.

18 జనవరి, లక్ష్మివారం :

వెలగాడగ్రామమునకు రోడ్డు.

22 జనవరి, సోమవారం :

వార్తేరుకు బయలుదేరితిని.

27 జనవరి, శనివారం :

మహారాణి, ప్రిన్స్ ఆఫ్ వేల్సును చూసినది.

1911

12 జనవరి గురువారం :

శ్రీ వీరేశలింగం పంతులు నిశ్చయముగా మహాపురుషుడు. సాహిత్యములో వొక శాఖను ప్రారంభించి, సంఘములో పురోభివృద్ధిపంథా లేవదీసిన మాన్యుడు. ఇది మిగుల కష్టతరమైన పని. తెలుగు దేశపు సేనాధిపతులైన వంశపురుషుల రక్తము ఆయనలో ప్రవహించుచున్నది. కనుకనే వారిలో సాహసము, నిశ్చలత్వము కనబడతవి.

27 మార్చి :

నాది ప్రజల వుద్యమము. దానిని యెవరిని సంతోష పెట్టడానికైనా వదులుకోలేను.

1913

1 జనవరి, బుధవారం :

సర్ జాన్ ఎట్కిన్సన్‌ను కలుసుకున్నాను. మనిషి మంచి మర్యాదస్థుడు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెళ్ళిపోయిన తరువాత వొకసారి మళ్ళీ ఆయనను చూడవలసివుంది. ♦రామమూర్తికి రావుసాహేబ్ బిరుదు వచ్చినందుకు నాకు అమిత ఆనందం కలుగుతున్నది. ఆహ్లాదకరమైనవార్త. కాస్మాపాలిటన్ క్లబ్బులో రామచంద్రరావు కనిపించి యీ విషయం ప్రసంగిస్తూ "మన ఉద్యమానికిది వొక గొప్పవిజయ మన్నా"డు.

♦ వాగను శాసనులు శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు

2 జనవరి, లక్ష్మివారం :

15 వ తేదీన వారసత్వపు దావా అపీలు విచారణకు వస్తుంది. వాదులు వాయిదాకోరితే, దాన్ని శ్రీనివాసయ్యం గారంగీకరిస్తేతప్ప, మళ్ళీ 'యీరింగు' పడదు. ఇకవాయిదా యివ్వాస్తికాదని మేం వాదిస్తాం.

జస్టిస్ పి. ఆర్. సుందరఅయ్యరును చూస్తిని. తెలుగు కథలనుగురించి వొకనోట్ రెండుమూడు రోజుల్లో రాసి యియ్యాలట. 10 వ తేదీన మీటింగు.

శేషయ్యరునుకూడా ఇవ్వాళనే కలుసుకున్నాను. మిస్టర్ హాంటర్, ఏట్సు, శేషగిరిరావులకు లేఖలు రాశాను. మహా రాజాకు వైర్ యిచ్చాను.

3 జనవరి, శుక్రవారం :

మిస్టర్ ఫౌలర్ నావిజయనగరం చిరునామాకు తంతి యిచ్చాడట. బహుశా విల్లునుగురించే అయివుంటుంది. లాయరు కిచ్చిన సూచనలను మార్చుకోవలసివచ్చింది.

4 జనవరి, శనివారం :

మదరాసు నుంచి బయలు దేరాను. హెచ్. హెచ్ కి వైరు (అ) తెలుగు (ఆ) సివిలియన్సుకు తెలుగు.

5 జనవరి, ఆదివారం :

ఏలూరులో.

విజయనగరం చేరుకున్నాను. రాజమండ్రిలో 'గున్నేశ్వ రావు కనిపించి ప్రదర్శించుకుందుకు తెలుగు నాటకాలు కావాలని అడిగారు.

6 జనవరి, సోమవారం :

మిస్టర్ ఫౌలరూ, మహారాజావారూ, నేనూ, కీర్తిశేషులైన మహారాజావారి 'విల్లును'ను గురించి చర్చించుకున్నాం.

9 జనవరి, లక్ష్మివారం :

విజయనగరం నుంచి మద్రాసుకు బయలుదేరాను.

12 జనవరి, ఆదివారం :

స్వామి అయ్యరు యింట 13 వ తేదీన పార్టీ. మాక్కు-హంటర్‌ను, మిస్టర్ గిల్‌మన్‌ను చూస్తిని.

14 జనవరి, మంగళవారం :

ఎమ్. జి. నటేశంగారియింట ఆరున్నర గంటలకు పార్టీ.

16 జనవరి, లక్ష్మివారం :

గవర్నర్ విజిట్; తిరుగు ప్రయాణం.

23 జనవరి, లక్ష్మివారం :

పేజి 360* జె. యమ్. యల్. యస్. అక్టోబరు 1839 సంపుటి పది.

తెలుగుభాషా సాహిత్యములమీద రచించిన వ్యాసం. తెలుగు పద్యములను రెండు తరగతులుగా విభాగించుకో వచ్చును. పాప్యులర్; క్లాసికల్.

(షరా : ఇది స్థూలమైన విభాగం)

పాప్యులరు కృతులు (సామాన్య కావ్యములు) సమాన ప్రమాణంగల ద్విపదలలో రచింపబడ్డవి. పాశ్చాత్య సాహిత్యం

*జర్నల్ ఆఫ్ ది మెడ్రాసు తెలుగు సొసైటీ.

లోని కథాగేయములవలె యివి జన బాహుళ్యానికి పరిచితమైన శైలిలో వ్రాయబడినవి.

క్లాసికల్ (మహాకావ్యములు) కృతులు సాధారణముగా పద్యాలలో వ్రాయబడినట్టివి. గ్రే, హోరేస్‌ల కృతులతో వీటిని సరిపోల్చవచ్చును.

వీటికి శబ్దాడంబరం ఎక్కువ. శబ్దాడబరానికే ప్రాధాన్యత లావు. కాని పద్యపాదాలలో అభిరుచికలిగించే గుణం, సౌకుమార్యం వుందనడానికి సందేహం లేదు.

చాలా పద్యాలలో ముఖ్యంగా సీసపద్యాలలో ఒక్కే ఒకభావం పదేపదే మూడు నాలుగుసార్లు ఆవృతమౌతూ వుంటుంది. భావ ఒకటే. కొద్దిగా పదాలుమాత్రం తేడా. ఇవి తెలుగుభాష నేర్చుకుందామనుకునే విదేశీయుడికైతే బాగా ఉపయోగపడతాయి. అతనికి అమరకోశం అక్కరలేదు. ఇవి చాలును. కాని యీ పద్యపాదాలుమొత్తానికు సొగసుగా వుండవు.

ఇట్టి పదాడంబరంలేని ద్విపద కావ్యాలు విదేశీయుని అభిరుచులకు సరితూగగలవి. ఇవి సహజంగానూ, లలితంగానూ వుంటాయి. కనక, విదేశీయుల మెప్పుదల పొందగలుగుతాయి. శబ్దాడంబరం లేకపోవడం చాదస్తులైన బ్రాహ్మణ పండితుల దృష్టిలో పాకదోషం. దీనికితోడు యింకొకటి: చాలా ద్విపదకావ్యాలు, బహుశా అన్నీ, వారి దృష్టిలో తక్కువే. సాధారణంగా పద్యకావ్యాలు మాత్రం పవిత్రమైన జాతికి చెందినట్టివి! కోదండరామ, కాంతాలలామ సుమతీ శతకం, యిత్యాదులన్నీ తక్కువజాతికి చెందినకృతులు. వేమన

శతకం, సీతారామశతకం, కాంతాలలామ, యిలాంటివి కేవలం వాట్టి గ్రామ్యభాషలో వ్రాయబడ్డవని పండితప్రకాండుల లెక్క. (ఇది చాలా వివిక్తమైనమాట. పండిత సంప్రదాయమైన సంస్కృతపద జటిలత్వముగల కవితాపద్ధతులతో ఛందస్సుతో వీటిని పోల్చి చూస్తున్నారు. ఈ జానపద గేయాలలో శబ్దసౌష్టవం లేకపోయినా, కవితాశిల్పం లేకపోలేదు. సర్వజన సంపత్తిగానైన జానపదగేయములు విదేశీయులకు ఆకర్షణీయములు. దేశమున ప్రాముఖ్యము పొందిన శైలిలో, భావములను వివిధరీతుల వ్యక్తీకరించడంవల్ల ఇవి విదేశీయుల ఆదరణను పొందగలుగుతావి. ఇందుగల భావవ్యక్తీకరణ పద్ధతి వారికెంతో ప్రయోజనకారి.)

ఇవి కాక మరికొన్ని కథారూపమున వున్న బ్యాలెడులు కలవు. ప్రత్యేకమైన ఒకవిధమగు సంగీతం యీ వీరకథలలో సహజం. ఇవి పెద్దవి. మార్గ కవితారీతులకు, ఛందో నియమములకు యివి విభిన్నం. బొబ్బిలికథ (రంగారావు చరిత్ర) నాగమ్మకథ మొదలైనవి యీ తరగతికి చెందినవి. ఆనోటా ఆనోటా ప్రచారంలోనికి వచ్చి యివి జనులవల్ల పదిలపరచబడ్డవి. మొన్నమొన్నటి వరకూ యివి అచ్చుకు నోచుకోలేదు. ఈ కథలు దేశంలో నలుమూలలా బహుళ వ్యాప్తి చెందాయి. పండితులు వీటిని తిరస్కారభావంతో తోసిపుచ్చినా, గ్రామ్యమని, నిరసించినా, వీటిని దేశీయులు పాడుకుంటూ వుంటారు.

పేరా 67 ;

వ్యాఖ్యానంతో ఒక్కసారి ముద్రింపబడింది. పదిమందికీ తెలిసే తెలుగులో వ్రాసినవ్యాఖ్య. ప్రతిపదానికీ విపులమైనఅర్థం.

367 :

వైదికమత ప్రధానమైన బ్రాహ్మణుల సాహిత్యమువలె, జైన, శైవవాఙ్మయములు, సౌకుమార్యము గలవి.

376 :

త్వరలోనే మద్రాసులో అచ్చుకానున్న ఒక కావ్యము నుంచి కొంతభాగము యిందు ఉదహరింపబడ్డది. ఇది దేశంలో గొప్ప ప్రసిద్ధికెక్కిన కావ్యం. బహుళ ప్రచారంలోవున్న కావ్యం. అదే సారంగధరచరిత్ర. ద్విపద. ఇదికాక చామకూర వెంగళరాజు మధురమైనఉదాత్తశైలిలో రచించిన యిదే కావ్యమున్నదికాని విదేశీయులకు ద్విపదకావ్యం హెచ్చుగా ఉపయోగపడుతుంది. ద్విపదలను సహజ సిద్ధమైన సంభాషణ పూర్వక శైలిలో వ్రాయడమే యిందుకు హేతువు. అక్కడక్కడ సారంగధర ద్విపదలోని శైలిని బట్టిచూస్తే యిది ప్రాచీన కావ్యమని రుజువవుతుంది; కాని శైలి నేటికి కూడా సుపరిచితమయినదే.

13 ఫిబ్రవరి, లక్ష్మివారం :

రెండుసంతకాలు. పెద్దచెరువు. మహారాజా ఫోటోను ఉపయోగించవలెను.

22 ఫిబ్రవరి, శనివారం :

ఆక్స్‌ఫర్డు యూనివర్సిటీ హేండ్‌బుక్కు

పంచాపకేశఅయ్యరు

7 ఏప్రియల్, సోమవారం :

విజయనగరం నుంచి బయలుదేరాను. రాజమండ్రిలో వీరేశలింగం పంతులుగారు బండి యెక్కారు. ఇద్దరమూ కలిసి ప్రయాణం చేశాము.

8 ఏప్రియల్, మంగళవారం :

మద్రాసు చేరుకున్నాను.

9 ఏప్రియల్ బుధవారం :

పరీక్షాధికారుల సమావేశం

14 ఏప్రియలు, సోమవారం :

విజయనగరం నుంచి బయలుదేరాను. మోడరన్ రెవ్యూ.

15 ఏప్రియల్, మంగళవారం :

మద్రాసు చేరుకున్నాను.

ఫ్రెంచి బుక్కు కోసం వెంకటచలానికి, హైద్రాబాదతనికి ఉత్తరాలు రాశాను.

23 ఏప్రియల్, బుధవారం :

జస్టిస్ పి. ఆర్ సుందరయ్యరును కలిశాను.

రామేశం బుక్కు. రామకృష్ణ కవిగారికి ఉత్తరం వ్రాశాను.

వెంకటచలం లక్ష్మివారం వస్తాడుట.

24 ఏప్రియల్, లక్ష్మివారం :

పరీక్షాధికారులకు ఉత్తరాలు వ్రాశాను.

26 ఏప్రియల్, శనివారం :

సింహాచలం శాసనము.
తిమ్మరుసుమీద గ్రంథం.
విన్నకోట పెద్దన వ్యాకరణం.
దంతులూరి.

1 మే, లక్ష్మివారం :

విజయనగరంనుంచి నీలగిరి కొండలకు బయలు దేరాను. టెక్స్ట్ బుక్కు కమిటీలోవున్న మిస్టర్ 'ఊస్' దొర కంపార్టుమెంటులో తారసపడ్డాడు. మనిషి ప్రసన్నంగా వుంటాడు. ఓర్మితో ప్రతీదీ వింటాడు, తెలుగును గురించి చాలాసేపు చర్చించుకున్నాము. దొర మంచివాడు; కనుకనే కంపార్టుమెంటు కిటికీ నన్ను మూసి వేసుకోనిచ్చాడు.

2 మే, శుక్రవారం :

మిస్టర్ మిషెల్ మాట్టును ట్రెయిన్లో చూశాను. చివరికెలా అయితేనేం, అతన్ని కలుసుకోగలిగాను. మెయిలు కేరేజీలో ఇద్దరమూ ఎక్కాం. 3 రూపాయిలు చెల్లించాం. ప్లాటుఫారం మీద అతను అదృశ్యుడయాడు.

హైలాండ్సుకు చేరుకున్నాను. లోనికి వెళ్ళమని మహారాణీవారు డ్రాయింగు రూము చూపించారు. పూలపందిర, కొండలు, లోయలు, దిగువను సమతల ప్రదేశం. ప్రకృతిశోభ ఒక కలవలె తోస్తున్నదని ఆమె అన్నారు. నిజమే మరి, ఇది అందమైన ఒక కల! గది చక్కని అలంకరణతో అలరారుతున్నది.

నీలిపూల లతలు తలలు వూపుతూ స్వాగతమిస్తున్నవి. ఉక్కింతలు కూడా కలవు.

10 మే, శనివారం :

ఊటీకి బయలుదేరి వెళ్ళాను.

14 మే, బుధవారం :

మహారాణీవారి కోసమని షేక్స్పియరు నాటకం కొన్నాను.	1-12-0
టైమ్స్ ఆఫ్ ఇండియా	0 -4-6
	2 -0-6

15 మే, లక్ష్మివారం :

ఉదకమండలం బయలుదేరి వెళ్ళాను.

23 మే, శుక్రవారం :

గురువులుకి నాల్గురూపాయ లిచ్చాను.

12 జూన్, లక్ష్మివారం :

కెనమెరా లైబ్రరీలో, (1) అనంతపురం మాన్యుయల్ (2) బళ్ళారిజిల్లా మాన్యుయల్, (3) మద్రాసు లిటరరీ సొసైటీ జర్నలు, విన్నకోట పెద్దన, జర్మన్ పండితుడు వ్రాసిన వ్యాసము యూనివర్సిటీ నోట్‌బుక్కును చూడవలెను. దత్త మండలముల శాసనముల పుస్తకము.

17 జూలై, లక్ష్మివారం :

క్రింది అంతస్థుకు దూలాలు $8 \times 17' \times 10'' \times 12'$

మీాది అంతస్థుకు దూలాలు $8 \times 16' \times 9'' \times 11''$

26 జూలై, శనివారం:

మొంటాడ ప్రాజెక్టు సమాచారం.

8 ఆగస్టు, శుక్రవారం:

శ్రీ కె. లింగమూర్తి, శ్రీ వీరేశలింగంపంతులుగారి లైబ్రరీ!

14 ఆగస్టు, లక్ష్మివారం:

స్వామిగారి	రామాయణము
చిలకమర్తి	పద్మనాభము
గున్నేశ్వర్రావు	

15 సెప్టెంబరు, సోమవారం:

పారిస్‌లోవున్న మిస్టర్ మ్యారెల్‌కు పబ్లిక్ లైబ్రరీలో నాకు కావలసిన సమాచారము లభియించగలదేమోనని ఉత్తరం వ్రాస్తిని. ఇంపీరియల్ లైబ్రరీలోని లైబ్రేరియనుకు, పారిస్ విశ్వవిద్యాలయములోని హిస్టరీ ప్రొఫెసరుకూ లేఖలు వ్రాస్తిని.

డూప్లేను గురించి ఫ్రెంచిభాషలో ఏమీ గ్రంథమే లేదా?

స్కూలు పుస్తకములు, అక్కరకువచ్చే సారస్వతము.

◆ ◆ ◆

శ్రీ అ. రామమూర్తి పంతులుగారు: ఆయన ధరించే వస్తులు.

17 అక్టోబరు, శుక్రవారం:

థేకరేస్ రెడ్యూసుడు సర్వే మ్యాప్ ఆఫ్ ఇండియా, అండ్ బర్మా బ్రిజె. జి. చార్తోలోమ్యూ, డబ్బై మైళ్ళకు వొక అంగుళము స్కేల్.

సెయింట్సుబరీస్ యింగ్లీషునవల
సెనేటు సమావేశము.

18 అక్టోబరు, శనివారం :
సెనేటు సమావేశము.

19 అక్టోబరు, ఆదివారం :
ద్రవిడియను బోర్డాఫ్స్టడీసు మీటింగు.

20 అక్టోబరు, సోమవారం :
ఇంటర్మీడియేటు తెలుగు కాంపోజిషను సబ్ కమిటీ సమావేశము.

23 అక్టోబరు, లక్ష్మీవారం :
రాజమండ్రీ మెయిలుకు అందుకోవలెను.

4 డిసెంబరు, లక్ష్మీవారం :
రిసప్షెను పెండాలుకు రావలసినదని ఆహ్వానము. ఎల్. టి. హారిస్.

5 డిసెంబరు, శుక్రవారం :
సాయంకాలము నాలుగుగంటల పదిహేను నిమిషము లకు శంకుస్థాపన మహోత్సవము.

1914

1 జనవరి, మంగళవారం :
చిరునామాలు : ఏబ్సు; డబ్ల్యు. బి 18 ఉబర్న్ బిల్డింగ్స్; యస్. డబ్ల్యు.

ఆర్. కిప్లింగ్: రవెనన్స్ స్వ్యాస్; యస్. డబ్ల్యు. జి. కె. ఛస్టర్టన్: నోవర్ రోడ్స్; బేకన్స్‌షీల్డు ఒక్స్, నాటక రచయిత మిస్టర్ జార్జి బెర్నార్డ్‌షా: 10 అడెల్ఫి టెర్రేస్; డబ్ల్యు. సి.

* * *

దేవతా పూజలకుం అంగరంగభోగానకుం యిప్పించ్చి; కపాలానకుడిచిన; దీని యెవ్వరు దప్పినా.

17 జనవరి, శనివారం:

సర్ మ్యురేను మధ్యాహ్నం పన్నెండు గంటలకు కలిశాను.

* * *

సంధి వ్యావహారికభాషలోగల ఉచ్చారణకు సన్నిహితముగా వుండేటట్లు చేద్దామనే ప్రయత్నం కానరాదు. సంధి కార్యములు భాషలో స్వతస్సిద్ధంగా యేర్పడినవే తప్ప, అవి కృతకమైనవిమాత్రం కాదు.

లిఖితపూర్వకమైన భాషను చదివేటపుడు చదువరుల ఉచ్చారణశక్తిమీదనూ, ఉదాత్తానుదాత్తాది స్వరభేదము వల్లనూ యివి యేర్పడతాయని రామయ్య వాదిస్తున్నాడు. ఇది సంగీతం అవుతుందేతప్ప భాషాలక్షణంమటుకు కాదనే సంగతి ఆయన మర్చిపోతున్నాడు.

ఇక లక్ష్మణరావుకు సంప్రదాయంమీద విశ్వాసం. సంధికార్యములవలన వాక్యములలో లయా, స్పష్టతా యేర్పడతాయని ఆయన భావం.

కొనసాగు *యు. జి. కె. యస్. సైతం వాడుకలోని సంధిని అనుసరించడానికి తల పెట్టింది. తుమున్నాద్యర్థకము తరవాతవచ్చే కొట్టపడు మొదలైనచోట్ల సైతం ద్రుతప్రకృతికాను నిర్లక్ష్యాం చేసింది.

రామయ్యవాదిస్తున్నట్లుగా ద్రావిడభాషల ధ్వని వుచ్చారణ క్రమం గ్రాంథికభాషను అనుసరించి యేర్పడినట్లయితే; అంటే గ్రాంథికభాషకు స్వతస్సిద్ధముగా వొక ప్రత్యేకధ్వని శాస్త్రమన్నదే వున్నట్లయితే, దానిని మార్చడానికి ఆయనకు

*ఆ కాలంలో మద్రాసులో యేర్పడిన "ఉపయుక్త గ్రంథకరణసభ" బాలవ్యాకరణకర్త చిన్నయసూరి దీనికి కొంతకాలం గౌరవాధ్యక్షులు. స్కూలు పుస్తకాలను గ్రాంథికభాషలో వ్రాయింపించి ప్రచురించడం దీని ఆశయం.

స్కూలు పుస్తకాలలోని గ్రాంథికభాష సులభద్యోతక మయేందుకు జటిలమైన కొన్ని సంధికార్యములను పరిత్యజించి వాడుకలోవున్న కొన్నిటిని గ్రహించింది. 1856 లో యీసభవారు అనుసరించిన యీ పద్ధతి తెలుగు భాషాచరిత్రలో వొకమార్పు. కాని వాడుకలోలేని పాతబడిన పదాలను అర్థం చేసుకోగలిగిన విద్యార్థికి ఉపయుక్త గ్రంథకరణసభ "అవసరమైన వేద్యంగా" సంధిలో తలపెట్టిన యీ మార్పు ఉపకరించలేదు. కాగా తరవాత వచ్చిన గ్రాంథికభాషా రచయితలకు కేవలం సంధిని వుల్లంఘించడమే వొకవ్యాసంగా మారిపోయింది.

ఉపయుక్త గ్రంథకరణసభ ఆనాడు కావించిన యీ మార్పును దృష్టిలో పెట్టుకొని 1912 వ సంవత్సరం మే నెల 15, 16 తేదీల్లో తెలుగు అకాడమీ ఆధ్వర్యాన మద్రాసులో జరిగిన పండిత పరిషత్తు పద్యరచనలో వ్యాకరణ బద్ధమైన సంధిసూత్రాలను తప్పక అన్నిటా పాటించితీరాలనీ, పిల్లల కుపయోగపడే పుస్తకాలను రచించేటప్పుడుమాత్రం వ్యాకరణసూత్రాలు ఆమోదించినచోట మాత్రమే సంధిని సడలించాలనీ, మామూలు గ్రంథరచన గ్రాంథికభాషలోనే కొనసాగాలనీ తీర్మానించింది.

అధికారం యెలాగు వచ్చింది? ఇందుకు యడాగమం వొక దృష్టాంతం. సంధిలేనిచోట కళలమీద యడాగమం వస్తోంది. గ్రాంథికభాషలో 'య' ఆదిగాగల పదాలు లేవని చెప్పినా, వాడుకభాషలో కొన్నివున్నాయి. కృతకంగా తెచ్చిపెట్టుకొన్న యడాగమం చెవులకు వెటుకుగా వుంటున్నది. ఆధునిక తెలుగు భాషలో ద్రుతప్రకృతికాలు యించుమించు నశించిపోయినట్లే.

గ్రాంథికభాషలో సంధిలేనిచోట కళలమీద మాత్రమే వచ్చే యడాగమం యే పదాలను ద్రుతప్రకృతికాలని గ్రాంథిక భాషావ్యాకరణాలు స్వీకరించాయో, అవే ద్రుతప్రకృతికాల మీద ఆధునిక గ్రాంథికభాషలో యడాగమం వస్తున్నది. ద్రుతప్రకృతికాలు వున్నవనేవిషయం, చాలామంది పండితుల మనసునుంచి తొలగిపోయిందనే కదా దీని అర్థం!

లక్ష్మణరావు చెబుతున్నట్లుగా ధ్వనులకలయికమాత్రమే సంధికాదు. రామయ్య యింతకంటె కొంచెం జాగ్రత్తవహించి సంధి అంటే పదాదిని, పదాంతమందువచ్చే మార్పులుగా పరిగణిస్తున్నప్పటికీ, అవి యేమిటో స్పష్టంగా నిర్వచించడం లేదు. సరే, విసంధి యేమంత క్లిష్టమైన సమస్యకాదు.

చిలకమర్తి 'మహాపురుషుల జీవిత చరిత్రము': యుపనిషత్తులు జదివి, యదిమొదలు, యీయన, నాయక, యతడు, యక్కడస్థాపించియందు, యట్లుచేయ, యీడుదాని, యెచ్చట, యర్థము, యన్నము, యుద్యోగము, యధికమయ్యె, యుత్తర ప్రత్యుత్తరము, యనుచితము, యుపన్యాసము, యనంతరము, యాచారము; సహజజ్ఞానియని యనేకుల యభిప్రాయముచేసి యాయాదేశములందున్న;

18 జనవరి, ఆదివారం :

సాహిత్యపరిషత్తు వార్షిక సమావేశానకు హాజరయితిని. సమావేశమునకు పండితహరప్రసాదశాస్త్రి అధ్యక్షతవహించిరి. పాలీభాష పూర్వమొకప్పుడెంతో ప్రాచుర్యము వహించి వుండే దనిన్నీ, అందుకు అదిసులభముగా పలుకుటకు అనువుగావుండుట కారణమనిన్నీ తమప్రసంగములో పండిత హరప్రసాదశాస్త్రి గారు నుడివిరి.

26 జనవరి, సోమవారం :

తెలుగు కాంపోజిషను, 3 సి, సెకండు పేపరు ఆన్సరు పుస్తకాలలో ఉన్నీ లోపాలే. పరీక్షకు వెళ్ళే అభ్యర్థులకీ లోపాలు లేకుండా చేయవచ్చును. ఇంగ్లీషు కాంపోజిషను బోధించే ఉపాధ్యాయుడే, విద్యార్థులకు తెలుగు కాంపోజిషను చెప్పవలెను.

తెలుగు గ్రూపు 3 (సి) ను అభ్యసించే విద్యార్థులు సెకండు పేపరు ఆన్సరుచేసేటప్పుడు నిర్దిష్టమైన గ్రాంథికమును రాయడానికి ప్రయత్నించాలి.

గ్రాంథికభాషలో కాంపోజిషను రాయడానికి అభ్యర్థులకు యేపాటి శక్తికలదో పరీక్షించడానికి యీ పేపరు పెట్టారనుకుంటాను. కంపల్సరీ కాంపోజిషనులో అభ్యర్థులు ఆధునిక ప్రయోగాలను వాడవచ్చును; సాధారణంగా వాటినే అభ్యర్థులు ప్రయోగిస్తూ వస్తున్నారు.

స్కూలుఫైనలు పరీక్షలో కంపల్సరీ పేపరుపెట్టారు. ఆ సంప్రదాయాన్ని మానకుండా కాబోలును, కాలేజీ తరగతులలో కంపల్సరీ కాంపోజిషను పేపరువుంటున్నది.

15 మార్చి, శనివారం :

ఇంటర్మీడియటు తెలుగు కాంపోజిషనులో యే యే పద్ధతులు అనుసరించాలనే చర్చ తెమలక ఆలస్యమౌతున్న కొద్దీ యిక జాగు చేయడం కూడదనుకున్నాను. పుస్తకాలమీద నా అభిప్రాయం వెంటనే పంపించాలనుకున్నాను.

16 మార్చి, సోమవారం :

రావుబహద్దూర్ (శ్రీ) కందుకూరి వీరేశలింగంగారు వ్రాసిన రాజశేఖరచరిత్ర. ఇది గోల్డుస్మిత్తు "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు" అనే నవలకు అనుసరణ. ఇది బహుళ ప్రచారం పొందిన నవల. గ్రంథకర్త గ్రాంథికభాషలో రచించినప్పటికీ గ్రాంథికభాషా సంధులను వుల్లంఘించారు. ఈ ఉల్లంఘనంలో కూడా వొక నియమమును అక్కడక్కడ పాటించారు. మరి కొన్నిచోట్ల పాటించలేదు. దీనిని యిదివరకు పాఠ్యగ్రంథంగా పెట్టారు.

గ్రీకు పురాణకథలు మొదటిభాగం. దీన్ని సెట్టి లక్ష్మీనరసింహంగారు వ్రాశారు. హాల్థారు వండర్ వుడ్, టేంగిల్ వుడ్ కథలకిది అనువాదం. కథలలో గొప్పలక్షణాలు, సాహిత్య మెలకువలు వున్నాయి. తెలుగు సారస్వతంలో నూతన పోకడలను యివి ప్రవేశపెడుతున్నాయి. వీరేశలింగముగారి అనుసరణమువలె యీయన అనువాదం చక్కగా వుంది. అనువాదకుడు మెలకువలు తెలిసిన రచయిత. సంధిని పరిత్యజించడంలో వొక నియమాన్ననుసరించారు. ఇది గ్రాంథికంలో వ్రాసిన గ్రంథమే. ఇదివరకు ఇది విద్యార్థులకు పాఠ్యగ్రంథం.

శృంగారచంద్ర కాశీయానం. దీన్ని వ్రాసినవారు ముద్దులపల్లి గురుబ్రహ్మం. దీనిలో యేమీ నాటకీయత కనిపించదు. శైలి, నిర్వాహణపద్ధతీ చాలా పేలవంగావున్నాయి. ఆయన వ్రాసిందే మరొక గ్రంథం, కొండవీటి చరిత్ర. కృతక మైన భాష. పుష్పలావికల వర్ణనలవల్ల విద్యార్థులు నేర్చుకో తగ్గదేమిటో !

22 మే, శుక్రవారం :

ఊటీకి వెళ్ళితిని.

26 మే, మంగళవారం :

(1) మాయింట వొక వాచ్‌మన్.

(2) శేషగిరిరావు బి. ఏ. ఆనర్సు

3 జూన్, బుధవారం :

మద్రాసు చేరుకున్నాము.

12 జూన్, శుక్రవారం :

ఎన్నికలు.

17 జూన్, బుధవారం :

ఊటీకి వెళ్ళితిని. మళ్ళీ యీవేళే తిరిగిబయలుదేరాను.

1 ఆగస్టు, శనివారం :

పెట్టెప్రెఎ బుక్కుమీద నివేదికను పంపితిని.

2 ఆగస్టు, ఆదివారం :

మద్రాసు విశ్వవిద్యాలయ రిజిస్ట్రారుకు పైప్రుడు లేఖ; గోవిందరాజు అయ్యారుకు ఉత్తరం.

3 ఆగస్టు, సోమవారం :

రిజస్ట్రారుకు ఉత్తరం. బి. హనుమంతరావు, స్టోన్, మిడిల్ మాస్టరులకు లేఖలు.

16 ఆగస్టు, ఆదివారం :

మహారాజాను, ఇనస్పెక్టరు చూడ వెళ్ళారు.

1 సెప్టెంబరు, మంగళవారం :

పాలకొల్లునుంచి నారింజపళ్లు పంపమని ఉత్తరం వ్రాస్తిని. మావిడిపళ్ళ యెగుమతులు. సర్ హెరాల్డు స్టూవర్టుకు ఉత్తరం.

6 సెప్టెంబరు, ఆదివారం :

ఉక్కుదూలములు 4×18; 10″×6″
4×14; 8″×6″

దాస్‌కు ఉత్తరం వేస్తిని.

7 సెప్టెంబరు, సోమవారం :

తెలుగు పేపర్ల కరెక్షన్.

18 నవంబరు, బుధవారం :

కరివేపాకు మొక్కలు భాగవతులవారి యింట. బాదం మొక్కలు గున్నేశ్వరరావుగారి యింట. కొబ్బరి మొక్కలు.

తోటకు వెళ్లితిని. చక్కగా దున్నలేదు. అప్పయ్య పంతులుతోటనుంచి అరటిమొక్కలు తెచ్చి వేయిస్తిని. కోటకు వెళ్ళాను. ఎండ వేడి మిక్కుటముగావున్నది. నాశరీరము ఎండకు దొరికిపోయినది. మిరపకాయలు కొనడానకు బజారుకు పోతిని.

20 నవంబరు, శుక్రవారం :

సాయంకాలము టెంపరేచరు 99.6
తరువాత 99.4

మనసబును చూస్తిని. మూర్తి పంతులుతో ప్రసంగించితిని.

21 నవంబరు, శనివారం :

ఉదయం జ్వరం 98.4
పదిగంటలకు 98.5 లేదా అంతకంటె కొద్దిగా హెచ్చు.

నిద్రపోయిన తరువాత
మధ్యాహ్నము 2 గంటలకు 99.2
మూడూ నలభై నిమిషాలకు 99.2
ఆరూ ఇరవై నిమిషాలకు 99.6
తోటపాలెం బండీలో వెళ్లితిని.
భోజనంచేశాక పదిగంటలకు 98.6
తోటకు వెళ్ళితిని.

రాత్రి కడుపులో తిప్పుడ మారంభమయినది.

22 నవంబరు, ఆదివారం :

పొద్దున్నే అయిదూ ముప్పై అయిదు నిముషములకు 98.4
పదకొండూ, పన్నెండు గంటలమధ్య 98
రాత్రి యేడుగంటలకు 99
రెయిలు స్టేషనకు వెళ్ళితిని.

పొద్దున్న యిల్లు కదలకుండా వున్నట్లయితే, టెంప రేచరు తగ్గివుండే దనుకుంటాను.

ఇవాళవరకూ నేను ఉదయం బయట కెక్కడికీ వెళ్ళందే.

మీకు జ్వరం సాధారణంగా రాదనీ, వస్తే అట్టేకాలం వుండదనీ డాక్టరు బ్రౌనింగ్ నాకు చెప్పాడు. వొంటికి యే మాత్రం ఎండ తగలకుండా కాపాడుకోమని సలహాయిచ్చాడు.

బహుశా ఊటీలో వుండడంవల్ల నేమో, నా శరీరాని కేమాత్రం యెండంటే కిట్టకుండా వుంది. నరాలనుఅది నీరస పరిచిందా యేమిటి చెప్మా!

25 నవంబరు, బుధవారం :

ఉదయం ఏడుగంటలకు నిద్రనుంచి లేచానా టెంపరేచరు 97.8; తొమ్మిది నలభై నిముషాలకు 97.8; థర్మామీటరు చాలాసేపునోట్లోవుంచి చూసుకుంటే దాని "రీడింగులు" 97.9; 98; 98.4; 93.6. టెంపరేచరు యిప్పుడిప్పుడే హెచ్చుతున్నదా? లేక శరీరంలోని వొక్కొక్కభాగపు వేడి నెమ్మది నెమ్మదిగా యెక్కుతున్నదందామా?

భోజనంచేశాక ఒంటిగంటా పదినిముషాలకు చూసుకుంటే ఉష్ణోగ్రత 99. బడలిక తీర్చుకోవాలనిపిస్తున్న దీవేళ. నిద్రపోతే బాగుండును.

మధ్యాహ్నం మూడుగంటలకు నిద్రలేచాక ఉష్ణం 99. రాత్రి తొమ్మిది గంటలకు 99.2.

26 నవంబరు, లక్ష్మీవారం :

ఉదయం అయిదు గంటలకు 98.6; పన్నెండు గంటలకు 93.6; కొద్దిగా కడుపులో చురుక్కు చురుక్కుమనే నొప్పి. ఉదయం బీరకాయ. నారిదబ్బకాయ. సిన్నరాత్రి వెలక్కాయ పచ్చడి. సిన్న మెంతికూర.

మూడు గంటలకు 100.4. రాత్రి 101; రాత్రి కడుపు నొప్పి విపరీతముగా ఆరంభమయింది. పిప్పరిమెంటు అవీ పుచ్చుకున్నాను. నొప్పి తగ్గిందికాదు. కడుపులో ఆసిడ్ చేరింది. చాయ; సోడా. తగ్గలేదు నొప్పి. కొంచెం నల్లమందు వేసుకున్నాను. అరగంటకల్లా నొప్పి తగ్గింది.

27 నవంబరు, శుక్రవారం :

ఉదయం నాలుగు గంటలకు 101, అయిదు గంటలకు ఆముదంతాగాను. ఎనిమిదిగంటలకు 99.6; ఏడుగంటలకు 99.5.

28 నవంబరు, శనివారం :

ఉదయం ఆరుంపావుకి 98. ఎనిమిదికి 98; పొంటిగంటకు 93.3; మూడూ నలభై నిముషాలకు 98; ఎనిమిదిగంటలకు 99. రాత్రి పదకొండు గంటలకు నిద్రపోయాను. తెల్లవారుఝామున నాలుగింటికి లేచాను.

టెంపరేచరు కొంచెం తగ్గుమొహం పట్టడానికి కారణం, ఆముదం ప్రభావమే అయి వుంటుందా ?

29 నవంబరు, ఆదివారం :

తెల్లారగట్ల నాలుగుగంటలకు 98; ఆరుగంటలకు 98; తొమ్మిది పావుకి 98.1; ఒంటిగంటా పధ్నాలుగు నిముషాలకు నిద్రలేచాక 93.8.

30 నవంబరు, సోమవారం :

ఉదయం అయిదున్నరకు	97.9
తొమ్మిదింపావుకి	98.3
వొంటిగంటా పదినిముషాలకు	99.1
ఆరున్నరకు	99.1.

ఒంటిగంటకు నిద్రపోతున్నప్పుడు ఫ్లానలుకోటు తొడుక్కున్నానేమో చెమటపట్టింది. కులాసాగా లేచినట్టనిపించింది. మజ్జిగ తాగాను.

రాత్రి ఎనిమిది గంటలకు పరుపుమీద వాలాను, తొమ్మిది గంటల తరవాత నిద్రపట్టింది.

పట్టిందే కాని కోడికునుకు. మాటి మాటికీ మెలకువ వచ్చేది.

1 డిసెంబరు, మంగళవారం :

ఉదయం ఆరుగంటలకు లేచాను. ఆరుంపావుకి 93.2; తొమ్మిదిగంటలకు 98 8; పదకొండున్నరకు 99; రెండుగంటలకు 99.4.

పదకొండున్నరకు స్నానంచేసి అన్నం తిన్నాను. రెండు గంటలకు నిద్రలేచాను.

పొద్దున్న అటూ యిటూ తిరుగాడాను; ఏదో లోకాభి రామాయణం చెప్పుకున్నాం. చాలా హాయిగా వున్నట్లని పించింది.

రాత్రి వాన కురిసింది.

2 డిసెంబరు, బుధవారం:

ఆరుగంటలకు 97.6; ఎనిమిదిం పావుకి 98. మూడు గంటలకు 100; ఇవాళ అన్నీ పనులే. మూడుగంటలకు కాఫీ, జావా తాగాను.

ఇవాళ మబ్బులూ, గాలీ.

3 డిసెంబరు, లక్ష్మీవారం:

అయిదుంపావుకి 93.9; ఆగునలభై అయిదు నిమిషాలకు 93.4; మళ్ళీ యివాళ చేతినిండా పనే. మహారాణితో కలసి మధ్యాహ్నం పన్నెండుదాకా ఆ కాగితమూ, యీ కాగితమూ చూస్తూ కూచున్నాను. ఒొంట్లో బాగున్నట్టుంది. బహుశా జావలో కొంచెం కాఫీ కలిపి పుచ్చుకోవడంవల్ల కాబోలును! మధ్యాహ్నం భోజనం చేశాక విశ్రాంతి. కాని నిద్ర పట్టింది కాదు. మధ్యాహ్నం మూడుగంటలకు అప్పయ్యగారి తోటకు వెళ్ళాను. చాలాదూరం నడిచాను. ఇదివరకు యెంతబలంగా వుండేవాణ్ణో అంత సత్తువగానూ యివాళ వున్నాననిపించింది. నా జబ్బుకు యేమిటి చికిత్స? (1) హాయిగా విశ్రాంతీ, కంటి నిండా నిద్రా? (2) విస్మృత్తుకూడానా? (3) కాఫీ?

4 డిసెంబరు, శుక్రవారం :

ఉదయం అయిదూ నల్భై అయిదు నిముషాలకు 99.4; ఎనిమిదింపావుకి 93.8, సాయంకాలం అయిదుగంటలకు 98.3; ఆరున్నరుకు బాగా బడలిక తీరాక 98.4.

5 డిసెంబరు, శనివారం :

పొద్దున్న ఆరుగంటలకు 98.

6 డిసెంబరు, ఆదివారం :

పొద్దున్నే ఆముదం తాగాను. ఎనిమిదిగంటలకు 99.6; తరవాత 100 4; 101.4; కడుపునొప్పి. మళ్లీ నల్లమందు వేసుకున్నాను. వేసుకున్నాక నొప్పి తగ్గింది.

7 డిసెంబరు, సోమవారం :

ఉదయం యేడుగంటలకు 98.3; తొమ్మిదికి 98.1; పడుకొని లేచాక నాలుగు గంటలకు 97.8; రాత్రి తొమ్మిదికి 98.3 కు మించి.

ఇవాళల్లా బిలో నార్మల్. బహుశా ఆముదం తాగినందువల్లనే కాబోలును. అలా అయితే, యిన్నిరోజుల టెంపరేచరు యిలా వుండడానికి కారణం మలబద్ధకమే అని నేను నిర్ధారణ చేసుకోవచ్చునా! వాగన్ను తగ్గినది. కాని నొప్పిమాత్రము వున్నది.

8 డిసెంబరు, మంగళవారం :

ఉదయం ఆరుగంటలకు 97.4; పదిన్నరకు 98; రెండూ నల్భైఅయిదు నిముషాలకు 98.8.

అవ్వే, మరి సందేహంలేదు. ఈ "లో టెంపరేచరు" కు హేతువు ఆముదప్ర ప్రభావమే.

9 డిసెంబరు, బుధవారం :

స్నానంచేశాక నార్మల్‌కంటె హెచ్చు,

10 డిసెంబరు, లక్ష్మీవారం :

తెల్లవారగట్ల నాలుగున్నరకు 98.6; రెండుగంటలకు 98. 5 లేదా 6; రాత్రి తొమ్మిదిగంటలకు 99; మధ్యాహ్నం క్షవరం చేయించుకొని స్నానంచేసిన తరువాత రెండుగంటలకు 98.5 లేదా 6. సరే!

11 డిసెంబరు, శుక్రవారం :

ఉదయం తొమ్మిదిగంటలకు 99; స్నానానంతరం పదింపావుకి 99; బాగా నిద్రపోయి లేచాక మూడూ యిరవైకి 99.1 లేదా 2; మెల్లిమెల్లిగా కడుపునొప్పి ఆరంభం.

12 డిసెంబరు, శనివారం :

పొద్దున్నే అయిదున్నరకు 97.8; మధ్యాహ్నం బాగా పనిచేసి స్నానంచేసి వొక్క చిన్న కునుకు తీశాక 98.6;

14 డిసెంబరు, సోమవారం :

ఉదయం నాలుగున్నరకు 98.1; ఇవాళ చక్కగా పని చేశాను.

15 డిసెంబరు, మంగళవారం :

తెల్లవారుఝాము రెండుగంటలకు 100.2; అయిదు మోతాదుల సాల్టు తీసుకున్నాను. ఆరున్నరకు 99.5; పది గంటలకు 99.6; మూడుగంటలకు 99.5; అయిదున్నరకు 99.4;

మూడుగంటలకు నిద్రలేచాను; రాత్రి పన్నెండున్నరకు 97.8; కొద్దిగా కడుపునొప్పి.

16 డిసెంబరు, బుధవారం :

ఉదయం ఆరింపావుకు 93 8; కడుపునొప్పి తగ్గలేదు; నిద్రలేచాక పొంటిగంట నల్భై అయిదు నిముషాలకు 99.4.

17 డిసెంబరు, లక్ష్మీవారం :

ఆరున్నరకు 97.8.

18 డిసెంబరు, శుక్రవారం :

ఉదయం ఆరునల్భై అయిదు నిముషాలకు 98.5; ఆముదం తాగాను. ఒంటిగంటన్నరకి 100; రోజల్లా 93.6

19 డిసెంబరు, శనివారం :

ఆరున్నరకు 97 8; రెండుగంటలకు 93.6; లేతమాట పెరుగు పచ్చడి తిన్నాను. ఇది వేసుకోవడంవలన కడుపులో యాసిడు యెక్కువైంది. ఇక అరటిదూట వేసుకోకూడదు.

రోజ్జగాలి. మబ్బులు. వాన కురియ లేదు.

20 డిసెంబరు, ఆదివారం :

ఆరున్నరకు 99; పదకొండుగంటరకు 100; నిద్ర పట్టకుండా చెడగొట్టడానికి అవసరమయినంతగా కడుపునొప్పి.

21 డిసెంబరు, సోమవారం :

తెల్లవారఝామున 101; నాలుగుగంటలకు 101; ఏడూ నలభైఅయిదు నిముషములకు 99.8; పదకొండు గంటలకు కడుపునొప్పి.

22 డిసెంబరు, మంగళవారం :

ఆరూనలభై అయిదు నిముషాలకు 97.4; పన్నెండూ నలభై అయిదు నిముషాలకు 98.4.

ఉదయం తొమ్మిదిన్నరకు విపరీతమైన ఆకలివేసింది.

23 డిసెంబరు, బుధవారం :

సుగుణవిలాస సభవారు కోరినకోరిక. ఆరున్నరకు 97.5; నాలుగుగంటలకు 99; ఆరుగంటలకు 99.4.

వకీలుగారు నా గ్రంథములను తీసుకువెళ్లిరి. గొడ్డళ్ళు. గునపం.

కొద్దిగా జ్వరంవచ్చినట్లు ఫీలవుతున్నాను.

24 డిసెంబరు, లక్ష్మివారం :

ఉదయం అయిదున్నరకు 98; వంట ఆలస్యముగా అయినది. పదకొండుగంటల నలభై నిముషములకు భోజనంచేశాను. టెంపరేచరు 99.

25 డిసెంబరు, శుక్రవారం :

ఏడుగంటలకు 97.8; తొమ్మిదిగంటలకు 98; పాంటి గంటా నలభై అయిదు నిముషములకు 100; రెండుగంటలకు 100.5; రెండూ నలభై అయిదు నిముషములకు 100.2 లేదా 3 ! నాలుగు నలభై నిముషములకు 100.3; రాత్రి ఎనిమిదిగంటలకు 101; భోజనానంతరము తొమ్మిది గంటలకు 100 2; తొమ్మిదిన్నరకు 99.6.

ఉదయం పదకొండుగంటలకు స్నానం చేశాను. కడుపునొప్పి.

26 డిసెంబరు, శనివారం :

తెల్లవారగట్ల వొంటిగంటన్నరకు 98; నాలుగుంపావుకు 98.5; తొమ్మిదిన్నరకు 97.8; పదకొండుంపావుకు 98; రెండున్నరకు 99; నాలుగున్నరకు 98.8.

ఉల్లినారుకు సొమ్ముయిచ్చి వేసితిని.

27 డిసెంబరు, ఆదివారం :

ఆరున్నరకు 97.6; తొమ్మిదిగంటలకు 98; మూడూనలభై అయిదు నిముషములకు 93.4; తొమ్మిదిగంటలకు 98.

మధ్యాహ్నం నిద్ర లేచాక ఎంతో నిస్సత్తువగా వుంది!

28 డిసెంబరు, సోమవారం :

అక్కిరాజు ఉమాకాన్తమ్,
ఆన్ధ్ర వాఙ్మయసమితి,
52 ఆఫీసు, వేఙ్కటాచల మొదలి వీధి,
తిరువల్లిక్కేణి, చెన్నపురి.

ఆరుగంటలకు 97.6; ఆపనీ యీపనీ చేశాక పదిన్నరకు 93.4; రాత్రి ఏడున్నరకు 99.6; తొమ్మిదిన్నరకు 99.

29 డిసెంబరు, మంగళవారం :

ఉదయం ఆరున్నరకు 97.6.

ఏడుగంటలకు 98.4.

30 డిసెంబరు, బుధవారం :

ఆరున్నరకు 97.6; పదింపావుకు 97.8; చిన్నపూలతోటకు వెళ్లాను.

రాత్రి ఆరున్నరకు 98.6.

31 డిసెంబరు, లక్ష్మివారం :

ఆరుంపావుకు 97.6; రాత్రి ఒంటిగంటన్నరకు 98.6.

1915

1 జనవరి, శుక్రవారం :

ఉదయం అయిదూ యిరవైకి 98; రాత్రి ఏడుగంటలకు 99.2.

వేడినీళ్ళు మీదపడుటవలన చేయి బొబ్బలెక్కినది.

2 జనవరి, శనివారం :

ఆరూ నలభై అయిదు నిముషాలకు 97.6; ఆరున్నరకు 101; తొమ్మిదిన్నరకు 102; ఆరున్నరకు సొట్టుపుచ్చుకున్నాను. రెండున్నరకు 99; మళ్ళీ సొట్టు.

3 జనవరి, ఆదివారం :

ఉదయం యేడుగంటలకు 93; పదకొండుకు 98; రెండున్నరకు 99.

మధ్యాహ్నం భోజనం చేశాక మొహం ఝుమాయించింది. వొంట్లో యేదో తిప్పాడు.

* వైద్యుని సలహాకై నివేదిక

1. వృత్తి : కళాశాలలో కొన్ని సంవత్సరాలకాలం లెక్చరరు పదవి; విజయనగరం మహారాజులకు ప్రైవేటు సెక్రటరీ.

---

* ఇది చెన్నపట్ణం పంపిన తేదీ 9 ఏప్రియలు 1915.

వయస్సు : ఏభై నాలుగేళ్ళు.
బరువు : పుష్పైమూడో ఏట 78 పౌనులు. నాలుగైదు నెలల క్రితం తూచుకుచూసుకుంటే 81 పౌను లున్నాను. ఈమధ్యనే మళ్ళీ తూచుకునేసరికి 84 పౌనులున్నట్లు కనిపించింది కాని, మెషిను ఆక్యురులో లేదేమోనని నా అనుమానం.

2. శీతోష్ణపరిస్థితుల ప్రభావానికి నా శరీరం అతివేగంగా ప్రతిచలిస్తూ వుంటుంది. సాధారణంగా వీచేగాలిని సైతం నేను భరించలేను. గాలి వంటికి తాకకుండా గొడుగును అడ్డంపెట్టు కుంటూ వుంటాను. నడుస్తున్నప్పుడూ, బండిలో వెళుతున్న ప్పుడూ యిది నాకు మామూలు. శీతోష్ణపరిస్థితుల కను గుణంగా, ఒక శాలువ, లేకపోతే ఒక శాలువమీద యింకొకటీ, తలపాగా, కోటూ, కోటుమీదకోటూ, కాకుంటే ఉన్ని దుస్తులు ధరించడం నాకు పరిపాటి. ఇక ♦కొండలమీద వున్నప్పుడుకూడా యివే దుస్తులు; జుబ్బామీద జుబ్బా; కోటు మీద కోటు. కొండమీద వాతావరణం చక్కగానే వుంటుంది. శరీరానికి మంచిదికూడాను. అయినప్పటికీ, నా శరీ రారోగ్యం నాలుగైదు సంవత్సరాలనుంచీ అలాగే వుంది. కొండలమీద వున్నప్పటికీ అంతా యథా పరిస్థితే. నిరంతరం ఆలోచిస్తూ మేధస్సుకు శ్రమకల్పించడం బహుశా దీనికి కారణం కావచ్చును. కొండలమీద వున్నప్పుడు బాగా ఆకలివేస్తున్న

♦ రాజకుటుంబీకులతో అప్పారావుగారు వేసవిలో నీలగిరిలో వుంటూ వుండేవారు. కొండుభట్టీయము మొదలైన రచనలు ఆయన యిక్కడ వున్నప్పుడే రాశారు.

ప్పటికీ, కాస్త ఊపిరి సలిపినప్పటికీ, కొంత ప్రశాంతత చిక్క-నప్పటికీ, యీమధ్య బొత్తిగా అవి లేదు.

3. మధ్యాహ్నం భోజనమయ్యాక కొంతసేపు విశ్రాంతి తీసుకొనేవాణ్ణి. మంచం మీద వాలి రెండు మూడు గంటల పాటు సేదతీర్చుకొనేవాణ్ణి. ఇలాగ కొన్నేళ్ళు జరిగాయి. ఇలా కాక యింకొకలాగ చేస్తిరా వొళ్ళు కుతకుత మనేది. సాయంకాలం మూడూ నాలుగు గంటలమధ్య ఆయాసంగా వుండేది. వొంట్లో నిస్త్రాణ. నాలుగు గంటలక్కానీ యింత రొట్టె, కాస్త కాఫీ పుచ్చుకుంటేనా బడలిక తగ్గేది; ప్రాణం లేచివచ్చి నట్లనిపించేది. ఓపిక కలిగేది. సాయంకాలంపూట నడవగలిగే వాణ్ణి. ఏ పనైనా చేయగలిగేవాణ్ణి. చకచకా అంగలువేస్తూ నడిచేవాణ్ణి. రొట్టె, కాఫీ తీసుకోవడంవల్ల లోపల యాసిడ్ పుట్టి, ఒకొక్కప్పుడు నిద్రరాక బాధపడుతూ రావడంవల్ల, యిక లాభం లేదని వాటినీ వొదిలి పెట్టేశాను. అవికూడా అరిగించుకోలేక పోతేయేం చేయడం మరి! కొంచెం పుష్టికరమైన ఆహారం భుజించాలని యిప్పటికీ నాకు కోరికగా వుంటూనే వుంది. కాని అది కడుపులో చేరి 'యాసిడ్' కలిగిస్తేమాత్రం బాధ కలుగుతుంది. సాత్త్వికాహారం తీసుకున్న వెంటనే ఎంతో హాయిగా వుంటుంది. మంచి టిఫిను కావాలనిపిస్తుంది నాకు.

4. కొన్నేళ్ళ క్రితంమాట: అందరికీవలె కాక నా శరీరం చాలా ఉష్ణంగా వున్నట్టనిపించేది. తరుచు ఏదో బాధగానే వుండేది. కడుపు భగభగ మండుతూ వుండేది; రాత్రి భోజనం చేశాక స్తిమిత పడేవాణ్ణి.

5. రాత్రిపూట భోజనం చేసేముందు కొన్నేళ్ళపాటు కొంచెం క్లారెటు, కోకోనైను పుచ్చుకున్నానా లేదా అన్నంత స్వల్పంగా తీసుకునేవాణ్ణి. నా భోజనంలో ప్రధాన ఆహారం పాలూ, అన్నం, కాస్తంత చక్కెర. కడుపులో యాసిడుచేరి ఉధృతమైనప్పుడు, కునుకు పట్టేదికాదు. నాకూ, నిద్రకూ సగ మెరిక. మాటిమాటికీ మూత్రం వస్తూవుండేది. రంగు వివర్ణం. క్లారెటు, తదితర పానీయాలను పూర్తిగా విడిచి పెట్టేను. కొన్నాళ్ళకు అవీ పడలేదు. ఎంత కొంచెం తీసుకున్నా చికాకు హెచ్చేది. ఉపశమనానికి బదులు మేధస్సు ప్రకోపించేది. మూడేళ్ళక్రితం, నాలికకు అల్సర్ వచ్చింది. పాలు తాగవద్దన్నారు. సరేనన్నాను. నైట్రో-హైడ్రోక్లారిక్ యాసిడ్‌తో కలిపిన మిక్స్చరు పుచ్చుకోవడంవల్ల అల్సరు పోయింది. మళ్ళీ అది రాలేదు.

6. విచిత్రమేమంటే, కొండలమీదికి వెళ్ళినప్పుడల్లా నాకు ఆకలి బాగానే వేస్తుంది, పొద్దున్నా సాయంకాలప్పూ కాఫీ తాగేవాణ్ణి. అయినప్పటికీ మళ్ళీ నా నాలుకకు అల్సరు రాలేదు.

7. మామూలుగా వేసుకునే దుస్తులతోనే నిద్రపోవడం నా అలవాటు. కాని సాధారణంగా నామోము వెచ్చగా వుంటుంది. అందువల్ల మాటిమాటికీ విసుక్కుంటూ వుంటాను. కొన్నాళ్ళకి మోము భగభగమనడం పోయింది. అది భగభగ మన్నప్పుడల్లా బహుశా ఒంపరేచరు నార్మలుగాకంటె ఎక్కువ వుండేవి కాబోలును.

8. ఇరవై మూడేళ్ళ కితం, అనుభవిస్తున్నట్టు చాలా ఏళ్ళ వరకూ, నా నరాలూ, పేగులూ సలుపుతెత్తేవి. ఉన్న బాధంతా ముఖ్యంగా వాటివల్లనే. ఇట్టే అవి ప్రకోపించేవి. విరేచనం వొకొక్కప్పుడు కొంచెం నీళ్ళనీళ్ళగానూ, తరుచు గట్టిగానూ రోజూ నాలుగయిదుసార్లు అవుతూవుండేది. తీసుకున్న ఆహారం అరిగేదికాదు.

9. 1891 వ సంవత్సరంలో వొకనాటి ఉదయం పది గంటలకు వొక కొండను అధిరోహించ ఆరంభించాను. శీతా కాలం. ఎండకాస్తున్నది. తలమీద ఎండ పడుతూనే వుంది. తలపాగా లేదు. గొడుగూ లేదు. కొండమీదవున్న భవంతికి త్వరత్వరగా చేరాలనే ప్రయత్నంతో అడ్డుదారిని గబగబ నాలుగడుగులు వేశాను. కొండ శిఖరంమీద నాలుగడుగులు వేసేసరికి ఆయాసం లావయింది. మూర్ఛ వచ్చినట్లయింది. కొన్ని సెకండులపాటు స్పృహకూడా తప్పింది. నాటి సాయంకాలను ంచీ తలతిప్పడ మారంభించింది.

10. అదే పనిగా ఏదో ఒక ఆలోచనా పూర్వకమైన పనిచేయడంవల్ల, మేధస్సుకు శ్రమ కలిగించడంవలన నా నరాలు పట్లు తప్పాయి. నరాల బలహీనత హెచ్చింది. దాంపత్య సుఖం అనుభవించిన తరువాత మేధస్సు ఉద్రేకం కాజొచ్చేది. నిద్రపట్టేది కాదు. ఒకొక్కప్పుడు భుజాలగూళ్లు సలుపుతెత్తేవి. నాకు నిద్రలేమి అనేజబ్బు ఎలాగూవుంది; అయినా కాఫీ తీసుకోవడం మానేనుకాను. నేను కాలేజీలో లెక్చరరుగా వుండేవాణ్ణి. అదే పనిగా గ్రంథాలను పరిశీలించడం అలవాటైపోయింది. కొంతకాలానికి పరిశీలన మాటకేమి, వృత్తినే పుస్త

కంలోని అక్షరాలను చదివితే చాలును, తల భారమయేది. మేధస్సుకు శ్రమ కలిగేది. రెండడుగులు అలా నడిచి వెళ్ళడమంటే ప్రాణాంతకం.

11. సరే; ఇక నాకు మరణం తప్పదనుకున్నాను. కాని * స్వర్గస్థులైన మహారాజావారు నన్ను చెన్నపట్ణం తీసుకువెళ్ళి డాక్టర్ బ్రౌనింగ్‌కు చూపించారు. రైలుప్రయాణం భారమైనా నేను మదరాసు వెళ్లాను. ♦ డాక్టరు బ్రౌనింగు నన్ను పరీక్షించాడు. నా శరీరంలోని నరాల నిర్మాణపద్ధతి పూర్తిగా చెడిపోయిందని చెప్పాడు. కాని నేను చాలాకాలం బతుకుతానని అన్నాడు. భోజనంతో పాటు ప్రతిసారీ యివి పుచ్చుకోవాలని ఆదేశించాడు: అరోమెటిక్ కన్‌ఫెక్షన్ అయిదు గ్రెయినులు; బిస్మత్ ఐదు గ్రెయినులు; పెప్సిను అయిదు గ్రెయినులు.

నరాల సత్తువకు తాను నాకు అప్పట్లో మందు యివ్వలేదు. అలా యిచ్చినట్లయితే ప్రయోజనం లేదన్నాడు. కారణం అప్పట్లో నా కేమాత్రం చురుకుకలిగించే ఏమందు వాడినా, నా నరాలు వాటిని గ్రహించేస్థితిలో లేవట. ఏం తీసుకున్నా నరాలు చలించిపోతాయట. అందువలన సాత్వికమైన ఒక టానిక్‌ను పుచ్చుకోమన్నాడు. ఇది రాత్రిళ్ళు సేవించే ఔషధం. ఇందువల్ల రాత్రిళ్ళుజరిగే వీర్యస్ఖలనం

* ఆనంద గజపతి.

♦ మద్రాసుప్రభుత్వ ప్రఖ్యాత సర్జను డాక్టరు బ్రౌనింగు అప్పారావు గారిని పరీక్షించి యిచ్చిన సలహా, ఆయనతో కావించిన యింటర్‌వ్యూ విశేషాలు 1895, మార్చినెల 31 వ తేదీ డైరీలో కలదు. చూ. 84 వ పేజీ.

కట్టడుతుంది. బెలొడ్డోనా; హెయసిమస్; కేంఫర్; ఇవి కాక కాడ్‌లివరాయిల్ కొద్ది కొద్ది మోతాదులుగా యివ్వడ మారంభించాడు.

12. కొన్నాళ్ళకి కొంచెం నయమయింది. ఆరోగ్యం బాగుపడింది. కాని అయిదు నెలలయాక బ్రోన్కైటిస్ వ్యాధీ, జ్వరమూ పట్టుకున్నాయి.

అయితే నా అనారోగ్యంవల్ల నాకొకటి కలసివచ్చింది; అదృష్టమే మరి. డాక్టర్ బ్రానింగ్ వూళ్ళో లేకపోవడంవల్ల డాక్టర్ నంజుండరావు మందు యిస్తూవుండేవాడు. ఆయనా, నేనూ స్నేహితులమయాం. రాత్రుళ్ళు బాగా కాగినపాలూ, యింత అన్నమూ తినమని ఆయన సలహా యిచ్చాడు. అప్పటికి నా వయస్సు ముప్ఫైమూడు. బరువు డబ్భైఎనిమిది పౌనులు. జ్వరం కాయడంవల్ల ఆరు పౌనులు తగ్గిపోయినాను.

13. పాలు తాగడం యెందుకు మానేశానో కారణం మీకు ఇదివరకే చెప్పాను. నాలుకకు అల్సరు వచ్చింది. ఇక పాలు తాగవద్దన్నారు. సరే నన్నాను. పాలు పుచ్చుకోవడం వల్ల పొద్దున్నే విరేచనం బాగా అయేది. మలబద్ధకంగావుంటే కాసిన్ని పాలు ఎక్కువ తీసుకునేవాడిని. ఇపుడు పాలు వొంటికి పడవు. కడుపులో యాసిడు పుట్టుకొస్తుంది.

14. 1894–95 మధ్యకాలంలో నాకు కలిగిన యితర బాధలు యివి: తల వెనకభాగం సూదులతో గుచ్చినట్టు, దబ్బళాలతో పొడిచినట్టు చురుక్కుమనేవి. ఒక ఏడాదిపాటు బాధపడ్డాను. తరవాత తగ్గిపోయింది.

15. రోజూ మూడుపూటలా భోజనం చేసేవాడిని; సాయంకాలం నాలుగు గంటలకు టిఫిను తీసుకునేవాడిని. ఒక్కొక్కప్పుడు కొన్ని వారాలపాటు అన్నానికి బదులు పొద్దున్నే పాలూ, కాఫీ తీసుకునేవాడిని. ఇలాగ పాలూ, కాఫీ తాగుతున్నప్పుడు మధ్యాహ్నం వేళల విరేచనం కొంచెం గట్టిగా అయేది; నల్లగావుండేది.

16. విపరీతమైన బడలిక, ఆయాసం నాకు బాల్యం నుంచీ వున్నదే. నా శరీరతత్వానే అంత అనిపించేది. చాలా బక్కపల్చటి మనిషిని. కాని నేను కావించేకృషి, మేధో సంబంధమైన కార్యాచరణా అత్యధికం. నేనింత కృషి ఎలా చేస్తున్నానా అని నా మిత్రులకేకాదు, నాకే ఆశ్చర్యం వేసేది. ఎప్పుడూ పక్క మీంద అలా వాలి, విశ్రాంతి తీసుకోవాలనిపించేది. శారీరక కష్టమంటే యిష్టముండేది కాదు. ఇంత ఆయాసంగావున్నా యింత బలహీనంగావున్నా పోనీ ఆలోచనలకు విశ్రాంతియిచ్చానా! లేదు; మేధస్సును అదేపనిగా శ్రమపెడుతూ వచ్చాను. నిన్న మొన్నటివరకు నేను కావించిన మూర్ఖప్పని యిదే.

17. ఇప్పుడు నాకు కలిగిన రుగ్మత యిది: పూర్తిగా నరాల బలహీనత. జీర్ణకోశం చెడిపోయింది. నరాలకు షాకు కలిగినా, నా ఆరోగ్యం చెడిపోతున్నదే అనే వ్యాకులతవలనా శరీరం మార్పుచెందేది; మలబద్ధంపోయి విరేచనమయేది. ఇది యిదివరకటిమాట. ఇప్పుడు అదీలేదు. నరాలకు ఉద్రేకం కలిగినా మలబద్ధం మలబద్ధమే. దీనికితోడు జ్వరం.

ఈ జ్వర లక్షణాలు బక్నేయూ మాన్యువలు మొదటి వాల్యూములో రెండువందల మూడవ పేజీలో పేర్కొనబడిన జ్వరలక్షణాలను పోలి వుంటవి. కడుపులో యాసిడు చేరినట్టు వుంటుంది. చాయ తాగినా, మజ్జిగ పుచ్చుకున్నా యిది ఎక్కువవుతుంది. కడుపు నొప్పి ఆరంభమవుతుంది. జీర్ణించుకుందుకు కొంచెం కష్టమైన ఆహారం, లేదా మలబద్ధం కలిగించేమందులు వాడినా, కడుపునొప్పి అధికమవుతుంది. అయితే యిది అరుదు. ఎనిమా చేసుకుంటే తక్షణ ఉపశమనం కలుగుతుంది. ఆముదం మొదలైనవి అసలే పడవు. మా డాక్టరు యీ మిక్స్చరు వాడమని చెప్పాడు: మాగ్సల్ఫ్ వొక ఔన్సు; సోడిసల్ఫ్ వొక ఔన్సు; సోడా బైక్రోబ్ పది గ్రెయినులు.

ఈ మిక్స్చరు ఆరుడ్రాములు తాగితే ఆరేడు నీళ్ళవిరేచనాలవుతాయి. మొన్న వేసవివరకు నేనెప్పుడూ పర్గేటివు తీసుకోలేదు. పాలుతాగితే చాలుననిపించేది.

ఇప్పుడు ఎనిమిదిడ్రాముల మిక్స్చరు వాడినా ఫలితం కనిపించడం లేదు. అందుకని మూడు డ్రాముల ఆముదం తాగేను. కాని దీనితో నాపని తలకిందులైంది. గత్యంతరంలేక ఎనీమా చేసుకున్నాను. రెండుమూడు రోజులవరకు సవ్యంగానే వుంది.

ఇప్పుడు నేను తీసుకుంటున్న ఆహారం.

(అ) ఉదయం ఆరుగంటలకు మెల్లిన్సుఫుడ్ ఆరు చెమ్చాలు. నిండు చెమ్చాలు కావు. (ఆ) పదకొండు గంటలకు అన్నం, చప్పిడి కూర; వాడే కూరగాయలు యివి: ఆనప

కాయ; పొట్లకాయ; వంకాయలు. (ఇ) రాత్రి ఏడుగంటలకు మధ్యాహ్నంవలె మామూలు భోజనం.

నూకలు వేయించి జావ చేసుకుని యీ మధ్య పుచ్చుకునేవాడిని. కాని ఆయుర్వేద వైద్యులు, వేయించిన నూకల జావ మలబద్ధకం కలిగిస్తుందని చెప్పడంవల్లమానివేశాను. ఇపుడు మళ్ళీ పుచ్చుకొంటున్నాను. నాకిప్పుడు జావలాంటి పదార్థం సులభంగా జీర్ణమయేది తీసుకోవాలని వుంది. మలబద్ధంపోయి జ్వరం తిరుగుమొహం పెట్టాలి. నరాల బలహీనతవల్ల కొంత, మందుల విషంవల్ల మరికొంత నాకు ఉష్ణం వచ్చి వుండవచ్చును. నెల క్రితం నా టెంపరేచరు నూటమూడు డిగ్రీలు. మెల్లిన్సుఫుడ్డూ, నూకలజావా మూడు నాలుగు రోజులు పుచ్చుకున్నాను. అప్పటికి టెంపరేచరు నార్మలుకు వచ్చింది. మధ్యాహ్నం ఒక పూటే భోజనం చేసేవాణ్ణి. తరవాత రాత్రుళ్ళుకూడా భోజనంచేశాను. మధ్యాహ్నం భోజనమయాక టెంపరేచరు వచ్చింది. మెల్లిన్సుఫుడ్డూ, నూకల జావా తీసుకోవడంవల్ల టెంపరేచరు తగ్గినా, ఆ తగ్గడంతో పాటు నీరసంకూడా పుట్టేది. అన్నంతింటే నిస్త్రాణ వుండేది కాదు. కొంచెం దారుఢ్యంగా వున్నట్టనిపించేది. నిన్న రాత్రల్లా నిద్రపట్టలేదు. ఇప్పుడు ఉదయం ఏడుగంటలయింది. టెంపరేచరు నూరు డిగ్రీలు. ఇదంతా నేను చెప్పగా వ్రాయబడ్డ నివేదిక.

18. జ్వరం కాస్తున్నపుడు కడుపులో మంటపుట్టినట్లుంటుంది. రొమ్ము, భుజాలు, ప్రత్యేకంగా ఎడమభాగం నొప్పెడుతున్నాయి. నూరు డిగ్రీల జ్వరం వచ్చినా, నొప్పి కలగనపుడు

కొంత బాధనిపించదు. టెంపరేచరు, నార్మలుకు వచ్చిందా ప్రాణం తెరిపిన బడినట్లుంటుంది. బాధలేదు. పనేమీ లేకుండా పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ కూచోడం నావల్ల కాదు. అయితే ఎంత విశ్రాంతిని భరించగలనో అంత విశ్రాంతీ నేను తీసుకుంటూనే వున్నాను. నాలాగ జాగ్రత్తగా ఆహారం తీసుకొనే వాళ్ళుంటారని నేననుకోను. జ్వరంగా వుంది. జ్వరంతో ప్రయాణం చేయడమంటే భయంగానే వుంది. లేకపోతే మద్రాసు వచ్చి వైద్య సలహా తీసుకునేవాడినే.

19. నాకు వస్తోన్న జ్వరం రెండు రకాలు: ఒకటి అపుడపుడు వస్తూ వుంటుంది. కంఠంలో నొప్పి బయలుదేరి నపుడు, బ్రోన్కైటిస్ వచ్చినపుడు, రక్తంలో విషసంబంధమైన పదార్థాలు చేరినపుడు యిది వస్తుంది.

అప్పుడు నీరసం హెచ్చుతుంది. చికాకు లావవుతుంది. అవయవాలు పీక్కుపోతాయి. కొంచెం చలివేస్తుంది. ఇప్పుడు వచ్చిన జ్వరం మామూలుగా వచ్చే ఉష్ణం కాదు. సాధారణంగా నాకు ఆకలి బాగానే వేస్తుంది.

ఇపుడు వచ్చిన నా జ్వరానికి ప్రధాన కారణం యిదను కుంటాను: జూలై మాసం యిక వెళ్ళిపోతుందనగా ఆఖరి వారంలో నా కొకరోజున నూటవొకటి డిగ్రీల జ్వరంవచ్చింది. జ్వరంరాడానికి ముందు ఆవేళ నేను చాలా శ్రమపడ్డాను. శ్రమంతా ఏదో ఒకటి చదవడం, రాయడం; ఆలోచనలకు శ్రమ కలిగించడంవల్ల టెంపరేచరు హెచ్చింది. కాని తగ్గింది; మళ్ళీ మూడురోజులూ ఈ మధ్య రెండుసార్లు టెంప

రేచరు హెచ్చింది. మా డాక్టరు బహుశా యిది మలేరియా అయివుంటుందనుకున్నాడు. నాకు చలిలేదు. ఆకలి బాగానే వేస్తుంది. ఎందుకైనా మంచిది ముందే జాగ్రత్త తీసుకుందామని మా డాక్టరు రెండున్నర గ్రెయినులు క్వినైను వాడమన్నాడు. రోజుకు రెండుసార్లు క్వినైను తీసుకున్నాను. ఒకరోజున మాకెవరికీ తెలియకుండా ఒక పొరపాటు జరిగిపోయింది. డిస్పెన్సరీలో మందు ఎవరిచ్చారోకాని క్వినైను మోతాదు రెండున్నర గ్రెయినులకు బదులు అయిదు గ్రెయినులకు పెరిగింది.

నేను రెండు గ్రెయినుల క్వినైన్‌కు మించి ఎప్పుడూ తీసుకోలేదు. అందువల్ల యీ ఐదు గ్రెయినుల మోతాదూ నాకు చాలా అవస్థ కలిగించి వుండాలి. దానితో నా కడుపూ, నరాలూ, పేగులూ చెడిపోయి వుంటాయి.

అనుబంధం

1. మలబద్ధం వచ్చినపుడు నూటవొకటీ, నూటరెండు డిగ్రీల జ్వరం వుంటున్నదని డాక్టర్ బర్నేయో చెబుతున్నాడు. కొంతమంది డాక్టర్లు యింతకంటె హెచ్చుజ్వరమే వస్తుందంటున్నారు. ఈ జ్వరం కాసినపుడు తలనొప్పి, నాలికపై ముళ్ళు పుడతాయి. నోరు పూస్తుంది. ఆకలి పుట్టదు. నాకు వచ్చిన జ్వరం యిలాంటిదే ననుకుంటాను.

2. గత నాలుగయిదు మాసాలలో నాకు అయిదారు సారులు జ్వరమొచ్చింది. తిన్న ఆహారం అరగలేదు. తీసుకున్న

ఆహారం మంచిదీ కాదు. అందువల్ల కడుపునొప్పి ఆరంభమయింది. సరే; ఇక మలబద్ధం, అటు తరవాత జ్వరం రానే వచ్చాయి.

ఇప్పుడు నాకు జ్వరం వచ్చినా, నాలిక మామూలుగానే వుంది. ఇంతకు ముందెన్నడూ నాకు తల నొప్పిపెట్టలేదు. ఎండలు ముదరడంవల్ల ఏప్రియలు ఎనిమిదో తేదీ నుంచి తలనొప్పి ఆరంభమయింది. ఇప్పుడు ఆకలి మటుకు బాగానే వేస్తోంది. ఉష్ణంవల్ల ఆకలి తగ్గలేదు. జ్వరం నూట వొకటి డిగ్రీలకు మించినట్లయితేమాత్రం ఆకలి చచ్చిపోతుంది. నాకు జ్వరం రావడానికి కారణాలు రెండు.

1. మొదటి కారణం: మధ్యాహ్నం వొంటిపూట తిండి. ఇంత అన్నం తినడమారంభించాను. అప్పుడు టెంపరేచరు తొంభై తొమ్మిది డిగ్రీలు. *ఇందుతో జతపరచిన పట్టిక ఫిబ్రవరి పదిహేనువరకూ చూడండి. అటుపిమ్మట రాత్రుళ్ళు

* ఫిబ్రవరి పట్టిక లభించినది కాదు. కాని శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారికి వ్రాసిన లేఖలో జతచేసిపంపిన పట్టికలో మార్చి నెల 1 వ తేదీ 1915 న మహాకవి శరీర ఉష్ణోగ్రత: ఉదయం యేడుగంటలకు 98.4; తొమ్మిది నలభై అయిదు నిముషములకు 99.4; పదిన్నరకు 99.6 పదకొండున్నరకు 100.8; మరొక పావుగంటకు 100.6; మధ్యాహ్నం వొంటిగంటా నలభై అయిదు నిముషములకు 100.8; మూడుగంటలకు 100.2; నాలుగు గంటలకు 100.8; నాలుగున్నరకు 100.4; ఏడూ యాభైకి 100; తొమ్మిదింటికి 99.8.

మర్నాటి టెంపరేచరు :

ఉదయం ఆరున్నరకు 98; ఎనిమిదిన్నరకు 98; తొమ్మిది గంటలకు 98.4.

కూడా తినిచూద్దామనుకున్నాను. టెంపరేచరు 99.6 డిగ్రీలకు హెచ్చేది. ఫిబ్రవరి 19 వరకు ఇలాగనేవుంది. తరవాత రెండురోజులూ టెంపరేచరు 99.8 డిగ్రీలు. ఇరవై రెండో తేదీన నూరు డిగ్రీలు. జావా అవీ తాగితే టెంపరేచరు తగ్గవచ్చును. మెల్లిన్సుఫుడ్డూ, జావా తీసుకున్నాను. నీరసం అధికమయింది. అన్నం తింటే నిస్త్రాణగా వుండదు. బలంగానే వుంటుంది. కొన్నాళ్ళు అన్నమే తిన్నాను. నిస్త్రాణ పోయింది. కాస్త జవసత్వాలు వచ్చాయి. కాని కడుపులో ఆసిడ్ చేసినట్లు అనిపించింది. చింతపండు వాసన తగిలిందా యిది ఎక్కువవుతుంది. మజ్జిగ పడదు.

4. ఇక రెండవ కారణం: ఎండపొడ కిట్టదు. ఎండలో నాలుగయిదు నిముషాలయినా నించోలేను. ఎండబాగా కాసిందా ఆనాడు నేను ఏదైనా పనిచేస్తినా జ్వరం వచ్చేస్తుంది. ఆవేళ ఏమీ చదవనూకూడదు; రాయాస్తీకాదు. నాకు విశ్రాంతి అవసరమౌతుంది. ఇప్పుడు పనీ పాటూ లేదు. విశ్రాంతి తీసుకుంటున్నాను.

5. మధ్యాహ్నం నిద్రపోకపోయినా, టెంపరేచరు విధిగా హెచ్చిందన్నమాటే. హెచ్చడంలోనూ అలా యిలా కాదు; త్వరత్వరగా కొన్ని సంవత్సరాలనుంచీ వస్తూ పోతూ, హెచ్చుతూ, తగ్గుతూవున్న యీ టెంపరేచరువల్ల నా శారీరక తత్వమే అంత అనుకున్నాను. ఏమాత్రం ఉద్రేకం కలగకుండా నరాలకు శక్తి కలిగించాలి.

6. నరాల బలహీనతతప్ప మరొక వ్యాధేమీ నాకు లేదు. మిగిలిన అవయవాలన్నీ బాగానేవున్నాయి. నిన్న నూకల

జావ తాగాను. పొద్దున్న ఏడుగంటలకి మెల్లిన్సుఫుడ్డూ, పన్నెండుగంటలకి జావా పుచ్చుకున్నాను, రాత్రి ఏడుగంటలకి మెల్లిన్సుఫుడ్డూ, కాసిన్ని పాలూ తీసుకున్నాను. దానితో ఎక్కిళ్ళు ప్రారంభమయాయి.

♦ ఎండవేడి యెక్కువవుతున్నకొద్దీ జెంపరేచరు లావవుతోంది. కాని జ్వరానికి ప్రధానకారణం అజీర్ణం. మలబద్ధం. నాకు కాస్త మంచి ఆహారం కావాలి. తినగానే జీర్ణమయితే మంచిది. అయితే మెల్లిన్సుఫుడ్డూ, జావామాత్రం వొద్దు. అవి పుచ్చుకుంటే చెప్పలేనంత నిస్త్రాణగా వుంటోంది. నా జీర్ణకోశం చెడిపోయింది.

♦ ఇక్కడనుంచి యీ చివరినాలుగు పంక్తులూ ఆయన స్వదస్తూరితో వ్రాసినవి. మిగిలిన భాగమంతా ఆయన చెప్పగా వ్రాసినది. శైప్రుడు కాపీ.

*శ్రీ అప్పారావుగారి నిర్యాణం

విజయనగర విద్యావేత్త

30 నవంబరు, విజయనగరం:

చాలా కాలంనుంచి వ్యాధిగ్రస్తులై వున్న శ్రీ గురజాడ వెంకట అప్పారావుగారు తమ ఏభైనాలుగవయేట నేటి ఉదయం తమ స్వగృహంలో పరమపదించారు. వీరు విజయనగర కళాశాలలో విద్యనభ్యసించి పట్టభద్రులయారు. అదే కళాశాలలో పెక్కు సంవత్సరాలు ప్రొఫెసరుగా వుద్యోగం చేశారు. తరువాత ఆనందగజపతి మహారాజావారి ఆంతరంగిక కార్యదర్శిగనూ, పిమ్మట డవేజరు మహారాణి, రీవామహారాణుల ఆంతరంగిక కార్యదర్శిగనూ పనిచేశారు.

మదరాసు విశ్వవిద్యాలయంలో తెలుగుభాషకు పరీక్షాధికారులుగ శ్రీ అప్పారావుగారు కొంతకాలం నియమితులు. మూడేళ్ళక్రితం సెనేటుకు సభ్యులుగ వీరిని ప్రభుత్వం నియమించింది. వీరికి ఆంగ్లకవిత్వమంటే మిక్కుటమైన ఆసక్తి కలదు. శ్రీ అప్పారావుగారు రచించిన ఆంగ్లగీతాలు, 'రీస్ అండ్ రయత్' సంపాదకులు స్వర్గీయ డి. వి. శంభుచంద్ర ముఖర్జీగారి ప్రశంసల నందుకొన్నవి. శ్రీ అప్పారావుగారు తెలుగుభాషలో కన్యాశుల్కమనే నాటకమును రచించారు. తాము ఆంతరంగిక కార్యదర్శులుగవున్న సమయంలో సంస్థాన పరిపాలనను దక్షతతో నిర్వహించడానికై తమ పలుకుబడి నంతటినీ వినియోగించారు.

---

* ఇది మద్రాసు మెయిలు దినపత్రికలో ప్రకటితమైనవార్త.

(శ్రీ) అప్పారావుగారి మృతికి సంతాపసూచకంగా నేడు మహారాజావారి కళాశాల మూసివేయబడింది.

Death of G. V. Appa Row
A Vizianagram Educationist

Vizianagaram, Nov. 30.—Death took place here this morning of Mr. G. V. Appa Row, aged 55, after a long illness. Mr. Appa Row graduated from the Maharaja's College, in which he lateron served the best part of his life as Professor. Latterly he was appointed Private Secretary to the late Maharaja Anandaraja and served in this capacity under the late Dowager Maharani and Rewa Maharani. He was an examiner in Telugu for the Madras University and a nominated member of the Senate three years ago. He had a great liking for English poetry and wrote some verses which were highly commended by Mr. D. V. Sambhu Chunder Mukherj, late Editor of *Reis and Rayyet*. He has written a drama in Telugu called *Kanyasulkam*. As Private Secretary his influence was exerted in the better administration of the estates. The Maharaja's College was closed to-day in honour of his death.—(A.P.I)

చివరి చిరునవ్వు

నవంబరునెలలో ఇరవైతొమ్మిది రాత్రుళ్ళు గడిచిపోయాయి. తెల్లవారింది. మహాకవి జీవితంలో అదే తుది ఉదయమని ఎవరూ కలలోకూడా అనుకోలేదు.

మేడమీదగదిలో మంచంమీద మహాకవి మామూలుగానే దుస్తులన్నీ ధరించి పడుకున్నారు. మంచం పక్క కొడుకూ, ఎదుట డాక్టరు మంగయ్యనాయుడుగారూ దిగు

లుగా నించున్నారు. మహాకవి తల్లీ, పిల్లలూ, బంధువులూ ఆందోళనతో అటూ, ఇటూ తిరుగుతున్నారు.

బయటకిటికీలోంచి ఎండపొడ గదిలోపడుతున్నది. చలి గాలి దొప్పుకొస్తున్నది. రొజ్జగాలీ, ఎండపొడా, మహాకవికి పడవుకదా !

దగ్గర నిలబడిన వారిని మెల్లగా దరికిపిలిచి మహాకవి, తాము ధరించిన దుస్తులన్నీ తీసివేయమన్నారు. వొక్క ప్లానలు లాల్చీని మాత్రం వుంచుకున్నారు.

తన మంచం ప్రక్కనే దిగులుగా నించున్న కొడుకును చేరువకు రమ్మని పిలిచి "కొంచెం కోకోవైనూ, దంపిన తాంబూలమూ తెచ్చిపెట్టు బాబూ!".

వీటిని తండ్రి తీసుకుంటే ఏమవునో అనే భీతితో కొడుకు, డాక్టరు నాయుడుగారిని చూపులతో ప్రశ్నించారు. డాక్టరుగారు ఇవ్వవచ్చునని తల ఊపారు. కొడుకు తండ్రికి వాటిని అందిచ్చారు.

తాంబూలము చప్పరిస్తూ మహాకవి, డాక్టరుగారి చేయి పట్టుకుని "వీటిని వేసుకో వచ్చునో, కూడదో, నేను బతికుంటే ఆహారశాస్త్రం మీద వొక గ్రంథం రాస్తాను, డాక్టరుగారూ!" అంటూ చిరునవ్వు నవ్వారు.

అదే మహాకవి చివరి చిరునవ్వు. అదే ఆయన తుది పలుకు. అప్పటికి గోడనున్న గడియారం ఎనిమిదిదాటి ఇర వయ్యోనిమిషమువద్ద ఆగిపోయినది !

* కీర్తిశేషులైన గురజాడ అప్పారావుగారు

"......వీరు సామాన్య స్థితిగల కుటుంబమున జన్మించినవారు. విజయనగర సంస్థానమున వీరితండ్రి అమీనుగా నుండిరి. వీరి పూర్వీకులు గ్రామకరణములుగా నుండినవారు. వీరు చదువుకొనునప్పుడును సుఖముగా గాలము గడిపినవారు కారు......పండిత చంద్రశేఖరశాస్త్రిగారి ప్రోత్సాహమున వీరికి సంస్కృతమునకు నభిలాష మెండుగనుండెను......వీరు కళింగదేశ చరిత్రను వ్రాయు నుద్దేశమున తదనుకూలసామగ్రి సమకూర్చిరనియు దానిని ఆధారంచేసికొనియే విజ్ఞానచంద్రికా మండలివారికి గ్రంథమువ్రాసి యిచ్చుటకు నంగీకరించిరనియు వాడుకయున్నది. ఈపని జరిగియుండినందున వారు సంతరించిన సామగ్రిని ఆవిషయ మెరిగిన వారియొక్క సమర్థమిత్రు లెవ్వరైనను నుపయోగించుకొని గ్రంథమువ్రాసిన యెడల మిక్కిలి యుపయోగకరము కావచ్చును.........వీరు మహారాజులుం గారికి ఆంతరంగిక కార్యదర్శిగా నున్నప్పుడే వీరి ప్రోద్బలముననే విజయనగరము మహారాజుగారి ఆంగ్లకళాశాలయు సంస్కృత కళాశాలయు రెండును స్థిరపడినవని తెలియుచున్నది...... రచకులుగా మాత్రమే గాక అప్పారావుగారు ఆంధ్రభాషా పక్షమున విశ్వవిద్యాలయ సభ్యులుగను, పరీక్షకులుగను ప్రశంసనీయమగు పరిశ్రమచేసి రనుటలో తప్పేమియు లేదు. వాఙ్మయ పక్షపాత మింతకలిగి గంజాము విశాఖపట్టణ

* ఇది వొక తెలుగుపత్రిక వ్రాసిన సంపాదకీయం. ఆ పత్రిక పేరు తెలియదు. సంపాదకీయములోని కొన్ని భాగములు యిక్కడ పొందు పరుస్తున్నాము.

మండలములలో ప్రాముఖ్యతవహించి శాంతులై ఎదుటివారలను మర్యాదించుటలో నసామాన్యులై దంభములేక పని చేయుచుండిన అప్పారావుగారివంటి పుత్రుని గోల్పోయిన యాంధ్రమాత మిక్కిలి దుఃఖించుననుటకు సందేహము లేదు. ఆమెకును, అప్పారావుగారి కుటుంబమునకును మా సానుభూతిని తెలియజేయుచు వారి ఆత్మకు శాంతికలుగును గాక యని ప్రార్థించుచున్నారము.

* మదరాసులో సంతాపసభ

శ్రీ గురజాడ అప్పారావుగారి మృతివలన ఆంధ్రదేశానికి వాటిల్లిన తీరని నష్టానికి దురపిల్లుతూ నిన్న సాయంకాలం ఆండర్సన్ హాలులో తెలుగు రీసెర్చిసొసైటీ ఆధ్వర్యాన సంతాప సభ జరిగింది. శ్రీ అప్పారావుగారి చిరకాల స్నేహితులు, వారి

*"వారు విజయనగరంలో శివసాయుజ్యం పొందిన దినములలో నేను మదరాసు విశ్వవిద్యాలయములో 'రీడరు'గా వుంటిని. అప్పుడు ఆండర్సన్ హాలులో పెద్ద సానుభూతిసభ చేస్తిమి. అప్పారావుగారి 'కన్యక' అనే ఖండకావ్యం ప్రత్యేకంగా ప్రకటించి పంచితిమి. మన ఆంధ్రులలో ఆనాడు చెన్నపురిలో వుండిన పెద్దలంతా వచ్చిరి. సర్. హారాల్డు స్టూవర్టుగారున్ను, శ్రీమాన్ ఎస్. శ్రీనివాసయ్యంగారున్ను సానుభూతి వచనములు వ్రాసిరి. "చాణుక్యుని, యుగంధరుని జ్ఞాపకము చేసిన మహానీయుడ"ని పలువురు ప్రశంసించిరి. అట్టి మహనీయుని భరవసా ఆంధ్రులకు పోయినదని శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తిగారు చాలా వగచిరి. "మహాధనికుడు కాగలిగిన పరిస్థితులలో వుండిన్నీ సంస్థానమునకు ఋణపడి గతించినవాడని" శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు తమకు విజయనగరం పెద్ద దావా నడిపించుటలో గలిగిన అనుభవముతో అనిరి" డాక్టరు శ్రీ బుర్రా శేషగిరిరావు, ఎం. ఏ., పి. హెచ్.డి.

అభిమానులు అగు శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు సభకు అధ్యక్షత వహించారు.

ఆనరబుల్ సర్ హోరాల్డు స్టూవర్టు

శ్రీ అప్పారావుగారి మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ ఆనరబుల్ స్టూవర్టు పంపిన సందేశాన్ని శ్రీనివాసయ్యంగారు సభవారికి చదివి వినిపించిరి. "శ్రీ అప్పారావు పంతులుగారి మరణమునకు సానుభూతి తెలుపడానికై సభ జరుగుతున్నట్లు నాకిప్పుడే వర్తమానం వచ్చింది. చాలా జరూరుపనులు వుండడంవల్ల నేనీ సభకు హాజరుకా లేకపోతు న్నందుకు నాకెంతో దిగులుగావుంది. అప్పారావుపంతులువంటి మహాపండితుని కోల్పోయినందుకు దురపిల్లుతున్న తెలుగువారి సంతాపములో నాకూ భాగమున్నది."

ఈ దిగువ సంతాపతీర్మానమును సభవారు దుఃఖసూచకముగ కొన్ని నిముషములు మౌనముగ నిలబడి ఏకగ్రీవముగ ఆమోదించారు :

"(శ్రీ) గురజాడ అప్పారావుగారి మరణంవలన తెలుగు సాహిత్యమునకు యెంతో నష్టం వాటిల్లింది. వారి కుటుంబానికి యీ సభవారు తమ సంతాపాన్ని తెలియచేస్తున్నారు."

గారు ఆంధ్రపత్రికలో ప్రకటించిన వ్యాసమునుండి మీది వాక్యములు ఉదాహృతములు.

సంతాపసభజరిగిన తేదీ 8, డిసెంబరు. మహాకవి సంస్మరణ సంచికను ప్రకటించుటకు విరాళములకోసము విజ్ఞప్తిచేయగా సభలో అయిదువందల రూపాయలు వెంటనే వసూలయినవి.

శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తి

సంతాపతీర్మానాన్ని ప్రతిపాదిస్తూ మద్రాసు ప్రభుత్వ తెలుగు ట్రాన్సులేటరు శ్రీ భానుమూర్తిగారిలా ఉపన్యసించారు :

"శ్రీ అప్పారావుగారి ఉపజ్ఞమాత్రమే గొప్పదికాదు; ఆయన హృదయం నవనీతంవంటిది. అనేక శాస్త్రాలలో నికటమైన పాండిత్యమూ, అపార విజ్ఞానసంపత్తిగల మేధావులు. తమ స్నేహితులను హృదయమిచ్చి ప్రేమించేవారు. సోదర ప్రజానీకంపట్ల ఆయనకు గల ప్రేమ యెనలేనిది. డాబూ, దర్పమూ యేకోశానా యెరగనివ్యక్తి. మిత్రులైననూ, శత్రువులైననూ, వారి వారి సుగుణములను సరిసమానముగా గుర్తించి శ్రీ అప్పారావు పంతులుగారు వారిని మన్ననచేసేవారు. వారితో పరిచయమైతేచాలు; కలిగిన ఆకాస్త పరిచయమూ యితరుల ప్రేమను, గౌరవాన్ని సదా పొందుతూ వుండేది. దీనికి, శ్రీ అప్పారావుపంతులుగారి సుగుణసంపత్తియే కారణం."

శ్రీ అప్పారావుగారి మృతివలన, దేశము ఒక ఉత్తమ పుత్రుని కోల్పోయినదనీ, తెలుగువారొక ఆత్మీయుని పోగొట్టుకొన్నారనీ చెబుతూ శ్రీ భానుమూర్తిగారు గ్రాంథిక, వ్యావహారిక భాషావివాదములను ప్రస్తావిస్తూ యిలా అన్నారు:

"వ్యావహారికభాషావాదానికి ఆయన నాయకులు. నేనూ నా మిత్రులమూ దీనికి వ్యతిరేకులము. వారికీ, మాకూ తీవ్ర భేదాభిప్రాయాలుండేవి. రవీంద్రనాథ్‌టాగూరు యే భాషలో అయితే, బెంగాలీ సాహిత్యాన్ని సృష్టించారో, అట్టి

భాష మన తెలుగు సాహిత్యానికెంతో ప్రయోజనకారి. ప్రజలను విద్యావంతులను చేయడానికీ, దేశ అభివృద్ధికీ, జాతీయాభ్యున్నతికీ యిట్టి భాషా సాహిత్యాలెంతో అవసరం."

శ్రీ అప్పారావుగారు రచించిన ఖండకృతుల ప్రాశస్త్యమును ఉపన్యాసకులు ప్రస్తుతిస్తూ, ప్రజలను విద్యాసంపన్నులను చేసే, జాతీయోన్నత్యాన్ని సాధించే రచనా విధానాన్ని రవీంద్రునివలె, శ్రీ అప్పారావుపంతులుగారు కొనసాగించారని యిలా అభిభాషించేరు:

"శ్రీ అప్పారావుగారి కవితాశక్తి మహత్తరమైనది. విశ్లేషించిచూసే దృష్టీ, తార్కికశక్తీ, తమ ఆశయాల కనుగుణంగా రచించే నేర్పూ ఆయనకు కలవు. తమ ఆదర్శాలేమో, వాటిని సాధించడానికి యేమి చేయవలెనో తెలిసిన ఆత్మశక్తీ, చైతన్యమూ గల రచయిత."

శ్రీ హరిసర్వోత్తమరావు

శ్రీ అప్పారావుగారి మృతిపట్ల తమ గాఢసంతాపాన్ని తెలియచేస్తూ శ్రీ *ఆర్. వి. సుబ్బారావుగారు పంపిన లేఖను శ్రీ హరిసర్వోత్తమరావుగారు సభలో చదివారు.

అనంతరం, శ్రీ హరిసర్వోత్తమరావుగారు ఉపన్యసిస్తూ శ్రీ అప్పారావుగారు నాయకత్వంవహించిన వ్యావహారికభాషా వాదమునకు తాము వ్యతిరేకులమే అయినా, శ్రీ అప్పారావుగారిలో గల రెండు ఉత్కృష్టగుణములను ఆయన శత్రువులు

* రెంటాల వెంకటసుబ్బారావుగారు; వకీలు.

సైతము మెచ్చుకోక తప్పదన్నారు : "గొప్ప గొప్ప పండితులకు సైతం, తమ వాదమును నచ్చజెప్పి, తమకు సుముఖులుగ చేసుకుంటూ వారిని మార్చేశక్తి శ్రీ అప్పారావుగారికే వుంది. తమ వాదానికి తామే ఆదర్శముగ నిలబడి కావ్యరచన సాగించడమనే ఉత్కృష్ట ఆశయాన్ని ఆయన సాధించారు.

మరికొన్ని సంవత్సరాలు ఆయన జీవించి, తాము అవలంబించినరీతులలో రచనలను అధిక సంఖ్యాకంగా సృష్టించివుంటే, ఈసరికి, ఆయన తెలుగుదేశానికి రవీంద్రులయేవారు."

* ఆనరబుల్ శ్రీ శర్మ

"శ్రీ అప్పారావుపంతులుగారు మరికొన్నేళ్ళు సాహిత్య రచనలోనే తమ జీవితకాలమును గడిపివున్నట్లయితే, ఈపాటికి ఆంధ్రసాహిత్యం మహా సంపన్నవంతమై వుండేది. ఆయనకు అనేక యితర కార్యకలాపాలు వుంటూ వుండేవి. మీదపడ్డ యీ కార్యభారమంతా తొలగి యిక తీరిక చిక్కింది కదా అనుకునేసరికి, సాహిత్యసేవ మిక్కుటముగా చేసే అవకాశం తిరిగి లభించిది కదా అని ఆశించేతరి, ఆకస్మికంగా మృత్యువు సమీపించింది. ఇటువంటి దురదృష్టకర సంఘటనవల్ల ఆంధ్ర దేశానికి తీరని నష్టం వాటిల్లింది. నిజంగా యిది తెలుగువారి దురదృష్టమనక తప్పదు.

ఇంతవరకూ వచ్చిన సాహిత్యం ప్రజలకు చేయవలసిన సేవ చేయతగ్గంత చేయలేక పోయిందనీ, దీనికి అనేక కారణాలు

* శ్రీ బయ్యా నరసింహ శర్మ.

కలవనీ, దీనిని సంస్కరించి నూతన దృక్పథంతో ముందు అడుగు వేయాలనీ గమనించినవారు అరుదు. ఇట్టి వినూత్న మార్గములను అన్వేషించి కొత్త కొత్త పోకడలుపోయి ప్రజలకు సాహిత్యాన్ని సన్నిహితంగా తెచ్చినవారు శ్రీ అప్పారావు పంతులుగారు. ఆయన ఈ మార్గంలో మహోత్కృష్ట విజయాన్ని సాధించారు. మాతృభాషకు, సాహిత్యానికి యింతటి ఆత్మస్నేహితులు మరొకరు లేరు."

అనంతరం సానుభూతి తీర్మానాన్ని బలపరుస్తూ వొక పండితుడు తెలుగున వుపన్యసించారు.

అధ్యక్షుడు

ఉపన్యాసకుల పలుకులలో అతిశయోక్తి లేవీ లేవని చెబుతూ సభాధ్యక్షులు శ్రీ యస్. శ్రీనివాసయ్యంగారిలా అన్నారు: "అప్పారావుగారు సునిశిత విమర్శకులు. ఇతరుల రచనలనే కాదు; తమ రచనలను సైతం వారు విమర్శించుకుని చూసుకునేవారు. కావ్యవస్తువులోనూ, రీతిలోనూ ఆయన ఆదర్శమల్లా పరిపూర్ణతను సాధించడం."

తమకూ, శ్రీ అప్పారావుగారికీగల స్నేహాన్ని గురించి ముచ్చటించి, అధ్యక్షులు కొన్ని మధురస్మృతులను పేర్కొన్నారు. విజయనగరం పెద్ద దావా జరుగుతున్న సందర్భంలో ఆయనతో తాము వొక్కేసులో కొన్నాళ్ళు గడిపే అవకాశం లభించిందని చెపుతూ శ్రీ శ్రీనివాసయ్యంగారిలా అభిభాషించారు: "సంస్కృత, ఆంధ్ర ఆంగ్లభాషా సాహిత్యాలలో, శాసనపరిశోధనలో పురావస్తుతత్వశాస్త్రంలో ఆయనకుగల

జ్ఞానం అపారం. ఆయన విషయపరిజ్ఞానం నన్నాశ్చర్యచకితుణ్ణి చేసింది. సాహిత్యపు పోకడలనే కాక, లోకమున మనుజుల ప్రవర్తనను, తీరుతెన్నులను, స్వభావాన్ని ఆకళింపుకున్న రచయిత శ్రీ అప్పారావుపంతులు. ఆయనతో అయిదారు నిముషాలు ప్రసంగిస్తే చాలును, ఆయన నఖశిఖపర్యంతమూ మహాపండితుడనీ, గొప్ప మేధావి అనీ మనకు బోధపడుతుంది. ఆయన సాహిత్యసేవయే, పరిశోధనమే జీవిత పరమాశయంగా ఉపలక్షించిన రచయిత. పరిశోధనలో మిక్కుటమగు ఆసక్తి వలన, ఎక్కువ ఖండకృతులను రచించే వ్యవధి ఆయనకు లేక పోయింది. ఇంతటి ధీశాలి యింకా అధికంగానే రచనలుచేసే అవకాశం వుందిమరి. కాని సంస్థానవ్యవహారాలు ఆయనకు ఊపిరాడనీయ లేదు. విజయనగర రాజ కుటుంబీకు లాయనకు యెంతో ఋణపడ్డారని చెప్పవచ్చును. ఆయనతో పరిచయ మౌతున్నకొద్దీ, ఆయన మనకు సన్నిహితులయేవారు. మౌనవ్రుగా ఆయనలోగల లోపములకంటె, సుగుణములనే మనం దర్శించగలం."

అధ్యక్షుని ఉపన్యాసానంతరం, మద్రాసు యూనివర్సిటీ రీడరు శ్రీ బి. శేషగిరిరావుగారు సభవారు కావించిన సంతాప తీర్మానాన్ని, శ్రీ అప్పారావుగారి కుటుంబమునకు అందచేయ వలసినదిగా సూచించిరి.

* శ్రీ గురజాడ అప్పారాయ స్మృతి

కోకిలా ! పారిపోతివె కోర్కెలన్ని
వమ్ముజేసి, శోకమ్మున మమ్ముముంచి
చూపులకు నందరానిదై చోకనశక్య
మైన మనుభూమికొచ్చితే మందు నిన్ను
శీతకాలమ్ము నందెట్లో చిక్కి స్రుక్కి
చాటుమాటున దాగుండి సరసమగు వ
సంతకాలము వచ్చెను సంతవరకు
ఓపికను పట్టలేనైతివే ! ప్రియసఖా !
వెఱ్ఱిపడియెదుగాని యీ విధము క్రొత్త
ప్రకృతి మార్గమ్ములకు నడ్డువచ్చుచుంటె !
వేసవి చనంగ, దాని వెన్వెంట వచ్చు
శీతకాలము రాకుండ, జేయగలవె ?

దివ్యమౌ నీదు గానమ్ము తీపి వీర
లకు రుచింపక పోయెను, వికల మతిని
"కొయ్యబొమ్మల" నే మెచ్చుకొనెడి వీరి
మతుల కెట్లెక్కునార, "కోమలులసౌరు" ?

అంతమాత్రాన వీరిపై నలుగనేల ?
వెలుగుచీకటియొక్కచో వెలయుగాదె ?
ప్రకృతి వైచిత్ర్య మిట్టుల బరగ, మమ్ము
నలుకమైవీడ నిన్నేమి యనగలమయొ ?

---

*శ్రీ బసవరాజు అప్పారావుగారు రచించిన పద్యములు.

ముందువచ్చు వసంతమ్ములందు నీదు
క్రొత్తగీతము విన నెంతొ కోర్కెనుంటి
నింక నేమి వసంతమీ యిగురుపాట
వినపడదు కాదె యింక మాచీనులకును ?

మరచిపోకుము నెచ్చెలీ మమ్ము, దలపు
మమరులలరి చేష్టలు దక్కియాలకించ
లీనమై పోయి, నీదివ్య గానరసము
చిలుకునప్పుడు నీదు నెచ్చెలులమంచు !

వాగనుశాసనులు శ్రీ గిడుగు

పర్లాకిమిడి,
5 డిసెంబరు, 1915

ప్రియమైన రామదాసూ,

ఎంత విషాదకరము ! అతను గతించినాడు ! ప్రియమైన ఆత్మ ! నీవలెనే, నాకూ దుఃఖం పొంగుకువస్తున్నది. నీ విచారములో సంగోరుభాగమును పంచుకుంటున్నాను. నా అత్యంత ప్రియమిత్రుడు పరమపదించినాడు !

ఎలాగవున్నదో చూసివద్దామని విశాఖపట్నం వెళ్లాను. అదే ఆఖరుసారి అతన్ని చూడడం. నేనతన్ని చూడ్డానికి వెళ్లినపుడు డాక్టరు నాకిలా సలహాయిచ్చాడు: "మీరు యెదట కనిపించేసరికల్లా ఆయన వుద్రేకంపట్టలేక పోతున్నారు. అదే

కొన్ని సానుభూతి లేఖలను యిందు ప్రచురిస్తున్నాము.

పనిగా, జబ్బుచూ మరచి మీతో సాహిత్యగోష్ఠి చేస్తున్నారు. చారిత్రకవిషయాలను గురించీ, సారస్వతాన్ని గురించీ చర్చలు జరుపుతున్నారు. విపరీతమైన అలసట కలుగుతున్నా లెక్క చేయడం లేదు. ఇలా అయితే ఆయన ఆరోగ్యం మరీ పాడవు తుంది కద!"

డాక్టరు, అతనికి ఉత్తరాలు వ్రాయవద్దని నాకు చెప్పాడు. నాటినుంచీ, అతనికి ఉత్తరాలు వ్రాయడం మానుకొన్నాను. జబ్బు నిమ్మళిస్తుందికదా, ఆరోగ్యం తిన్నబడుతుందికదా అని ఆశిస్తూ వుంటిని. కాని యింత త్వరలోనే మరణం ముంచుకు వస్తుందనుకోలేదు.

నీ దస్తూరీతో వున్న అతని ఉత్తరం ఇరవైతొమ్మిదో తేదీన కాబోసు పోస్టులో వేశావు. అది, అతను, చెప్పగా నువ్వు వ్రాసిన ఉత్తరంకదూ! అవును, అదే కట్టకడపటి ఉత్తరం!

అతని మరణంతో వొక గొప్పవ్యక్తిని, వొక పరోప కారపరాయణుని, మహాపండితుని మన దేశం పోగొట్టు కొన్నది.

మీ నాయనమ్మను తలచుకొన్నప్పుడల్లా నా హృదయం ద్రవించిపోతున్నది. గుండె చెరువవుతున్నది. పాపం, ముసలి తనంలో యెంత విపత్తు! ఏమని చెప్పి ఆమె దుఃఖాన్ని నివా రించగలం! దుఃఖమును ఆచుకొనేశక్తిని భగవంతుడు ఆమెకు ప్రసాదించుగాక. మీ తల్లిగారినీ, నాన్నమ్మనూ, అప్పచెల్లె ళ్ళనూ వోదార్చి, నువ్వు ధైర్యముతో వుండవలెను.

మా నాన్నగారు పోయేసరికి నాకు పధ్నాలుగేళ్ళు మాత్రమే. దుఃఖం పట్టలేకపోయాను. అవును, నాకింకా జ్ఞాపకంవుంది, దుఃఖిస్తోన్న నన్ను చూసి దుఃఖం పట్టలేక అప్పారావు భోరున దుఃఖించసాగేరు. అదే నన్ను ఉపశమింపజేసింది.

తెలుగు ప్రజల స్మృతిపథంలో అప్పారావు సదా జీవిస్తాడు. చనిపోయినప్పటికీ అతను జీవిస్తున్నాడు. అతన్ని తలచుకోవడమంటే మన జీవితములలోని అత్యంత ఆనందమయ సంఘటనలను మన స్మరణకు తెచ్చుకోవడమే.

Apparao will live in the memory of all Telugu people. He is living though dead. To think of him is to recollect the happiest moments in our lives.

Yours affectionately
G V Ramamurti

మిస్టర్ జె. ఏ. ఏట్స్

4 సౌత్ పెరేడ్
బెంగుళూరు
24 డిసెంబరు '15

ప్రియమైన శ్రీరామదాసుగారూ,

......మీ తండ్రిగారి మరణవార్త విన్నంతనే నా ప్రగాఢ సానుభూతిని మీకు అందచేయవల్సిందిగా రావు సాహేబ్ శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారిని కోరితిని. మీ నాయనగారి ఆప్తమిత్రులు, బంధువ్రులూ శ్రీరామమూర్తి పంతులుగారిని తప్పిస్తే నేను మరెవ్వరినీ యెరుగను.

ఈ విషాదవార్తను నేను మొదట నమ్మలేకపోయాను. ఇది నిజంకాదనుకున్నాను. ఏమిటా అంటే ఇలాంటి దురదృష్టకర సంఘటన జరగకూడదనీ, జరగదనీ నా మనస్సు ఊహిస్తూ రావడమే నేనీ వార్తను విశ్వసించకపోవడానికి హేతువు. మొన్న మొన్ననే యీమధ్యనే ఆయన నాకు లేఖ వ్రాశారాయె! తరవాత తెలుగు వ్యావహారిక భాషమీద ఆయన వ్రాసిన మెమోరాండము పన్నెండు కాపీలు పంపారాయె! తెలుగు భాషా సంస్కరణకు నడుముకట్టి అహోరాత్రాలు కృషిచేసిన మహాపండితుడు పరమపదించడం తీరని లోటు. అంతటి హాస్యరస ప్రధానమైన గొప్ప నాటకాన్ని రచించి, సంస్కరణోద్యమాన్ని శక్తివంతమైనదానినిగా చేసిన ప్రతిభాశాలి ఆయన. ఆయనకు బదులుగా ఆయన రచనలు యెల్లకాలమూ జీవిస్తాయి. మహత్తరమైన ప్రయోజనమును సాధించి, ఉదాత్త ఆశయములకోసం ఆయన మరణించారు. ఆ ఆశయములు నెరవేరినవి. కనుక ఆయన లేరనే దిగులు పడనక్కరలేదు. భవిష్యత్తులో వొక్కొక్క యేడాదీ పైబడుతున్నకొద్దీ మానవులు గతంవెనుక కొకసారి తిరిగి చూసుకుని నమ్రతతో, గౌరవముతో మీ నాయనగారికి జోహారు లర్పిస్తారు. రచయితగా, పండితునిగా, దేశ భాషా సంస్కరణోద్యమ ఆద్యులుగా లోకము ఆయనకు హారతులు పడుతుంది.

ఆయనతో నాకు పరిచయం లభించడం ఎంత అదృష్టం! తెలుగు భాషా సాహిత్యములనుగురించి యెన్నో విషయములను తెలుపుతుచేస్తూ ఆయన నాకు లేఖలు వ్రాస్తూవుండేవారు.

వంగదేశీయ ఆంధ్రసమితి

27, భవానీచరణ్ దత్తాలేన్,
కలకత్తా, 14 డిసెంబరు '15

*అయ్యా,

డిసెంబరు పన్నెండవ తేదీన వంగదేశీయ ఆంధ్రసమితి యను పేర బరగుచున్న బంగాళాదేశము ఆంధ్రసంఘముకూడి, కీర్తిశేషులగు గురజాడ అప్పారావుపంతులుగారు ఆంధ్రదేశమునకు చేసిన మేలు అతిశ్లాఘనీయమని కొనియాడుచు ఆంధ్రకవి ప్రపంచమున నూతనాదర్శములతో ప్రకాశించుచున్న ఆంధ్ర ప్రపంచము కోలుపోయిన సత్తముని జ్ఞాపకార్థము ఈసభకూడినదనియు వారి యకాలమరణమునకు మిక్కిలి చింతించుచున్నామనియు, నిలచి, నిశ్శబముగా తీర్మానించిరి.........

* విజయనగరములో వున్న ఆంధ్ర సాహిత్యసంఘము కార్యదర్శి పేరున వచ్చిన సానుభూతి ఉత్తరం. వంగదేశీయ ఆంధ్రసమితి సహాయకార్యదర్శి శ్రీ పంద్రంగి కేశవరావు గారు. విజయనగరములోని ఆంధ్రసాహిత్య సంఘమును స్థాపించినవారు శ్రీ గురజాడ అప్పారావు పంతులుగారు.

మిస్టర్ మార్క్ హంటర్

ఆండర్సన్ హౌస్
నుంగంబాకం
మద్రాసు
9 డిసెంబరు '15

డియర్ మిస్టర్ రామదాసు,

నా మిత్రుడు శ్రీ అప్పారావు మరణవార్త విని క్రుంగిపోయాను. ఆయన సాధించినది ఉన్నతమైనది. దక్షిణ భారతదేశములోగల మేధావులలో పండితులలో ప్రథమ శ్రేణికి చెందిన వ్యక్తి. తన రచనలతో తెలుగుభాషా సారస్వతములకు ఎనలేని సేవచేసిన రచయిత. ఆయన ఉద్యమ స్వభావమును కొందరు అపార్థము చేసుకొంటే చేసుకొందురుగాక! కాని ఆయన తన ఉత్తమ లక్ష్యసాధనకు ఎడతెరిపిలేని పోరాటమును నడిపినాడు. ద్రవిడభాషలకు, వాఙ్మయమునకు ఆయన మరణంవలన తీరనినష్టము వాటిల్లినది.

నివాళి

* ఆయన మన ఆంధ్రులలో మాకు ముందటితరము వారిలో చాలా ప్రసిద్ధపురుషులు...తనమాట చెల్లివచ్చిన చోటనల్లా మన ఆంధ్రులకు, ఆంధ్ర సంస్థలకు సాయపడిన, సిసలైన దేశాభిమాని... "దేశాభిమానం నాకు కద్దని వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్, పూని యేదైనాను వొకమేల్ కూర్చి జనులకు చూపవోయ్!" అని తన ముత్యాలసరములలో పాడినట్లు తాను లోకోపకారమని నమ్మిన 'వ్యావహారిక భాషోద్ధరణ' మనే ఉద్యమమునకు ధారపోసిన మహాత్ముడు. "నాది ప్రజల ఉద్యమము. దానిని యెవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను" అని ప్రవచించిన శ్రీ అప్పారావు పంతులుగారు నాకు గురుతుల్యులు.

♦ ఒకసారి మనోహరమగు స్త్రీలపాతపాట ఒకటి అప్పారావుగారి చెవినిబడి మనసున క్రొత్తసంగీతము తిరుగగా, తెలుగున ఒక క్రొత్త ఛందము నడిపింపవలెనని సంకల్ప ముదయించెను. 1910లో బరంపురమున జరిగిన నానావర్ణ సహపంక్తి భోజనములో అప్పారావు పాల్గొనినాడు. ఆ సంవత్సరమే తోకచుక్క పొడిచినది. ఒక విచిత్రమైన భావమథనమున అప్పారావు రసిక చిత్తమున నుండి ఒక క్రొత్త కవితావేశము రూపు కట్టినది...ఈతని కావ్యముల పాత్రలు ఒకసహజ భావో

---

* డాక్టర్ శ్రీ బుర్రా శేషగిరిరావుగారు.

♦ శ్రీ కొంపెల్ల జనార్దనరావుగారు.

ప్రదేశములో ఈతనివలెనే, కావ్యౌచిత్యమును కాంచుటవడ నీయక మెరుగు దేసనల్లు సంస్కారాశయములు వెలిబుచ్చెను.

♦ ఇంగిలీషు ప్రభుత్వం సుస్థిరంకాగానే, దిగజారుతున్న ఆర్థికపరిస్థితులు బట్టబయలైనాయి. ప్రజలు అన్నంలేక మాడి పోతున్నారనీ, ఈ దుస్థితి ప్రజలకు కలగడం మన దుష్టసాంఘిక పరిస్థితులవల్లనేననీ మనసంఘం మరామత్తు అయి, ప్రజాప్రభుత్వ స్థాపనమై, పరప్రభువుల స్వచ్ఛందవిహారం కట్టించబడితేనే గాని ప్రజలకు మరి ముక్తిలేదని ప్రజల్లో కొంతయలజడి కలిగింది...అంతవరకూ నిరసించబడ్డ జాతీయ సారస్వతం తిరిగి ప్రజలదృష్టి నాకర్షించింది...ప్రజాసామాన్య సారస్వత రక్తధ్వజం ఎత్తబడింది...ఈ రక్తధ్వజాన్ని ఎత్తినవారిలో నగ్రగణ్యులు గురజాడ వేంకట అప్పారాయకవి.

* గురజాడ అప్పారావు పంధొమ్మిదివందల పదిహేనులో చనిపోయినా పంధొమ్మిది వందల పదిహేను తరువాతనే జీవించడం ప్రారంభించాడు. కాల్పనికోద్యమంలో ఉన్న ఉత్తమ లక్షణాలన్నీ స్వచ్ఛమూ, నిసర్గ సుందరమూ అయిన ఆయన వాణిలో కనబడతాయి. సామాన్యుల గాథలూ, సామాన్యుల మాటలూ, కావ్య ప్రాంగణాన ప్రవేశపెట్టడం ఆయన గొప్పతనం. ఆ 'ముత్యాలసరం' కూడా అలాగే అయింది! ఆ ఛందస్సు తెలుగువాడి కష్టసుఖాలూ, కథలూ ఎంత బాగా చెప్తుంది! "పాట లాధరి చెట్లచేమలకై పాటపాడితే తోటి వనమున ఆగి చంద్రుడు తాను చెవియొగ్గడమూ",

---

♦ శ్రీ కిళాంబి రంగాచార్యులుగారు.

* శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు

"మంచి చెడ్డలు రెండె కులములు; మంచి అన్నది మాల అయితే మాల నే నౌదున్" అని చాటడమూ "నలుగురు కూర్చుని నవ్వే వేళల పుత్తడిబొమ్మను పూర్ణమ్మను ఒక పరితలచి" అవన్నీ పలికించడమూ, "పెరిగి విరిగితి, విరిగి పెరిగితినని స్వంత కష్టసుఖాలు తలపోసుకుని వాపోవడమూ, "ప్రేమ కలుగక బ్రతుకు చీకటి" అని ప్రేమికుడు కావడమూ ఇవన్నీ ఆ క్రొత్త రోజుల్లో యువకవుల హృదయాలకు ఆనంద పక్షాలు తొడిగి, గూటి యెరుగనివాటికి కొండంత జీవితాకాశాన్ని చూపెట్టాయి. వీరి రచన లన్నిటిలోనూ వీరేశలింగం మానవోద్యమ ప్రభావమే కనబడుతుంది.

* గురజాడ అప్పారావు పంతులుగారు సంస్కృత ఆంధ్ర ఆంగ్లభాషలలో నిష్ణాతులు...ఆయన సృష్టించిన పాత్రలు మానవత్వంతో నిండినట్టివి. ప్రాణమున్న ప్రతివాక్క-రిలోనూ అవి జీవించి, జీవితాన్ని ఉత్సాహవంతం చేస్తాయి. మానవత్వంతోనూ జీవితంతోనూ పరిపూర్ణమైన రచన కన్యాశుల్కం. దానిలోని స్త్రీలూ, పురుషులూ దయాదాక్షిణ్యాలతోను, విపరీతాలతోను, అయుక్తాలతోను, క్రౌర్యాలతోను, కుయుక్తులతోను, పవిత్రతతోను, వంచకత్వంతోను తిరుగులాడతారు. ప్రకృతి – ఆచారం హేతువు – సంప్రదాయం, అభిప్రాయం, ఛాందసత్వం ఒకదానితో వొకటి తీవ్రసంఘర్షణలకు తలపడ్డ జీవిత వెల్లువలతో యిది నిండి తొణకిసలాడుతున్న ది

* శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు.

♦ మహాకవి గురజాడ అప్పారావుగారి గేయాలలో తేట తెనుగు భాష తియ్యదనము చక్కగా ద్యోతక మవుతాయి. మృదుమధురమైన పదాలను సరి కూర్చడంలో గురజాడ వారి కున్న ప్రతిభ "ముత్యాల సరాలు" చాటుతాయి. సరళమైన శబ్దాలకు పదునుపెట్టి జతచేర్చి తాము అంద జేయాలనుకున్న భావాలను చదువరుల హృదయాలకు హత్తునట్లుగా చెప్పగల గొప్పశిల్పి అప్పారావుగారు. పూర్ణమ్మ, కన్యక మొదలయిన పాటలను చదివితే మహాకవి రచనా పాటవం చక్కగా స్ఫురించుతుంది.

గురజాడవారి "దేశభక్తి" గేయం, జాతీయ గీతాలన్నిటిలోకి అత్యుత్తమమైనదిగా నేను భావించుతాను. బ్రిటీష్ వాళ్ళ జాతీయగీతమైన "గాడ్ సేవ్ ది కింగ్"లో సామ్రాజ్యవాదుల అహంకారం ద్యోతకమవుతుందే గాని, మానవత్వం గోచరించదు. భారత దేశంలో ఉత్తమ జాతీయ గీతాలుగా ఎంచబడుతున్న 'వందేమాతరం', 'జనగణమన' లలో కూడ మాతృభూమిని కీర్తించడం వుందేగాని, ప్రజానీకంపై దృష్టిని కేంద్రీకరించవు. "దేశమంటే మనుషులోయ్" అని ఎలుగెత్తి చాటిన అప్పారావుగారి గీతం వాటన్నిటికంటే మహోన్నతమైనదనడంలో సందేహం లేదు.

"దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్;

♦ శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావుగారు

పూని యేదైనాను వొక మేల్
కూర్చి జనులకు చూపవోయ్!"

అనే చరణంలోనూ

"స్వంత లాభం కొంత మానుకు
పొరుగువానికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్,
దేశమంటే మనుషులోయ్!"

అనే చరణంలోనూ అప్పారావుగారు మానవత్వం యొక్క ఔన్నత్యాన్ని నిరూపించారు.

"వెనకచూసిన కార్యమేమోయ్?
మంచిగతమున కొంచెమేనోయ్
మందగించక ముందుఅడుగేయ్
వెనకపడితే వెనుకే నోయ్!"

అని మహాకవి ప్రజానీకాన్ని అభ్యుదయమార్గాన నడువమని ఉద్బోధించారు.

"యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశిసరుకులు నించవోయ్!"

"పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్;
తిండి కలిగితె కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయ్!"

అని మహాకవి ఎలుగెత్తి చాటారు. ఇంత గొప్ప జాతీయ గీతాన్ని మనకందించిన మహాకవి మనవాడవడం నిజంగా ఆంధ్రప్రజల అదృష్టం!

♦ ఏ కవికైనాసరే అతనిమట్టూ ఒకసమాజం, ఆసమాజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. ఈ సామాజిక చారిత్రక పరిణామగమనంలో కవియొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలీ అయితే ఈ గమనాన్ని అతడు మరింత వేగవంతంచేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను... భవిష్యత్తు మీద గురజాడకున్న విశ్వాసానికి నేనిక్కడ నివాళులెత్తుతున్నాను. తక్కినవాళ్ళంతా తెలుగుదేశంలో యోధానుయోధులైతే ఒక్క గురజాడ మాత్రమే ప్రపంచంలో ఎచ్చట ప్రామాణ్యాలకైనా విలువగల సార్వజనీనతను సాధించినవాడు.

ఆధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగు దేశపు సరిహద్దుల కవతల అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగువారి తరఫున ప్రతినిధిగా నిలువ గలిగినవాడు గురజాడ అప్పారావు ఒక్కడే. కవిగా మాత్రమేకాదు, కథారచయితగా, విమర్శకుడుగా విశేషించి నాటక కర్తగా గురజాడ ధృవతార.

*ముఖ్యంగా నాటకరచన విషయంలో నీవు ప్రదర్శించి ప్రతిభ సమకాలిక భారతదేశంలోనే కాదు; సమకాలిక

♦ శ్రీశ్రీ

*శ్రీ నార్ల వేంకటేశ్వరరావుగారు

ప్రపంచంలోనే గణుతించ దగినట్టిది. నీవు 'కన్యాశుల్కము' నాటకాన్ని - ఒక సమకాలిక సమస్య యితివృత్తంగా - ప్రకటించిననాటికి యూరప్ ఖండములోనైనా క్రొత్తనాటకం అంతగా ప్రచారంలోనికి రాలేదు.

♦ అప్పారాయకవి ఆంధ్ర వాఙ్మయానికి ఒక సరిహద్దు. ఈయనతో నవ్యసారస్వతయుగం మొదలైనది...స్వాతంత్ర్యపు టూర్పుపోసిన పరమేష్ఠి. దేశభక్తి అంటే ఏమిటో మొదట తెలియజెప్పిన మహానుభావుడితడే.

* సాంఘిక దురాచారాలను బట్టబయలుచేసి సంఘ సంస్కారాన్ని సాహిత్యంద్వారా, అప్పారాయమహాకవికి పూర్వంగాని, తరవాతగాని ఏ తెలుగురచయితా ఆయన చేసినంత అమోఘమైన సేవ చెయ్యలేదనే నిస్సంశయంగా చెప్పవచ్చును.

దేవుళ్ళూ రాజులూ ధనికులూ ఆక్రమించుకొన్న సాహిత్యాన్ని ప్రజలకు సంపాదించిన మహాపురుషుడు అప్పారాయ మహాకవి. సాహిత్య విప్లవకారకుడై నూతన సంస్కృతిని నెలకొల్పిన మహాపురుషుడు.

అప్పారాయ మహాకవి తెలుగుజాతికి పెన్నిధి! ప్రపంచ కవులకుటుంబానికిచెందిన విశ్వకవి!

♦ శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు

* శ్రీ సెట్టి ఈశ్వరరావుగారు

* ప్రతి విషయంలోను ఇంత స్పష్టమైన దృక్పథం ప్రదర్శించిన మహాకవి వెనుక ఒక మహత్తరమైన శక్తి వుంది. మారుతున్న లోకాన్ని తన రచనల్లో స్పష్టంగా చిత్రించాడు. ప్రాచ్యపాశ్చాత్యసాహిత్య సంప్రదాయాలు మేళవించి, సజాతీయంగా, సహజంగా "క్రొత్తపాతల మేలుకలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా" జాతిని మేల్కొల్పి విజ్ఞానపథాలకు నడిపే ఉత్తమాదర్శం ఆయన రచనల్లో అడుగడుగునా గోచరిస్తుంది.

ఆంధ్రసాహిత్యంలో ఆయన అభ్యుదయయుగానికి దారితీసిన మహాకవి. ఆయన ఉత్తమ జీవితాదర్శం ఎల్లప్పుడూ ఆంధ్రజాతి హృదయంలో వేగుచుక్కగా వెలుగొందుతుంది. ఆయన దివ్యవాణి ఆంధ్రజాతికి కర్తవ్యాన్ని ఉపదేశిస్తుంది. ముందుకు నడుపుతుంది. అదే ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికీ, ఆంధ్రజాతికీ, అభ్యుదయానికీ, ఆశారేఖ.

---

* అభ్యుదయ సాహిత్య పత్రిక సంపాదకీయం.

♦ మ హా క వి

గుత్తునా యని జాతిముత్యాల్
గుచ్చినాఁడే మేలిసరముల
ఇత్తునా యని తెలుఁగుఁదల్లికి
ఇచ్చినాఁడే భక్తితో!

నవవసంతము, నవ్యవనరమ,
మావికొమ్మల గమ్మచివురులు,
పాటపాడెడి పరభృతంబును
ఎవ్వరాపుదురో?

పొడుపుమలపై రంగవల్లిక
మింటినడుమఁ బ్రచండతేజము
సంజమబ్బులపైని కెంపులు
చూడకుంటిరిగా!

రంగవల్లిక మాయమయ్యెను
చండతేజము మాసిపోయెను
సందెకెంపులు సాగిపోయెను
వెదకుచున్నారా!

కారుచీఁకటి గ్రమ్మినప్పుడె
చదల మబ్బులు కప్పినప్పుడె

♦ శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రచించిన గీతం

మిఱుఁగుఱై నను మెఱయనప్పుడె
వెదకుచున్నారా!

చుక్కలన్నియు సొక్కి సోలెను
గిరులు కదలెను, దిరుగఁబాడెను
లోక మోహనమధురగానా
స్వాదమోదమున!

యుగయుగంబులనుండి మ్రోఁగెడు
విశ్వగానవియత్తరంగిణి
భంగముల నుప్పొంగు నాతని
గీత శీకరముల్!

పాటపాడిన పరభృతంబును
మూఁగవోయిన ముద్దుకోయిలఁ
జిన్ని పికములు చిఱుతపాటలఁ
బిలుచుచున్నవి యా!

★

కొన్ని ముఖ్య తేదీలు

30-11-1861 : విశాఖజిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరంలో మహాకవి జననం.

14-8-1883 : వారి 'సారంగధర' కావ్యాన్ని ప్రశంసిస్తూ "రీస్ అండ్ రయ్యత్" పత్రికా సంపాదకులు శ్రీ శంభుచంద్ర ముఖర్జీ కలకత్తానుంచి వ్రాసిన లేఖ.

1-4-1884 : విజయనగరం కళాశాలలో పదో అసిస్టెంటు లెక్చరరుగా నియామకం. జీతం నెలకు పాతిక.

-1-1886 : ఎనిమిదో అసిస్టెంటుగా ప్రమోషను.

-1-1886 : బి. ఏ.; పట్టభద్రత.

3-8-1887 : కళాశాలలో 'లీవ్' వుంచుకుంటూనే, విజయనగరం జనరల్ డెప్యూటీ కలెక్టరు కచేరీలో సబ్ప్రిటం హెడ్‌గుమాస్తాగా ఉద్యోగ స్వీకరణ.

7- 3-1887 : పై ఆర్డరు వచ్చిన తేదీ. ఆర్డరు నెంబరు 560.

27-10-1887 : విజయనగరం కాంగ్రెస్ సమావేశంలో ఉపన్యసించుట.

-10 1887 : నాలుగో అసిస్టెంటుగా తిరిగి విజయనగరం కళాశాలలో లెక్చరరు పదవి. జీతం, నెలకువంద. ఆర్డరు నెంబరు 275.

20-7-1888 : విశాఖపట్టణం స్వచ్ఛంద సేవాదళ సభ్యత్వస్వీకరణ. నెం. 225.

22-6-1889 : విజయనగరం సంస్థానపు డిబేటింగుసొసైటీకి ఉపాధ్యక్షులుగా ఎన్నిక.

22-6-1891 : మూడవ లెక్చరరుగా నియామకం. జీతం నెలకు నూటపాతిక.

5-6-1896 : సంస్థాన శాసన పరిశోధకునిగా నియామకం.

1-1-1897 : 'కన్యాశుల్కము' మొదటి కూర్పునకు ఉపోద్ఘాత [illegible] ఇంతకుముందే నాటకరచన ముగించుట.

-6-1898 : ఆనందగజపతి సోదరి రీవా మహారాణికి అంతరంగిక కార్యదర్శిగ నియామకం.

24-4-1905 : తండ్రిగారి మరణం.

- -1906 : 'కొండుభట్టీయము' తొలిసారిగా రచించుట.

11-3-1909 : 'కన్యాశుల్కము' నాటకమును యిప్పటికే కొన్ని అంకములను తిరిగి మార్చి వ్రాయుట.

1-5-1909 : "కన్యాశుల్కము" రెండవ ముద్రణకు పీఠిక.

21-5-1909 : వాస్తవిక రచనాలక్షణాలను ప్రతిపాదిస్తూ శ్రీ సుబ్రహ్మణ్యము గారికి లేఖ.

- -1910 : బరంపురంలో నానావర్ణ సహపంక్తి విందు.

- -1910 : 'ముత్యాలసరములు' రచన.

- -1910 :కొండుభట్టీయము' రెండవసారి రచించుట.

21-4-1910 : 'బిల్హణీయము' మొదటి అంకము ప్రచురించుట.

24-11-1910 : 'గ్రామ్యశబ్ద విచారణము' వ్యాసరచన.

29-12-1910 : 'ఆకాశరామన్న'కు జవాబుగా వ్యాసప్రకటన.

-4-1911 : 'బిల్హణీయము' రెండవ అంకమును అచ్చొత్తించుట.

27-3-1911 : "నాది ప్రజల ఉద్యమము. దానిని యెవరిని సంతోష పెట్టడానికైనా వదులుకోలేను" ఆంధ్రసారస్వత ప్రపంచమున మహాకవి 'మాగ్నకార్టా' ప్రకటన.

28-1-1912 : కలకత్తాలో వంగీయ సాహిత్యపరిషత్తు, మహాకవి గౌరవార్థం చేసిన తేనీటివిందు; సభ.

16-5-1912 : వ్యావహారిక భాషాప్రయోజనం గురించి మద్రాసులో జరిగిన ఆంధ్రసాహిత్య పరిషత్తు సభలో ప్రసంగం.

-1912 : తెలుగుభాషలో సాంకేతికపదాల కూర్పుకు ప్రయత్నం.

12 : 'కనక్య' ప్రచురణ.

కలకత్తాలో రవీంద్రునితో సమావేశం.

– –1913 : 'సుభద్ర' పద్యకావ్యరచన.

30-1-1913 : మద్రాసు విశ్వవిద్యాలయంలో "ఫెల్లో" గా నియమించుటకు గవర్నరు అభ్యర్థన.

20-4-1914 : "ఎ మినిట్ ఆఫ్ డిసెంటు, టు ది రిపోర్టు ఆఫ్ ది తెలుగుకాంపోజిషను సబ్-కమిటీ" ప్రచురణ.

30-10-1915 : 'దింపు లంగరు' ప్రచురణ.

30-11-1915 : ఉదయం ఎనిమిదీ ఇరవై నిమిషాలకు విజయనగరంలో మహాకవి నిర్యాణం.

★

కొన్ని విశేషాలు

బాల్యంలో శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారితో కలసి "నల" నాటక ప్రదర్శనాలు. మెట్రిక్యులేషను, ఇంటరుమీడియేటు, బి. ఏ; ఎమ్. ఏ; పరీక్షాధికారిగా నియామకం. మద్రాసు విశ్వవిద్యాలయ యావజ్జీవిత సెనేటు సభ్యత్వం. తెలుగు వ్యాకరణ రచనకు కృషి; ఆంధ్రకవుల జీవితచరిత్ర, కళింగ దేశ చరిత్రల రచనకు కావలసిన విషయసేకరణ. విజయనగర సంస్కృత, ఆంగ్ల, సంగీత కళాశాలల అభివృద్ధికి కృషి. కౌన్సిలరుగా పౌరహిత కార్యకలాపాలు. నగరంలో నీటి సరఫరాకు కుళాయిల ఏర్పాటుకు కృషి. వ్యావహారిక భాషాఉద్యమవ్యాప్తికి ఆంధ్ర సాహిత్య సంఘస్థాపన. 'ప్రకాశిక' తెలుగుపత్రికకు సంపాదకత్వం.

కొందరు సమకాలికులు

శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు:

ఆంధ్ర జాతీయాభ్యుదయానికి పునాదులువేసిన మహనీయులు. రాజమహేంద్రవరంలో 16 ఏప్రియల్, 1848 వ సంవత్సరంలో జననం. 1871 లో రాజమండ్రి ప్రభుత్వపాఠశాలలో ఉపాధ్యాయపదవి. 1876 లో 'వివేకవర్ధని' పత్రికాస్థాపన. సంఘసంస్కరణమే ధ్యేయంగా సాహిత్యరచన. మహిళోద్ధరణ; వితంతు శరణాలయం, పురమందిర నిర్మాణం. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో పండితపదవి. రాజశేఖర చరిత్ర, బ్రాహ్మవివాహం, శారీరకశాస్త్ర సంగ్రహాది శతాధికగ్రంథ రచయిత. వ్యక్తిగా కాక తామే ఒక సంస్థగా విరాజిల్లుతూ ఆంధ్రదేశంలో నూతనచైతన్యం, జాగృతి కలిగించిన యుగపురుషులు. ప్రజోపయోగంకోసం తమ సర్వస్వమును ధారపోసిన మహాపురుషులు. నిర్యాణం: 27 మే, 1919.

శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారు:

ఆంధ్రమును మహత్తరమైన జాతీయభాషగా రూపొందించ ఉద్యమించిన వాగనుశాసనులు. కళాప్రపూర్ణులు. 'ఆదిలాక్షణికుల కందని బహుపద పారిజాత సుమములేరి' వ్యావహారిక భాషావాదమును సంస్థాపించిన శబ్దవేది. పర్వతాలపేటలో 1863 లో జననం. గిడుగు, గురజాడలు బాల్యస్నేహితులు. కొంతకాలం ఉపాధ్యాయవృత్తి. కళాశాలలో ఆచార్యపదవి. సవరభాష కొరకు లిపి, వ్యాకరణముల రచన. 1905 లో సవరబడుల స్థాపన. సవరభాషా కృషికి ప్రభుత్వంవారిచే 1913 లో "రావుసాహెబ్" బిరుదు ప్రదానం. వ్యావహారిక భాషావ్యాప్తికి అనన్యకృషి. పండితగోష్ఠులు, ...లు, సభలు; విమర్శనా పూర్వక వ్యాసరచన. రచించిన కొన్ని గ్రంథ... బాలకవి శరణ్యము, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము, గమ్మ, గద్య చింతామణి మొదలైనవి. నిర్యాణం: 22 జనవరి,

శ్రీ ఆనంద గజపతి :

తండ్రి శ్రీ విజయరామగజపతి అనంతరము విజయనగర సంస్థానమునకు అధిపతి. ఆంధ్రభోజుడని కీర్తిప్రతిష్ఠ లార్జించినవారు. సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషలలో దిట్ట; కవి. సంస్కృత ఆంగ్లభాషా గ్రంథములను సామాన్యముగ అందరికీ బోధపడే తెలుగున అనువదింపచేయడానికి ఒక ప్రణాళికను ఊహించి, ఒక్కొక్క శాఖను ఒక్కొక్క పండితునికి అప్పగించినవారు. శ్రీ కొల్లూరు కామశాస్త్రిలుగారు తెలిగించిన గ్రంథపీఠికలో "నన్నయ్య, తిక్కన మొదలగు కవులు, పాండిత్య ప్రకర్ష చూపి కావ్యములను రచించిరి. ప్రబంధములునూ అంతే. పామరుల కర్థమయేభాషలో యీ ఉద్గ్రంథాలను అనువదించండ"ని ఆనందగజపతి ఆదేశించినట్లు కలదు. విజయనగర సంస్థాన చరిత్రను 'ట్రీటీ' అనే పేరుతో గ్రంథముగా వ్రాసిరి. విజయనగరంలో విశ్వవిద్యాలయం నెలకొల్పుటకు కృషి చేశారు. సంఘములోనూ, సాహిత్యములోనూ సంస్కరణము అభిలషించినవారు. విశాఖజిల్లాలో నాడు జరుగుతూవుండే కన్యాశుల్క, బాల్యవివాహాల లెక్కలను సేకరింపజేసినవారు. కన్యాశుల్కము నాటక రచనకు ప్రోత్సాహించినవారు.

శ్రీ అలక రాజేశ్వరి :

ఆనంద గజపతితల్లి. భర్త అనుమతిని పొంది యీమె విజయరామ గజపతిని దత్తత చేసుకున్నది. ఆనందరాజుగారి విల్లు ప్రకారము యీయనకు సంస్థానము దఖలు పడ్డది. అట్లు దఖలు పడుటకు వీలులేదనీ, దత్తత చెల్లనేరదనీ, వారసులు దావా తెచ్చినారు. దీనిని విజయనగరం పెద్దదావా, వారసత్వపు దావా అందురు. 1897–1912 వరకు జరిగిన యీదావా మహాకవి సాహిత్యకృషిని హరించి వేసింది. ఈమె పెద్దకూతురు రీవారాణి. ఆనంద గజపతి అక్క.

శ్రీ విజయరామ గజపతి :

ఆనందగజపతి దత్తత తమ్ముడు. అన్నగారి విల్లుప్రకారము ప్ర దఖలు పడగా 1904 '22 వరకూ సంస్థానము ఏలుబడి ఈయన హయాములోనే సంగీతకళాశాల స్థాపింపబడ్డది

శ్రీ సి. చంద్రశేఖరశాస్త్రిగారు :

విద్యాధికులు. తమిళులు. రాయవెల్లూరు వీరి స్వస్థలం. విజయనగరం ఆంగ్లకళాశాలకు మొదటి ప్రిన్సిపాలు. అనేకమంది విద్యార్థులకు తమ ఇంటనే భోజన సదుపాయముచేసి, జీతం లేకుండా చదువు చెప్పించిన ఉదారులు.

శ్రీ కిడాంబి రామానుజాచార్యులుగారు :

సంస్కృత, ఆంధ్ర ఆంగ్లభాషలలో పండితులు. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు వీరి స్వస్థలం. శతావధాని. స్వయం ప్రతిభచే రాణించిన వారు. ఎమ్. ఏ., బి. ఎల్. కొంతకాలం హైకోర్టులో ప్రాక్టీసు. శ్రీ చంద్రశేఖరశాస్త్రిగారి అనంతరము, విజయనగర కళాశాలకు ప్రిన్సిపాలయినారు. 1914 లో కాకినాడలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషద్వార్షికోత్సవసభకు అధ్యక్షులు. మొదట గ్రాంథికవాది. తరువాత వ్యావహారికభాషావాది.

శ్రీ లింగం లక్ష్మాజీ పంతులుగారు :

అఖండ ప్రతిభాశాలి. గ్రీకులాటిను, ఫ్రెంచి, ఇంగ్లీషు సంస్కృతాంధ్ర భాషలలో గొప్ప పండితులు. ఆనందగజపతికి గురువు. కోయభాషకు లిపి కల్పించి, వ్యాకరణమును రచించిన మేధావి. వీరి స్వగ్రామం విజయనగరం దగ్గర వున్న కోనాడ.

శ్రీ జిడ్డు సుందరరావుగారు :

బి. ఏ. పట్టభద్రులు. ఆనందగజపతికి పెర్సనల్ అసిస్టెంటుగావుండే వారు. అప్పారావుగారికి కావలసిన మిత్రులు. వారికి సహాయపడ్డవారు.

అనాసపురపు రామమూర్తి పంతులుగారు :

సంస్కృతాంధ్ర ఆంగ్లభాషలలో పండితులు. పట్టభద్రులు. మొదట [illegible]పాధ్యాయపదవి. అనంతరం విజయనగరసంస్థానపు దేవస్థాన వ్య[illegible] నైతికజీవితమును గడిపి పేరుపొందిన ఉద్యోగి.

శ్రీ ఎనమంద్ర నారాయణమూర్తిగారు :

పట్టభద్రులు; చెముడు జమీందారుకు కొంతకాలం ట్యూటరు. అప్పారావుగారి సహాయంతో రాజువద్ద సెక్రటరీ అయి అనంతరం కళాశాలలో లెక్చరరు అయినారు. గ్రాంథిక వాది. "అడవిమల్లెలు" మొదలగు ఖండ కావ్యములను రచించారు.

శ్రీ బాలయ్యనాయుడుగారు :

ఆనందగజపతి కాలములో చెన్నపట్నం, నీలగిరి మొదలైనచోట్లగల జౌటుస్టేషనులకు ఏజంటుగా వుండేవారు.

శ్రీ వెంకటరాయశాస్త్రిగారు :

వీరు శ్రీ చంద్రశేఖరశాస్త్రిగారికి బావమరది. విజయనగరము కళాశాలలో ఫిలాసఫీ లెక్చరర్‌గా వుండేవారు.

శ్రీ నిష్టల రామశర్మగారు :

శృంగవరపుకోట తాలూకా సోంపురం అగ్రహారీకులు. ఎమ్. ఏ. ప్యాసయినారు. ఆంగ్లమున కవిత్వం చెప్పేవారు. కళాశాలలో లెక్చరర్‌గా వుంటూ ఆనందరాజు అనంతరం ఎస్టేటు రెవిన్యూ సూపర్‌వైజరుగా పని చేశారు.

శ్రీ వంగ మాధవరావుగారు :

విజయనగరం కళాశాలలో మాథమెటిక్స్ ప్రొఫెసరు.

శ్రీ శ్రీనివాసాచారిగారు :

విద్వాంసులు. ఆనంద గజపతి నెలకొల్పిన న్యాయ సభ్యులు. చక్రపాణి గాత్రం. చంద్రహాస అను యింగ్లీషు

శ్రీ రాజామణిచెట్టిగారు :

రిటైర్డు డిప్యూటీ కలెక్టరు కుమారుడు. తెనుగున కవిత్వం చెప్పేవారు. బిలియర్డ్సు, క్రికెట్టు ఆటలలో అభిరుచి.

శ్రీ పి. శేషాద్రిగారు :

మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో కొంతకాలం, కాశీ హిందూ కళాశాలలో మరికొంతకాలం ప్రొఫెసరు. ఆంగ్లమున 'పూర్ణమ్మ' కావ్యంపై చక్కని విమర్శను వ్రాశారు.

డాక్టర్ శ్రీ బుర్రా శేషగిరిరావుగారు :

విద్యాధికులు. విజయనగరం కళాశాలలో ప్రొఫెసరు. ఏమ్. ఏ., పి. హెచ్. డి., మద్రాసు విశ్వవిద్యాలయములో రీడరు. ఆంధ్రా రిసెర్చి యూనివర్సిటీ సంస్థాపకులు. మహాకవి శిష్యులు. వ్యావహారికభాషావాదము నకు అండగా నిలచినవారు. విమర్శకులు. కళాశాల విద్యార్థులకు మాతృ భాషలో వ్యాసరచనయందు తర్ఫీదు యివ్వడానికి ఏట్టి భాషను స్వీకరించ వలెనో నిర్ణయించడానికి మద్రాసు యూనివర్సిటీ నియమించిన కమిటీలో వ్యావహారికభాషావాదుల తరఫున వీరు వొక సభ్యులుగా నియమితులు.

డాక్టరు హుల్ట్జు :

మద్రాసుప్రభుత్వ ఉద్యోగులు; శాసన పరిశోధకులు.

డాక్టరు మిల్లర్ :

సి. ఐ. ఇ. కొంతకాలం మద్రాసుక్రిస్టియను కళాశాలలో ఆంగ్లోపన్యాసకులు; తరువాత కళాశాలాధ్యక్షులు.

రావుబహద్దర్ శ్రీ ఎ. వెంకయ్య అవర్గళ్ :

పట్టభద్రులు. మద్రాసు ఆర్కియాలాజికల్ డిపార్టుమెంటు [illegible]ంటు; శాసన పరిశోధకులు.

శ్రీ వై. ఎ. ఏట్సు :

ఆంగ్ల విద్యాధికుడు. కొంతకాలం పచ్చయ్యప్ప కళాశాలకు ప్రిన్సిపాలు. తమిళ్, తెలుగుభాషలను అభ్యసించారు. 1903 లో తూర్పు జిల్లాలకు విద్యాధికారిగా నియమితులు. ఉపాధ్యాయ పరిషత్తులను జరిపి చర్చలు సాగించి గిడుగు, గురజాడల వ్యావహారిక భాషా ఉద్యమానికి ప్రోత్సాహం యిచ్చారు.

శ్రీ శ్రీనివాసయ్యంగారు :

ప్రసిద్ధ న్యాయవాది. మదరాసు హైకోర్టులో అడ్వకేటు జనరలు. అప్పారావుగారి సన్నిహిత మిత్రులు. గొప్ప షేక్స్పియరీయను పండితులు.

శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు :

పండితులు. వీరి స్వస్థానం నెల్లూరు. జననం : 21 డిసెంబరు 1853. కళాప్రపూర్ణ, మహా మహోపాధ్యాయ బిరుదాంకితులు. ప్రతాపరుద్రీయము, ఉషాపరిణయము మొదలైన నాటకములను రచించారు. విశ్వనాథకవి రాజ ప్రణీత సాహిత్య దర్పణమును తెలిగించారు. గ్రాంథికవాదులు. 1919 వ సంవత్సరపు ఆంధ్ర సాహిత్య పరిషన్మహాసభాధ్యక్షులు. నిర్యాణం : 18 జూన్, 1929.